సమస్యాపూరణాల సమాహారం

సమస్య: అన్నము తినునట్టి మనిషె అధముడు జగతిన్

కం. తిన్నడు శివలింగం బా
కొన్నం గని బువ్వఁ బెట్టఁ గోరుచు వేడెన్,
అన్నా! (కన్నా) నీ కర్పింపక
యన్నము తినునట్టి మనిషె, యధముడు జగతిన్.

రచన: మద్దాలి వేంకట సత్య రంగనాధం

సమస్యాపూరణాల సమాహారం

రచన:

మద్దాలి వేంకట సత్య రంగనాధం

సమస్యాపూరణాల సమాహారం

రచన: మద్దాలి వేంకట సత్య రంగనాధం

SamasyaapuuraNaala samaahaaram (Free E-Book)

Author: M. V. S. Ranganadham

ISBN 978-93-343-8295-2

© సర్వ హక్కులు రచయితవే

ప్రచురణ (Publishing): 01 – 09 – 2025

Contact details of author:

M. V. S. Ranganadham

H. No. 5-12-78/46,

Laxmipuri Colony Phase – 2,

Sainikpuri, Hyderabad – 500 094.

Telangana State.

Mob: +91 9818878155

E-Mail: mvsranganadham@hotmail.com

అంకితం

బహు గ్రంథ కర్త, మా మేనమామ గారైన
శ్రీ చిరువోలు విజయ నరసింహారావు గారికి

కం. ఎన్నో సమస్య లందున
దన్నుగ నా ప్రక్క నిల్చి ధైర్యము నిడుచున్
నన్నడిపించిన మామకు
యన్నున నీ చిన్ని పొత్త మంకిత మిడితిన్.

ముందుమాట

అవి 1972-74 సంవత్సరాల్లో నేను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజులు. మోపిదేవిలో హైస్కూలు చదువు ముగించుకొని విజయవాడలో కాలేజీ చదువు మొదలు పెట్టిన రోజులు. అప్పుడు, వారానికి ఒకసారి అనుకుంటా, ఆకాశవాణిలో సమస్యాపూరణం కార్యక్రమం ప్రసారం అయ్యేది. ఆ కార్యక్రమానికి మా మేనమామ గారైన శ్రీ చిరువోలు విజయనరసింహారావు గారు తమ పూరణలు పంపేవారు. ఆ కార్యక్రమం క్రమం తప్పకుండా ప్రతివారం విని ఆయన నేను చర్చించుకునే వాళ్ళం. ఆ చర్చల్లో భాగంగా, రేడియోలో వచ్చిన పూరణల గురించే కాకుండా, ఆయన నాకు ప్రసిద్ధమైన పూరణల గురించి చెప్పేవారు. ఆ విధంగా, ఈ సమస్యాపూరణం అన్న ప్రక్రియను నాకు పరిచయం చేసింది ఆయనే.

అంతకు ముందే, అంటే హైస్కూలులో చదివే రోజుల్లోనే, నాకు పద్యాల లోని లయను గుర్తించే అభ్యాసము కొంచెం అలవాటు అయ్యింది. అది ఎలా అంటే, మా గురువు గారు (కీ.శే. శ్రీ చిరువోలు దుర్గాప్రసాదరావు గారు) అప్పుడప్పుడూ ఆశువుగా పద్యాలు చెప్పుతూ డిక్టేషన్ (dictation) వ్రాయడానికి నన్ను నియోగించే వారు. ఆ వ్రాయడంలో ఉన్న నిబంధన ఏమిటంటే, ఛందస్సు సరిగ్గా కుదిరిందా లేదా అన్నది, యతి ప్రాసలు సరిగ్గా కుదిరాయా లేవా అన్నవి గణ విభజన చేసి కాకుండా పద్యాని కున్న లయను బట్టి నేను చూసుకొని తేడా వస్తే ఆయనకు చెప్పాలి. 99.99 % సందర్భాలలో అవి సరిగ్గానే కుదిరేవి. అరుదుగా, ఎప్పుడన్నా తేడా వస్తే మా గురువుగారికి చెప్పాలి. పద్యం ఆశువుగా చెప్పేటప్పుడు, ప్రాస మీద దృష్టి పెట్టడం, పద్యం ట్యూనును (Tune) బట్టి యతిస్థానానికి ముందు ఆపుకోవడం (మనస్సులో), ఆపుకొని యతి వేసుకొని ఆ ట్యూనును కొనసాగించడం నాకు మా గురువుగారు నేర్పారు. ఆ అభ్యాసంతో ఆ రోజుల్లో పద్యాలు వ్రాయడం (ఎవరికీ తెలియకుండా) కొద్ది కొద్దిగా చాతనయ్యింది నాకు. అది మా మేనమామ గారు ఇచ్చిన శిక్షణతో సమస్యాపూరణలు చేయడంలో సహకరించింది.

అసలు సమస్యాపూరణం అంటే ఏమిటి? పద్యంలో సాధారణంగా అసంబద్ధము (absurdity) ఉన్న ఒక పాదం ఇచ్చి మిగిలిన మూడు పాదాలు పూరించమంటారు. దీన్నే సమస్యాపూరణము అంటారు. ఇవ్వబడ్డ పద్యపాదంలో అసంబద్ధముగా ఉన్నదే సమస్య. సమస్యగా ఇచ్చిన పాదాన్ని పూరించిన మూడు పాదాలతో కలిపి చదివినప్పుడు ఆ అసంబద్ధము కనపడకుండా చేయడమే సమస్యాపూరణం.

సాధారణంగా, ఒక పూర్తి పద్యపాదం సమస్యగా ఇవ్వబడుతుంది. దాని ముందరి పాదంలో ఒక అక్షరాన్ని గానీ పలు అక్షరాలను గానీ చేర్చి సమస్యగా ఇచ్చిన పాదంలోని అసంబద్ధము, వ్యతిరేకార్థము పోయేటట్లుగా చేస్తాము. ఆ చేసేటప్పుడు, ఒక్కొక్క సారి, సమస్యగా ఇచ్చిన పాదంలోని మొదటి పదాన్ని విడదీసి గానీ సంధిగా ఉంటే సంధిలోని పదాలను విడివిడిగా గ్రహించి గానీ ఇలా అన్వయం కుదురుస్తాము. ఒక్కోసారి, సమస్యగా ఇచ్చిన పాదంలో యతి మైత్రి లేకపోతే అది కలిగించడం కోసం మనమే యతి కుదిరే విధంగా సంధి చెయ్యాల్సి ఉంటుంది. ఉదాహరణగా 251.344, 363.498 క్రమ సంఖ్యలు ఉన్న పద్యాలు చూడవచ్చు. ముఖ్యంగా, దుష్కర ప్రాస ఇచ్చినప్పుడు, క్రొత్త పదాలను సంధియుతంగా సృష్టించే క్రమంలో కూడా ఈ విషయాలు గుర్తుంచుకుంటాము. ఒక్కోసారి ముందరి పాదంలో అక్షరము (రాలు) జతపరచినా కూడా అసంబద్ధము, వ్యతిరేకార్థము తొలగించడం కుదరక పోతే ఇచ్చిన సమస్యాపాదాన్ని, చిన్న పదాలుగా విభజించి, ఒక్కొక్క పదంలో లేదా రెండు, మూడేసి పదాలలో ఉన్న అర్థాన్ని జవాబుగా పొందే ప్రశ్నలని పై పాదాల్లో ఏర్పరచడం, క్రమాలంకార శోభితమై సమస్యను పూరిస్తుంది. దీనికి ఉదాహరణలుగా, 13.17, 48.71, 59.90, 89.130, 116.167, 118.170, 264.360 క్రమ సంఖ్యలుగా ఉన్న పద్యాలు చూడవచ్చు. ఒక్కోసారి ఇచ్చిన సమస్య ఒక ఛందస్సుకు సంబంధించిన పద్యపాదం అయితే పూరణ వేరే ఛందస్సులో చేయడానికి వెసులుబాటు ఉంటుంది. ఇటువంటి విన్యాసాలకి ఉదాహరణ, ఉత్పలమాల ఛందస్సులో సమస్య ఇస్తే పూరణ ఉత్పలమాలలో కందములో చేయడం పద్యాల క్రమ సంఖ్యలు 73.109, 73.110ల లోను, ఆటవెలది ఛందస్సులో సమస్య ఇస్తే పూరణ తేటగీతిలో చేయడం క్రమ సంఖ్యలు 33.44 నుండి 33.47 వరకు ఉన్న పద్యాల లోను చూడవచ్చు. క్రమ సంఖ్యలు 341.467, 341.468 మరియు 341.470లో ఉన్న పద్యాలు ఈ కోవలోకే వస్తాయి. ఇలాంటి మెలఁకువలు నాకు చాలా నేర్పినట్టి మా మేనమామగారు బహుగ్రంథకర్త ఐన శ్రీ చిరువోలు విజయనరసింహారావు గారికి ఈ పుస్తకం అంకితం ఇస్తున్నాను.

ఈ పుస్తకంలో ఇవ్వబడిన సమస్యలకి మూలాలు (sources) కొన్నిటికి శ్రీ బూదరాజు రాధాకృష్ణ గారు కూర్చిన "తెలుగులో సమస్యాపూరణాలు" అన్న పుస్తకం, కొన్నిటికి 1953లో వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారి "తెలుఁగు సమస్యలు" అన్న పుస్తకం, కొన్నిటికి డాక్టర్ ప్రసాదరాయ కులపతి గారి "కవితా మహేంద్రజాలం" అన్న పుస్తకం, కొన్నిటికి అంతర్జాలంలో (Internet) ఉన్న బ్లాగులు (blogs), కొన్నిటికి పత్రికలు (వెబ్ {web} పత్రికలు కూడా), ఇంకా కొన్నిటికి రేడియో / యూట్యూబ్ ప్రసారాలు. అలా సేకరించిన 456 సమస్యలకి చేసిన 620 పూరణలు (కొన్ని సమస్యలకి ఒకటి కన్నా ఎక్కువ పూరణలు చేయబడ్డాయి) ఈ పుస్తకంలో నిఘంటువు క్రమంలో (dictionary

order) లఘుటీకా వ్యాఖ్యాన సహితంగా ఇవ్వబడ్డాయి. వీటిలో కొన్ని, "తెలుగు వెలుగు" అన్న పత్రిక యొక్క వివిధ సంచికలలో, "సుజనరంజని" అన్న వెబ్ మేగజిన్ (web magazine) యొక్క నెలవారీ శీర్షికల్లో, "కవన విజయం" అన్న ఆకాశవాణి (విశాఖపట్నం కేంద్రం) కార్యక్రమం ప్రసారాలలో (నెలకి రెండు సార్లు) నా పేరు మీద గానీ, నా బంధు మిత్రుల పేర్ల మీద గానీ, ప్రచురితమైనవి / ప్రసారమైనవి కూడా ఉన్నాయి. చదువరుల సౌకర్యం కోసం సమస్యల నిఘంటువు క్రమంలో (dictionary order) ఒక్కొక్క సమస్యతో పాటు వాటికి చేసిన పూరణలు ఇవ్వబడ్డాయి కాబట్టి, ఈ పుస్తకంలో విషయ సూచిక అవసరం ఉండదని ఇవ్వలేదు. పద్యాలకి క్రమ సంఖ్యను ఒక ప్రత్యేక పద్ధతిలో కేటాయించడం జరిగింది. ఉదాహరణకి 455.616 అంటే, 455వ సమస్యకి చెప్పబడిన పద్యాలలో క్రమ సంఖ్య 616 కేటాయించబడిన పద్యం అని అర్థం. అదే సమస్యకి మొత్తం ఐదు పద్యాలు చెప్పబడ్డాయి. అందుచేత, మిగిలిన నాలుగు పద్యాలకి క్రమ సంఖ్యలు 455.617, 455.618, 455.619, 455.620 కేటాయించబడ్డాయి.

సమస్యా పూరణాలు చేయడం ఛందోజ్ఞానం, భాషా పాండిత్యము, పురాణ కావ్య పరిజ్ఞానము, లౌకిక విషయాల మీద ఆసక్తి, స్ఫురణలకి సంబంధించిన సాహిత్య క్రీడ. ఈ విషయాలలో నాకున్న నైపుణ్యం చాలా తక్కువైనప్పటికీ, నాలో ఉత్సాహం నింపిన మా గురువు, మా మేనమామ గార్ల కారణంగా ఏదో కొద్దిగా ప్రయత్నించి నేను చేసిన సమస్యాపూరణాలు ఒక చోట చేర్చి ఈ ఎలక్ట్రానిక్ పుస్తకం (E-Book) రూపంలో అందరికీ ఉచితంగా (Free) అందిస్తున్నాను.

ఈ పుస్తకంలోని సమస్యాపూరణాలు అదివరకే నా బ్లాగు "https://mvsranganadham.in/" లో పెట్టడం వలన, కొంత మందికి తెలిసినవే. చదవడానికి ఎక్కువ సౌలభ్యమని ఎక్కువ మందికి అందించడానికి వీలవుతుందనీ ఈ ఫ్రీ ఈ-బుక్ (free E-Book) విడుదల చేస్తున్నాను. ఇది నా మూడవ ఈ-బుక్. ఇందులో దోషాలు గానీ నచ్చని విషయాలు గానీ ఉంటే పాఠకులు నాకు తప్పక తెలియఃజెయ్యాలని మనవి.

సైనిక్ పురి, హైదరాబాదు, — భవదీయుడు,

ది: 01 - 09 - 2025. — మద్దాలి వేంకట సత్య రంగనాథం

సమస్యాపూరణాల సమాహారం

(లఘుటీకావ్యాఖ్యాన సహితము)

1. సమస్య: అంగము లేని వాఁడు తన యాలినిఁ గూడి సుఖించె నెట్లనో

1.1 ఉ. అంగజు కేళి కేర్పరచి యంతిపురమ్మున పాన్పు కొండు ఖ
ట్వాంగము లేని వాఁడు తన యాలినిఁ గూడి సుఖించె నెట్లనో
గంగను ధాత్రిఁ జేర్చ పడు కష్టము లన్న వవేమి తక్కువా
భంగము లెన్ని యున్న తమ వ్యాపృతి సాగగఁ జేయు టట్లనే.

(అంగజుడు = మన్మథుఁడు, కేళి = క్రీడ, ఏర్పరచు = ఏర్పాటు చేయు, అంతిపురము = భోగగృహం, ఒండు = ఏకము, ఖట్వాంగము = మంచపు కోడు, ఆలి = భార్య, కూడు = కలియు, ఎట్లు = ఏ విధముగా, ధాత్రి = భూమి, భంగము = ఆటంకము, వ్యాపృతి = వ్యాపారము, అట్లు = ఆ విధముగా)

మన్మథ క్రీడ కోసం ఏర్పాటు చేసుకొని భోగగృహంలో పాన్పుకు ఒక మంచకోడు లేని వాడు తన భార్యను కలసి ఏదో విధంగా సుఖించాడు. గంగను భూమికి చేర్చడానికి పడ్డ కష్టాలన్నవి అవేమన్నా తక్కువా? ఆటంకాలు ఎన్ని ఉన్నా తమ పని సాగేటట్లుగా చేసుకోవడం అలాగే.

2. సమస్య: అంగీకార మొనర్చునే యమునతో నానందముం బొందునే

తెనాలి రామలింగ మహాకవి రచించిన పాండురంగ మహాత్మ్యం అన్న కావ్యంలో తుంగభద్రానది వర్ణన గురించిన పద్యంలోని ఒక పాదం ఈ సమస్య. ఆ పద్యం క్రింద ఇవ్వబడింది.

శా. గంగా సంగమ మిచ్చగించునె మదిన్ గావేరి దేవేరిగా
నంగీకార మొనర్చునే యమునతో నానందముం బొందునే
రంగత్తుంగ తరంగ హస్తముల నారత్నాకరేంద్రుండు నీ
యంగం బంటి సుఖించునేని గుణభద్రా! తుంగభద్రానదీ!

నత్కీరోపాఖ్యానంలోని వృత్తాంతము తీసుకొని సమస్యని పూరించడం జరిగింది. ధూర్జటి మహాకవి రచించిన శ్రీకాళహస్తి మాహాత్మ్యం అన్న పద్యకావ్యంలో నత్కీరుడి కథ ఉంది. కవిపండిత పోషకుడైన పాండ్యరాజు కొలువుకి ప్రతిదినం ఎవరో ఒకరు రావడం, కవిత్వం వినిపించడం, ఆస్థానంలో ఉన్న నత్కీరాది కవీశ్వరులు తర్కించి నిగ్గు తేల్చడం, అర్హుడైతే వానికి రాజసత్కారం, అనర్హుడైన వాడు వెనుదిరిగిపోవడం, జరుగుతూ ఉండేది. ఆ రాజ్యంలో ఒక సారి కరువొచ్చింది. ఆ సమయంలో శివాలయంలో ఉన్న పూజారి దయనీయ స్థితిని చూసి, శివుడు ప్రత్యక్షమై ఒక పద్యం అల్లి పూజారి కిచ్చి "దీన్ని రాజు గారి వద్దకు తీసికెళ్ళు, నీ సమస్య తీరుతుంది" అన్నాడు. పూజారి రాజు కొలువుకి వెళ్ళి శివు డిచ్చిన పద్యం చదివాడు. ఆ పద్యంలో " సింధుర రాజ గమనా ధమ్మిల్ల బంధంబు సహజ గంధంబు" అని ఉంది. అంటే ఏనుగు లాంటి నడక కలిగిన స్త్రీ జుట్టుముడి సహజ సువాసనతో అలరారుతోంది అని అర్థం. దీనికి కొలువులో నత్కీరుడు అభ్యంతరం చెప్పాడు. జడకి సహజ గంధం ఏమిటి, తప్పిది, చెప్పరాదు, కవితా పద్ధతులకీ కవిసమయానికీ ఇది ఒప్పదు, అని తిరస్కరించాడు.

2.2 శా. కింగాణమ్మొనరించి పండితుడు నత్కీరుండు వాదంబునన్
యంగీకార మొనర్చునే? యమునతో నానందముం బొందునే
పింగాక్షుం, డుమ కొప్పు తావి సహజంబే యన్న పద్యంబునన్,
భంగం బయ్యెను యోగ్యతం చతడు దేవాజీవికిం జెప్పగన్.

(కింగాణము = వ్యతిరేకము, ఒనరించు = చేయు, వాదము = చర్చ, ఒనర్చు = చేయు, యమున = పార్వతి, పొందు = అనుభవించు, పింగాక్షుడు = శివుడు, ఉమ = పార్వతి, కొప్పు = కేశబంధము, తావి = పరిమళము, సహజము = స్వతస్సిద్ధము, పేర్కొను = స్తుతించు, భంగము = నష్టము, యోగ్యత = ఔచిత్యము, దేవాజీవి = పూజారి)

వ్యతిరేకము చేసి పండితుడైన నత్కీరుడు చర్చలో ఒప్పుకుంటాడా? పార్వతి కేశబంధము యొక్క పరిమళం స్వతస్సిద్ధమే అన్న పద్యంలో ఔచిత్య భంగం అయ్యింది అంటూ అతడు పూజారికి చెప్పడం వల్ల పార్వతితో ఆనందం అనుభవిస్తాడా శివుడు?

3. సమస్య: అంత గజాననుండు తన యానతి నిచ్చెను తత్క్రియాదికిన్

3.3 ఉ. పంతము యాశుధారకును వ్రాయసకానికి వేగమందునన్,
దంతము తోడ భారత యుదంతము లర్థ మెరింగి వ్రాయగన్,
వింతగ నేకదంష్ట్రునికి విజ్ఞుడు వ్యాసునికిన్ తలెత్తగా,
అంత గజాననుండు తన యానతి నిచ్చెను తత్క్రియాదికిన్.

(పంతము = పోటీ, ఆశుధార = అప్పటికప్పుడే అంతరాయము లేకుండ చెప్పు కవిత్వము, వ్రాయసకాడు = వ్రాయువాడు, ఉదంతము = వృత్తాంతము, ఎరుగు = తెలిసి కొను, వింత = ఆశ్చర్యము, ఏకదంష్ట్రుడు = వినాయకుడు, విజ్ఞుడు = నిపుణుడు, తలెత్తు = ఆవిర్భవించు, గజాననుడు = వినాయకుడు, ఆనతి = ఆజ్ఞ, తత్ = ఆ, క్రియ = పని, ఆది = మొదలు)

మహాభారతం వ్రాయడానికి వ్యాసుడికి ఒక వ్రాయసకాడి అవసరం కలిగింది. ఆ పాత్ర పోషించడానికి వినాయకుడు ఒప్పుకున్నాడు కానీ ఒకళ్ళ కొకళ్ళు నియమాలు విధించుకున్నారు. తన గంటం ఆగనంత వేగంగా చెప్పాలని, గంటం ఆగితే ఆ తరువాత వ్రాయనని వినాయకుడి నిబంధన, అర్థం చేసుకుని వ్రాయాలని వ్యాసుడి నిబంధన. ఆ వృత్తాంతం గురించి ఈ పద్యంలో చెప్పబడింది. ఏమనంటే: వినాయకుడికీ నేర్పరి యైన వ్యాసుడికీ పోటీ తలెత్తింది, అది వ్యాసుని ఆశు కవిత్వానికి, మహాభారతం లోని వృత్తాంతాలు అర్థం తెలుసుకొని పంటితో వ్రాసే వినాయకుడికి. అంతట వినాయకుడు ఆ పని ప్రారంభానికి తన అనుజ్ఞ ఇచ్చాడు.

4. సమస్య: అందము చెడిపోయె ననుచు నతివయె మురిసెస్

4.4 కం. కందగ లక్ష్మణు, డాతని
పొందగఁ జను చుప్పనాతి, భూజను నేడే
తిందుననగ, యామెకు తను
వందము చెడిపోయె ననుచు నతివయె మురిసెస్.

(కందగ = కోపించగా, చుప్పనాతి = శూర్పణఖ, భూజ = సీత, తనువందము = శరీరము యొక్క అందము)

లక్ష్మణుడు కోపించగా, ఆతని పొందగోరి వెళ్ళే శూర్పణఖ 'సీతను ఇవాళే తింటాను' అని అనగా ఆమెకు శరీరము యొక్క అందము చెడిపోయెనని వనితయే (సీతయే) సంతోషించింది.

4.5 కం. స్యందనమున సాత్రాజితి
కందముపై నున్న శ్రద్ధ కదనముఁ గొనగా,
మ్రందెను నరకుడు, తన తను
వందము చెడిపోయె ననుచు నతివయె మురిసెస్.

(స్యందనము = రథము, సాత్రాజితికి = సత్యభామకు, కదనము = యుద్ధము, మ్రందెను = చచ్చెను, తనువందము = శరీరము యొక్క అందము)

రథముపై నున్న సత్యభామకి అందముపై నున్న శ్రద్ధను యుద్ధము తీసేసుకోవడం వల్ల నరకుడు చచ్చాడు. తన శరీరము యొక్క అందము చెడిపోయిందని వనితయే (సత్యభామే) సంతోషించింది.

5. సమస్య: అందఱు నందఱే మఱియు నందఱు నందఱె యందఱందఱే

5.6 ఉ. కొందఱు శాస్త్రకోవిదులు, కొంద ఱనేక కళా ధురంధరుల్,
కొందఱు రాజకీయముల కుల్యులు, కొందఱు శ్రామికోత్తముల్,
యందరికిస్ సమాజమన యంకిత భావమె, ధర్మనిష్ఠలో
నందఱు నందఱే మఱియు నందఱు నందఱె యందఱందఱే.

(శాస్త్రకోవిదుడు = శాస్త్రములలో పండితుడు, ధురంధరుడు = శ్రేష్ఠుడు, కుల్యుడు = పూజ్యుడు, శ్రామికుడు = శ్రమజీవి, అంకితభావము = ఒక విషయమున పూర్తిగా స్వార్థము లేకుండ చూపు నిష్ఠ), నిష్ఠ = నిర్వహణము)

కొందరు శాస్త్రాలలో పండితులు, కొందరు అనేక కళలలో శ్రేష్ఠులు, కొందరు రాజకీయాల్లో పూజ్యులు, కొందరు ఉత్తములైన శ్రమజీవులు, అందరికీ సమాజము అంటే అంకితభావమే. ధర్మాన్ని నిర్వర్తించడంలో అందరూ అందరే.

5.7 ఉ. కొందఱు కైత లల్లుచును, కొందఱు శిల్పములస్ సృజించుచుస్,
కొందఱు నృత్యరీతులను, కొందఱు గానము చేయుచుస్, భవుస్
యందరు పూజసేతు రిటు, యందము నర్చన చేయుటందు వీ
రందఱు నందఱే మఱియు నందఱు నందఱె యందఱందఱే.

(కైత = కవిత్వము, సృజించు = సృష్టిచేయు, భవుడు = శివుడు)

కొందరు కవిత్వము అల్లుతూ, కొందరు శిల్పాలని సృష్టిచేస్తూ, కొందరు నృత్యరీతులలోనూ, కొందరు గానం చేస్తూనూ శివుణ్ణి అందరూ ఈ విధంగా పూజ చేస్తారు. సౌందర్యార్చన చేయడంలో వీరందరూ అందరే.

6. సమస్య: అందవికారమే బ్రతుకు నందున శాంతి నొసంగు మిత్రమా

6.8 ఉ. అందము భార్య కున్న తగ దందురు భీతినిఁ గాని, యందుకొ
మ్మందవిహీన పాణి నని యన్న సహింపగఁ జాల మందురే

యందవికారమే, బ్రతుకు నందున శాంతి నొసంగు, మిత్రమా!
యందము తోడి మానసిక యందముఁ గూడ మనుష్యు కున్నచో.

భార్యా రూపవతీ శత్రుః అని అన్నారు కదా. భార్య అందంగా ఉంటే కుదరదు అంటారు, భయంతో. అయితే, ఒక అందం లేని అమ్మాయి చెయ్యందుకో (వివాహం చేసుకో) అని అంటే, అందవికారమే సహించ జాలమని అంటారు కదా. మిత్రమా, మనిషికి (నీకైనా, నీ భార్యకైనా, ఎవరికైనా) అందంతో పాటు మానసిక అందం కూడా ఉంటే జీవితంలో శాంతి నిస్తుంది.

7. సమస్య: అంది యందని యందమే విందొసంగు

7.9 తే.గీ. పొందుఁ గోరగ వలదని పోయి ప్రవరు
డేగుదెంచ కపటి యని యెరుగ కతడె
ప్రవరుడని వరూధిని యెంచి పరవశించె,
యంది యందని యందమే విందొసంగు.

(పొందు = కలయిక, ఏగుదెంచు = వచ్చు, కపటి = మోసగాడు, ఎరుగు = గ్రహించు, ఎంచు = అనుకొను, పరవశించు = మైమఱచు, విందు = సంతోషము, ఒసగు = ఇచ్చు)

పొందును కోరగా వద్దని వెళ్ళిపోయిన ప్రవరుడు రాగా మోసగాడని తెలియక అతడే ప్రవరుడని వరూధిని తలచి మైమఱచిపోయింది. అందీ అందని అందమే సంతోషాన్ని ఇస్తుంది.

8. సమస్య: అంధుం డర్ధ నిశీథ మందుఁ గనె నయ్యర్కేందు బింబమ్ములన్

8.10 శా. గాంధారీపతి దివ్యదృష్టిఁ గలుగన్ గాంచెన్ విరాడ్రూపమున్,
సందర్శించిన రూప మందుఁ వెలుగన్ చంద్రున్, జగచ్చక్షువున్,
సంధిన్ గాదనిఁ గృష్ణుఁ బంపి శయనించన్ స్వప్నమం దప్పు డా
యంధుం డర్ధ నిశీథ మందుఁ గనె నయ్యర్కేందు బింబమ్ములన్.

(దివ్యదృష్టి = దైవము ప్రత్యేకంగా ఇచ్చిన దృష్టి, కాంచు = చూచు, విరాడ్రూపము = పరమాత్మ రూపము, సందర్శించు = చూచు, వెలుగు = ప్రకాశించు, జగచ్చక్షువు = సూర్యుడు, శయనించు = పరుండు, స్వప్నము =

కల, అంధుడు = గ్రుడ్డివాడు, అర్థనిశీథము = అర్థరాత్రి, అర్క = సూర్యుడు, ఇందు = చంద్రుడు, బింబము = మండలము)

గాంధారి భర్తయైన ధృతరాష్ట్రుడు దివ్యదృష్టి లభించగానే పరమాత్మ రూపాన్ని, చూసిన రూపంలో చంద్రుడు సూర్యుడు ప్రకాశించడాన్ని చూశాడు. సంధి కుదరదని కృష్ణుణ్ణి పంపేసి పరుండగానే కలలో అప్పుడు ఆ గ్రుడ్డివాడు అర్థరాత్రి యందు ఆ సూర్యచంద్ర బింబాలను చూశాడు.

9. సమస్య: అంధుండాలయముఁ గాంచి యానందించెన్

9. 11 కం. బంధువులను మాట మరచి,
పాంథులుగా లక్కయింట పాండవుల వధన్
సంధించి, మదిని, రాజగు
యంధుం డా లయముఁ గాంచి, యానందించెన్.

(పాంథుడు = ప్రయాణీకుడు, వధ = మారణము, సంధించు = కూర్చు, మది = మనస్సు, అంధుడు = గుడ్డివాడు, లయము = నాశము)

బంధువులనే మాటని మరిచిపోయి, ప్రయాణీకులుగా లక్క ఇంటిలో (వారణావతంలో) పాండవుల హత్యకు ఏర్పాటు చేసి, రాజైన గుడ్డివాడు (ధృతరాష్ట్రుడు) మనస్సులో ఆ నాశనాన్ని చూసి ఆనందించాడు.

10. సమస్య: అంధుల శిక్షింపవలయు నానందముగన్

10.12 కం. అంధకరిపు కింకరు దశ
కంధరు దుష్కార్యముఁ గని, కపిరథు డెంచెన్,
బంధు సహితముగ యట్టి మ
దాంధుల శిక్షింపవలయు, నానందముగన్.

(అంధకరిపు = అంధకాసురుని శత్రువైన శివుడు, కింకరు = సేవకుడు, దశకంధరుడు = పది మెడలు కల రావణుడు, దుష్కార్యము = చెడు పని, కపిరథుడు = శ్రీరాముడు, మదాంధుడు = గర్వము చేత గ్రుడ్డి వాడైన వాడు)

శివుని సేవకుడైన రావణుని చెడ్డ పని చూసి, బంధు సమేతంగా అటువంటి మదాంధులను శిక్షించాలని, సంతోషంతో శ్రీరాముడు అనుకున్నాడు.

10.13 కం. 'బంధకి కృష్ణ' యనిన కా
మాంధుల శిక్షింపవలయు, నానందముగన్
బంధుల నుంచుట యాప
ద్బాంధవు కృష్ణుని పనుపని, పాండవు లనరే.

(బంధకి = రంకుటాలు, కృష్ణ = ద్రౌపది, కామాంధుడు = కామము చేత అంధుడైన వాడు, బంధుల = బంధువులను, ఆపద్బాంధవుడు = ఆపదలలో బంధువులగా ఆదుకునే వాడు, పనుపు = ఆదేశము)

ద్రౌపదిని బంధకి అని అన్నటువంటి కామాంధులని శిక్షించాలి, బంధువులను సంతోషంగా ఉంచాలి, అన్నవి ఆపద్బాంధవుడైన కృష్ణుని ఆదేశాలని పాండవు లనరే.

10.14 కం. బంధువు లయిన సరే కా
మాంధుల శిక్షింపవలయు, నానందముగన్
బంధముల కతీతమ్మగు
బంధముల సుజనులఁ గాచు బాధ్యతఁ గొనుచున్.

(అతీతము = అతిక్రమించినది)

అన్ని బంధాలకి అతీతమైన బంధాలతో మంచి వాళ్ళని రక్షించే బాధ్యత తీసుకుంటూ, కామాంధులు బంధువు లయినా సరే, వాళ్ళని శిక్షించాలి.

11. సమస్య: అక్కా రమ్మనుచు మగఁడు నాలిం బిలిచెన్

11.15 కం. మక్కువఁ జూపితి నంటివి,
కక్కురితిగ వండి తీవు, కారపు ఘాటే
తక్కువ యయ్యెను, యిమ్మా
యక్కారమ్మనుచు, మగఁడు నాలిం బిలిచెన్.

(మక్కువ = ప్రేమ, కక్కురితి = అశ్రద్ధ, ఘాటు = తీవ్రత, అక్కారము = ఆ కారము, ఆలి = భార్య)

ప్రేమ చూపించా నంటావు. నువ్వు అశ్రద్ధగా వండావు. కారపు ఘాటే తక్కువైంది. ఆ కారము ఇవ్వుమా అంటూ మగడు భార్యను పిలిచాడు.

12. సమస్య: అధివిన్నం గని నంత మండు నొడ లత్యం తాగ్రహో దగ్రతన్

12.16 మ. అధిపుం డొల్లమి సేయగా సవతులం దారాధ్య నెట్లౌదు, నన్
యధివిన్నం గని నంత మండు నొడ లత్యం తాగ్రహో దగ్రతన్
విధియే కైకగ, రాము గానలకు పంపించంగ, రాజ్యంబు నే
కధనుం డేలగ, నిశ్చయించె ననుచున్ కౌసల్య వాపోయెగా.

(అధిపుడు = ప్రభువు, ఒల్లమి = అలక్ష్యము, సవతి = తోడిపెండ్లాము, ఆరాధ్య = ఆరాధింపతగిన, నన్ = నన్ను, అధివిన్న = మొదటి భార్య, కను = చూచు, అంత = వెంటనే, మండు = కోపాదులచే జ్వలించు, ఒడలు = శరీరము, అత్యంత = చాలా అధికమైన, ఆగ్రహ = కోపము, ఉదగ్రత = ఉద్ధతి, విధి = బ్రహ్మ, కాన = అడవి, ఏకధనుడు = సోదరుడు, ఏలు = పాలించు, నిశ్చయించు = నిర్ణయించు, వాపోవు = దుఃఖించు)

ప్రభువైన దశరథుడే అలక్ష్యం చేస్తుంటే, సపత్నులకి ఆరాధ్యని ఎట్లా అవుతాను. పెద్ద భార్యనైన నన్ను చూడంగానే అధికమైన కోపోద్ధతితో ఒళ్ళు మండి పోతుంది. విధియే కైక రూపంలో రాముణ్ణి అడవులకి పంపడానికి, రాజ్యాన్ని సోదరుడైన భరతుడు ఏలడానికి, నిర్ణయించింది అంటూ కౌసల్య దుఃఖించింది.

13. సమస్య: అనిరుద్ధుడు నెమలినెక్కి అంబుధి దాటెన్

13.17 కం. తనయుడు ప్రద్యుమ్ను కెవరు?
యినతేజుడు శరజుడేది యెక్కి చరించెన్?
యనిల సుతుడేమి జేసెను?
అనిరుద్ధుడు; నెమలినెక్కి; అంబుధి దాటెన్.

(తనయుడు = కుమారుడు, ప్రద్యుమ్నుడు = కృష్ణునికి రుక్మిణియందు పుట్టిన కొడుకు, ఇన = సూర్యుడు, శరజుడు = కుమార స్వామి, చరించు = తిరుగు, అనిలుడు = వాయుదేవుడు, అంబుధి = సముద్రము)

క్రమాలంకారంలో పూరించబడిన సమస్య ఇది. ప్రద్యుమ్నునికి పుత్రుడు ఎవరు? సూర్యతేజస్సుతో ఉండే కుమార స్వామి దేనిని ఎక్కి తిరిగాడు? వాయుపుత్రుడైన హనుమంతుడు ఏమి చేశాడు? వీటికి సమాధానాలు వరుసగా, "అనిరుద్ధుడు", "నెమలినెక్కి", "అంబుధి దాటెన్".

14. సమస్య: అన్నప్రాశనము జేయు డారవ యేటన్

14.18 కం. చిన్ని శిశువు కారు నెలల
కన్నప్రాశనముఁ జేయు, డారవ యేటన్
తన్నొక గురూత్తముని కడ,
విన్నాణిగ తీర్చిదిద్ద, విడనాడ వలెన్.

(అన్నప్రాశనము = బిడ్డలకు మొట్టమొదట అన్నము తినిపించెడి యొక శుభకర్మము, విన్నాణి = విజ్ఞాని, తీర్చిదిద్దు = చక్కగా నుంచు, విడనాడు = వదలిపెట్టు)

చిన్న బిడ్డకు ఆరు నెలలకు అన్నప్రాశనము చేయుడు. ఆరవ యేట, తనని ఒక ఉత్తమ గురువు దగ్గర విజ్ఞానిగా తీర్చిదిద్దడం కోసం వదలిపెట్టాలి.

15. సమస్య: అన్నము తినునట్టి మనిషి అధముడు జగతిన్

15.19 కం. అన్నము కొర కాకలితో,
కన్నుల ముందొకడు చాల కటకటఁ బడగా,
యన్నముఁ బెట్టక, తా మృ
ష్టాన్నము తినునట్టి మనిషి యధముడు జగతిన్.

(కటకటపడు = బాధపడు, మృష్టాన్నము = రుచికరమైన తియ్యని పదార్థములతో కూడిన మంచి భోజనము, అధముడు = నీచుడు)

అన్నం కోసం ఆకలితో కళ్ళముందే ఒకడు బాధపడుతూ ఉంటే అన్నం పెట్టకుండా, తాను మృష్టాన్నము తినే మనిషి లోకంలో నీచుడు.

15.20 కం. తిన్నడు శివలింగం బా

కొన్నం గని బువ్వఁ బెట్టఁ గోరుచు వేడెన్,
అన్నా! నీ కర్పింపక
యన్నము తినునట్టి మనిషె, యధముడు జగతిన్.

(ఆకొను = ఆకలిగొను, బువ్వ = అన్నము, వేడు = ప్రార్థించు, అర్పించు = గౌరవ సూచకంగా సమర్పించు)

శివలింగము ఆకలి గొన్నదని, 'ఔరా! నీకు అర్పించకుండా అన్నం తినేటటువంటి మనిషే లోకంలో నీచుడు కదా' అని అన్నం పెడతానని కోరుతూ తిన్నడు ప్రార్థించాడు. ఈ పద్యంలోని మూడవ పాదంలో 'అన్నా' బదులు 'కన్నా' అని పెట్టినా పద్యం అర్ధవంతంగా ఉంటుంది. తిన్నడు తన కళ్ళని శివలింగానికి అర్పించాడు కదా, అందుకని.

15.21 కం. అన్నపదార్థము కల్తీ
లెన్నో విధములుగఁ జేసి యెందరి యుసురోఁ
గొన్న దురాత్మకుడు, కడుపు
కన్నము తినునట్టి మనిషె? యధముడు జగతిన్.

(కల్తీ = ఒక వస్తువులో అటువంటిదే మరొక వస్తువును కలిపి మోసపుచ్చు, ఉసురు = అన్యాయంగా ఒకరిని కష్టపెట్టినందువల్ల కలిగే పాపం, దురాత్మకుడు = చెడ్డ బుద్ధి కలవాడు)

అన్న పదార్థము ఎన్నో విధాలుగా కల్తీ చేసి, ఎందరి ఉసురో గొన్న దురాత్మకుడు, కడుపుకు అన్నం తినేటటువంటి మనిషా? లోకంలో నీచుడు కదా.

15.22 కం. చిన్నార్ల వసతి గృహమున,
యన్నాదుల లోటుపాట్లు యవకతవక లె
న్నున్నను పట్టని ధూర్తుడు,
యన్నము తినునట్టి మనిషె? యధముడు జగతిన్.

(లోటుపాట్లు = ఎక్కువతక్కువలు, అవకతవకలు = తారుమారులు, ధూర్తుడు = మోసకాడు)

చిన్నారుల వసతి గృహములో, అంటే హాస్టలులో, అన్నం ఇంకా మిగిలిన అవసరాలలో ఎక్కువ తక్కువలు, అవకతవకలు ఎన్ని ఉన్నా పట్టించుకోని మోసకాడు, అన్నం తినేటటువంటి మనిషా? లోకంలో నీచుడు కదా.

16. సమస్య: అన్నము సున్నమైన ముద మందిరి బంధులు పెండ్లి విందులో

16.23   ఉ. తన్ను పరాభవింపగ నధర్వుల పంక్తి బహిష్కరించినన్,
కన్నరిఁ గాక భీమకవి క్రన్నన వారిని తిట్టి నంతనే,
యన్నము సున్నమైన, ముద మందిరి బంధులు పెండ్లి విందులో,
మన్నన నిల్పుకొన్న గుణమండితు ధైర్యము నుగ్గడించుచున్.

(అధర్వుడు = బ్రాహ్మణుడు, కన్నరి = దుఃఖితుడు, క్రన్నన = శీఘ్రముగా, ముదము = సంతోషము, మన్నన = గౌరవము, గుణమండితుడు = గుణము చేత అలంకృతుడు, ఉగ్గడించు = ప్రశంసించు)

తనను అవమానించడానికి బ్రాహ్మణ సమూహము బహిష్కరించగా, దుఃఖితుడు కాకుండా, వేములవాడ భీమకవి వాళ్ళని తిట్టగానే (శపించగానే), అన్నము సున్నము అవ్వగా, గౌరవం నిలుపుకొన్న ఆ సుగుణాలంకృతుని ధైర్యాన్ని ప్రశంసిస్తూ, పెళ్ళి విందులో బంధువులు సంతోషించారు.

17.   సమస్య: అన్నా రమ్మని పిల్చె భర్త తన అర్ధాంగిన్ ప్రమోదమ్మునన్

17.24   శా. అన్నం బొండుట యందు లీనమయితిన్ యందాఁక నన్ బిల్వఁ బో
కన్నా! రమ్మని పిల్చె భర్త తన యర్ధాంగిన్ ప్రమోదమ్మునన్,
యెన్నాళ్ళైనను నీ పయిన్ తన కదే యిష్టం బటంచున్ యనన్,
కన్నార్పన్ యనిపించ లేదనుచు యా కందోయి కాంక్షల్ గనన్.

(ఒండు = వండు, లీనమగు = మునుగు, అందాఁక = అంతవఱకు, పిల్చు = పిలుచు, ప్రమోదము = సంతోషము, కందోయి = రెండు కనులు, కాంక్ష = కోరిక, కను = చూడు)

అన్నం వండడంలో లీనమయ్యాను, అంతవఱకు పిలవ వద్దని అన్నా కూడా సంతోషంతో భర్త తన భార్యని ఎన్నాళ్ళైనా నీ మీద తన కదే ఇష్టమని చెప్పడానికి, కళ్ళు మూసుకోవాలని అనిపించలేదంటూ ఆ కళ్ళలో కోరికలు చూడడానికి, రమ్మని పిలిచాడు.

18.   సమస్య: అమవస నాఁటి రాత్రి నొక యంగన సూపెనుఁ జందమామనున్

18.25 చం. గమగమ లాడె మల్లెలని ఘూటగు ప్రేమకు హ్వాన మంచు పొ

ర్ణమిఁ జని పక్షమాయె నని నావ్రత మంతయు పూర్తి యయ్యె నీ
సమయము బీఱువోవునని స్వామికి చిత్రపటంబు నందు, యా
యమవస నాఁటి రాత్రి నొక యంగన సూపెనుఁ జందమామనున్

(గమగమలాడు = గమగమయని వాసనకొట్టు, ఘాటు = చాల తీవ్రమైన, హ్వానము = ఆహ్వానము, చను = వెళ్ళు, పక్షము = పదిహేను రోజులు, వ్రతము = నోము, సమయము = వేళ, బీఱువోవు = వ్యర్థమగు, స్వామి = భర్త, చిత్రపటము = చిత్తరువు, అమవస = అమావాస్య, అంగన = స్త్రీ)

మల్లెపూలు గమగమ వాసన కొడుతున్నాయని, ఘాటైన ప్రేమకు ఆహ్వానమని, పౌర్ణమి వెళ్ళి పదిహేను రోజులు అయ్యింది అని నా నోము పూర్తి అయ్యింది ఈ వేళ వ్యర్థమవుతుంది అని, భర్తకు చిత్రపటంలో ఆ అమావాస్య రాత్రి ఒక స్త్రీ చందమామను చూపించింది.

19. సమస్య: అమ్మకు గూడ భార్య గల దామెను యేమని బిల్వగా వలెన్

19.26 ఉ. దమ్మముఁ దప్పి ద్యూతమున దారను ధర్మజు డోడె, యట్టి ద
ద్దమ్మకుఁ గూడ భార్యఁ గల, దామెను యేమనిఁ బిల్వగా వలెన్?
యుమ్మడి సొత్తు వేశ్య యగు నూఢగ చెల్ల దటన్న కర్ణుకున్,
సమ్మతిఁ దెల్పె కౌరవులు, సభ్యులు ప్రాన్పడి మిన్న కుండగన్.

(దమ్మము = ధర్మము, ద్యూతము = జూదము, దార = భార్య, ధర్మజుడు = ధర్మరాజు, ఓడు = పోగొట్టుకొను, అట్టి = అటువంటి, దద్దమ్మ = అసమర్థుడు, పిల్చు = పిలుచు, ఉమ్మడి = సమిష్టి, సొత్తు = ఆస్తి, ఊఢ = భార్య, చెల్లు = అర్హమగు, సమ్మతి = అంగీకారము, తెల్పు = తెలియజేయు, సభ్యులు = సభికుడు, ప్రాన్పడు = నిశ్చేష్టితుడగు, మిన్నకుండు = విషయాన్ని పట్టించుకొనకపోవు)

ధర్మాన్ని తప్పి ధర్మరాజు జూదంలో భార్యని పోగొట్టుకున్నాడు, అటువంటి అసమర్థుడికి కూడా భార్య ఉంది, ఆమెని ఏమని పిలవాలి? సమిష్టి ఆస్తియైన ఆమె వేశ్య అవుతుంది, భార్యగా చెల్లదు అన్న కర్ణునికి, సభికులందరూ నిశ్చేష్టులై ఊరకుండగా, కౌరవులు అంగీకారము తెలిపారు.

20. సమస్య: అమ్మాయిల గని నుతించు యబ్బాయిలలో

20.27 కం. ఇమ్ముగ విద్యాధికులగు

యమ్మాయిలఁ గని నుతించు యబ్బాయిలలో
నమ్మిన యాదర్శములే
వమ్మగు నాచరణ మందు, పరిణయ మాడన్.

(ఇమ్ముగ = అనుకూల్యముగా, కను = చూచు, నుతించు = పొగడు, నమ్ము = విశ్వసించు, ఆదర్శము = అనుకరింపదగినది, వమ్ము = వ్యర్థము, ఆచరణము = చేయునది, పరిణయము = వివాహము)

అనుకూలంగా ఎక్కువ చదువుకున్న అమ్మాయిలని చూసి పొగిడే అబ్బాయిలలో నమ్ముకున్న ఆదర్శాలు పెళ్ళి చేసుకోవడానికి ఆచరించడంలో వ్యర్థ మవుతాయి.

20.28 కం. తమ్మెదిరించక యౌనను
యమ్మాయిలఁ గని నుతించు యబ్బాయిలలో
చిమ్మెడి యనురాగము, వా
జమ్మల మరపించు నమ్మ, సవ్యాజంబై.

(తమ్ము = తమను, ఎదిరించు = ప్రతిఘటించు, కను = చూచు, నుతించు = పొగడు, చిమ్ము = చల్లు, అనురాగము = ప్రేమ, వాజమ్మ = అసమర్థుడు, సవ్యాజము = కృత్రిమము)

తమని ప్రతిఘటించకుండా "ఔను" అనే అమ్మాయిలని చూసి పొగిడే అబ్బాయిలలో బయటికి చిమ్మే ప్రేమ కృత్రిమమై అసమర్థులని తలపిస్తుంది.

21. సమస్య: అర్జును డద్రి నందనకునై కొనివచ్చెను పారిజాతమున్

21.29 ఉ. కర్జముఁ జేసి మృచ్ఛకటికం బను నాటక మందు పాత్రగా
యార్జనకై, శకారునిగ నందరి మన్నన లందె నొక్క స
మ్మార్జకు డెంతొ స్ఫూర్తిగను మాటలు జ్ఞప్తికి రాక యిట్లనన్
"అర్జును డద్రి నందనకునై కొనివచ్చెను పారిజాతమున్".

(కర్జము = పని, మృచ్ఛకటికము = శూద్రకుని నాటకము, ఆర్జన = సంపాదనము, మన్నన = సమ్మానము, అందు = గ్రహించు, సమ్మార్జకుడు = ఊడ్చువాడు, స్ఫూర్తి = స్ఫురణము, అద్రినందన = పార్వతి)

సంపాదన కోసం మృచ్ఛకటికము అనే నాటకంలో పాత్రగా పని చేసి, ఒక ఊద్వేవాడు ఎంతో స్ఫురణతో నాటకంలో సంభాషణలు గుర్తుకు రాక, ఈ విధంగా అనడం వల్ల శకారునిగా అందరి మెప్పులు పొందాడు: అర్జునుడు పార్వతి కోసం పారిజాతాన్ని తీసుకొని వచ్చాడు. శకారు డలా మాట్లాడడం మృచ్ఛకటికం నాటకంలో పరిపాటే.

22. సమస్య: అస్ఖలితబ్రహ్మచారి కార్గురు పుత్రుల్

22.30 కం. ఏ స్ఖాలిత్యంబయె రే
తస్ఖలనము లేక సంతు దక్కిన, కృష్ణుం
డస్ఖలితు డటె, యితరు డే
యస్ఖలితబ్రహ్మచారి కార్గురు పుత్రుల్?

(స్ఖాలిత్యము = పొరపాటు, రేతస్ఖలనము = వీర్యము జారుట, సంతు = సంతానము, దక్కు = లభించు, అస్ఖలితుడు = స్ఖలనము లేని వాడు, అటె = ఆ విధముగా, ఇతరుడు = వేరొకడు)

వీర్యము జారుట అన్నది లేకుండా సంతానము కలగడంలో ఏ పొరపాటు జరిగింది? కృష్ణుడు అటువంటి అస్ఖలితుడే. వేరొకడు ఏ అస్ఖలితబ్రహ్మచారికి ఆరుగురు పుత్రులు ఉన్నారు?

23. సమస్య: ఆంగ్లమ్మే తల్లియగును ఆంధ్రమ్మునకుస్

23.31 కం. ఆంగ్లము రాదని యాంధ్రుని
జంగ్లీగా చూడ, యాంగ్ల జాడ్యము పెరుగస్,
ఆంగ్లాంధ్ర పదము లుండిన
ఆంగ్లమ్మే, తల్లియగును ఆంధ్రమ్మునకుస్.

ఇంగ్లీషు రాదని, తెలుగువాడిని అడవి మనిషిగా చూడడం వల్ల ఇంగ్లీషు పిచ్చి ఎక్కువవుతూ ఉండగా, ఇంగ్లీషు, తెలుగు పదాలు కలిసిన ఇంగ్లీషే తెలుగుకు మాతృక అవుతుంది.

23.32 కం. ఆంగ్లము నెక్కువ వాడిన
ఆంగ్లమ్మే తల్లియగును ఆంధ్రమ్మునకుస్
ఆంగ్లమొక సవతి తల్లిగ
ఆంగ్లేయుల నాటినుండి యాశలు నింపెస్.

ఇంగ్లీషు ఎక్కువగా వాడితే ఇంగ్లీషే తెలుగుకు మాతృక అవుతుంది. తెలుగుకు ఇంగ్లీషు ఒక సవతి తల్లిలాగా ఆంగ్లేయుల కాలంనుండి ఆశలు నింపింది.

23.33 కం. ఆంగ్లం బిటఁ బుట్టెను డా
క్బంగ్లా నాగరికలోక బట్లరు భాషై,
ఆంగ్లము వాడుక మించిన
ఆంగ్లమ్మ తల్లియగును ఆంధ్రమ్మునకున్.

డాకు బంగళా (Dock Bungalow) నాగరిక లోకం మాట్లాడే బట్లరు (Butler) భాషగా ఇంగ్లీషు ఇక్కడ పుట్టింది. ఇంగ్లీషు వాడకం ఎక్కువైతే, అదే తెలుగుకి మాతృక అవుతుంది.

24. సమస్య: ఆలి కుచంబు పుల్లనని యాతడు రంభను కోరె చూచితే

24.34 ఉ. బాలిశు కివ్వ జంబలము వాజము నందున పిండి త్రాగగా
యా లికుచంబు పుల్లనని యాతడు రంభనుఁ గోరెఁ జూచితే
వాలిశు పూజ యందున యుపారముగా కదళీఫలం బిడన్
జాలిగఁ జూచి దోపె తన శష్కులి యందిది మూర్ఖ పద్ధతే.

(బాలిశుడు = మూర్ఖుడు, జంబలము = నిమ్మ, వాజము = నీళ్ళు, లికుచము = నిమ్మపండు, రంభ = అరటి, వాలిశుడు = విష్ణువు, ఉపారము = నైవేద్యము, కదళీఫలం = అరటి పండు, ఇడు = ఇచ్చు, జాలి = విచారము, దోపు = చొప్పించు, శష్కులి = కర్ణరంధ్రము)

చూశావా! మూర్ఖుడికి నీళ్ళలో పిండుకొని త్రాగమని నిమ్మ ఇవ్వగా, ఆ నిమ్మపండు పుల్లగా ఉంటుందని అరటిని కోరాడు. విష్ణుపూజలో నైవేద్యంగా అరటి పండు ఇవ్వగా, జాలిగా చూసి దాన్ని తన చెవిలో దోపుకున్నాడు. ఇది మూర్ఖుడి పద్ధతే.

25. సమస్య: ఆశ్రమ దమములకు నాంది యాశ్రమ మదిగో

25.35 కం. అశ్రాంత మహింసా వ్రత,
మా శ్రమదమములకు నాంది యాశ్రమ మదిగో,
విశ్రుతము సబర్మతిగా,

యశ్రోత్రియమైన యుప్పు యనుపును నిలుపస్.

(అశ్రాంతము = ఎడతెగనిక్రియ, వ్రతము = నియమము, దమము = బాహ్యేంద్రియ నిగ్రహము, నాంది = మొదలుపెట్టడము, విశ్రుతము = మిక్కిలి ప్రసిద్ధికెక్కినది, అశ్రోత్రియము = సదాచార యుక్తము కానిది, అనుపు = సుంకము, నిలుపు = అడ్డగించు)

నిరంతరము అహింసా నియమము, ఆ శ్రమకు నిగ్రహానికి ప్రారంభ రంగమైన ఆశ్రమము అదిగో, సదాచారము కానటువంటి ఉప్పు మీది సుంకాన్ని అడ్డగించడానికి సబర్మతిగా విఖ్యాతమైంది.

25.36 కం. అశ్రుత మస్పృశ్యతగ, జ
నశ్రుతిగా దండి యాత్ర నడుపగ గాంధీ,
యాశ్రేయముగ సబర్మతి,
యా శ్రమదమములకు నాంది యాశ్రమ మదిగో.

(అశ్రుతము = విననిది, అస్పృశ్యత = అంటరానితనము, జనశ్రుతి = జనులు చెప్పుకొనెడు వృత్తాంతము, ఆశ్రేయము = ఆశ్రయింపతగినది, దమము = బాహ్యేంద్రియ నిగ్రహము, నాంది = మొదలుపెట్టడము)

అంటరానితనము అనేది వినపడని విధంగా, ప్రజలు చెప్పుకునే నానుడి లాగా దండి సత్యాగ్రహము గాంధీజీ నడిపించడానికి ఆధారము అనదగిన సబర్మతి. ఆ శ్రమకి, నిగ్రహానికి ప్రారంభ రంగమైన ఆశ్రమము, అదిగో.

26. సమస్య: ఇంటను దొంగ లుండ వెలి నీవల జూతు వదేల మానవా

26.37 ఉ. కంటికి గోచరింపడని కంటుగఁ జూచెద వేల శ్రీహరిస్,
కంటకు లార్గురస్ మరచు కారణ మున్నదె నాకుఁ జెప్పుమా,
యింటను దొంగ లుండ వెలి నీవలఁ జూతు వదేల, మానవా
తుంటరి చేష్ట లీవనుచు, దూఱె విభీషణు డన్న మేలుకై.

(గోచరించు = కనపడు, కంటు = శత్రువు = కంటకుడు, ఆర్గురు = ఆరుమంది (అరిషడ్వర్గము), వెలి = వెలుపల, ఈవల = ఈప్రక్క, మాను = విడుచు, తుంటరి = దుర్మార్గమైన, చేష్ట = పని, ఈవు = నీవు, దూఱు = నిందించు)

కంటికి కనపడడని శ్రీహరిని శత్రువుగా ఎందుకు చూస్తావు, అరిషడ్వర్గాన్ని మరిచి పోవడానికి కారణం ఏమన్నా ఉందా, నాకు చెప్పు, ఇంటి దొంగలు (అరిషడ్వర్గము) ఉండగా బయట ఈ ప్రక్క ఎందుకు చూస్తావు, దుర్మార్గమైన పనులు నీవు మానవా, అంటూ విభీషణుడు అన్నయైన రావణుని మేలు కోరి నిందించాడు.

27. సమస్య: ఇంతిని కౌగిలించెను జితేంద్రియుడైన మునీంద్రు డక్కటా

27.38 ఉ. ఎంతటి వారలైన, మనమెంత నియంత్రణఁ జేసికొన్న, యో
కాంతకు దాసులే యనగ, గాధిజు సంయతి కంతరాయమై
చెంతను నిల్వ మేనకయె, చిత్తము యామెను పొందఁ గోర, యా
యింతిని కౌగిలించెను, జితేంద్రియుడైన మునీంద్రు డక్కటా.

(మనము = మనస్సు, నియంత్రణ = అదుపుచేయటం, గాధిజు = విశ్వామిత్రుని, సంయతి = తపస్సు, అంతరాయము = విఘ్నము, జితేంద్రియుడు = ఇంద్రియనిగ్రహముగలవాఁడు, అక్కట = అయ్యో)

ఎంత వారలైనా మనసెంత అదుపులో పెట్టుకున్నా ఒక స్త్రీకి దాసులే అన్నట్లుగా, విశ్వామిత్రుని తపస్సుకు విఘ్నముగా ప్రక్కన మేనకయే నిలబడగా, మనస్సు ఆమెను పొందగోరగా, అయ్యో, ఆ స్త్రీని ఇంద్రియ నిగ్రహము గల వాడైన మునిశ్రేష్ఠుడు కౌగలించుకున్నాడు.

28. సమస్య: ఇన శశి బింబయుగ్మ ముదయించె దినాంతము నందు నద్దిశన్

28.39 చం. కనుమరుగయ్యె సూర్యు, డిక కవ్వడి పంతము వ్యర్థ మయ్యె, నా
తని మరణంబుఁ జూతునని, తార్క్ష్యము నెక్కిన సైంధవుండు తో
డనె తొలగంగ మబ్బు వినె టంకృతి యర్జును, కృష్ణు కన్నులన్
యిన శశి బింబయుగ్మ ముదయించె, దినాంతము నందు నద్దిశన్.

(కనుమరుగగు = కంటికి కనిపించకుండా పోవు, కవ్వడి = అర్జునుడు, పంతము = ప్రతిజ్ఞ, వ్యర్థము = అప్రయోజకము, తార్క్ష్యము = రథము, తోడను = వెంబడిని, తొలగు = తప్పుకొను, టంకృతి = వింటినారియొక్క ధ్వని, ఇనుడు = సూర్యుడు, శశి = చంద్రుడు, బింబయుగ్మము = మండల ద్వయము, ఉదయించు = పొడము, దినాంతము = సాయంకాలము, దిశ = దిక్కు)

సూర్యుడు కంటికి కనిపించకుండా పోయాడు, ఇక అర్జునుని ప్రతిజ్ఞ వ్యర్థమయ్యింది, ఆతని చావు చూస్తానని రథము ఎక్కిన సైంధవుడు వెంబడిని మబ్బు తొలగిపోగా అర్జునుని వింటినారి యొక్క ధ్వని విన్నాడు. సాయంకాలం ఆ దిక్కున కృష్ణుని కన్నులలో సూర్యచంద్ర బింబద్వయం ఉదయించింది.

29. సమస్య: ఈతాకుల గుడిసె లోన నిను డుదయించెస్

29.40 కం. ఏ తావున వెదకెద మిము
త్రాతలు మీరనిఁ దిరుగుచు, దమ్మక్కఁ గనెస్
సీతారాముల ప్రతిమలు
యీతాకుల గుడిసె లోన, నిను డుదయించెస్.

(తావు = చోటు, వెదకు = గాలించు, త్రాత = రక్షకుడు, కను = చూచు, ప్రతిమ = విగ్రహము, ఈత = ఈత చెట్టు, ఇనుడు = సూర్యుఁడు, ఉదయించు = పొడము)

ఏ చోటులో మిమ్మల్ని గాలిస్తాను, రక్షకులు మీరు అని తిరుగుతూ ఈతాకుల గుడిసెలో సీతారాముల విగ్రహాలను పోకల దమ్మక్క చూసింది. సూర్యుడు ఉదయించాడు.

30. సమస్య: ఉత్తరమున భానుబింబ ముదయం బయ్యెస్

30.41 కం. క్రొత్తా చౌర్య మనగ, ప్ర
త్యుత్తరమున, భానుబింబ ముదయం బయ్యెస్,
తత్తరమున యింటికి పరు
వెత్తితి నని, దొంగ తనదు విహితుని కనియెస్.

(చౌర్యము = దొంగతనము, ప్రత్యుత్తరము = జవాబు, భానుబింబము = సూర్యబింబము, తత్తరము = తడబాటు, పరువెత్తు = పరుగుతీయు, తనదు = తన యొక్క, విహితుడు = స్నేహితుడు)

నీకు దొంగతనం కొత్తా అని అడగగా, జవాబుగా సూర్యుడు ఉదయించాడు, కంగారుగా ఇంటికి పరిగెత్తాను అని దొంగ తన స్నేహితుడికి చెప్పాడు.

31. సమస్య: ఉల్లంఘనమే ఘనమగు నుద్యోగులకున్

31.42   కం. కల్లల, కపటముల, నిధుల
గల్లం తగునట్లుఁ జేయు కశ్మల మతులౌ
చిల్లర నేతల యాజ్ఞల
యుల్లంఘనమే, ఘనమగు నుద్యోగులకున్.

(కల్లల = అబద్ధములతో, కపటముల = మోసాలతో, నిధి = కార్యక్రమాల నిర్వహణ కోసం అందుబాటులో ఉండే ధనం, గల్లంతగు = అక్రమాలవల్ల కనిపించకుండా పోవు, కశ్మల = మలినము, చిల్లర = చిన్న చిన్న, ఆజ్ఞ = ఇది యిట్లు చేయవలసినదనెడి ఉత్తరువు, ఉల్లంఘనము = అతిక్రమించుట, ఘనము = గొప్పతనము)

అబద్ధాలతో మోసాలతో నిధులు గల్లంతు అయేటట్లు చేసే మలినమనస్కులగు చిల్లర నేతల ఉత్తరువులు అతిక్రమించడమే ఉద్యోగులకి గొప్ప.

32.   సమస్య: ఊర్వశి రమ్ము నీకిదె బహూకృతి గొమ్ము కపాలకుండలా

32.43   ఉ. పార్వతి ముద్దు బిడ్డనికి ప్రాణము పోయె, గజేంద్ర దైత్యుడే
యూర్వ శిరమ్ము నీ కిదె బహూకృతిఁ, గొమ్ము కపాలకుండలా!
జీర్వికిఁ గూర్చి బాలునికి జీవము నిమ్మని కేశవుం డనన్,
శర్వుడు సానుభూతిగ గజాననుఁ నిల్పెను విఘ్నహారిగన్.

(దైత్యుడు = రాక్షసుడు, ఊర్చు = ఊపిరివిడుచు, శిరము = తల, బహూకృతి = బహుమానము, కొమ్ము = తీసికొనుము, కపాలకుండలుడు = శివుడు, జీర్వి = శరీరము, కూర్చు = జోడించు, కేశవుడు = విష్ణువు, శర్వుడు = శివుడు, సానుభూతి = దయ, గజాననుడు = ఏనుగు ముఖం కలవాడు, విఘ్నహారి = విఘ్నమును తొలగించు స్వభావం గలవాడు)

ఓ శివా! పార్వతి ముద్దు బిడ్డడికి ప్రాణం పోయింది, రాక్షసుడైన గజాసురుడు ఊపిరి విడిచాడు, తల నీకు ఇదే బహుమానంగా ఇస్తున్నాను, ఆ శరీరానికి జోడించి బాలుడికి ప్రాణం ఇవ్వమని విష్ణువు అనగా, శివుడు దయతో ఏనుగు ముఖం కలవాడిని విఘ్నమును తొలగించు వాడిగా నిలిపాడు.

33. సమస్య: ఎలుక ఓటు వేసె పిల్లి గెలువ

సమస్యగా ఇచ్చిన ఆటవెలది పద్య పాదంలో యతిమైత్రి భంగం అయ్యింది, ఎందుకంటే, "ఎ" కీ "పి" కీ యతి కుదరదు. పాదంలో మొదటి అక్షరం "ఎ" అచ్చు కాబట్టి దాన్ని సంయుక్త / ద్విత్వ అక్షరం చేసి యతిమైత్రి కుదర్చడం అవదు. అందు చేత, "ఎలుక ఓటు వేసె" అన్న భాగాన్ని పై పాదం లోకి, "పిల్లి గెలువ" అన్న దాన్ని క్రింది పాదం లోకి తీసుకొని తేటగీతి పద్యాలు వ్రాశాను.

33.44 తే.గీ. ఎలుకలనుఁ బోలు యోటర్లు యెదవడి యొక
పిల్లి వంటి నేతకు, తమ పెల్లు నందు
యోప లేక ప్రతి యెలుక యోటు వేసె
పిల్లి గెలువ, చట్ట సభకు వెళ్ళు ననుచు.

(పోలు = సరిపోలు, ఎదవడు = భయపడు, పెల్లు = నెలవు, ఓపు = సహించు)

నా చిన్నప్పుడు ఒక నాయకుణ్ణి గురించి ఈ విధంగా విన్నాను. ఎలక్షన్ల ప్రచారంలో ఆయన ఏమి చెప్పేవారంటే, నాకు ఏమేమి అలవాట్లు (పుస్తకాల్లో చెప్పిన అన్ని వ్యసనాలు ఉన్నాయి ఆయనికి) ఉన్నాయో మీ అందరికీ తెలుసు, మీరు ఓటు వెయ్యకపోతే అవన్నీ ఇక్కడే కొనసాగిస్తా, మీరు ఓటేస్తే ఇక్కడి నుండి వెళ్ళి రాజధానిలో అవన్ని అక్కడ సాగిస్తా, మీ ఇష్టం అని చెప్పేవాడు. ఆయనతో ఎందుకొచ్చిన గోల అని ఓటర్లు గెలిపించి తామున్న చోటు నుండి తోలేసేవారు. ఈ భావన ఆధారంగా వ్రాసిన పద్యం ఇది. ఇక పద్యంలో ఏముందో చూద్దాం.

ఎలుకలని పోలిన ఓటర్లు ఒక పిల్లి లాంటి నేతకు భయపడి, తమ నెలవులో ఆయన్ని సహించ లేక చట్ట సభకు వెళతాడని ప్రతి ఎలుక పిల్లి గెలవడానికి ఓటు వేసింది.

33.45 తే. గీ. 'పిల్లి' గుర్తున్న పార్టి సంవృత్తి లేక
'ఎలుక' గుర్తున్న పార్టిని కలుపు కొనెను,
నాట సర్కారును 'ఎలుక' యోటు వేసె
'పిల్లి' గెలువ, యపూర్వ సంభేద మదియె.

(సంవృత్తి = బలము, నాటు = నిలువద్రొక్కుకొను, సర్కారు = ప్రభుత్వము, అపూర్వ = ఇంతకుమునుపు లేనిది, సంభేదము = కూటమి)

‘పిల్లి’ గుర్తున్న పార్టీ సంఖ్యాబలం లేక ‘ఎలుక’ గుర్తున్న పార్టీని కలుపుకుంది. ప్రభుత్వాన్ని నిలపడానికి ‘పిల్లి’ గెలిచే విధంగా ‘ఎలుక’ ఓటు వేసింది. అదే అపూర్వ కూటమి.

33.46 తే.గీ. బొమ్మల కొలువు నందున భూషణముగ
ఓటు వేయు మిషను వంటి యోటి బొమ్మ
నొకటి పెట్టి నొక్క, యెలుక యోటు వేసె
పిల్లి గెలువ, పిల్ల లదేమిఁ జెల్ల దనిరి.

(భూషణము = అలంకారము, ఓటి = వట్టి, చెల్లు = సరిపడు)

బొమ్మల కొలువులో అలంకారంగా ఓటు వేసే మిషను వంటి వట్టి బొమ్మను ఒక దాన్ని పెట్టి నొక్కగానే, పిల్లి గెలవడానికి ఎలుక ఓటు వేసింది. పిల్లలు అదేమీ చెల్లదని అన్నారు.

33.47 తే.గీ. జంతువుల వేషముల పాఠశాల యందు
తిరుగు పిల్లల యెన్నిక తీరు యులికి
పాటునుఁ గలిగింప యెలుక యోటు వేసె
పిల్లి గెలువ, మరచి వారి వేరి మచట.

(తీరు = విధము, ఉలికిపాటు = త్రుళ్ళిపడుట, వేరిమి = విరోధము)

బడిలో జంతువుల వేషాలలో తిరిగే పిల్లల ఎన్నిక విధానము ఉలికిపాటు కలిగించేటట్లుగా, తమ మధ్య ఉన్న వైరము మరిచి ఎలుక పిల్లి గెలవడానికి ఓటు వేసింది.

34. సమస్య: ఎలుకలు తమ కలుగు లోని కేనుగు నీడ్చెన్

34.48 కం. కలసి చదరంగ మాడిన
చెలికా ళ్ళిరువు, రలసిసొలసి వదలగా పా
వుల నటనే, యా రేయిన్,
యెలుకలు తమ కలుగు లోని కేనుగు నీడ్చెన్.

(చెలికాడు = స్నేహితుడు, అలసినొలసి = శ్రమపడి, పావులు = చదరంగంలో పావులు, రేయి = రాత్రి, కలుగు = బొక్క)

కలిసి చదరంగం ఆడిన ఇద్దరు స్నేహితులు బాగా అలిసిపోయి పావులని అక్కడే వదలగా, ఆ రాత్రి ఎలుకలు ఏనుగు పావుని తమ కలుగు లోకి ఈడ్చాయి.

35. సమస్య: ఏక పత్ని ఉన్న ఎంత తప్పు

35.49 ఆ.వె. నాగరికత కది యనాదిగ చిహ్నమే
ఏక పత్ని ఉన్న; ఎంత తప్పు?
యట్టి విధము వీడి, యంగనా లోలతస్,
విచ్చలవిడితనము విడిది జేయ.

అనాదిగా ఏకపత్నీవ్రతము నాగరికతకు చిహ్నంగా ఉంది. అట్టి విధానము వదిలిపెట్టి స్త్రీలోలత్వంతో విచ్చలవిడిగా ఉండడం ఎంత తప్పు?

35.50 ఆ.వె. కాపురంబు నిత్య కాంతిని శోభిల్లు
ఏక పత్ని ఉన్న; ఎంత తప్పు?
యట్టి సతిని క్షోభ కగ్గముఁ జేయుచు
బ్రతుకు నీడ్వఁ గోరి భంగ పడుట.

ఒకే పత్ని ఉంటే, కాపురము నిత్యము వెలుగుతూ శోభస్కరంగా ఉంటుంది. అటువంటి భార్యను క్షోభ పెడుతూ బ్రతుకును ఈడుద్దామనుకుని భంగపడటం ఎంత తప్పు?

35.51 ఆ.వె. రాము విభవ మొక శరము సత్య నిష్ఠయు
నేక పత్ని; ఉన్న ఎంత తప్పు?
రావణు వలె కపట రాజ నీతి పర కాం
త పయి నాశ; లేదె! తప్పు భయము.

ఒక బాణం, సత్య నిష్ఠ, ఏక పత్ని, ఇవే రాముని వైభవానికి కారణాలు. రావణుడి లాగా మోసపూరితమైన రాజనీతి, పరకాంతా వ్యామోహము ఎంత తప్పు? పాప భయం లేదా?

36. సమస్య: ఏడ్పే ఇష్టమ్ము నా కదే మోదమిడుస్

36.52 కం. తోడ్పాటు లున్న చోటనె
కాడ్పాటులు కూడ నుండు కార్యములందుస్,
చేడ్పా టెరుగనిది యఱవ
యేడ్పే, యిష్టమ్ము నా కదే మోద మిడుస్.

(తోడ్పాటు = సహాయము, కాడ్పాటు = కలత, చేడ్పాటు = బాధ, అఱవ ఏడ్పు = దొంగయేడుపు)

పనులు చేసేటప్పుడు సహాయాలు, కలతలు రెండూ ఉంటాయి. బాధ అంటే ఏమిటో తెలియనిది ఒక్క దొంగ ఏడుపే. నాకదే ఇష్టం. సంతోషాన్ని ఇస్తుంది.

37. సమస్య: ఐపీఎల్ ముగిసెనుగద అరచేతులలో

37.53 కం. ఆపూర్తి నిచ్చి జనులకు
ఐపీఎల్ ముగిసెనుగద, అరచేతులలో
ఔపాసనమా, కాదని
వాపోవగ జేసి, క్రికెటు భవితవ్యంబై.

(ఆపూర్తి = మిక్కిలినింపు లేక తృప్తి, వాపోవు = ఆశ్చర్యపడు)

ఇదేమన్నా అరచేతులలో ఔపోసన అనుకున్నారా, కాదు అని ఆశ్చర్యపడేడట్లుగా చేసి, క్రికెట్టుకి (cricket) భవిష్యత్తు ఇదే అనుకునే విధంగా ప్రజలకు చాలా తృప్తి నిచ్చి ఐపీఎల్ (IPL) ముగిసిపోయింది కదా.

37.54 కం. రూపించి క్రికెటు స్ఫూర్తిని
ఐపీఎల్ ముగిసెనుఁ గద, యరచేతులలోఁ
జూపి క్రికెట్టు భవిత, కర
దీపిక యయ్యెను ప్రతిభకు తెరపై నెలవై.

(రూపించు = ఋజువుచేయు, స్ఫూర్తి = పోరాటపటిమ, కరదీపిక = దివిటీ, తెరవు = మార్గము, నెలవు = ఉనికిపట్టు)

ప్రతిభకు మార్గమై, ఉనికిపట్టై, అరచేతులలో క్రికెటు భవితవ్యాన్ని చూపించి, క్రికెటు పోరాటపటిమను నిరూపించి ఐపీఎల్ (IPL) ముగిసిపోయింది కదా.

37.55 కం. తీపి గురుతు లందించిన
ఐపీఎల్ ముగిసెనుఁ గద, యరచేతులలోఁ
జూపుచు గెలు పోటములస్,
గోపము యుత్కంఠఁ జేర్చి కుడియెడమలుగా.

(ఉత్కంఠ = కుతూహలము)

కోపము, ఉత్కంఠ చేర్చి, గెలుపు ఓటములను కుడి ఎడమలుగా అరచేతులలో చూపిస్తూ, తీపి గుర్తులు అందించిన ఐపీఎల్ (IPL) ముగిసిపోయింది కదా.

37.56 కం. వ్యాపకమై యలరించిన
ఐపీఎల్ ముగిసెనుఁ గద, యరచేతులలో
జ్ఞాపిక గెలిచిన జట్టుకు
దీపమ్మై దీప్తి నిచ్చె దీక్షకు గురుతై.

(వ్యాపకము = వ్యాసంగము, అలరించు = సంతోషపెట్టు, జ్ఞాపిక = ప్రత్యేక సందర్భములలో ఇచ్చు బహుమతి లేక మెమొంటో, దీప్తి = వెలుగు, దీక్ష = పట్టుదల)

అందరికీ వ్యాపకముగా సంతోషపెట్టిన ఐపీఎల్ (IPL) ముగిసిపోయింది కదా. అరచేతుల్లో మెమొంటో (memento), గెలిచిన జట్టుకి వాళ్ళ పట్టుదలకి గుర్తుగా, దీపంలాగా వెలుగు నిచ్చింది.

38. సమస్య: ఒకరా యిద్దర ముగ్గురా నలుగురా యూహింప నింకెందరో

38.57 మ. వికటమ్మైన ప్రణాళికల్ కదన యభ్రేషంపు యుల్లంఘనల్
వకవృత్తుల్ గ్రహియించి కౌరవులు బీభత్సాత్మజుస్ జంప, హం
తకులస్ గన్గొని నంత పాండవులకుస్ దండింప పాటేలనస్,
యొకరా, యిద్దర, ముగ్గురా, నలుగురా, యూహింప నింకెందరో.

(వికటము = అక్రమము, ప్రణాళిక = పథకము, కదనము = యుద్ధము, అభ్రేషము = న్యాయము, ఉల్లంఘన = అతిక్రమణము, వకవృత్తి = కొంగవలె వంచన చేయు స్వభావం, గ్రహియించు = తీసికొను, బీభత్సుడు = అర్జునుడు, ఆత్మజుడు = కొడుకు, హంతకుడు = చంపినవాడు, కన్గొను = కనుఁగొను, అంత = అప్పుడు, దండించు = శిక్షించు, పాటు = శ్రమము, ఊహించు = అంచనావేయు)

అక్రమమైన వ్యూహాలు, రణనీతిని అతిక్రమించడాలు, కొంగ లాగా మోసం చేసే స్వభావాలు కౌరవులు స్వీకరించి అర్జునుని పుత్రుడైన అభిమన్యుని చంపగా, హంతకులని గుర్తించగానే శిక్షించడానికి పాండవులకు శ్రమ ఎందుకంటే, ఒకరా, ఇద్దరా, ముగ్గురా, నలుగురా, అంచనావేస్తే ఇంకా ఎందరో.

39. సమస్య: ఒక్క సారిటు వచ్చి చేకొను యొంటరిన్ సరి కన్నియన్

39.58 మత్తకోకిల. గ్రక్కునన్ శిశుపాలు నోర్చి విఘాతమున్ దొలగించగన్,
చక్కదిద్దగ నా పరిస్థితి, సంగడిన్ సమకూర్చగన్,
యొక్క సారిటు వచ్చి చేకొను యొంటరిన్ సరి కన్నియన్,
స్రుక్కుచున్ యిటు లేఖ వ్రాసెను, రుక్మిణీ సతి కృష్ణుకున్.

(గ్రక్కున = శీఘ్రముగా, ఓర్చు = ఓడించు, విఘాతము = కీడు, తొలగించు = పోగొట్టు, చక్కదిద్దు = సరిదిద్దు, సంగడి = ప్రేమ, సమకూర్చు = కలిగించు, ఇటు = ఈవైపు, చేకొను = స్వీకరించు, సరి = యుక్తము, కన్నియ = పెండ్లికాని పడుచు, స్రుక్కు = దుఃఖించు, ఇటు = ఇట్లు, లేఖ = జాబు, సతి = స్త్రీ)

శీఘ్రంగా శిశుపాలుణ్ణి ఓడించి ఆపదను పోగొట్టడానికి, నా పరిస్థితిని సరిదిద్దడానికి, ప్రేమ కలిగించడానికి, ఒక్కసారి ఈవైపు కొచ్చి, ఒంటరి దాన్ని, యోగ్యత ఉన్న పెండ్లికాని పడుచును, స్వీకరించుము. దుఃఖిస్తూ రుక్మిణి అన్న అమ్మాయి శ్రీకృష్ణుడికి ఈ విధంగా ఉత్తరం వ్రాసింది.

39.59 మత్తకోకిల. ఒక్క సారిటు వచ్చి చేకొను యొంటరిన్ సరి కన్నియన్
పెక్కు మార్లు వరాసనున్ యిటు వెంట రమ్మని పిల్చుచున్
వాక్కు యర్థము కూడు నట్లుగ వాంఛితమ్ములు నిల్పుచున్
మక్కువన్ కురిపించు ప్రేమకు మాపనే యభిసారికా!

(ఇటు = ఈవైపు, చేకొను = స్వీకరించు, సరి = యుక్తము, కన్నియ = పెండ్లికాని పడుచు, మారు = అనేకము, మారు = తడవ, వరాసనుడు = ప్రియుడు, ఇటు = ఈ ప్రకారము, వాంఛితము = కోరిక, నిల్పు = స్థిరపరచు,

మక్కువ = ఆసక్తి, కురిపించు = వర్షించు, మాపన = కొలత బద్ద, అభిసారిక = ప్రియుని గూర్చి సంకేతస్థలమునకు బోయెడి నాయిక)

ఒక్కసారి ఈ వైపుకు వచ్చి ఒంటరి దాన్ని యోగ్యత ఉన్న పెండ్లికాని పడుచును స్వీకరించుము. చాలా సార్లు ప్రియుణ్ణి ఈ విధంగా వెంట రమ్మని పిలుస్తూ, వాగర్థాలు కలిసేటట్లుగా కోరికలు నిలుపుతూ, ఆసక్తిని కురిపించే ప్రేమకి కొలత బద్ద అభిసారికయేనా!

40. సమస్య: ఒక్కడె పాంచాలికి మగ డూహింపంగన్

40.60 కం. టక్కుల జూదమున సతిని
హక్కులఁ గోల్పోవు పాండవాగ్రజు తోడన్,
యక్కర్ణుం డనె, 'రారా
జొక్కడె పాంచాలికి మగ డూహింపంగన్'.

(టక్కు = మోసము)

మోసాల జూదంలో భార్యని, హక్కులని కోల్పోయిన ధర్మరాజుతో ఆ కర్ణుడన్నాడు 'ఊహించగా, దుర్యోధనుడొక్కడే పాంచాలికి మగడు'.

41. సమస్య: ఒడ్డాణ మలంకరించె నువిద కుచంబుల్

41.61 కం. అడ్డపు యెగుదల నాపగ
యొడ్డాణ మలంకరించె నువిద, కుచంబుల్
బిడ్డలకు క్షీర మిడునని
గుడ్డలతోఁ గప్పె శిశుల కుశలముఁ గోరకై.

(అడ్డము = వెడల్పు, ఎగుదల = వృద్ధి, ఆపు = నివారించు, ఒడ్డాణము = స్త్రీలు నడముబిగికై ధరించు నగ, అలంకరించు = సింగారించు, ఉవిద = స్త్రీ, కుచము = స్తనము, క్షీరము = పాలు, ఇడు = ఇచ్చు, కప్పు = ఆచ్ఛాదించు, శిశులు = శిశువులు, కుశలము = క్షేమము)

అడ్డంగా పెరగడాన్ని ఆపడానికి స్త్రీ ఒడ్డాణం సింగారించింది. స్తనములు బిడ్డలకు పాలు ఇస్తాయని శిశువుల క్షేమం కోసం గుడ్డలతో ఆచ్ఛాదించింది.

42. సమస్య: ఓట్లు రాని వాడె సీట్లు గెలుచు

42.62 ఆ.వె. కలిమి యున్నవారు కలరు కొలది వేలు,
లేని వారు కలరు వేనవేలు,
లేని వారి యోట్లు లెక్కింప, కలవారి
యోట్లు రాని వాడె సీట్లు గెలుచు.

సంపద ఉన్నవారు కొన్ని వేల మంది మాత్రమే ఉన్నారు. లేని వారు, అంటే బీద వారు, పెక్కు వేల మంది ఉన్నారు. పేదల ఓట్లు లెక్కిస్తే, ధనికుల ఓట్లు రాని వాళ్ళే, సీట్లు గెలుస్తారు.

42.63 ఆ.వె. బల పరీక్ష నెగ్గ బల సంఖ్య చాలని
ముఖ్య పక్ష మొదల ముఖ్యమంత్రి
పదవి నొక స్వతంత్ర ప్రత్యర్థికి, ప్రజల
యోట్లు రాని వాడె సీట్లు గెలుచు.

బలపరీక్ష గెలవడానికి బల సంఖ్య చాలక, ప్రధాన పక్షము ముఖ్యమంత్రి పదవిని ఒక స్వతంత్ర ప్రత్యర్థికి వదిలిపెడితే, ప్రజల ఓట్లు రాని వాడే సీట్లు గెలుస్తాడు.

43. సమస్య: ఔనౌనే మధురాత్మ బంధ మిదియే, యౌనౌను దేశాంబికా!

43.64 శా. క్షీణింపన్ పరదాస్య భావనలు, యక్షీణంబుగా శాంతి నీ
క్షోణిన్ స్థాపనఁ జేసి, పాలనను సంక్షోభంబు వారింపగా,
జ్ఞానుల్ గూర్చినదేఁ గదా లిఖిత రాజ్యాంగంబు, దేశైక్యతన్
యౌనౌనే మధురాత్మ బంధ మిదియే, యౌనౌను దేశాంబికా!

(క్షీణించు = సన్నగిల్లు, భావన = తలపు, అక్షీణము = స్థిరము, క్షోణి = భూమి, స్థాపన = ఏర్పరచడము, పాలన = ఏలుబడి, సంక్షోభము = ఆందోళనము, వారించు = నివారించు, జ్ఞాని = జ్ఞానం కలిగినవాడు, కూర్చు = కూడబెట్టు, మధురము = ప్రియమైన, ఆత్మ = హృదయము, బంధము = అనుబంధము, అంబిక = మాత)

ఔనౌను దేశమాతా! పరదాస్యభావనలు సన్నగిల్లగా, సుస్థిరంగా శాంతిని ఈ భూమి మీద స్థాపించడానికి, పరిపాలనలో సంక్షోభం నివారించడానికి జ్ఞానులు కూర్చినదే కదా లిఖిత రూపంలో ఉన్న రాజ్యాంగము. ఔనౌను, దేశ ఐకమత్యం కోసం ప్రియమైన హృదయానుబంధం ఇదే.

43.65 శా. ఆ నిర్ద్వంద్వము లోకమాన్యము, యహింసాస్త్రంబె స్వాతంత్ర్య స
మ్మానం బిచ్చు నటన్న గాంధి పలుకే మాహాత్మ్యమై, జాతికిన్
ధ్యానంబై, పితృవాక్యమై వరలి సంధానించె నాంతర్యముల్
ఔనౌనే మధురాత్మ బంధ మిదియే, యౌనౌను దేశాంబికా!

(నిర్ద్వంద్వము = స్పష్టమైన రీతి, మాన్యము = సమ్మానింపదగినది, అహింస = బాధింపకుండుట, అస్త్రము = ఆయుధము, స్వాతంత్ర్య = యథేచ్ఛ, సమ్మానము = గౌరవము, మాహాత్మ్యము = గొప్పతనము, ధ్యానం = చాంచల్యము లేక మనసున తలచుట, పితృవాక్యము = తండ్రి మాట, వరలు = ప్రవర్తిల్లు, సంధానించు = కూర్చు, ఆంతర్యము = అభిప్రాయము, మధురము = ప్రియమైన, ఆత్మ = హృదయము, బంధము = అనుబంధము, అంబిక = మాత)

ఔనౌను దేశమాతా! ఆ స్పష్టమైన రీతి లోకపూజ్యము. అహింసాయుధమే స్వాతంత్ర్య గౌరవాన్ని ఇస్తుంది అన్న గాంధీగారి పలుకే గొప్పగా, జాతికి ధ్యానంగా, తండ్రి (జాతిపిత) మాటగా వర్ధిల్లి వేరు వేరు అభిప్రాయాలని కూర్చింది. ఔనౌను, దేశ ఐకమత్యం కోసం ప్రియమైన హృదయానుబంధం ఇదే.

44. సమస్య: కందము ఛందమున్ తెలుపగా వలె నుత్పలమాల పద్యమున్

44.66 ఉ. సుందరహాసమున్ నిలిపి సొంపిరి మీర కవిత్వ మందు పే
ర్మిం దరియించు భావనలు రేగ రసజ్ఞత నివ్విధంబుగా
కందురు నాల్గు పాదములు గర్భితమై తనరారునట్లుగా
కందము ఛందమున్ తెలుపగా వలె నుత్పలమాల పద్యమున్.

(సుందర = మనోహరమైన, హాసము = నవ్వు, సొంపిరి = ఉత్సాహము, మీరు = అతిశయించు, పేర్మి = ప్రేమ, తరియించు = తరించు, భావన = ఆలోచన, రేగు = విజృంభించు, రసజ్ఞత = గుణమును గ్రహించు సహృదయత, కను = చూచు, గర్భితము = లోపల ఉండునది, తనరారు = ఒప్పు)

మనోహరమైన నవ్వు చిందించి ఉత్సాహము అతిశయించేటట్లుగా కవిత్వంలో ప్రేమతో తరించే తలపులు విజృంభించగా సహృదయతను ఈ విధంగా చూస్తారు. నాలుగు పాదాలు గర్భితమై ఉండేటట్లుగా ఉత్పలమాల పద్యంలో కందము ఛందస్సును తెలపాలి.

పైనున్న ఉత్పలమాల పద్యంలో గర్భితంగా ఉన్న కంద పద్యం నాల్గు పాదాలు (కేవలం ఛందస్సు పరంగా, అర్థవంతంగా కాదు) క్రింది విధంగా ఉంటాయి:

కం. దరహాసముస్ నిలిపి సొం
పిరి మీర కవిత్వమందు పేర్మిం దరియిం
దరియించు భావనలు రే
గ రసజ్ఞత నివ్విధంబుగా కందురు నా

44.67 ఉ. కందము ఛందముస్ దెలుపగా వలె నుత్పలమాల పద్యముస్
పందె మిదే యటన్న నరపాలకు ముంగటఁ జెప్పె కైత గా
డందముగా సభాసదులు యక్కజ మొందగ నాల్గు మాత్రలస్
పొందికగా నమర్చుచు యపూర్వ చమత్కృతి తోడ పద్యముస్.

(నరపాలకుడు = రాజు, ముంగట = ముందర, కైతగాడు = కవి, అక్కజము = ఆశ్చర్యము, పొందిక = ఒద్దిక, అమర్చు = కూర్చు, అపూర్వ = పూర్వము లేని విధంగా, చమత్కృతి = చమత్కారము)

కందము ఛందస్సును ఉత్పలమాల పద్యంలో తెలపాలి, ఇదే పందెం అన్న రాజు ముందర, కవి, సభికులు ఆశ్చర్యం పొందగా చతుర్మాత్రలను ఒద్దికగా కూరుస్తూ గొప్ప చమత్కారముతో పద్యం చెప్పాడు.

45. సమస్య: కందములను వ్రాయుటన్న కదన విజయమే

45.68 కం. డెందము నందలి భావము
లందముగా కందమందు యల్లుట సులువా?
అందలి నియమము లెక్కువ,
కందములను వ్రాయుటన్న, కదన విజయమే.

(డెందము = మనసు, అల్లుట = రచించుట, సులువా = తేలికా, నియమము = నిబంధనము, కదన = యుద్ధము)

మనసులోని భావాలు అందంగా కందపద్యంలో రచించడం తేలికా? అందులో నిబంధనలు ఎక్కువ. కందపద్యాలు వ్రాయడమంటే యుద్ధంలో గెలవడమే.

46. సమస్య: కదలని వాడిల్లు జేర్చె కానని వానిన్

46.69 కం. సదనపుఁ ద్రోవనుఁ గానక
వదలి వరూధినిని వేడె ప్రవరుడు యనలున్,
యదనుగ వాయువు వీచక
కదలని వా డిల్లుఁ జేర్చె, కానని వానిన్.

(సదనపు =ఇంటి, వేడు = ప్రార్థించు, అనలుడు = అగ్నిదేవుడు, అదనుగ = తగిన సమయంలో, వీచు = విసరు)

ఇంటికి వెళ్ళే త్రోవ కనపడక, ప్రవరుడు వరూధినిని వదిలిపెట్టి అగ్నిదేవుణ్ణి ప్రార్థించాడు. గాలి సాయం లేకుండా కదలని వాడైన అగ్నిదేవుడు తగిన సమయంలో గాలి వీచగా ఇంటి త్రోవ కనపడని వానిని ఇల్లు చేర్చాడు.

47. సమస్య: కన్న కుమారునిన్ మగనిగాఁ గనె సజ్జను లెల్ల మెచ్చగన్

47.70 ఉ. ఎన్నియొ నింద లేసినను, యెంతగనో యవమానపెట్టినన్,
తన్ను జయించ వచ్చి తన దర్ప మడంచె నటంచు, పుత్రికిన్
తిన్నగ జాంబవంతు డట, దేవకియున్ వసుదేవుడున్ చెఱన్
కన్న కుమారునిన్ మగనిగాఁ గనె, సజ్జను లెల్ల మెచ్చగన్.

(దర్పము = గర్వము, అడంచు = అణచు, పుత్రి = కుమార్తె, తిన్నగ = సవ్యంగా, చెఱ = కారాగృహము, కను = చూచె, సజ్జనుడు = ఉత్తముడు, మెచ్చు = శ్లాఘించు)

ఎన్నో నింద లేసినా, ఎంతగానో అవమానించినా, తనను గెలవాలని వచ్చి తన గర్వము అణచాడని, సవ్యంగా జాంబవంతుడు ఉత్తములు మెచ్చేటట్లుగా అక్కడ దేవకీ వసుదేవులు కారాగృహంలో కన్న కొడుకును (కృష్ణుణ్ణి) కుమార్తెకు భర్తగా చూశాడు.

48. సమస్య: కప్పం గని శేషుఁడంత గడగడ వణఁకెస్

48.71 కం. ఎప్పుడు కోపము నాగుకు?
ఎప్పడకను విష్ణుమూర్తి యెప్డు పరుండుస్?
సప్ప మన కప్ప కేమయె?
కప్పం గని శేషుఁడంత గడగడ వణఁకెస్.

(నాగు = పాము, పడక = పాన్పు, ఎప్డు = ఎల్లప్పుడు, పరుండు = శయనించు, సప్పము = పాము, కను = చూచు, శేషుడు = ఆదిశేషువు, అంత = అప్పుడు)

ఇది క్రమాలంకారంలో పూరించబడిన సమస్య. పాముకి కోపం ఎప్పుడు వస్తుంది, కప్పను చూసి. ఏ పాన్పున విష్ణుమూర్తి ఎల్లప్పుడు శయనిస్తాడు, శేషుడు. పాము అనంగానే కప్పకు ఏమయ్యింది, అప్పుడు గడగడ వణికింది.

49. సమస్య: కప్పకు సంపెంగి నూనె కావలె, వింటే

49.72 కం. ఇప్పటి కైనా యెఱుగుము,
యప్పటి వాసన చముర్లు యత్తర్లన్నస్
యొప్పదుగా మా యంజలి
కప్పకు, సంపెంగి నూనె కావలె, వింటే.

(ఎఱుగు = గ్రహించు, చమురు = నూనె, అత్తరు = సుగంధతైలము, ఒప్పు = సమ్మతించు, అప్ప = అక్క)

ఇప్పటి కన్నా గ్రహించు, అప్పటి వాసన నూనెలు సుగంధతైలాలు అంటే సమ్మతించదుగా. మా అంజలిక అక్కకు సంపెంగ నూనె కావాలి, విన్నావా!

50. సమస్య: కప్పనుఁ జూడంగఁ బాము గడగడ వణకెస్

50.73 కం. గప్పున పురుగులు వణకెను
కప్పనుఁ జూడంగఁ, బాము గడగడ వణకెస్
తప్పించుకొన నకులమును,

యిప్పుడమిని మత్స్య న్యాయ మిటులే యుండుస్.

(గప్పున = హఠాత్తుగా, వణకు = కంపించు, నకులము = ముంగిస, పుడమి = భూమి, మత్స్య న్యాయము = చిన్న చేపను పెద్ద చేప తినుట అను నియమము)

ఒక్కసారిగా కప్పను చూడగానే పురుగులు భయపడ్డాయి. ముంగిసను తప్పించుకోడానికి పాము గడగడా వణికింది. ఈ భూమి మీద మత్స్య న్యాయము ఇలాగే ఉంటుంది.

51. సమస్య: కమలాక్షుడు విషము గ్రోలెగద శుభకరుడై

51.74 కం. రమను తన భార్యగాఁ గొనె
కమలాక్షుడు, విషము గ్రోలెఁ గద శుభకరుడై
శమనరిపుడు, సాగర మథ
నము వేళస్ జగతిఁ గావ, నాశము నాపస్.

(కమలాక్షుడు = విష్ణువు, శమనరిపుడు = శివుడు)

లక్ష్మీదేవిని విష్ణుమూర్తి తన భార్యగా చేసుకున్నాడు. క్షీరసాగర మధనము వేళ లోకాన్ని రక్షించడానికి, నాశనాన్ని ఆపడానికి, శివుడు శుభకరుడై విషం త్రాగాడు.

52. సమస్య: కరములు లేనట్టి వాడు కత్తులు దూసెస్

52.75 కం. తిరిగిమ్మని రాజ్య రమను,
యరివీరులు పాండు సుతులు యర్థింపంగా,
కురురాజు, యేమియును కని
కరములు లేనట్టి వాడు, కత్తులు దూసెస్.

(కత్తులు దూయు = గొడవపడు)

తమ రాజ్యలక్ష్మిని తిరిగి ఇమ్మని శత్రువులపై వీరత్వం చూపగల పాండు కుమారులు యాచించగా, ఏమాత్రం దయ లేనట్టి కురురాజైన దుర్యోధనుడు గొడవపడ్డాడు.

53.   సమస్య: కరి సింహము మీద నెక్కి కదిసెను దనుజున్

53.76   కం. సుర లందరు వేడగ, శం
కరి సింహము మీద నెక్కి కదిసెను దనుజున్
యరి మహిషాసురు, దునిమెన్
వరత్రిశూలమున వాని, భండన మందున్.

(సురలు = దేవతలు, వేడు = ప్రార్థించు, శంకరి = దుర్గ, కదియు = సమీపించు, దనుజుడు = రాక్షసుడు, అరి = శత్రువు, దునుము = చంపు, వర = శ్రేష్ఠమైన, భండనము = యుద్ధము)

దేవతలు అందరూ ప్రార్థించగా, దుర్గామాత సింహము నెక్కి రాక్షసుడు, శత్రువు యైన మహిషాసురుని సమీపించింది. తన ఘనత్రిశూలంతో యుద్ధంలో వానిని చంపింది.

54.   సమస్య: కరికంటెను మేలు గాదె గాడిద భువిలో

54.77   కం. గురువొక్కడు విద్యార్థు ల
న రివాజుగ పెక్కు జంతునామము లిచ్చున్
పరిశీలన ముగియగ ననె
కరి కంటెను మేలుఁ గాదె గాడిద భువిలో.

(రివాజు = ఆనవాయితీ, పరిశీలన = పరీక్షించుట)

ఉపాధ్యాయుడు ఒకాయన విద్యార్థులంటే ఆనవాయితీగా రకరకాల జంతువుల పేర్లు ఇస్తాడు. పరీక్ష అయిపోగానే, లోకంలో ఏనుగు కంటే గాడిద మేలు కాదా అని ఆ పేర్లున్న విద్యార్థులని ఉద్దేశించి అన్నాడు.

55.   సమస్య: కరినిఁ జంపి యమ్మకరినిఁ గాఁచెను హరి

55.78   తే.గీ. మకరితోఁ బోరి యలసిన మత్తగజము
ధైర్య మిక లేదు ననుఁ బ్రోవ దయను రమ్మ
యనుచు మొఱపెట్టఁ, గ్రన్నన యంగవించి
కరినిఁ, జంపి యమ్మకరినిఁ గాఁచెను హరి.

(మకరి = మొసలి, పోరు = యుద్ధముచేయు, అలయు = బడలు, మత్త = మదించిన, గజము = ఏనుగు, ప్రోచు = రక్షించు, మొఱపెట్టు = విన్నవించు, క్రన్నన = శీఘ్రముగా, అంగవించు = సమీపించు, కరి = ఏనుగు, కాచు = రక్షించు, హరి = విష్ణువు)

మొసలితో పోరాడి అలసిపోయిన మదపుటేనుగు, ఇక ధైర్యం లేదు, నన్ను రక్షించడానికి దయతో రావలసింది అంటూ విన్నవించుకోగా, వెంటనే ఏనుగును సమీపించి ఆ మొసలిని చంపి విష్ణువు రక్షించాడు.

56. సమస్య: కరుణ నుమాపతియె గాచెగ కరి వరేణ్యుస్

56.79 కం. కరి చర్మమును ధరించెను
కరి శిరమును పుత్రు కిచ్చి కలతను మాపెస్
వర మీడేర్చి గజాసురు
కరుణ నుమాపతియెఁ గాచెగ కరి వరేణ్యుస్.

(ఈడేర్చు = సిద్ధింపజేయు, వరేణ్యుడు = ముఖ్యుడు)

ఏనుగు చర్మాన్ని వలువగా కట్టుకున్నాడు. ఏనుగు తలను పుత్రుడైన వినాయకుడికి ఇచ్చి కలవరము పోగొట్టాడు. గజాసురునికి ఇచ్చిన వరము సిద్ధింపఁ జేసి దయతో ఆ కరిముఖ్యుడిని ఉమాపతియైన శంకరుడు రక్షించాడు.

57. సమస్య: కరొనాయే గొప్ప వరము ఘనమగు జగతిస్

57.80 కం. మరయుగ మంతయు కృతకము,
యరయగ నలవడదు యేరి కంతర్ముఖులై,
నరులకు యీ వీలిచ్చిన
కరొనాయే గొప్ప వరము, ఘనమగు జగతిస్.

(మర = యంత్రము, కృతకము = కృత్రిమము, అరయగ = తెలుసుకొనుటకు, అలవడదు = అభ్యాసమవదు, అంతర్ముఖుడు = లౌకిక జీవితంలో ఉంటూనే బ్రహ్మ జ్ఞానాన్ని సంపాదించిన వ్యక్తి, నరుడు = మానవుడు, వీలు = అవకాశము)

మర యుగమంతా (machine age) కృత్రిమంగా (artificial) ఉంటుంది. అంతర్ముఖులై తెలుసుకోవడానికి ఎవరికీ సాధ్యమవదు. మానవులకు ఆ వీలు కలిగించిన కరోనాయే (corona) గొప్ప దేవతానుగ్రహము. లోకానికి మంచి జరుగుతుంది.

57.81 కం. పరహితమును కాంక్షించుచు,
దురపిల్లక దుర్దశలకు, తొణకక యెద ని
బ్బరమున నిలిచెడి వారికి,
కరోనాయే గొప్ప వరము, ఘనమగు జగతిన్.

(దురపిల్లు = శోకించు, దుర్దశ = దురదృష్టము, తొణకు = తడబడు, ఎద = గుండె, నిబ్బరము = ధైర్యము)

ఇతరుల మంచిని కోరుతూ, దుర్దశలకి శోకింపక, చెదరని గుండె నిబ్బరంతో నిలిచే వారికి, కరోనాయే గొప్ప దేవతానుగ్రహము. లోకానికి మంచి జరుగుతుంది.

57.82 కం. పరవళ్ళుదుముకు నదులను,
పరుగిడె నీనాడు నీరు, పరిశుద్ధముగా,
యరుదగు నీ దృశ్య మిడిన,
కరోనాయే గొప్ప వరము, ఘనమగు జగతిన్.

(పరవళ్ళుదుముకు = జాలువాఱు, పరిశుద్ధము = స్వచ్ఛమైన)

కరోనా పుణ్యమా అని అందరు ఇళ్ళల్లోనే ఉండడం వల్ల నదుల కాలుష్యం తగ్గింది. జాలువాఱే నదుల్లో ఈనాడు స్వచ్ఛమైన నీరు ప్రవహిస్తోంది. అరుదైన ఈ దృశ్యాన్ని ఇచ్చిన కరోనాయే గొప్ప దేవతానుగ్రహము. లోకానికి మంచి జరుగుతుంది.

57.83 కం. మెరుగయ్యె పారిశుద్ధ్యము
తరిగెను కాలుష్యము జనతా కర్ఫ్యూతో,
పరికించు కోణ మిది యవ,
కరోనాయే గొప్ప వరము ఘనమగు జగతిన్.

(మెరుగగు = బాగగు, పారిశుద్ధ్యము = పరిశుభ్రత, తరుగు = తగ్గు, కాలుష్యము = మాలిన్యము, పరికించు = చూచు)

జనులు వాళ్ళకి వాళ్ళే పెట్టుకున్న కర్ఫ్యూ (curfew) వలన, పారిశుద్ధ్యము మెరుగయ్యింది, కాలుష్యము తగ్గింది. ఈ కోణంలో గనక చూస్తే, కరోనాయే గొప్ప దేవతానుగ్రహము. లోకానికి మంచి జరుగుతుంది.

57.84 కం. పరిహాసముఁ జేయుదురే,
కరోనాయే గొప్ప వరము, ఘనమగు జగతిన్
నర జీవితమున యనుచున్,
పరిణామం బతి భయద, మపరిహార్యమెలే.

(పరిహాసము = నవ్వులాట, పరిణామము = మార్పు, భయదము = భయము గొలిపించునది, అపరిహార్యము = నివారింపశక్యము కానిది)

కరోనాయే గొప్ప దేవతానుగ్రహము, లోకంలో మానవ జీవితంలో మంచి జరుగుతుంది, అని పరిహాసం చేస్తారా. మార్పు, అతి భయంకరంగా, నివారింప శక్యము కానిదిగా, ఉంటుందిలే.

57.85 కం. మరయుగము వలన, వాతా
వరణము కలుషితము గాగ, వారణ మార్గం
బరయగ, కర్ఫ్యూ తెచ్చిన,
కరోనాయే గొప్ప వరము, ఘనమగు జగతిన్.

(వారణ = వారించుట, అరయు = విచారించు)

మరయుగము (machine age) వల్ల వాతావరణము కలుషితము కాగా, నివారించే మార్గము విచారించగా, కర్ఫ్యూ తీసుకొచ్చిన కరోనాయే గొప్ప దేవతానుగ్రహము. లోకానికి మంచి జరుగుతుంది.

58. సమస్య: కర్ణుం డపకారి యయ్యెఁ గౌరవపతికిన్

58.86 కం. వర్ణిని కృష్ణను వేశ్యగ
వర్ణించి సభన్, కురుకుల పతనమునకు సం

పూర్ణముగా నిర్ణేతగు
కర్ణుం డపకారి యయ్యెఁ, గౌరవపతికిన్.

(వర్ణిని = వనిత, కృష్ణ = ద్రౌపది, పతనము = నాశనము, నిర్ణేత = నిర్ణయముచేయువాఁడు)

స్త్రీయైన ద్రౌపదిని నిండుకొలువులో వేశ్యగా అభివర్ణించి కురువంశ నాశనానికి పూర్తిగా నిర్ణేతయైన కర్ణుడు కురురాజుకు అపకారం చేసిన వాడయ్యాడు.

59. సమస్య: కర్ణుడె పిసినారి యగును ఘనమగు జగతిన్

59.87 కం. వ్యయ దానము లెరుగని సిరి
కయిపు తగదనగ వినని యకర్ణుడె పిసినా
రి యగును, ఘనమగు జగతిన్
వయ సుడుగగ వాని కలిమి పలువుర కిడగన్.

(కయిపు = మత్తు, అకర్ణుడు = చెవిటివాడు, ఇడు = ఇచ్చు)

ఖర్చు, దానము రెండూ ఎరగని డబ్బు మత్తు తగదు అని చెప్పితే వినని చెవిటివాడు (మామూలుగా చెవిటివాడు కాదు) పిసినారి అవుతాడు. వయస్సు తీరిన తర్వాత వాని సంపద పెక్కుమందికి ఇవ్వగానే లోకానికి మంచి జరుగుతుంది.

59.88 కం. నిర్ణయముగ కృష్ణు డనెను,
పూర్ణమగు కురుకుల లయము, పొందు యడుగ నా
కర్ణింపని రారాజయు
కర్ణుడె పిసినారి యగును, ఘనమగు జగతిన్.

(నిర్ణయముగ = నిశ్చయింపబడినట్లుగా, పూర్ణము = పూర్తియగును, లయము = నాశనము, పొందు = సంధి, ఆకర్ణించు = విను)

నిశ్చయింపబడినట్లుగా, కురువంశ నాశనము సంపూర్ణ మవుతుంది, సంధి కోరగా వినని దుర్యోధనుడు, కర్ణుడే పిసినారి అవుతారు, లోకానికి మంచి జరుగుతుంది అని కృష్ణు డన్నాడు.

59.89 కం. దుర్న్యయ కౌరవ తొలికకు
కర్ణుడె పిసి, నారి కియగు ఘన, మగు జగతిన్,
నిర్ణాయక యుద్ధ, మటన్
కర్ణాదులు సమయుదురని, కంసారి యనెన్.

(దుర్న్యయ = అన్యాయము, తొలిక = చక్రమధ్య రంధ్రము, పిసి = తొలియందు బిగగొట్టుటకై చెక్కిన స్తంభము పట్టె లోనగువాని చివర, నిర్ణాయక = నిర్ణయము చేయు, సమయుట = నశించు లేక చచ్చు, కంసారి = కృష్ణుడు)

దుర్నీతి అనే కౌరవ తొలికకి కర్ణుడు దాన్ని నిలబెట్టే పిసిలాంటివాడు, స్త్రీకి గౌరవము కలుగుతుంది, లోకంలో నిర్ణాయక యుద్ధం జరుగుతుంది, అందులో కర్ణుడు మొదలైన వారు మరణిస్తారు, అని కృష్ణుడు చెప్పాడు.

59.90 కం. పూర్ణు డెవరు దానమ్మున?
దుర్న్యయమతి స్వార్థగుణముతో నేమగునో?
కర్నా వైర సణగునా?
కర్ణుడె, పిసినారియగును, ఘనమగు జగతిన్.

(పూర్ణుడు = పూర్తిగా సాధించిన వాడు, దుర్న్యయమతి = అవినీతిపరుడు)

ప్రశ్నలు, సమాధానాలతో క్రమాలంకారములో ఉన్న పద్యమిది. దానంలో పూర్ణు డెవరు? అవినీతిపరుడు స్వార్థగుణముతో ఉంటే ఏమవుతాడు? కరోనా వైరసు అణగిపోతుందా? సమాధానాలు వరుసగా, 'కర్ణుడే', 'పిసినారి అవుతాడు', 'జగతికి మంచి జరుగుతుంది'.

60. సమస్య: కర్ణుని తోడ ద్రౌపదికి కల్గె వివాహము వైభవంబుగన్

60.91 ఉ. వర్ణము నందు సూతుడని వారణఁ జేసె స్వయంవరంబునన్
కర్ణుని కృష్ణ, భీముడును కవ్వడి గెల్వగ నాజి శల్యుతో
కర్ణుని తోడ, ద్రౌపదికి కల్గె వివాహము వైభవంబుగన్
పర్ణకుటిన్, వివోఢలగు పాండుకుమారులతో క్రమంబుగన్.

(వర్ణము = కులము, సూతుడు = రథసారథి, వారణ = వారించుట, స్వయంవరం = తనంతట భర్తను వరించుట, కృష్ణ = ద్రౌపది, కవ్వడి = అర్జునుడు, ఆజి = యుద్ధము, పర్ణకుటి = గుడిసె, వివోఢ = పెండ్లికుమారుడు, క్రమము = వరుస)

కులములో సూతుడని ద్రౌపది తన స్వయంవరంలో కర్ణుణ్ణి వారించింది. భీముడు, అర్జునుడు శల్యుడితోను కర్ణుడితోను యుద్ధంలో విజయం సాధంచగా, పర్ణశాలలో వరులైన పాండుపుత్రులతో వరుసగా ద్రౌపదికి వైభవంగా వివాహము జరిగింది.

61. సమస్య: కర్ణుని మేన ప్రాణములు గల్గిన పార్థుని చావు దప్పునే

61.92 ఉ. వర్ణువు పుత్రుడంచు, వసువర్మధరుండని కీర్తిఁ గాంచియున్,
స్వర్ణ మయూఖ కాంతి తను వంతయు నిండిన, దానశీలుడా
స్తీర్ణ పరాక్రమున్ యణచు, తీక్ణపు శాపము లన్ని వ్యర్థమై,
కర్ణుని మేన ప్రాణములుఁ గల్గిన, పార్థుని చావుఁ దప్పునే.

(వర్ణువు = సూర్యుడు, వసువర్మధరుడు = బంగారు కవచమును ధరించిన వాడు, మయూఖ = కిరణము, ఆస్తీర్ణ = విశాలమైన, తీక్ణ = పదునైన)

భారతంలో కర్ణుని చావుకు చాలా కారణాలు ఉన్నాయని అంటారు. వాటిలో ముఖ్యమైనవి అతడి కివ్వబడిన శాపాలు. సూర్యపుత్రుడనీ, సహజ కవచధారి అనీ పేరుగాంచిన, శరీరమంతా బంగారు కిరణాల కాంతితో నిండిన దానశీలుడూ, ఆస్తీర్ణ పరాక్రముణ్ణి అణచిపెట్టే పదునైన శాపాలన్నీ వ్యర్థమై కర్ణుని శరీరంలో ప్రాణాలు నిలిస్తే పార్థుని చావు తప్పుతుందా.

62. సమస్య: కర్తవ్యంబులు విస్మరించిన గదా కల్యాణముల్ జాతికిన్

62.93 శా. కర్తృత్వమ్మును దైవ మందు నిలుపన్ కాంక్షించి సద్ధార్మికుల్
యార్తత్వమ్మును రూపుమాప ధరణిన్ యావిర్భవించన్, జడుల్
ధూర్తుల్ సంఘము నందు తాము సలుపన్ దుర్మార్గ చేష్టల్ నిరా
కర్తవ్యంబులు విస్మరించినఁ గదా! కల్యాణముల్ జాతికిన్.

(కర్తృత్వము = కర్తగానుండు లక్షణము, నిలుపు = స్థిరపఱచు, కాంక్షించు = కోరు, సత్ = యథార్థమైన, ధార్మికుడు = పుణ్యాత్ముడు, ఆర్తత్వము = బాధ, రూపుమాపు = శాశ్వతంగా తొలగించు, ధరణి = భూమి, ఆవిర్భవించు = పుట్టు, జడుడు = చొరవలేని వాడు, ధూర్తుడు = మోసకాడు, చలుపు = చేయు, దుర్మార్గ = దౌర్జన్యము, చేష్ట = పని, నిరాకర్తవ్యము = నిరాకరింపదగినది, విస్మరించు = మఱచిపోవు, కల్యాణము = క్షేమము)

కర్తగా ఉండే లక్షణము దైవంపై నిలపాలనుకొని, అంటే ఏ పని చేసినా కర్తృత్వం తాను వహించకుండా దైవాన్ని చేయాలనుకొని, నిజమైన పుణ్యాత్ములు లోకంలో బాధని శాశ్వతంగా తొలగించడానికి పుట్టగా, చొరవ లేని అసమర్థులు మోసగాళ్ళు సమాజంలో తాము దౌర్జన్యమైన పనులు, నిరాకరింపదగినవి మఱచిపోయినప్పుడు కదా, జాతికి క్షేమం కలుగుతుంది.

63. సమస్య: కలహపు దుంప భూమిపయిఁ గామిని కాదె తలంచి చూచినన్

63.94 చం. మలుపును త్రిప్పె రాము కథ మంథర కానల కంపి రామునిన్
కలకును తెచ్చె శూర్పణఖ కల్లనుఁ జెప్పి భ్రమింప రావణున్
వలపుకు లంకె సత్యవతి పట్ట మనంగ రణంబె యయ్యెగా
కలహపు దుంప భూమి పయిఁ గామిని కాదె తలంచి చూచినన్.

(కాన = అడవి, అంపు = పంపు, కలకు = యుద్ధము, కల్ల = అబద్ధము, భ్రమించు = అపోహపడు, వలపు = ప్రేమ, లంకె = సంబంధము, పట్టము = రాజ్యము, రణము = యుద్ధము, కలహము = జగడము, దుంప = మూలకందము, కామిని = ఆడుది, తలంచు = యోచించు)

మంథర రాముణ్ణి అడవులకి పంపి రాముడి కథ, అంటే రామాయణం, మలుపు తిప్పింది. శూర్పణఖ అబద్ధం చెప్పి రావణుణ్ణి భ్రమింప జేయడం యుద్ధాన్ని తెచ్చింది. ప్రేమకి రాజ్యానికి సత్యవతి లంకె పెట్టడం వల్ల మహాభారత యుద్ధమే అయ్యిందిగా. ఆలోచించి చూస్తే, లోకంలో జగడానికి మూలకందము, అంటే బీజము, ఆడదే కదా.

64. సమస్య: కలు సేవింపుడని గాంధి గణ్యుండయ్యెన్

64.95 కం. కుల మత భేదము లన్నిటిఁ,
దలదన్నుచు సత్యనిష్ఠ తలమానికమై,

యలు పెరుగకఁ బోరెడు యు
క్కలు సేవింపుడని, గాంధి గణ్యుండయ్యెన్.

(తలదన్ను = తిరస్కరించు, తలమానికము = శిరోరత్నం, అలుపు = అలసట, పోరు = కలహించు, ఉక్కలుడు = ధురంధరుడు లేక శౌర్యవంతుడు, గణ్యుడు = గౌరవనీయుడు)

కుల మత భేదాలన్నిటినీ తిరస్కరించి సత్యనిష్ఠయే తలమానికముగా అలుపెరుగని పోరాటం సాగించే శౌర్యవంతుని సేవ చేయండని చెప్పి, గాంధీ మహాత్ముడు పూజ్యుడయ్యాడు.

65. సమస్య: కవి సామ్రాట్ విశ్వనాధ కలత బడెనయో

65.96 కం. పవి వలె పదగుంఫనతో,
చవులూరించెడి సుమధుర సాహిత్యంబున్
యువకులు చదువుట లేదని,
కవి సామ్రాట్ విశ్వనాధ కలతఁ బడెనయో.

(పవి = వజ్రాయుధము, పదగుంఫన = మాటలు చక్కగా అల్లుట, చవులూరించు = రుచిపుట్టించు)

వజ్రాయుధము లాంటి పదునైన మాటల అల్లికతో, రసాస్వాదన కనువైన సుమధుర సాహిత్యాన్ని యువత చదవడం లేదని కవి సామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణగారు ఆందోళన పడ్డారు.

66. సమస్య: కాంతకు మ్రొక్కినం గలుఁగుఁ గామితసంపద లెల్ల శీఘ్రమే

66.97 ఉ. కాంతను ముఖ్యమంత్రిగను, కాంతను పార్టిని ముఖ్యనేతగా,
కాంత ప్రధానమంత్రిగనుఁ గాంచితిమే, యధికారమున్న యే
కాంతకు మ్రొక్కినం, గలుఁగుఁ గామిత సంపద లెల్ల శీఘ్రమే,
సుంతయు శంక లేదనుచు, చుట్టునుఁ జేరెడి నేత లెందరో.

(కాంచు = చూచు, మ్రొక్కు = నమస్కరించు, కామిత = కోరుకున్న, సుంత = కొంచెము, శంక = సందేహము)

స్త్రీని ముఖ్యమంత్రిగా, స్త్రీని పార్టీలో ముఖ్యమైన నాయకురాలిగా, స్త్రీని ప్రధానమంత్రిగా చూశాము కదా. అధికారము ఉన్న ఏ స్త్రీకి నమస్కారం చేసినా కోరుకున్న సంపదలన్నీ త్వరగా సిద్ధిస్తాయని అనడంలో కొంచెం కూడా సందేహం లేదంటూ, చుట్టూ చేరే నాయకు లెంతమందో.

67. సమస్య: కాంతా రమ్మనియెన్ మునీంద్రుడు చమత్కారంబు దీపింపగన్

మామూలుగా జంట కవులు అవధానాలు చేసేటప్పుడు, సమస్య ఇస్తే, చెరొక శబ్దం గానీ చెరొక పాదం గానీ చెప్పి పూరిస్తారు. కానీ, పింగళి కాటూరి కవులు చెరొక అక్షరం చెప్పి అవధానం చేశారు. అలా వారు "కాంతా రమ్మనియెన్ మునీంద్రుడు చమత్కారంబు దీపింపగన్" అన్న సమస్యను ఎలా పూరించారంటే: "దంతుల్ ఘోటకముల్ పదాతులును చెంతన్ గొల్చిరాన్ వచ్చు దు, ష్యంతున్ గన్గొని కణ్వమౌని యిటు రాజా రమ్మనన్ మీకు మీ, యంతేవాసులకున్ సుఖమ్మె యన నీ యండన్ సుఖంబుండె మా, కాంతారమ్మనియెన్ మునీంద్రుడు చమత్కారంబు దీపింపగన్". నా పూరణ క్రింద ఇవ్వబడింది.

67.98 శా. క్షంతవ్యంబె? తనంత దా సుఖములన్ గాదంచు, ఘోరాటవిన్
శాంతిన్ దాంతిని బ్రహ్మదీక్షఁ గొను విశ్వామిత్రుఁ గాంక్షింప, ది
గ్భ్రాంతున్ జేసిన మేనకన్ గని, తపోభ్రష్టుండు కామాంధుడై,
కాంతా! రమ్మనియెన్ మునీంద్రుడు, చమత్కారంబు దీపింపగన్.

(క్షంతవ్యంబె = క్షమించదగినదా, దాంతి = ఇంద్రియనిగ్రహము, బ్రహ్మదీక్ష = తపోదీక్ష, దిగ్భ్రాంతుడు = ఆశ్చర్యము చెందినవాడు, భ్రష్టుడు = చెడినవాడు, చమత్కారము = చతురిమ, దీపించు = ఒప్పు)

తనంత తానుగా సుఖాలను వద్దనుకుని భయంకరమైన అడవిలో శాంతంగా ఇంద్రియనిగ్రహంతో తపోదీక్షలో ఉన్న విశ్వామిత్రుణ్ణి కోరుకోవడం క్షమించదగినదా? తనని ఆశ్చర్యములో ముంచిన మేనకను చూసి తపస్సు చెడినవాడై కామంతో కళ్ళు మూసుకుని పోయి మునీంద్రుడు చమత్కారం ఒప్పేటట్లుగా కాంతా! రా! అని అన్నాడు.

68. సమస్య: కాంతారమ్మనుచు పిల్చె కాంతారమునన్

68.99 కం. సుంత భుజింపగ, గిరిజా
కాంతా! రమ్మనుచుఁ బిల్చెఁ, గాంతారమునన్
యంతర్మనుడై తిన్నడు

యంతకహరు లింగముఁ గని, యాకొనె నంచుస్.

(సుంత = కొంచెము, గిరిజ = పార్వతి, కాంతుడు = భర్త, కాంతారము = అడవి, అంతర్మనుడు = దుఃఖము నొందిన మనస్సు కలవాడు, అంతకహరుడు = శివుడు, కను = చూచు, ఆకొను = ఆకలిగొను)

అడవిలో తిన్నడు దుఃఖము నొందిన మనస్సు కలవాడై శివలింగాన్ని చూచి ఆకలి గొనెనని, కొంచెం తిందుగాని పార్వతీనాథా! రమ్ము, అని పిలిచాడు.

68.100   కం. అంతర్వత్నివి, రఘుకుల
కాంతా! రమ్మనుచుఁ బిల్చెఁ, గాంతారమునస్
యింతిని సీతనుఁ గని, వృ
త్తాంతము వాల్మీకి యెరిగి, తన కడ నుండస్.

(అంతర్వత్ని = గర్భిణి, రఘుకులకాంత = రఘుకులానికి చెందిన ఇల్లాలు, కాంతారము = అడవి, ఇంతి = స్త్రీ, కను = చూచు, వృత్తాంతము = సమాచారము, ఎరుగు = గ్రహించు, కడ = చెంత)

అడవిలో స్త్రీయైన సీతను చూచి సమాచారము గ్రహించి వాల్మీకి తన దగ్గర ఉండడానికి, గర్భిణివి రఘుకులానికి చెందిన ఇల్లాలా! రా అని పిలిచాడు.

68.101   కం. వింతయె మీ రాకడ, భూ
కాంతా! రమ్మనుచుఁ బిల్చెఁ, గాంతారమునస్
దంతిని దిగి వచ్చిన దు
ష్యంతుఁ గని శకుంతలఁ, గొన యాతిధ్యంబుస్.

(రాకడ = ఆగమనము, భూకాంతుడు = రాజు, కాంతారము = అడవి, దంతి = ఏనుగు, కను = చూచు, కొను = తీసికొను)

అడవిలో ఏనుగు మీద నుండి దిగి వచ్చిన దుష్యంతుణ్ణి చూచి, శకుంతల, మీ ఆగమనము ఆశ్చర్యము కలిగించేదే రాజా! ఆతిధ్యము తీసుకోవడానికి రండి అని పిలిచింది.

69.   సమస్య: కాంతుఁడు లేని వేళఁ గలకంఠి కిలక్కున నవ్వెఁ గిన్కతోన్

69.102   ఉ. వింతగ నున్నదీ ప్రవరు వేదన యింటికి వోదు నంచు, తా
నింతటి సుందరిన్ గనియు నింత విరక్తియె, యీ వరూధినిన్
కంతునిఁ బాలుఁ జేసెనని, కాముకియై, దినమందె రోహిణీ
కాంతుఁడు లేని వేళఁ, గలకంఠి కిలక్కున నవ్వెఁ గిన్కతోన్.

(వేదన = బాధ, విరక్తి = ఉదాసీనత, కంతుడు = మన్మథుడు, కాముకి = సంభోగమునందిచ్ఛగల ఆఁడుది, రోహిణీకాంతుఁడు = చంద్రుఁడు, కలకంఠి = స్త్రీ, కిన్క = అలుక)

ఇంటికి పోతానంటూ ఈ ప్రవరుడి బాధ ఆశ్చర్యంగా ఉంది, తాను ఇంతటి సుందరిని చూచి కూడా ఇంత ఉదాసీనతా? ఈ వరూధినిని మన్మథుని పాలు చేశాడు, అని కాముకియై, పట్టపగలే చంద్రుడు లేని వేళ, ఆమె అలుకతో కిలక్కున నవ్వింది.

70.   సమస్య: కాకా యను కాకి యరుపు కార్యము దీర్చున్

70.103   కం. లోకువఁ జేతురుఁ గానీ
కాకిని శనివాహనమని క్రైసేతురుగా,
శాకునముఁ జెప్పె నెదురుగ
కాకా యను కాకి యరుపు కార్యముఁ దీర్చున్.

(లోకువ = చులకన, క్రైసేయు = పూజించు, శాకునము = శకున శాస్త్రము)

కాకిని చులకన చేస్తారు గానీ, శనికి వాహనమని పూజిస్తారుగా. శకున శాస్త్రము చెప్పింది, ఎదురుగా “కాకా” అని కాకి అరిస్తే పనులు అవ్వుతాయని.

71.   సమస్య: కాకులు వినిపించు మధుర కంఠము లెపుడున్

71.104   కం. లేకుండ నుండునే చీ
కాకులు, వినిపించు మధుర కంఠము లెపుడున్,
సీకారి యున్న పొరుగున,

శ్రీకరమై ప్రతి దినంబు శివమై తోచున్.

(చీకాకు = కలత, మధుర = ఇంపైనది, కంఠము = కుత్తుకయొక్క ధ్వని, ఎపుడు = ఎల్లప్పుడు, సీకారి = గాయకుడు, వొరుగు = సమీపము, శ్రీకరము = లక్ష్మీప్రదమైన, శివము = శుభము, తోచు = స్ఫురించు)

కలతలు లేకుండా ఉంటాయా? గాయకుడు వొరుగున ఉంటే ఇంపైన గొంతు నిత్యము వినిపిస్తుంది. సంపదలతో నిండుగా ప్రతిరోజు శుభంగా అనిపిస్తుంది.

72. సమస్య: కామాతురుడైన వాడె ఘనుడగు జగతిన్

72.105 కం. సామాన్య జీవనమ్మున,
సామముతో సంఘమునకు సత్కార్యములన్,
ప్రేముడి సలుపుచును, ప్రగతి
కామాతురుడైన వాడె, ఘనుడగు జగతిన్

(సామము = మంచితనము, ప్రేముడి = స్నేహముతో, ప్రగతి = అభ్యున్నతి, కామాతురుడు = ఏదో కోరిక అనే రోగ పీడితుడు)

సామాన్య జీవితం గడుపుతూ, మంచితనంతో సంఘానికి మంచి పనులు స్నేహభావంతో చేస్తూ, అభివృద్ధిని కాంక్షించే వాడే లోకంలో గొప్పవాడవుతాడు.

72.106 కం. క్షేమము బుద్ధుని మార్గము,
ప్రేమ కదే మూలము, నిరపేక్షము, దానిన్
యామోదించెడి సమతా
కామాతురుడైన వాడె, ఘనుడగు జగతిన్.

బుద్ధుని అష్టాంగిక మార్గము శ్రేయస్కరము. ప్రేమకు అదే మూలము. కోరికలు వద్దని చెప్పేది. దానిని సమ్మతించి సమానత్వము కోరుకునే వాడే లోకంలో గొప్పవాడు.

72.107 కం. నీమముగా శివ కేశవ
నామార్చన యని, దరిద్రనారాయణులన్

ప్రేముడి సేవించు, యశః
కామాతురుడైన వాడె, ఘనుడగు జగతిన్.

నియమముగా శివ కేశవ నామార్చన అనుకుని, దరిద్రులను ప్రేమగా సేవించు కీర్తి కావాలనుకునే వాడే లోకంలో గొప్పవాడు.

72.108 కం. భూమిని సేద్యము సేయుచు,
క్షామము లేకుండఁ జేయు కర్షక జన సం
క్షేమము కోరెడి, వసుధై
కా మాతురుడైన వాడె, ఘనుడగు జగతిన్.

(వసుధ + ఏక + మాతురుడు = నేల తల్లి ఒక్కతే తల్లిగా కలిగిన నరుడు)

భూమిని వ్యవసాయము చేస్తూ, కరువు లేకుండా చేసే రైతుజన సంక్షేమము కోరుతూ నేల మాత్రమే అందరికీ తల్లి యని భావించేవాడే లోకంలో గొప్పవాడు.

73. సమస్య: కామిని పాద నూపురము ఖంగున మ్రోగదు హేతు వేమొకో

73.109 కం. కనరాదే మాలిని యిం
కను యని, కీచకుడు తాళక విలంబము, కా
మిని పాద నూపురము ఖం
గున మ్రోగదు హేతు వేమొకో, యని యలిగెన్.

(మాలిని = అజ్ఞాతవాసకాలమున సైరంధ్రీవేషమును ధరించిన ద్రౌపది ఉంచుకొన్న పేరు, తాళు = సహించు, విలంబము = ఆలస్యము, కామిని = ఆడుది, నూపురము = అందె, హేతువు = కారణము, అలుగు = కోపించు)

ఇంకా మాలిని కనపడదే అని కీచకుడు ఆలస్యాన్ని సహించలేక ఆమె కాలి అందె ఖంగుమని మ్రోగదు, కారణము ఏమై ఉంటుంది అని కోపించాడు.

73.110 ఉ. నా ముద లంది మాలినియె నా కడ కొచ్చు నటంచు, కీచకుం
డా మదిరాక్షి రాక కయి యర్రులుచాచి, యెడన్ సహింపకన్,

కామిని పాద నూపురము ఖంగున మ్రోగదు హేతు వేమొకో,
నా మది తల్లడిల్లె నని, నర్మిలి నోపక యుత్తలం బడెన్.

(ముదల = ఆజ్ఞ, మాలిని = అజ్ఞాతవాసకాలమున సైరంధ్రీవేషమును ధరించిన ద్రౌపది ఉంచుకొన్న పేరు, కడ = సమీపము, మదిరాక్షి = మదము కప్పిన కన్నులు గల ఆడుది, అర్రులుచాచు = ఆశగా పాకులాడు, ఎడ = కాలవిలంబము, కామిని = ఆడుది, నూపురము = అందె, హేతువు = కారణము, తల్లడిల్లు = బాధతో అల్లలాడిపోవు, నర్మిలి = వాంఛ, ఓపు = సహించు, ఉత్తలము = కలత)

నా ఆజ్ఞ అందుకొని మాలినియే నా దగ్గరకు వస్తుందని కీచకుడు ఆమె రాక కోసం అర్రులు చాచుతూ కాలవిలంబము సహించక ఆమె కాలి అందె ఖంగుమని మ్రోగదు, కారణము ఏమై ఉంటుంది, నా మనస్సు బాధతో అల్లలాడిపోతోంది అని వాంఛని ఆపుకోలేక కలఁత పడ్డాడు.

74. సమస్య: కాముడు సంఘమున కిచ్చు కార్య జయంబుల్

74.111 కం. నీమముగా తన ధర్మము,
బాముల కోర్చుచు ననేక బాధలఁ బడుచున్,
నోమనుచు సలిపెడి, యశః
కాముడు సంఘమున కిచ్చు కార్య జయంబుల్.

(నీమము = నియమము, ధర్మము = విధి, బాము = కష్టము, నోము = వ్రతము, యశఃకాముడు = ఖ్యాతిని కోరేవాడు)

కష్టాలని ఓర్చుకుంటూ, అనేక బాధలు పడుతూ నియమం ప్రకారం తన విధిని వ్రత మనుకుని చేసే ఖ్యాతిని కోరేవాడు సమాజానికి పనుల్లో విజయాలని అందిస్తాడు.

75. సమస్య: కాయలు కాయలుగ నుండు గావు ఫలంబుల్

75.112 కం. కాయల వ్యాపారమునన్
కాయలు పండ్లైన బేరగానికి చెఱుపే,
శ్రేయమగు నమ్ముకొన టెం
కాయలు, కాయలుగ నుండుఁ గావు ఫలంబుల్.

(బేరగాడు = వ్యాపారి, చెఱుపు = నష్టము, శ్రేయము = మేలు, టెంకాయ = కొబ్బరికాయ)

కాయల వ్యాపారంలో కాయలు పళ్ళు అయితే వ్యాపారికి నష్టము. కొబ్బరి కాయలు కాయలు గానే ఉంటాయి, పళ్ళు కావు కాబట్టి, అవి అమ్ముకోవడం మేలు.

76. సమస్య: కార మొసంగి సత్కవికి గౌరవ మిత్తువు పద్య భారతీ

76.113 ఉ. ఆరటముల్ ముదమ్ములను యక్షర రూపము నందు గ్రుచ్చి, నీ
హారమయూఖు కాంతి వలె యందరి కుల్లస మిచ్చి, సంఘు సం
స్కారముఁ బెంచు పద్యముల సత్కృతు లల్లుటఁ జూచి, నిత్య స
త్కార మొసంగి సత్కవికి గౌరవ మిత్తువు పద్య భారతీ.

(ఆరటము = బాధ, ముదము = సంతోషము, గ్రుచ్చు = నాటించు, నీహారమయూఖుడు = చంద్రుడు, ఉల్లసము = వికాసము, సంస్కారము = చక్కఁజేయుట, కృతి = ప్రబంధము, అల్లు = రచించు, సత్కారము = సమ్మానము, పద్యభారతి = పద్య రూపమున ఉన్న సరస్వతి)

ఓ, పద్యరూపంలో ఉన్న సరస్వతీ! బాధలని సంతోషాలని అక్షర రూపంలో గుచ్చి చంద్రకాతి లాగా అందరికీ ఉల్లాసాన్ని ఇచ్చి సంఘుసంస్కారం పెంచే పద్యాలతో ఉత్తమ కృతులు రచించడం చూసి నిత్యసత్కారం ఇచ్చి మంచి కవికి గౌరవాన్ని కలిగిస్తావు.

77. సమస్య: కారము సంజీవని యగు కలియుగ మందుస్

77.114 కం. కోరికలకు, జూదరులకు,
చోరులకును, యదుపు లేదు, చోద్యం బదియే,
మారక యున్నట్టిది మమ
కారము, సంజీవని యగు కలియుగ మందుస్.

కోరికలకు, జూదరులకు, దొంగలకు హద్దు లేదు. అదే వింత. మారకుండా ఉన్నది మమకారమే. కలియుగంలో అదే సంజీవని లాంటి ఔషధి.

78. సమస్య: కారముఁ గాంచినంతనె వికారముఁ గాంతురు మౌనిపుంగవుల్

78.115 ఉ. కోరుచు నెప్పుడుస్ తమకుఁ గూర్చెడి సౌఖ్యము, దైవ మన్న ధి
క్కారముఁ జూపుచుస్, స్వహిత కార్యములం దెనలేని శ్రద్ధతో
మీరుచు నన్ని ధర్మముల, మెప్పునుఁ గోరెడి వారి, యా కుసం
స్కారముఁ గాంచినంతనె, వికారముఁ గాంతురు మౌనిపుంగవుల్.

(కూర్చు = సంతరించు, ధిక్కారము = తిరస్కారము, మీరు = అతిక్రమించు, మెప్పు = శ్లాఘన, కుసంస్కారము = చెడు సంస్కారము, వికారము = బాగులేనిది, పుంగవుడు = శ్రేష్ఠుడు)

ఎప్పుడూ తమకి కలిసొచ్చే సుఖాన్ని కోరుకుంటూ, దైవాన్ని తిరస్కరిస్తూ, స్వప్రయోజనం ఉన్న పనుల మీద ఎక్కువ శ్రద్ధతో ధర్మాలని అతిక్రమిస్తూ మెప్పును కోరుకునే చెడు సంస్కారము ఉన్న వాళ్ళని మునిశ్రేష్ఠులు అసహ్యంగా చూస్తారు.

79. సమస్య: కారమును సహించ లేరు ఘనులగు మాన్యుల్

79.116 కం. ఓరిమిని నూరు తప్పులు
సైరించితి నంచు చక్రి సాత్వతి సుతు కే
నారము ఖండించెను, ధి
క్కారమును సహించ లేరు ఘనులగు మాన్యుల్.

(ఓరిమి = సహనము, సైరించు = క్షమించు, చక్రి = కృష్ణుడు, సత్వతి సుతుడు = శిశుపాలుడు, కేనారము = శిరస్సు, ఖండించు = నఱకు, ధిక్కారము = తిరస్కారము, సహించు = ఓర్చు, ఘనుడు = గొప్పవాడు, మాన్యుడు = పూజనీయుడు)

సహనంతో నూరు తప్పులు క్షమించానని కృష్ణుడు శిశుపాలుని శిరస్సును ఖండించాడు. గొప్పవారైన పూజనీయులు తిరస్కారాన్ని ఓర్చుకోలేరు.

80. సమస్య: కారమె ప్రేమికుల ప్రేమ కారణ మయ్యెస్

80.117 కం. సారత్యము యొండొరులకు,

యోరిమి భరియింతు రొకరి నొకరు నిరతమున్,
వేరేమి కావలయు, మమ
కారమె ప్రేమికుల ప్రేమ కారణ మయ్యెన్.

(సౌరత్యము = నమ్మకము, ఒండొరులు = ఒకరికొకరు, ఓరిమి = ఓర్పు, నిరతము = ఎల్లప్పుడు, మమకారము = నాదియను అభిమానము)

ఒకరంటే ఒకరికి నమ్మకము. ఎల్లప్పుడూ, ఒకరినొకరు ఓర్పుతో భరిస్తారు. వేరే ఏం కావాలి? ఆ ప్రేమికుల మధ్య ప్రేమకి మమకారమే కారణమయ్యింది.

81. సమస్య: కారా గృహమందు కన్య కానుక లందెన్

81.118 కం. చూరగొని దూర విద్యను
పోరాట పటిమ కలిగిన పొలతుల కోవన్
ధీరగ నిలచిన కృషికై
కారా గృహమందు కన్య కానుక లందెన్.

దూరవిద్యను (distance education) ప్రయత్నపూర్వకంగా పొంది, పోరాట పటిమ కలిగిన స్త్రీలలో ధీరురాలుగా నిలచిన కృషికి, జైలులో వున్న అమ్మాయి కానుక లందుకుంది.

82. సమస్య: కారాగారమున బుట్టె గద కర్ణుండే

82.119 కం. శూరసుతు సుతుగ కృష్ణుడు
కారాగారమునఁ బుట్టెఁ గద, కర్ణుం డే
గారవము లేని, సూతుని
కౌరసునిగ పేరుఁగాంచె, కౌరవుల కడన్.

(శూరసుతుడు = వసుదేవుడు, సూతుడు = రథసారథి, ఔరసుడు = ధర్మపత్నియందు కల్గిన కుమారుఁడు)

వసుదేవుని కుమారుడుగా కృష్ణుడు జైలులో పుట్టాడు కదా. కర్ణుడు ఏ గౌరవమూ లేని రథసారథి కొడుకుగా కౌరవుల వద్ద పేరు తెచ్చుకున్నాడు.

83.   సమస్య: కారాగారమున బెట్ట కలిగెను సుఖముల్

83.120   కం. సారా త్రాగుచు తిరిగెడి
చోరాగ్రణి రాజకీయ జూదము జరుపస్,
పేరాశయె పట్టి యతని
కారాగారమునఁ బెట్ట, కలిగెను సుఖముల్.

సారా తాగుతూ తిరిగే ఒక పెద్ద దొంగ రాజకీయ జూదము జరుపగా, వాడి దురాశయే వాణ్ణి జైలులో పెట్టించింది. అంతట, సుఖము కలిగింది.

83.121   కం. ధీరులు పుట్టిన భూమిని,
చోరాగ్రణులున్న జనులు చోద్యం బనరే,
వారిని సందేహింపక,
కారాగారమునఁ బెట్ట, కలిగెను సుఖముల్.

ధైర్యవంతు లుదయించిన ఈ జగతిని పెద్దపెద్ద దొంగలుంటే ప్రజలు వింత అనరా? వాళ్ళని నిస్సంకోచంగా జైలులో పెడితే సుఖం కలుగుతుంది.

83.122   కం. భీరువు కంసుడు విని యశ
రీర వచనము, మదిలో యరిష్టముఁ దోచస్,
బోరక, దేవకిని పతిని
కారాగారమునఁ బెట్ట, కలిగెను సుఖముల్.

(భీరువు = పిరికివాడు, అరిష్టము = కీడు, పోరక = కలహించక)
పిరికివాడైన కంసుడు అశరీరవాణి విని మనసులో కీడు అనిపించగా కలహించక దేవకిని ఆమె భర్తని జైలులో పెట్టగా, సుఖము కలిగింది.

84. సమస్య: కారాగారమునస్ ధ్వనించె నవురా! గంధర్వ సంగీతముల్

84.123   శా. వీరావేశమె దేశభక్తిగ, గళంబే శక్తిగా నుండ, బ
ళ్ళారిస్ జైలున ఘంటసాల నిడ, పల్లాండుల్ వృథా పోవులే,

కారాగారమునన్ ధ్వనించె నవురా! గంధర్వ సంగీతముల్
తారాస్థాయిని, టంగుటూరి ప్రభృతుల్ తాదాత్మ్యమం దూగగన్.

(గళము = కంఠము, ఇడు = ఉంచు, పల్లాండు = గానము, వృథా = వ్యర్థముగా, కారాగారము = చెరసాల, ధ్వనించు = మ్రోగు, అవురా = ఆశ్చర్యార్థకము, గంధర్వ సంగీతము = దివ్య సంగీతము, తారాస్థాయి = ఉచ్చ స్థాయి, ప్రభృతులు = మొదలైన వారు, తాదాత్మ్యము = పారవశ్యము, ఊగు = తేలియాడు)

వీరావేశమే దేశభక్తిగా, కంఠమే తన శక్తిగా ఉన్నాడని, బళ్ళారి జైలులో మధుర గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు గారిని ఉంచితే, పాటలు వృథా పోలేదులే. వహ్వా! చెరసాలలో, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం గారు మొదలుగా గలవారు పారవశ్యంలో తేలియాడగా తారాస్థాయిలో గంధర్వగానం ధ్వనించింది.

85. సమస్య: కావని కావుకావనుచుఁ గాకులు కర్మఫలంబుఁ దెల్పెడిన్

85.124 ఉ. కావని కాకి తారసిల కార్యము సార్థక మౌను యన్న యా
చావడి మాట లందు ఘన శాకున మున్నది, కాకి కిచ్చె ప
ర్యావరణ మ్ముదర్కమును వ్యంజన చేసెడి శక్తిఁ, గావునన్
కావని కావు కావనుచుఁ గాకులు కర్మఫలంబుఁ దెల్పెడిన్.

(తారసిలు = ఎదురుపడు, కార్యము = పని, సార్థకము = సఫలము, చావడిమాటలు = బహిరంగమైన వార్త, ఘన = గొప్ప, శాకునము = శకున శాస్త్రము, పర్యావరణము = చుట్టూ ఉండే శీతోష్ణాది బాహ్యపరిస్థితులు, ఉదర్కము = భవిష్యత్ఫలము, వ్యంజన = ప్రకటించుట, శక్తి = సామర్థ్యము, కావున = కాబట్టి, కర్మఫలం = సుఖ, దుఃఖాల రూపంలో కలిగే కర్మ పరిణామము, తెల్పు = తెలియజేయు)

కావు మంటూ కాకి ఎదురుపడితే పని సఫలము అవుతుందన్న ఆ బహిరంగంగా అనుకునే మాటలలో శకున శాస్త్రము ఉంది. పర్యావరణము కాకికి భవిష్యత్ఫలాన్ని సూచించే సామర్థ్యము ఇచ్చింది. అందుకనే, కావు కావు కావుమని అంటూ కాకులు కర్మఫలాన్ని తెలియజేస్తాయి.

86. సమస్య: కావలి వారె శత్రువులుగా నవతారము దాల్చు టబ్రమే

86.125 ఉ. చేవనుఁ గల్గినట్టి విదుషీమణి, ధీమతి, మాత దుర్గయై
క్రేవున బంగ్ల దేశమున ఖేదము మాన్పు ప్రధాని యంచు సం

భావన లందు యిందిరను, పాశవికమ్ముగఁ జంపివేయగా
కావలి వారె శత్రువులుగా నవతారముఁ దాల్చు టబ్రమే.

(చేవ = ధైర్యము, విదుషి = విద్వాంసురాలు, ధీమతి = బుద్ధిమంతురాలు, క్రేవున = అకస్మాత్తుగా, ఖేదము = దుఃఖము, సంభావన = సమ్మానము, పాశవికము = క్రూరము, అబ్రము = ఆశ్చర్యము)

ధైర్యమున్న విద్వాంసురాలు, బుద్ధిమంతురాలు, దుర్గామాతయై అకస్మాత్తుగా బంగ్లాదేశ్లో దుఃఖము పోగొట్టిన ప్రధాని అంటూ సమ్మానము లందుకున్న ఇందిరాగాంధీ గారిని క్రూరంగా చంపివేయడానికి కావలి వారే శత్రువులుగా మారడం ఆశ్చర్యమే.

86.126 ఉ. వావిని లెక్కసేయకనె, పాండవులన్ యొక లక్క యింట మే
దావిగఁ జేయు కుట్ర తన తాపముఁ బెంచ, ప్రలోభ పెట్టగా
కావలి వారె శత్రువులుగా నవతారము దాల్చు టబ్రమే,
యే విధి దీని నాపుటని యెంచి మదిన్ విదురుండు చింతిలెన్.

(వావి = బంధుత్వము, లెక్కసేయు = లక్ష్యముచేయు, మేదావి = బూడిద, కుట్ర = కుత్సితమైన ఆలోచన, తాపము = బాధ, ప్రలోభ పెట్టు, ఆశ చూపు, తాల్చు = ధరించు, అబ్రము = ఆశ్చర్యము, చింతిలు = చింతించు)

బంధుత్వాన్ని పట్టించుకోకుండా, పాండవులను ఒక లక్క ఇంట్లో బూడిద చేసే కుట్ర తన బాధను పెంచగా, ఆశజూపగా కావలి కాచేవారే శత్రువులగా అవతారము ధరించడం ఆశ్చర్యమే, ఏ విధంగా దీన్ని ఆపుట అని మనస్సులో ఆలోచించి విదురుడు చింతించాడు.

87. సమస్య: కుంజర యూధంబు దోమ కుత్తుక జొచ్చెన్

ఈ సమస్యని తెనాలి రామకృష్ణ మహాకవి రెండు విధాలుగా పూరించారు. ఏమని అంటే, "గంజాయి తాగి తురకల, సంజాతుల గూడి కల్లు చవి గొన్నావా, లంజల కొడకా! యెక్కడ, కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్" అనీ, "రంజన చెడి పాండవు లరి, భంజనులై విరటు గొల్వ పాల్పడి రకటా, సంజయ! విధినే మందును?, కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్" అనీ. నా పూరణ క్రింద ఇవ్వబడింది.

87.127 కం. రంజకమగు మయసభ తమ
నంజగొనగ దాని దోమ యాకృతి వలనన్,

రంజిలు మనమున పాండవ
కుంజర యూధంబు దోమ కుత్తుకఁ జొచ్చెన్.

(రంజకము = ఆనందకరము, అంజగొను = ఆకర్షించు, రంజిలు = ఆహ్లాదింపజేయు, మనమున = మనస్సుతో, కుంజర యూధము = ఏనుగుల సమూహము, కుత్తుక = గొంతు)

ఆనందకరమైన మయసభ, దాని దోమ ఆకారము చేత తమను ఆకర్షింపగా, సంతోషంగా పాండవులనే ఏనుగుల గుంపు దోమ గొంతు లోకి (దోమలా ఉన్న మయసభలోకి) వెళ్ళారు.

88. సమస్య: కుండలు కొండ నెత్తె కనుగొన్న సురల్ వెరగంది చూడగన్

88.128 ఉ. మండిపడంగ నంది తన మార్గమునం దగుపించి, దీవిరా
యండు, శపింతువా యనుచు యాగ్రహ మొప్పగ వాని కీశుకున్
నిండుగ బుద్ధిఁ జెప్ప, గణనీయముగా భుజశక్తితో ధ్వజీ
కుండలు కొండ నెత్తె, కనుగొన్న సురల్ వెరగంది చూడగన్.

(మండిపడు = కోపించు, నంది = శివుని వృషభము, అగుపించు = కనబడు, దీవిరాయడు = రావణుడు, శపించు = శాపం పెట్టు, ఆగ్రహము = రోషము, ఒప్పు = ఉచితమగు, ఈశుడు = శివుడు, నిండుగ = సంపూర్ణంగా, గణనీయము = ఎంచ దగినది, భుజశక్తి = భుజాల బలం, ధ్వజీ = సర్పము, కుండలుడు = కుండలముగా కలవాడు, కనుగొను = తెలిసికొను, సురలు = దేవతలు, వెరగందు = ఆశ్చర్యపడు)

తన త్రోవలో కనిపించి శివుని వాహనమైన నంది కోపించగా, రావణుడు, శపిస్తావా అంటూ రోషానికి తగ్గట్లుగా వానికీ శివునికీ సంపూర్ణంగా బుద్ధి చెప్పడానికి, తెలుసుకున్న దేవతలు ఆశ్చర్యపడి చూడగా, తన భుజబలంతో సర్పకుండలుడైన శివుని కొండని, అంటే కైలాసాన్ని, గణనీయంగా ఎత్తాడు.

89. సమస్య: కుందేలు చెలంగి వేట కుక్కను కరచెన్

89.129 కం. ఎందైన కలదె? కర్ణా!
కుందేలు చెలంగి వేట కుక్కను కరచెన్,
పందికి శుచి తెలిసె ననుట,
మ్రందింతు నరు నను టటని, మద్రపతి యనెన్.

(చెలంగు = ఉత్సహించు, శుచి = శుభ్రత, వ్రుందించు = చంపు, నరుడు = అర్జునుడు, అటు = ఆప్రకారము, మద్రపతి = మద్రదేశాధిపతియైన శల్యుడు)

కర్ణా! కుందేలు ఉత్సహించి వేటకుక్కని కరిచింది, పందికి శుభ్రత తెలుసు అని అనడం ఎక్కడైనా ఉందా? అర్జునుణ్ణి చంపుతాననడం అటువంటిదే అని శల్యుడు అన్నాడు.

89.130 కం. పందె మెవరొడ్డ తాబే
లందు గెలిచె? యేకలవ్యు డమ్ములు వేయన్
యెందు దిగె ననన్? క్రమముగ
కుందేలు చెలంగి, వేట కుక్కను కరచెన్.

(ఒడ్డు = వేయు, అమ్ము = బాణము, క్రమముగ = వరుసగా, చంపు, చెలంగు = ఉత్సహించు)

క్రమాలంకారంలో పూరించిన సమస్య ఇది. పందెము ఎవరు వేస్తే అందులో తాబేలు గెలిచింది? ఏకలవ్యుడు బాణాలు వేస్తే ఎందులో దిగాయి? అన్న ప్రశ్నలు వేస్తే, వరుసగా కుందేలు ఉత్సహించి, వేటకుక్కని కరిచాయి, అన్నవి సమాధానం.

89.131 కం. అందురు విప్లవకారులు,
కుందేలు చెలంగి వేట కుక్కను కరచెన్,
చందిరము జడిసె లత కని,
సందియమా! తిరుగుబాటు చాటించుటకే.

(విప్లవకారులు = విప్లవము లేపినవారు, చెలగు = విజృంభించు, చందిరము = ఏనుగు, జడియు = భయపడు, లత = చీమ, సందియము = సందేహము, తిరుగుబాటు = ఎదురు తిరుగుట, చాటించు = ప్రకటించు)

కుందేలు విజృంభించి వేటకుక్కని కరిచింది, ఏనుగు చీమకి భయపడింది అని విప్లవకారులు అంటారు. సందేహమా, తిరుగుబాటుని ప్రకటించడానికే.

90. సమస్య: కుక్క చేతను పడెఁ గదా కుంజరంబు

90.132 తే.గీ. బొమ్మల కొలువు నందున, యిమ్ముగ పలు

జంతువుల బొమ్మ లుంచగ, సందడి నడు
మస్ చెదరె బొమ్మలు, విరిగి మట్టి యయ్యె
కుక్క, చేతను పడెఁ గదా కుంజరంబు.

(ఇమ్ముగ = సౌకర్యంగా, సందడి = కోలాహలము, చెదరు = చిందఱవందఱగు, కుంజరము = ఏనుగు)

బొమ్మల కొలువులో సౌకర్యంగా జంతువుల బొమ్మలు పెట్టగా, కోలాహలము మధ్యలో బొమ్మలు చెల్లాచెదురు అయ్యాయి. కుక్క బొమ్మ విరిగి మట్టి అయిపోయింది. ఏనుగు బొమ్మ చేతిలో పడింది కదా.

91. సమస్య: కుక్కుట గృహమందు కాక ఘూకములుండెన్

కంద పద్యపాదంగా ఇచ్చిన ఈ సమస్యని కొప్పరపు కవులు పూరించారు. ఎలా అంటే, “ఒక్కడగు బోయ పక్షుల, వక్క జముగ నెన్నొ జాతు లనదగు వానిన్, కక్కురితి దెచ్చి యొక్కెడ, కుక్కుట; గృహమందు కాక ఘూకములుండెన్”. నా పూరణ క్రింద ఇవ్వబడింది.

91.133 కం. కొక్కొరకో యను జీవులు,
నక్కల దాడికినిఁ జిక్కి నాశం బవగా,
చిక్కని చీకటిఁ గ్రమ్మెను,
కుక్కుట గృహ మందు కాక ఘూకము లుండెన్.

కొక్కొరకో యను జీవులు, అంటే కోళ్ళు, నక్కలు చేసిన దాడికి నాశనం కాగా, దట్టంగా చీకిటి కమ్మింది. అలా ఖాళీయైన కోళ్ళ గూడులో కాకులు, గుడ్లగూబలు ఉన్నాయి.

92. సమస్య: కుచవస్త్రంబు పరిత్యజించి సతి తా కోరెన్ తమిన్ మామనున్

ఈ సమస్యకి ఆధారం ఒక పండిత పరిషత్తులో వాసిష్ఠ గణపతిముని గారికి సంస్కృతంలో ఇచ్చిన "స్తన వస్త్రం పరిత్యజ్య వధూ: శ్వశుర మిచ్ఛతి" అన్న సమస్య. అనగా, "పయ్యెద తీసివేసి కోడలు మామను కోరుతున్నది" అని. దానికి "హిడింబా భీమ దయితా నిదాఘే ఘర్మ పీడితా" అని చేర్చి వారు పూరించారు. అంటే, భీముని భార్యయైన హిడింబ అనే ఆటవిక స్త్రీ, ఎండకి చెమట బాధతో పయ్యెద తీసివేసి మామగారైన వాయువును కోరింది. అంటే, గాలి ఆడటం కోసం పై గుడ్డ తీసేసిందని, అర్థం. తరువాత ఒక అవధానంలో ఈ సమస్య గురుసహస్రావధాని

శ్రీ కడిమెళ్ళ వరప్రసాద్ గారికి ఇవ్వడం జరిగింది. ఆయన వాసిష్ఠ గణపతిముని గారు చెప్పిన భావాన్నే తెలుగు పద్యంలో చెప్పి సమస్య పూరించారు. నా పూరణ క్రింద ఇవ్వబడింది.

92.134 మ. అచలుఁ జూచి స్థిరంబుగా నిలచె తా నచ్చెర్వుతో తత్తరన్
కుచవస్త్రంబు పరిత్యజించి సతి, తా కోరెన్ తమిన్ మామనున్
యచలాత్మున్ గిరిరాజునే హరు డుమన్ యర్ధాంగిగాఁ జేయగన్,
ఖచరుల్ సంతస మంద పెండ్లి జరిగెన్ కామారికిన్ గౌరికిన్.

(అచలుడు = స్థాణువైన శివుడు, స్థిరము = కదలనిది, అచ్చెర్వు = ఆశ్చర్యం, తత్తర = తడబాటు, కుచవస్త్రము = పయ్యెద, పరిత్యజించు = వదలి, సతి = పార్వతి, తమి = మోహము, మామ = పిల్లనిచ్చే మామ, అచలము = కొండ, గిరిరాజు = హిమవంతుడు, హరుడు = శివుడు, ఉమ = పార్వతి, అర్ధాంగి = భార్య, ఖచరుడు = దేవత, సంతసము = సంతోషము, కామారి = మన్మథుని శత్రువైన శివుడు, గౌరి = పార్వతి)

స్థాణువైన శివుణ్ణి చూసి తాను అశ్చర్యంతో తడబాటు చేత పయ్యెద జార్చి పార్వతి నిల్చుంది. తాను మోహంతో, శివుడు పిల్లనిచ్చే మామయైన పర్వత రూపుడైన హిమవంతుని పార్వతిని భార్యగా చేయమని కోరాడు. దేవతలు సంతోషం పొందగా, శివునికి పార్వతికి పెళ్ళి అయ్యింది.

93. సమస్య: కుట్టక యున్న వృశ్చికముఁ గుమ్మరిపుర్వని యెంతురే గదా

93.135 ఉ. గట్టున దర్భలన్ బరచి కంధిని దాటగ పూజఁ జేసినన్
యిట్టుల మౌనమా? జలధి కెల్లిదమైతిని సాధువర్తినై,
కుట్టక యున్న వృశ్చికముఁ గుమ్మరిపుర్వని యెంతురేఁ గదా,
చట్టున నార్చె దాని నని చాపము నెక్కిడె రాము డుగ్రతన్.

(గట్టు = ఒడ్డు, దర్భ = పవిత్రమైన గడ్డి, పరచు = విస్తరింపజేయు, కంధి = సముద్రము, ఇట్టులు = ఈ ప్రకారము, మౌనము = మాట్లాడక ఉండడము, ఊను = సముద్రము, ఎల్లిదము = చులుకనిది, సాధు = సాత్వికమైన, వర్తి = నడుచుకొనువాడు, వృశ్చికము = తేలు, కుమ్మరిపుర్వు = మట్టిపురుగు, ఎంచు = తలచు, చట్టున = వెంటనే, ఆర్చు = ఎండబెట్టు, చాపము = విల్లు, ఎక్కిడు = ఎక్కుపెట్టు, ఉగ్రత = తీవ్రత)

ఒడ్డున దర్భలు పరిచి సముద్రము దాటడం కోసం పూజ చేసినా కూడా ఈ విధంగా మౌనమా? సౌమ్యమైన నడవడి కలవాడినవడం వల్ల సముద్రానికి చులకన అయ్యాను, తేలు కుట్టక పోతే కుమ్మరిపురుగు అని అనుకుంటారు కదా, వెంటనే దాన్ని ఎండగడతానని రాముడు ఉగ్రత్వంతో విల్లు ఎక్కుపెట్టాడు.

94. సమస్య: కూరలు లేకుండఁ జేయు కూరయె రుచియౌ

94.136 కం. భారీగా ధరలు పెరుగ,
కూరల నాణ్యత కొరవడె, కొరత పెరిగె; చే
కూరిన సరుకున, పుచ్చిన
కూరలు లేకుండఁ జేయు కూరయె రుచియౌ.

(కొరవడు = తక్కువ అగు, కొరత = అవసరానికి సరిపడ సరుకులు లభ్యం కాకపోవడం, చేకూరు = లభించు)

ధరలు భారీగా పెరగడం వలన కూరల నాణ్యత తగ్గింది. అవసరానికి సరిపడ కూరలు దొరకడం లేదు. దొరికిన సరుకులో పుచ్చిన కూరలు లేకుండా చేసే కూరే రుచిగా ఉంటుంది.

94.137 కం. చేరగ బజారు కష్టము,
కోరిన కూరలను కొనగ కోవిడ్ వలనస్,
దోరగ పప్పులు వేపియు
కూరలు లేకుండఁ జేయు కూరయె రుచియౌ.

కోవిడ్ (COVID) వల్ల కావలసిన కూరలు కొనడానికి బజారుకు వెళ్ళడం కష్టము. దోరగ, అంటే ఎర్రగా, పప్పులు వేయించి, కూరలు లేకుండా చేసే కూరే రుచిగా ఉంటుంది.

94.138 కం. కూరలుఁ జేతు రనేకము
కోరిన రుచులందు జనులు గూడిన, శాకా
హారుల కెపుడుస్ మాంసపు
కూరలు లేకుండఁ జేయు కూరయె రుచియౌ.

జనాలు ఒక చోట చేరినపుడు కావాల్సిన రుచుల్లో బోళ్ళు కూరలు చేస్తారు. శాకాహారులకి ఎప్పుడూ కూడా మాంసపు కూరలు లేకుండా చేసే కూరే రుచిగా ఉంటుంది.

95. సమస్య: కృత్యము మానగ సుకృతము కీర్తియు గలుగున్

95.139 కం. అత్యంతావశ్యకమా?
గత్యంతర మున్నదా? యని కార్యముఁ జేయన్,
నిత్య విచక్షణఁ గల్గి య
కృత్యము మానగ సుకృతము కీర్తియుఁ గలుగున్.

(అత్యంత = చాలా అధికమైన, ఆవశ్యకము = తప్పక చేయదగినది, గత్యంతరము = మఱొక మార్గము, నిత్య = ఎల్లప్పుడు, విచక్షణ = యుక్తాయుక్త జ్ఞానము, అకృత్యము = తగని పని, సుకృతము = పుణ్యము)

ఏ పనైనా, చెయ్యక తప్పదా? లేక వేరే మార్గం ఉందా? అని పనులు చేసేటప్పుడు ఎప్పుడూ యుక్తాయుక్త జ్ఞానము కలిగి చేయ కూడని పనులు చేయకుండా మానుకుంటే, పుణ్యము, కీర్తి కలుగుతాయి.

96. సమస్య: కృత్స్న జ్యోత్స్న ల వీడి చెప్పగదవే హృత్స్నే హ మేపారగన్

96.140 శా. సత్స్నిగ్ధంబగు ప్రేమ యున్నదని దోషాస్యమ్ము నార్పన్ యిటన్
జ్యోత్స్నాలంకృత వాహినీ తటమునన్ జోతున్నదా? ముగ్ధతా
కృత్స్నోద్భూతగు రాధతో వెరవుగన్ కృష్ణుం డనెన్, గుల్మినిన్
కృత్స్న జ్యోత్స్నల వీడి చెప్పగదవే, హృత్స్నేహ మేపారగన్.

(సత్ = నిజమైన, స్నిగ్ధము = స్నేహము, దోషాస్యము = దీపము, ఆర్చు = దీపము నిప్పు మొదలైనవి తీసివేయు, ఇట = ఇక్కడ, జ్యోత్స్న = వెన్నెల, అలంకృత = అలంకరింప బడిన, వాహిని = నది, తటము = ఒడ్డు, జోతి = దీపము, ముగ్ధత = అమాయకత్వము, కృత్స్న = అంతయును, ఉద్భూత = పుట్టినది, వెరవు = ఉపాయము, గుల్మిని = పొద, వీడు = వదలు, హృత్ = హృదయము, ఏపారు = అతిశయించు)

నిజమైన స్నేహము అనబడే ప్రేమ ఉందని దీపం ఆర్పడానికి (అంటే, ప్రమాణం చెయ్యడానికి) ఇక్కడ వెన్నెలతో అలంకరింప బడిన నదీతీరాన దీపం ఉందా? అంతటా ముగ్ధత్వంలో నుండి పుట్టిన రాధతో కృష్ణుడు ఉపాయంగా అన్నాడు, అంతటా ఉన్న వెన్నెలను వదిలి హృదయగతమైన స్నేహం అతిశయించే విధంగా పొదలో చెప్పవే అని. అంటే, వెన్నెల అనే దీపం లేని చోట, పొదలో చెబితే, దీపం ఆర్పి ప్రమాణం చేసినట్లే అని.

97. సమస్య: కొండెము లెన్ని చెప్పుచును కొంపలు కూల్చెద రెంద రెందరో

97.141 ఉ. అండగ నుంటి మంచు, తమ యక్కర లన్నియు తీర్చుకొంచు, వే
రొం డభిలాష లే దితరు లున్నతియే పరమంబుగా కరా
ఖండిగ నమ్మఁ బల్కుచును కాగల కార్యము లడ్డి చాటుగన్
కొండెము లెన్ని చెప్పుచును కొంపలు కూల్చెద రెంద రెందరో.

(అక్కర = ఆధారము, అక్కర = ఆవశ్యక కార్యము, వేరొండు = ఇతరము, అభిలాష = కోరిక, ఉన్నతి = అభివృద్ధి, పరమము = ప్రధానము, కరాఖండిగ = కచ్చితంగా, అడ్డు = అడ్డగించు, చాటుగ = రహస్యముగా, కొండెము = చాడీ)

అండగా ఉన్నామంటూ తమకు కావలసిన పనులన్నీ చేయించుకుంటూ, వేరే కోరిక అంటూ ఏమీ లేదు, ఇతరుల ఉన్నతియే తమకు ముఖ్యమని కచ్చితంగా నమ్మ బలుకుతూ, అయ్యే పనులని అడ్డుకుంటూ చాటుగా చాడీలు చెబుతూ కొంపలు కూల్చే వాళ్ళు ఎందరెందరో ఉన్నారు.

98. సమస్య: కొడుకునకున్ గూతునిచ్చె గోమలి ముదిమిన్

98.142 కం. తడయక తన యాడుబడుచు
కొడుకునకున్ గూతునిచ్చెఁ, గోమలి ముదిమిన్
గడపెను జీవన కాలము
కడ వరకును యాలుమగల కారుణ్యముతో.

(తడయు = ఆలస్యము చేయు, ఆడుబడుచు = మగనితోడఁబుట్టినది, కోమలి = సుందరి, ముదిమి = ముసలితనము, కడ = అంతము, కారుణ్యము = దయ)

ఆలస్యము చేయకుండా ఆడుబడుచు కొడుక్కి కూతురు నిచ్చింది. సుందరి ముసలితనంలో జీవన కాలము చివర వరకూ ఆ ఆలుమగల దయతో గడిపింది.

99. సమస్య: కొమ్మన కోమలికి వచ్చె కోపము తృటిలో

99.143 కం. లెమ్మా! సత్యా! విలు చే

కొమ్మా! యన కృష్ణుడు, నరకుడు కుపితుండై,
నమ్మను కదన మెరుగు నీ
కొమ్మన, కోమలికి వచ్చె కోపము తృటిలో.

లెమ్ము, సత్యా! ధనుస్సు చేకొనుమా! అని కృష్ణుడు అనగా, నరకాసురుడు కోపించిన వాడై, ఈ స్త్రీ యుద్ధమును ఎరుగును అంటే నమ్మను అనగా, ఆ కోమలికి వెంటనే కోపము వచ్చింది.

100. సమస్య: కోపమె భూషణమ్మగును కోడలికిన్ తన యత్త సన్నిధిన్

100.144 ఉ. చూపుల వెన్నెలల్ గురియు సుందర రూపము, భర్తఁ జేయు యా
టోపము లందు చూపక కడుంగడు హర్షము, లల్కపాన్పుపై
కోపమె భూషణమ్మగును కోడలికిన్, తన యత్త సన్నిధిన్
లోపము లేక సేవలను లోకము మెచ్చెడి రీతిఁ సేయగన్.

(ఆటోపము = ఆడంబరము)

తన అత్తగారి దగ్గర లోపం లేకుండా లోకం మెచ్చే విధంగా సేవలు చేస్తే, చూపులతో వెన్నెలలు కురిపించే అందమైన రూపము, భర్త చేసే ఆడంబరాలలో ఎక్కువ సంతోషం చూపించకుండా అలక పానుపు మీద కోపంగా ఉండడమే కోడలికి అలంకారమవుతుంది.

101. సమస్య: ... కౌపీనము ధరించువాఁడె ధనికుఁడౌ

ఇచ్చిన సమస్య కందపద్య పాదం (రెండవ లేక నాల్గవ) లాగా కనపడుతుంది గానీ ప్రారంభంలో రెండు లఘువులు లేక ఒక గురువు తక్కువ. రెండు లఘువులు వేసుకోవాలంటే, మొదటి లఘువుకి "ధరించువాఁడె"లో "వా"తో యతిమైత్రి ఉండాలి, రెండవ లఘువు ప్రాసాక్షరము కాబట్టి ప్రతి పాదంలోనూ వచ్చేలా పూరించాలి. ఒక గురువు వేసుకోవాలంటే, "ధరించువాఁడె"లో "వా"తో యతిమైత్రి ఉండేలా వేసుకోవాలి. అప్పుడు "కౌపీనము"లో "కౌ" ప్రాసాక్షరము అవుతుంది. అలా పూరించిన రెండు పద్యాలు క్రింద ఇవ్వబడ్డాయి.

101.145 కం. అడిగెను మూడడుగులు పా
పడు కౌపీనము ధరించువాఁడె, ధనికుఁడౌ
పుడమీశు బలిని, వామను

డడిగిన దిడ బలికి బింక మడుగంటె వెసస్.

(పాపడు = బాలుడు, కౌపీనము = గోచి, ధనికుడు = ధనము కలవాడు, పుడమీశుడు = రాజు, ఇడు = ఇచ్చు, బింకము = గర్వము, అడుగంటు = అణగారు, వెసస్ = శీఘ్రముగ)

డబ్బు ఉన్న రాజైన బలి చక్రవర్తిని బాలుడు గోచీ పెట్టుకున్న వాడు మూడు అడుగులు అడిగాడు. వామనుడు అడిగినది ఇవ్వగా వెంటనే బలికి గర్వము అణగారింది.

101.146 కం. శ్రీకరునికి దానమె? రుజు
వా కౌపీనము ధరించువాఁడె, ధనికుఁడౌ
లోకపతి బలిని వామను
డై కోరెను మూడడుగులు యహమును యణచస్

(శ్రీకరుడు = సంపత్కరుడు, రుజువు = సాక్ష్యము, కౌపీనము = గోచీ, ధనికుడు = ధనము కలవాడు, లోకపతి = రాజు, అహము = అహంకారము, అణచు = క్రుంగచేయు)

ఐశ్వర్యాన్ని ఇచ్చే వాడికి దానమా? ఆ గోచీ కట్టుకున్న వాడే సాక్ష్యము. డబ్బున్న వాడైన రాజు బలి చక్రవర్తిని, అహంకారము అణచడానికి వామనుడుగా మూడు అడుగులు కోరాడు.

102. సమస్య: క్రమమని యెంచి పంచెఁ గవిరాయడు భారతి యిస్తువంతయుస్

102.147 చం. సమతను పెంచు పాటలను, సంఘము నందున తా స్వతంత్ర తా
పము పెరుగంగ, సుబ్రమణి భారతి వ్రాసి మిగిల్చె నాస్తిగా,
క్రమమని యెంచి పంచెఁ గవిరాయడు భారతి యిస్తువంతయుస్
తమిళుల శాసకుల్, ప్రజకు దక్కగఁ జేయగ సర్వహక్కులస్.

(ఆస్తి = సొత్తు, క్రమము = విధి, ఇస్తువు = సొత్తు, శాసకుడు = పాలకుడు)

సమత్వాన్ని పెంచే పాటల ద్వారా సంఘములో తాను స్వతంత్రం కోసం తాపాన్ని పెరిగేటట్లుగా మహాకవి సుబ్రమణి భారతి (సుబ్రహ్మణ్య భారతి) వ్రాసి తన ఆస్తిగా మిగుల్చెను. తమ విధి అని తలచి ఆ కవిరాజైన భారతి సాహిత్యరూపమైన ఆస్తి అంతా తమిళ పాలకులు ప్రజలకు వాటిపై సర్వహక్కులు దక్కే విధంగా పంచారు.

103. సమస్య: ఖరపదము పరిగ్రహించి కననగు ముక్తిస్

103.148 కం. ధరణిజను కొరికి కరటము,
పరికించిన రాము చేతి బ్రహ్మాస్త్రమ్మే
తరుమ దలచె, రఘుకులశే
ఖరపదము పరిగ్రహించి కననగు ముక్తిస్.

(ధరణిజ = సీత, కొరుకు = కఱచు, కరటము = కాకి, పరికించు = చూచు, తరుము = వెంబడించు, తలచు = భావించు, రఘుకులశేఖరుడు = శ్రీరాముడు, పరిగ్రహించు = చేపట్టు, ముక్తి = విడుపు)

సీతను కొరికిన కాకి, అది చూచిన రాముని చేతి బ్రహ్మాస్త్రము వెంబడించగా, ఆ శ్రీరాముని పాదాలు పట్టుకుంటే ముక్తిని చూడవచ్చని అనుకుంది.

103.149 కం. దురుసుగ శరములు వేయగ,
హరు నేత్రాగ్నికి మరుండు యాహుతి కాగా,
మరుసతిఁ దలచెను, శశిశే
ఖర పదము పరిగ్రహించి, కననగు ముక్తిస్.

(దురుసు = కఠినము, శరము = బాణము, హరుడు = శివుడు, మరుడు = మన్మథుడు, ఆహుతి = అగ్నియందు వేల్చుట, మరుసతి = మన్మథుని భార్యయైన రతీదేవి, తలచు = భావించు, శశిశేఖర = శివుని)

కఠినంగా బాణాలు వేయగా, శివుని మూడవ కంటి అగ్నికి మన్మథుడు కాలి బూడిదవ్వగా, శివుని పాదాలు పట్టుకుంటే ముక్తిని చూడవచ్చని రతీదేవి అనుకుంది.

104. సమస్య: ఖరము నెక్కి నతడు ఖ్యాతి నొందె

104.150 ఆ.వె. భారతీయు లందు శూరుడు "అవతారు
సింగు చీమ" యనెడి సిక్కు వాడు,
యున్నత యెవరెస్టు యుర్వి కక్కజ మా శి
ఖరము నెక్కి నతడు ఖ్యాతి నొందె.

(శూరుడు = ధైర్యశాలి, ఉన్నత = ఎత్తైన, ఉర్వి = భూమి, అక్కజము = వింత, శిఖరము = కొండ, ఎక్కు = ఆరోహించు, ఖ్యాతి = కీర్తి, ఒందు = పొందు)

భారతీయులలో లెఫ్టినెంట్ కల్నల్ అవతార్ సింగ్ చీమా (Avtar Singh Cheema) అనబడే సిక్కు జాతి వాడు ధైర్యశాలి. ఎత్తైన ఎవరెస్టు శిఖరము పుడమికి వింత. ఆ శిఖరము ఆరోహించి అతడు కీర్తిని పొందాడు.

105. సమస్య: గంగ కద్దరి మేలిద్దరి కీడునుం గలదె యుద్యద్రాజ బింబాననా

వెనుక్కి తిరిగి ఉన్న ఒక వార వనితను చూసి తెనాలి రామకృష్ణుడు ఆశువుగా చెప్పినట్లుగా ప్రచారం పొందిన చాటు పద్యం క్రింద ఇవ్వబడింది:

మ. వరబింబాధరముల్ పయోధరములున్ వక్రాలకంబుల్ మనో
హర లోలాక్షులుఁ జూప కవ్వలి మొగంబై నంత సేమాయె నీ
గురు భాస్వజ్జఘనంబు క్రొమ్ముడియు మాకుం జాలవే గంగ క
ద్దరి మే లిద్దరి కీడునుం గలదె యుద్యద్రాజ బింబాననా

దొండపండు లాంటి పెదవి, ఉన్నతమైన వక్షోజాలు, ఉంగరాలు తిరిగిన ముంగురులు, మనసును దోచుకునే కన్నులు - చూపించక అటు వైపు మొహం తిప్పుకుంటే మాత్రం ఏమిటి? పెద్దదిగా ప్రకాశించే నీ జఘన భాగం, క్రొమ్ముడి మాకు చాలవా? గంగకు ఆ వైపైతే మేలు, ఈ వైపైతే కీడు అని ఉంటుందా? మునగ దలచుకున్నప్పుడు ఎటు వైపైనా, ముందైనా, వెనకైనా ఒకటే - అని భావం. ఇక నా పూరణ క్రింద ఇవ్వబడింది:

105.151 మ. ధరణీరాజ్యము గాధి పుత్రుడుఁ గొనెన్ దానమ్ముగా, కాశికిన్
యరుదెంచన్ ఋణ మెట్లుఁ దీర్తు మనియే యాలోచనల్, గంగ క
ద్దరి మేలిద్దరి కీడునుం గలదె, యుద్యద్రాజ బింబాననా!
పరివారమ్మును విక్రయింపగ ననెన్ భార్యన్ హరిశ్చంద్రుడే.

(ధరణి = భూమి, గాధి పుత్రుడు = విశ్వామిత్రుడు, కొను = గ్రహించు, అరుదెంచు = వచ్చు, ఋణము = అప్పు, తీర్చు = సవరించు, దరి = తీరము, మేలు = శుభము, కీడు = అశుభము, ఉద్యత్ = ఉదయించుచున్న, రాజబింబ = చంద్రబింబము, ఆనన = ముఖము కలది, పరివారము = పరిజనము, విక్రయించు = అమ్ము)

ఓ, ఉదయించుచున్న చంద్రబింబము వంటి ముఖము కలదానా! ధరణీ రాజ్యాన్ని విశ్వామిత్రుడు దానంగా గ్రహించాడు, కాశీకి చేరుకోగానే అప్పు ఎట్లా తీర్చాలన్న ఆలోచనలే, పరిజనాన్ని అమ్ముకోడానికి గంగకి అటు వేపైతే శుభము, ఇటు వేపైతే అశుభమా, అని భార్యను హరిశ్చంద్రుడే అన్నాడు.

106. సమస్య: గజమునకు ఖరంబు పుట్టి గంతులు వేసెస్

106.152 కం. రజకుని యింటను పండుగ
నజరానా యనగ జనుల నగవుల నడుమస్
కుజవారము నాడు ఖరాం
గజమునకు ఖరంబు పుట్టి గంతులు వేసెస్.

(రజకుడు = చాకలివాడు, నజరానా = కానుక, నగవు = నవ్వు, నడుమ = మధ్య, కుజవారము = మంగళవారము, ఖరము = గాడిద, అంగజము = దేహమునండి పుట్టినది)

చాకలివాని ఇంటిలో పండుగ బహుమతి అన్నట్లుగా, జనాల నవ్వుల మధ్యలో మంగళవారము నాడు గాడిద దేహము నుండి పుట్టిన గాడిదకి గాడిద పుట్టి గంతు లేసింది.

107. సమస్య: గణ చతుర్థి నాడు ఫణి చతుర్థి

ఈ సమస్యని తిరుపతి వేంకట కవులు చాలా అర్థవంతంగా ఇలా పూరించారు: "ఎన్ని దినము లాయె నిట నన్ను దించి నీ, వరిగి" యనిన బత్ని కనియె భర్త, నేటి కెన్నగ బది నెలలాయెగా నేడు, గణ చతుర్థి; నాడు ఫణి చతుర్థి. ఇక, నా పూరణలు క్రింద ఇవ్వబడ్డాయి.

107.153 ఆ.వె. విఘ్నపతికి పూజ విధిగా సలుపుదురు
గణచతుర్థి నాడు; ఫణిచతుర్థి
నాడు పూజ యగును నాగేంద్రు ప్రతిమకు,
రెండు పండుగలును మెండు మనకు.

(గణచతుర్థి = వినాయక చవితి, ఫణిచతుర్థి = నాగుల చవితి)

వినాయక చవితి నాడు విఘ్నేశ్వరునికి విధిగా పూజ చేస్తారు. నాగుల చవితి నాడు నాగరాజు బొమ్మకు పూజ అవుతుంది. రెండు పండుగలూ మనకు ఎక్కువే.

107.154 ఆ.వె. ప్రథమ పూజ విఘ్నపతికి సలుపుటయే
పండు గేది యైన వాడు కయ్యె,
గణచతుర్థినాడు ఫణిచతుర్థి దినము
యందు చేత వాని కగ్రపూజ.

(విఘ్నపతి = వినాయకుడు, సలుపు = చేయు, వాడుక = ఆచారము, గణచతుర్థి = వినాయక చవితి, ఫణిచతుర్థి = నాగుల చవితి, అగ్రపూజ = అందటికన్న ముందు చేయు పూజ)

పండుగ ఏదైనా మొదటి పూజ వినాయకుడికి చెయ్యడం ఆచార మయ్యింది. వినాయక చవితి రోజునా నాగుల చవితి రోజునా అందు చేతనే ఆయనకి అగ్రపూజ.

108. సమస్య: గణపతి నేత్రాగ్ని కాల్చె కాముని నయ్యో

108.155 కం. కనల మును కొలువ లేదని
గణపతి, నేత్రాగ్ని కాల్చె కాముని నయ్యో
త్రినయనుని, విరిశరములు మ
రునివి తనువున తగులగ, హరుడు యుగ్రుడవన్.

(కనలు = కోపగించు, మును = ఆరంభము, కొలువ కునికి = సేవింపకుండుట, త్రినయనుడు = శివుడు, ఉగ్రుడు = భయంకరుడు)

ఆరంభములో తనను పూజింప లేదని విఘ్నేశ్వరుడు కోపించగా, మన్మథుని పూలబాణాలు శరీరానికి తగులగా శివుడు భయంకరుడు కాగా ఆ ముక్కంటి కళ్ళలో పుట్టిన అగ్ని, పాపం, మన్మథుణ్ణి కాల్చింది.

109. సమస్య: గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్

ఇది సమస్య కాదు. కానీ, పైకి నిరాశావాదం లాగా కనుపడుతోంది కాబట్టి సమస్య అనుకోవచ్చు. ఇది నన్నయగారు వ్రాసిన ఆంధ్రమహాభారతం ఆదిపర్వము లోనిది. వ్యాసుడు తన తల్లి సత్యవతితో అన్న మాటలు:

"మతిఁ దలఁపఁగ సంసారం, బతిచంచల మెండమావు లట్టుల సంప, త్త్రతతు లతిక్షణికంబులు, గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్". నా పూరణ క్రింద ఇవ్వబడింది.

109.156 కం. రతి కనుకూల వసంతము
సతిపతులకు ముదము నిచ్చె చక్కగ, గ్రీష్మం
బతి తాపము, యెటులోర్తురు,
గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్.

వసంత ఋతువు అనురాగానికి అనుకూలమై భార్యాభర్తలకు చక్కగా సంతోషాన్ని ఇచ్చింది. గ్రీష్మ ఋతువు అతి వేడిగా ఉంటుంది. ఎట్లా ఓర్చుకుంటారు. అందుచేత, గతించిన కాలమే (వసంత ఋతువు) మేలు, వచ్చే కాలం (గ్రీష్మ ఋతువు) కంటే.

110. సమస్య: గరుడుడు గణపతికి తండ్రి కావలె సుమ్మీ

కంద పద్యపాదంగా ఇచ్చిన ఈ సమస్యని కొప్పరపు కవులు పూరించారు. ఎలా అంటే, "హరుడు గణపతికి పోలెన్, సరసీజాక్షుండు నాభిజన్మునకు వలెన్, గురుకీర్తి కన్న యా సా, గరు డుడుగణ పతికి తండ్రి కావలె సుమ్మీ". నా పూరణ క్రింద ఇవ్వబడింది.

110.157 కం. గరుడు డొక ధూర్తుడుగ డిం
గరుడుగ నుండెను గణపతి కమతము నందున్,
పరులను ముంచెడి కళలో
గరుడుడు గణపతికి తండ్రి కావలె సుమ్మీ.

గరుడుడు అనేవాడు ఒక ధూర్తుడుగా (మోసగాడుగా), డింగరుడుగా (సేవకుడుగా) గణపతి కమతంలో (వ్యవసాయదారుని సేద్యములో నున్న భూమిలో) ఉన్నాడు. ఇతరులను ముంచే (నాశనం చేయు) కళలో (నైపుణ్యములో) గరుడుడు గణపతిని మించిపోయాడు. గణపతే అనుకుంటే, ఆ కళలో వాడికి బాబు గరుడుడు.

111. సమస్య: గర్భములో నున్న బిడ్డ గ్రక్కున తుమ్మెన్

111.158 కం. దర్భం గొని నారద ముని
గర్భవతికి మంత్ర జపముఁ గఱపెడి వేళన్

యర్భుడు ప్రహ్లాదుండే
గర్భములో నున్న బిడ్డ, గ్రక్కున తుమ్మెన్.

దర్భ = కుశము, కఱపు = బోధించు, అర్భుడు = బాలకుడు, గర్భము = కడుపు, గ్రక్కున = తటాలున, తుమ్ము = అచ్ఛియను)

దర్భ తీసుకొని నారద మహర్షి గర్భవతికి (లీలావతికి) మంత్ర జపము నేర్పే సమయంలో బాలకుడు ప్రహ్లాదుడే వాళ్ళమ్మ కడుపులో బిడ్డ, తటాలున తుమ్మాడు.

111.159 కం. గర్భిణి నుత్తాడించగ
గర్భములో నున్న బిడ్డ, గ్రక్కున తుమ్మెన్
యర్భకు నాత్రం బది యా
విర్భావము కొరకటంచు వెలది మురియుచున్.

(ఉత్తాడించు = తాడనముచేయు, గ్రక్కున = తటాలున, అర్భకుడు = శిశువు, ఆత్రము = తొందర, ఆవిర్భావము = పుట్టుక, కొరకు = నిమిత్తము, వెలది = స్త్రీ, మురియు = సంతోషించు)

పొట్టలో ఉన్న బిడ్డ గర్భిణిని తాడనం చేయగా, శిశువు పుట్టుక కోసం చేసే తొందర అది అని మురిసిపోతూ ఆమె తటాలున తుమ్మింది.

111.160 కం. నిర్భయముగ పరికించిన
గర్భములో నున్న బిడ్డ గ్రక్కున తుమ్మెన్,
గర్భవతి యుత్త రడలె చ
తుర్భుజు రక్షణ కవచము దుండగ మాపన్.

(నిర్భయము = భయము లేకపోవుట, పరికించు = పరీక్షించు, గ్రక్కున = తటాలున, గర్భవతి = చూలాలు, అడలు = భయపడు, చతుర్భుజుడు = విష్ణువు, దుండగము = కీడు, ఆపు = ఆగునట్లు చేయు)

భయం లేకుండా పరీక్షించిన గర్భంలో ఉన్న బిడ్డయైన పరీక్షిత్తు తటాలున తుమ్మాడు. విష్ణువు రక్షణ కవచము జరగబోయే హానిని నిరోధించగా, గర్భవతియైన ఉత్తర భయపడింది.

112. సమస్య: గర్భీభూత సుధా నిధుల్ భుగభుగల్గా పొంగి ముంచెత్తగన్

112.161 శా. దౌర్భాగ్యమ్మగు మాతృ దాస్య ముడుపన్ దండెత్తి తార్క్ష్యుండు, య
త్యార్భాటమ్ముగఁ దెచ్చినట్టి సుధకున్ యాచూకి లేదెక్కడన్,
గర్భీభూత సుధా నిధుల్ భుగభుగల్గా పొంగి ముంచెత్తగన్,
దర్భల్ మాత్రమె యాశతో చిటుకగా దక్కెన్, భుజంగాలకున్.

(దౌర్భాగ్యము = దురదృష్టము, మాతృ = తల్లి, దాస్యము = బానిసతనము, ఉడుపు = పోగొట్టు, దండెత్తు = దండయాత్రచేయు, తార్క్ష్యుడు = గరుత్మంతుడు, అతి = అధికమైన, ఆర్భాటము = బడాయి, సుధ = అమృతము, ఆచూకి = జాడ, గర్భిభూత = లోనుండి వెలసిన, సుధ = అమృతము, నిధి = నిధానము, దర్భ = కుశము, చిటుకు = చప్పరించు, దక్కు = లభించు, భుజంగము = పాము)

దురదృష్టకరమైన తన తల్లి (వినత) బానిసతనము పోగొట్టడానికి దండయాత్ర చేసి అతి బడాయిగా గరుత్మంతుడు తెచ్చిన అమృతం జాడ ఎక్కడా లేదు (ఇంద్రుడు ఎత్తుకు పోవడం వల్ల). లోనుండి వెలసిన అమృత పాతఅ భుగభుగా పొంగి ముంచెత్తగా, ఆశగా చప్పరించడానికి పాములకు దర్భలు మాత్రమే దక్కాయి.

112.162 శా. ఆర్భాటమ్ముగ దేవదానవులు క్షీరాబ్ధిన్ మథించంగ, యా
విర్భూతమ్మగు కౌస్తుభంబును రమన్ విష్ణుండు చేపట్టి, మీ
దౌర్భాగ్యమ్మని చొక్కిడెన్ యసురులన్ దండింపగా, దివ్యులన్
గర్భీభూత సుధా నిధుల్ భుగభుగల్గా పొంగి ముంచెత్తగన్.

(ఆర్భాటము = అట్టహాసం, దేవ = దేవతలు, దానవులు = రాక్షసులు, క్షీరాబ్ధి = పాల సముద్రము, మథించు = చిలుకు, ఆవిర్భూతము = పుట్టినది, కౌస్తుభము = విష్ణువు వక్షస్థలమున పెట్టుకున్న మణి, రమ = లక్ష్మీదేవి, చేపట్టు = స్వీకరించు, దౌర్భాగ్యము = దురదృష్టము, చొక్కిడు = మోసపుచ్చు, అసురులు = రాక్షసులు, దండించు = శిక్షించు, దివ్యులు = దేవతలు, గర్భిభూత = లోనుండి వెలసిన, సుధ = అమృతము, నిధి = నిధానము)

అట్టహాసంగా దేవతలు రాక్షసులు పాల సముద్రాన్ని చిలకగా పుట్టిన కౌస్తుభమణిని లక్ష్మీదేవిని విష్ణువు స్వీకరించి, దేవతలని లోనుండి వెలసిన అమృత పాతఅ భుగభుగా పొంగి ముంచెత్తగా, మీ దురదృష్టమని రాక్షసులను శిక్షించడానికి మోసపుచ్చాడు.

113. సమస్య: గవ్వకుఁ గొఱగావు మేటికవి నెదిరిచినన్

113.163 కం. నవ్వితివా నా కవితకు,
గవ్వకుఁ గొఱగావు మేటికవి నెదిరిచినన్
క్రొవ్వున, నత్కిరా! యని
చివ్వున శాపంబు నిచ్చె, శివు డుగ్రుండై.

(గవ్వ = చిన్న నాణెము, కొఱగావు = పనికిరావు, మేటి = శ్రేష్ఠుడైన, ఎదురుచు = ఎదిరించు, క్రొవ్వున = మదముతో, చివ్వున = శీఘ్రముగ, ఉగ్రుడు = భయంకరుడు)

నా కవిత్వాన్ని చూసి నవ్వావా? మదమెక్కి శ్రేష్ఠుడైన కవిని ఎదిరిస్తే గవ్వకి కూడా పనికి రాకుండా పోతావు, నత్కిరా! అని వెంటనే శివుడు ఉగ్రుడై శాపము ఇచ్చాడు.

113.164 కం. ఇవ్వటుడే విష్ణు వతని
కివ్వకు దాన మనగ, బలి యిష్యుని యాజ్ఞన్
యవ్వలికింప, ద్విజు లనిరి
గవ్వకుఁ గొఱగావు మేటికవి నెదిరిచినన్.

(వటుడు = బ్రహ్మచారి, ఇష్యుడు = గురువు, అవ్వలికించు = తోసివేయు, ద్విజుడు = బ్రాహ్మణుడు, గవ్వ = చిన్న నాణెము, కొఱగావు = పనికిరావు, మేటి = శ్రేష్ఠుడైన, కవి = శుక్రుడు, ఎదురుచు = ఎదిరించు)

ఈ బ్రహ్మచారే విష్ణువు, అతనికి దానము ఇవ్వవద్దు అనగా గురువు ఆజ్ఞను బలి చక్రవర్తి తోసివేయగా, శ్రేష్ఠుడైన శుక్రాచర్యుని ఎదిరిస్తే గవ్వకి కూడా పనికి రాకుండా పోతావు అని బ్రాహ్మణులు అన్నారు.

114. సమస్య: గాడిద కాల్బట్ట మోక్షగతి లభ్యమగున్

114.165 కం. వీడునె భవభయ దుఃఖము
గాడిద కాల్బట్ట, మోక్షగతి లభ్యమగున్
తోడుగ నీడగ నుండియు
పీడిత తాడిత జనులను ప్రేముడిఁ గావన్.

సంసారం లోని భయ దుఃఖాలు గాడిద కాలు పట్టుకుంటే వీడిపోతాయా? తోడు నీడగా ఉండి పీడిత తాడిత జనాలను ప్రేమతో రక్షిస్తే మోక్షమార్గము దొరుకుతుంది.

115. సమస్య: గాడిద కాళ్ళు పట్టుకొని కావ్యగతార్థ మెరుంగ మేలగున్

115.166 ఉ. ఓడె, తెనాలి రామ కవి యుచ్చరణమ్ము గ్రహించ లేక తా
రాడుచు, యా కవిన్ ప్రెగడరాణ్ణరసున్ గని నింద జేయుచున్,
గాడిద! కాళ్ళు పట్టుకొని కావ్యగతార్థ మెరుంగ మేలగున్
వేడు మటంచు, రామ కవి వేడుక జేసెను రాజు ముంగటన్.

(ఉచ్చరణము = నోట పలుకుట, గ్రహించు = తెలుసుకొను, తారాడు = ఇట్టటు తిరుగు, ప్రెగడరాణ్ణరసున్ = ప్రెగడరాజు నరస కవి, కను = చూచు, ఎరుగు = తెలుసుకొను, మేలు = శుభము, వేడు = ప్రార్థించు, వేడుక = వినోదము, ముంగట = ఎదుట)

తెనాలి రామకృష్ణ కవి ఉచ్చరణము (తృవ్వట బాబా అన్న పద్యానికి సంబంధించి) తెలుసుకోలేక ఇట్టటు తిరుగుతూ ఓడిపోయాడు. ఆ ప్రెగడరాజు నరస కవిని చూచి తిడుతూ, ఓ గాడిద! కవిత్వ సంబంధమైన అర్థము తెలుసుకోవడానికి కాళ్ళు పట్టుకుంటే శుభము జరుగుతుంది, ప్రార్థించు అని రామకృష్ణ కవి రాజు (శ్రీకృష్ణదేవరాయలు) ఎదుట వినోదం చేశాడు.

116. సమస్య: గాడిద గ్రుడ్డు గొనివచ్చె గాశికి జనియున్

116.167 కం. తోడెవరు చాకలయ్యకు?
చూడగ నచలమగు జీవి చోద్యం బెదియొ?
ఏడది యీ పావడ? యన
గాడిద, గ్రుడ్డు, గొనివచ్చె గాశికి జనియున్.

ప్రశ్నలు, జవాబులతో క్రమాలంకారంలో ఉన్న పద్యం ఇది. చాకలి వానికి ఎవరు తోడు? చూస్తే, కదలిక లేనిది. కానీ అది జీవి. ఆ వింత ఏమిటి? ఈ లంగా ఎక్కడిది? వీటికి సమాధానాలు వరుసగా, గాడిద, గ్రుడ్డు, కాశికి వెళ్ళి కొని తెచ్చెను.

117.   సమస్య: గాడిద యేడిచెఁ గదన్న! ఘన సంపన్నా!

117.168   కం. కూడడుగుటకును, యొంటరి
కాఁడైనపుడును, భయంబుఁ గలిగిన యపుడున్,
దూడల మాదిరి 'బ్రే'యని
గాడిద యేడిచెఁ గదన్న! ఘన సంపన్నా!

(కూడు = ఆహారము, ఒంటరికాఁడు = ఏకాకి, దూడ = పశుశిశువు, మాదిరి = భాతి, ఘన = గొప్ప, సంపన్నుడు = ధనవంతుఁడు)

ఓ, గొప్ప సంపన్నుడా! ఆహారము అడగడానికి, ఏకాకి ఐనప్పుడు, భయం కలిగినప్పుడు, దూడల లాగా గాడిద 'బ్రే'యని ఏడిచింది కదన్నా!

117.169   కం. చూడ లటుని కుక్క బదులు
జాడఁ దెలుప తా నరవగ, శాయిక చెడగన్
జాడించె తనను భవి యని
గాడిద యేడిచెఁ గదన్న! ఘన సంపన్నా!

(లటుడు = దొంగ, బదులు = మాఱు, జాడ = ఆచూకీ, శాయిక = నిద్ర, జాడించు = కొట్టు, భవి = యజమాని, ఘన = గొప్ప, సంపన్నుడు = ధనవంతుఁడు)

పంచతంత్రం లోని ఒక కథ ఆధారంగా వ్రాసిన పద్యం ఇది. ఓ, గొప్ప సంపన్నుడా! కుక్కకి బదులు దొంగను చూడగా ఆచూకీ తెలియఁజెయ్యడానికి తాను అరవగా, నిద్రాభంగము అయ్యిందని యజమాని తనను కొట్టాడని గాడిద ఏడిచింది కదన్నా!

118.   సమస్య: గుండె ఆగిపోగ పండుగగును

118.170   ఆ. వె. అంగములకు రక్త మంపు యవయవము
యేది? కాల మేమయి నది ప్రేమ
జంట కింపు? నాగచవితి యేమి యగును?
గుండె, ఆగి పోగ, పండుగగును.

క్రమాలంకారంలో పూరించిన పద్యం ఇది. అవయవాలకు రక్తాన్ని పంపే అవయవం ఏది? కాలం ఏమయితే అది ప్రేమ జంటకి ఇష్టం? నాగచవితి ఏమవుతుంది? ఇవి మూడు ప్రశ్నలు. వీటికి సమాధానాలు వరుసగా 'గుండె', 'ఆగిపోగ', 'పండుగగును'.

118.171 ఆ. వె. పగలు రాత్రి యనక పర్జన్య ఘోషంబు,
కుంభినీ తటమున కుంభవృష్టి,
ఆగ నంత వరకు యదరెను లోకుల
గుండె, ఆగిపోగ పండుగగును.

(పర్జన్య = ఉఱిమెడి మేఘము, ఘోష = ధ్వని, కుంభినీ = భూమి, తటము = ప్రదేశము, కుంభవృష్టి = కుండపోతగా పడు వర్షము, అదరు = కంపించు)

పగలు రాత్రీ అనక ఆపకుండా ఉఱిమే మేఘ ధ్వని, భూమి అంతటా కుండపోతగా పడే వాన ఆగనంత సేపు ప్రజలకి గుండె అదిరింది, అవి ఆగిపోవగా పండ గయ్యింది.

118.172 ఆ. వె. సర్ప యాగమునకు సంకల్ప ముండె, హం
గుండె, ఆగిపోగ పండుగగును
సర్పజాతి కనుచు, సవన మాపించె యా
స్తీకు డనెడు మౌని, దీక్షఁ బూని.

(సంకల్పము = మనోనిశ్చయము, హంగు = ఏర్పాట్లు, సవనము = యాగము, దీక్ష = పట్టుదల)

మహాభారతంలో జనమేజయుడు చేసిన సర్పయాగంలో ప్రపంచంలోని పాములన్నీ అగ్నికి ఆహుతి అవుతుంటే, ఆస్తీకుడు అనే ముని అక్కడికి వెళ్ళి, జనమేజయుని మెప్పించి, దక్షిణగా యాగాన్ని నిలుపు చేయమని కోరి యాగాన్ని ఆపించేశాడు. ఇక పద్యంలోకి వెళితే, సర్పయాగం చేయడానికి కావలసిన మనోనిశ్చయము ఉంది, ఏర్పాట్లు ఉన్నాయి. అది ఆగిపోతే సర్పజాతికి పండుగ అని ఆస్తీకుడు అనే మౌని పట్టుబట్టి యాగాన్ని ఆపించాడు.

119. సమస్య: గుండ్రాతికి కాళ్ళు వచ్చి గునగున నడిచెన్

కంద పద్యపాదంగా ఇచ్చిన ఈ సమస్యని తిరుపతి వేంకట కవులు చాలా అందంగా పూరించారు. ఏమనంటే, "ఉండ్రాని యడవి లోపల, గుండ్రాయై యున్న మౌని కోమలిపై, గోదండ్రాము పదము సోకిన, గుండ్రాతికి కాళ్ళు వచ్చి గునగున నడిచెన్". నా పూరణలు క్రింద ఇవ్వబడ్డాయి.

119.173 కం. ఏం, డ్రాను లాట్రి రాలే?
యేం, డ్రీమున యెన్నొ వూళ్ళు యేల్లేదా? నీ
బండ్రాతి బుద్ధిలో, యే
గుండ్రాతికి కాళ్ళు వచ్చి గున గున నడిచెన్?

పద్యంలో ఊహ ఏమిటంటే, మనిషి కలల్లో ఏమైనా చూడొచ్చు. ఏం, డ్రా తీసినప్పుడు లాటరీలో ఏమీ తగలలేదా? డ్రీములో (dream), అంటే కలలో, ఎన్నో ఊళ్ళు ఏల లేదా? బండరాయి లాంటి నీ బుద్ధిలో, ఏ గుండ్రాతికి కాళ్ళు వచ్చి గున గున నడిచింది?

119.174 కం. ఉండ్రాళ్ళు చాల కారము,
ఉండ్రా! నీ కింకఁ జెప్పె దుప్పత లెన్నో,
పుండ్రేక్షు వెంతొ పుల్లన,
గుండ్రాతికి కాళ్ళు వచ్చి గునగున నడిచెన్.

(ఉండ్రాళ్ళు = మోదకాలు, ఉప్పత = రట్టు, పుండ్రేక్షువు = తెల్లచెఱకు)

ఉండ్రాళ్ళు చాలా కారంగా ఉంటాయి. ఉండరా! నీ కింకా రహస్యాలు చెప్తాను. తెల్లచెఱకు ఎంతో పుల్లగా ఉంటుంది. గుండ్రాతికి కాళ్ళు వచ్చి గునగునా నడిచింది.

120. సమస్య: గుండ్రాతిన్ కడు భక్తి గొల్వ యిదె నాకున్ నీకు సౌఖ్యంబగున్

120.175 శా. జేంద్రంబై చను సంప్రదాయములు యుజ్జీవించు చిహ్నంబుగా,
బండ్రా యంటి కృపా విహీను మది సంభావింతురే, మారుగా
గుండ్రాతిన్ కడు భక్తిఁ గొల్వ యిదె నాకున్ నీకు సౌఖ్యం బగున్,
మండ్రాటమ్ముల పోయి జీవితము సన్మానంబులన్ సాగులే.

(జీండ్రము = దురవస్థ, చను = నశించు, సంప్రదాయము = ఆచారము, ఉజ్జీవించు = నెగ్గు, చిహ్నము = గుర్తు, కృపా విహీనుడు = దయ లేనివాడు, మది = మనస్సు, సంభావించు = ఆరాధించు, మారు = బదులు, కొల్చు = పూజించు, సౌఖ్యము = హాయి, మండ్రాటము = సంతాపము, సన్మానము = మర్యాద, సాగు = నడుచు)

దురవస్థ పాలై నశించే ఆచారములు నెగ్గడానికి గుర్తుగా బండ రాయి లాంటి దయ లేని వాళ్ళని గౌరవిస్తారా? బదులుగా, గుండ్రాయిని మిక్కిలి భక్తిగా పూజించడం నాకూ నీకూ సుఖం అవుతుంది, సంతాపాలు పోయి జీవితం సన్మానాలతో నడుస్తుంది.

121. సమస్య: గుట్టుగ జెప్పికొన్న పలుకుల్ బహిరంగము లౌను వెంటనే

121.176 ఉ. చుట్టఱికమ్ము దాచి తన సోదరు కర్ణునిఁ గూర్చి, పోరునన్
గిట్టిన వారి సంస్కరణ కృత్యముఁ జేసెడి వేళఁ జెప్పి, మా
తెట్టి యఘమ్ముఁ జేసెనని యేడ్చిన ధర్మజు శాప, మింతులన్
గుట్టుగఁ జెప్పికొన్న పలుకుల్ బహిరంగము లౌను వెంటనే.

(చుట్టఱికము = బంధుత్వం, దాచు = మఱుగు పఱచు, సోదరుడు = తోడపుట్టినవాడు, గూర్చి = గురించి, పోరు = యుద్ధము, కిట్టు = చచ్చు, సంస్కరణ = అపరకర్మము, కృత్యము = పని, మాత = తల్లి, అఘము = పాపము, ఇంతి = స్త్రీ, గుట్టు = రహస్యము, పలుకు = మాట, బహిరంగము = బయలుపడినది)

తన సోదరుడైన కర్ణుని గురించి బంధుత్వం దాచి, యుద్ధంలో మరణించిన వారి అపరకర్మకి సంబంధించిన పని చేసే వేళ చెప్పి, తల్లియైన కుంతి ఎటువంటి పాపం చేసిందో అని ఏడ్చిన ధర్మరాజు శాపము, స్త్రీలలో రహస్యంగా చెప్పుకున్న మాటలు వెంటనే బహిర్గతం అవుతాయని.

122. సమస్య: గురు దక్షిణ నొసగు వాడు క్రూరుండు కదా

122.177 కం. అరయంగ నేకలవ్యుడె,
గురుదక్షిణ నొసగు వాడు, క్రూరుండు కదా
శరగురుడు, బొటవ్రేలిని
గురుదక్షిణగా యడుగుట కొరగామియెగా.

(అరయు = విచారించు, క్రూరుడు = దయలేనివాడు, శరగురుడు = ద్రోణుడు, బొటవ్రేలు = అంగుష్ఠము, కొరగామి = అకార్యము)

విచారించగా ఏకలవ్యుడే గురుదక్షిణ ఇచ్చేవాడు. దయలేనివాడు ద్రోణాచార్యుడు. బొటనవ్రేలిని గురుదక్షిణగా అడగటం అకార్యమేగా.

122.178 కం. అరచెడి శునకము నోటిని
శరములు గుప్పించె క్రుధను శరగురుడుఁ గనన్
యరయంగ నేకలవ్యుడె,
గురు దక్షిణ నొసగు వాడు క్రూరుండు కదా.

(క్రుధ = కోపము, శరగురుడు = ద్రోణుడు, అరయు = విచారించు)

ద్రోణాచార్యుడు చూస్తుండగానే, అరిచే కుక్క నోట్లో కోపంతో బాణాలు కురిపించాడు. విచారించగా అతడు ఏకలవ్యుడే. గురుదక్షిణ ఇచ్చేవాడు దయ లేనివాడు కదా.

123. సమస్య: గురువును నింద సేయ నొనఁగూడును విద్యలు శిష్యకోటికిన్

123.179 చం. సరి యగు నౌకరీ తనకు జక్కొన దంచు గురుత్వ మొక్కటే
దొరుకగ నంది పుచ్చుకొని ద్రోహము వృత్తికిఁ జేయగా, తగున్
గురువును నింద సేయ, నొనఁగూడును విద్యలు శిష్యకోటికిన్
నిరతినిఁ గల్గి జ్ఞానమును నేర్పు గురూత్తము సేవఁ జేసినన్.

(సరి = యుక్తము, నౌకరీ = ఉద్యోగము, జక్కొను = లభించు, గురుత్వము = గురువు పదవి, తగు = యుక్తమగు, ఒనగూడు = ప్రాప్తించు, నిరతి = మిక్కిలి ఆసక్తి)

సరియైన ఉద్యోగము తనకు లభించదని ఉపాధ్యాయ పదవి ఒక్కటే దొరుకగా దాన్ని స్వీకరించి వృత్తికి ద్రోహము చేయగా, గురువును తిట్టడం యుక్తమే. మిక్కిలి ఆసక్తి కలిగి జ్ఞానాన్ని నేర్పే ఉత్తముడైన గురువు సేవ చేస్తే శిష్యకోటికి విద్యలు ప్రాప్తిస్తాయి.

124.   సమస్య: గుఱ్ఱానికి నైదు కాళ్ళు కోడికి వలెనే

124.180   కం. కఱ్ఱను బొమ్మలు చేయుచు
గుఱ్ఱానికి నైదు కాళ్ళు కోడికి వలెనే
గుఱ్ఱడు పెట్టెను నిలకడ
బిఱ్ఱుగ నుండగ, నిలుచునె బేరము లటులే?

(కఱ్ఱ = కొయ్య, కుఱ్ఱడు = చిన్నవయసువాఁడు, నిలకడ = స్థిరంగా ఉండటం, బిఱ్ఱు = గట్టిగా, నిలుచు = మిగులు, బేరము = వెలకడుగుట, అటుల = ఆప్రకారము)

కొయ్యతో బొమ్మలు చేస్తూ కోడికి పెట్టిన విధంగానే గుఱ్ఱానికి ఐదు కాళ్ళు నిలకడ గట్టిగా ఉంటుందని కుఱ్ఱవాడు పెట్టాడు. ఆ విధంగా బేరాలు నిలుస్తాయా?

125. సమస్య: గెల్వఁగఁ నేడ్చెనొక్కడును గెల్వక నోడినవాడు నవ్వగన్

125.181   ఉ. సుల్వుగ తన్ను గెల్చు గతిఁ జూపగ ప్రేమను తాత, తా మదిన్
నిల్వక పొంగు దుఃఖమును నెగ్గుచు క్రీడి శిఖండి మాటునన్
తెల్విగ నిల్చి బాణముల దేహముఁ గప్పుచు, భీష్ముఁ గూల్చగన్,
గెల్వఁగఁ నేడ్చెనొక్కడును గెల్వక నోడినవాడు నవ్వగన్.

సులభంగా తనను గెలిచే మార్గము ప్రేమతో తాత చూపగా, తాను మనస్సులో పొంగే దుఃఖాన్ని జయిస్తూ, అర్జునుడు, తెలివిగా శిఖండి చాటుగా నిలచి బాణాలతో శరీరాన్ని కప్పుతూ భీష్మున్ణి పడగొట్టగానే, గెలవక ఓడినవాడు (భీష్ముడు) నవ్వగా, గెలిచి ఒకడు (అర్జునుడు) ఏడ్చాడు.

125.182   ఉ. సుల్వుగ యర్జునిన్ దునుమ సుక్రతు విచ్చిన శక్తి యస్త్రమున్
పల్వురుఁ జెప్పగా విసరి స్వర్గముఁ జేర్చి ఘటోత్కచున్ యనిన్
వెల్వెలబాఱు కర్ణుఁ గని వెన్నుడుఁ జెప్పెను ధర్మసూనుకున్,
'గెల్వఁగఁ నేడ్చెనొక్కడును గెల్వక నోడినవాడు నవ్వగన్'.

సులభంగా అర్జునుణ్ణి చంపడం కోసం ఇంద్రుడు ఇచ్చిన శక్తి అస్త్రాన్ని పెక్కుమంది చెప్పగా విసిరి ఘటోత్కచుణ్ణి స్వర్గానికి పంపి, యుద్ధంలో నిస్తేజుడైన కర్ణుణ్ణి చూసి కృష్ణుడు ధర్మరాజుతో 'గెలవక ఏడ్చినవాడు నవ్వగా, గెలిచి ఒకడు ఏడ్చాడు' అని అన్నాడు.

126. సమస్య: గ్రామము లేని దేశము వికాసము నొందును కల్మి పెంపునన్

126.183 ఉ. నీమముగా సమత్వమును నెమ్మిని పెంచుచు పంచుచున్, సదా
గ్రామ స్వరాజ్యమే తనదు లక్ష్యముఁ జేయు ప్రధాని యుండి, సం
క్షేమము వృద్ధియై, పొరుగు సీమలతో సహవాస ముండి, సం
గ్రామము లేని దేశము, వికాసము నొందును కల్మి పెంపునన్.

(నీమము = నియమము, సమత్వము = సమానత్వము, నెమ్మి = ప్రేమ, సదా = ఎల్లప్పుడు, సంక్షేమము = సుఖసంతోషములతో భద్రతతో నుండుట, సీమ = దేశము, సహవాసము = స్నేహము, సంగ్రామము = యుద్ధము, వికాసము = వికసించుట, కల్మి = సంపద, పెంపు = వృద్ధి)

నియమము ప్రకారం సమానత్వాన్ని ప్రేమతో పెంచి పంచుతూ ఎప్పుడూ గ్రామ స్వరాజ్యమే తన యొక్క లక్ష్యముగా చేసే ప్రధానమంత్రి ఉండి, సంక్షేమము ఉండి, పొరుగున ఉన్న దేశాలతో స్నేహం ఉండి యుద్ధం లేని దేశము, సంపదను అభివృద్ధి చేసుకోవడంలో వికాసము పొందుతుంది.

127. సమస్య: చంచల చిత్తను గొలిచిర చంచల భక్తిన్

127.184 కం. లంచంబుల సంపాదన
వంచనతో పేర్చి కూర్చు వశవర్తులకున్
చంచల లక్ష్మి యనుచు, నా
చంచల చిత్తనుఁ గొలిచి రచంచల భక్తిన్.

(లంచము = తనపని చక్కఁబెట్టుకొనుటకై యొకనికి రహస్యముగా నిచ్చు ధనము, వంచన = మోసము, పేర్చు = విశేషింపజేయు, కూర్చు = కూడబెట్టు, వశవర్తి = విధేయుడు, చంచల = చలించునది, చంచల చిత్త = చంచలమైన మనస్సు కలది, అచంచల భక్తిన్ = స్థిరమైన భక్తితో)

లక్ష్మీదేవి చంచల, చపల అంటారు. ఎందుకంటే, ఒకే చోట ఉండదని. లంచాలతో వచ్చిన సంపాదన పెంచి కూడబెట్టే విధేయులకు లక్షి చంచల అని ఆ చంచల చిత్తను స్థిరమైన భక్తితో పూజించారు.

128. సమస్య: చందమామ కొక్క శాప మిచ్చెను హస్తి

128.185 ఆ.వె. నిన్నుఁ గాంచిన యపనింద పాలగుదురు,
నీచ దృష్టిఁ జూచు నింద్యుఁడ వని
చందమామ కొక్క శాప మిచ్చెను, హస్తి
ముఖునిఁ గేరు కల్కముఁ గని గౌరి.

(కాంచు = చూచు, అపనింద = నిష్కారణముగ వచ్చిన నింద, పాలు = వశము, నీచ = అధముఁడు, దృష్టి = చూపు, నింద్యుఁడు = దూఱఁదగినవాఁడు, హస్తిముఖుడు = వినాయకుఁడు, కేరు = పరిహసించు, కల్కముడు = పాపి, కను = చూచు, గౌరి = పార్వతి)

వినాయకుణ్ణి పరిహసించే పాపిని చూచి పార్వతీదేవి నిన్ను చూస్తే అపనింద పాలవుతారు, నీచ దృష్టితో చూసే నింద్యుడివి అని చందమామకు ఒక శాపము ఇచ్చింది.

128.186 ఆ.వె. చందమామ కొక్క శాప మిచ్చెను, హస్తి
నీకుల సతి రోహిణిని వదలక,
తన యితర సుతల కతడు దూరమవ, దక్షు
డలిగి, కాంతిహీనుఁ డగుదు వనుచు.

(హస్తిని = స్త్రీజాతి విశేషము, కుల = జాతి, సతి = భార్య, సుత = కూఁతురు, దూరమగు = మైత్రిని కోల్పోవు, అలుగు = కోపముచేయు, కాంతి = ఒకచంద్రకళ, హీనుఁడు = రహితుడు)

హస్తినీజాతి స్త్రీ యైన రోహిణిని వదలకుండా, తన యితర కుమార్తెల కతడు దూరమవ్వగా, దక్షుడు కోపించి కళారహితుడవు అవుతావు అని చంద్రుడికి ఒక్క శాపం ఇచ్చాడు.

129. సమస్య: చంద్రు డొకటె కనగ సత్య వాక్కు

129.187 ఆ.వె. లక్ష్మణుని కఠోర ప్రతిన యేమన, రామ

చంద్రు డొకడె, కనగ, సత్య వాక్కు
నడపుట నిజమైన, నాదు మహేశ్వర
యస్త్ర మింద్రజిత్తు నడచు నిపుడె.

(నడపు = ప్రవర్తిల్లఁజేయు, అడచు = చంపు)

లక్ష్మణుడి కఠోర ప్రతిజ్ఞ ఏమిటంటే, చూడడానికి శ్రీరామచంద్రుడు ఒక్కడే (అటువంటివాడు ఇంకొకడు ఉండడు) సత్యవాక్కు పాటించడం నిజమైతే నా యొక్క మహేశ్వరాస్త్రము ఇంద్రజిత్తును ఇప్పుడే చంపుతుంది.

130. సమస్య: చలిలోఁ జెలి గౌగిలింత సంతాపమిడెన్

130.188 కం. వలదన్నను వినకయె కౌ
గిలిలో యూర్వశి యదుమగ, క్రీడికి శాపం
బు లభించి ఘుర్మజలముల
చలిలోఁ, జెలి గౌగిలింత సంతాప మిడెన్.

(అదుము = నొక్కు, క్రీడి = అర్జునుడు, ఘుర్మజలములు = చెమటలు)

వద్దన్నా వినకుండా కౌగిలిలో ఊర్వశి నొక్కగా, అర్జునునికి శాపం లభించడం వల్ల చెమటల చలిలో స్త్రీ కౌగిలింత విచారాన్ని ఇచ్చింది.

131. సమస్య: చలివేళన్ చెలి కౌగిలింత మిగులన్ సంతాపమున్ కూర్చెరా

131.189 మ. వలజన్ రంభనుఁ జూచి మోహమున తా ప్రాలేయ శైలమ్మునన్
బలిమిన్నామె నమాంతమున్ చెఱచెనే పౌలస్త్యుడంచున్ కడున్
కలతన్ జెంది శపించ నన్న కొడుకే, కామార్తు లంకేశుకున్
చలివేళన్ చెలి కౌగిలింత మిగులన్ సంతాపమున్ కూర్చెరా.

(వలజ = చక్కనిచూపుగల ఆడుది, మోహము = చిత్తవైకల్యము, ప్రాలేయ = మంచు, శైలము = కొండ, బలిమి = బలాత్కారము, అమాంతము = లటుక్కున, చెఱచు = చెడగొట్టు, పౌలస్త్యుడు = రావణుడు, కడున్ =

అత్యంతంగా, కలత = మనస్సులో ఆందోళనము, కామార్తుడు = కామ పీడితుడు, లంకేశుడు = రావణుడు, మిగులన్ = మిక్కిలిగా, సంతాపము = విచారము, కూర్చు = కూడబెట్టు)

చక్కని చూపున్న రంభను చూసి చిత్తవైకల్యముతో తాను మంచుకొండ మీద బలాత్కారము చేసి ఆమెను అమాంతంగా చెడగొట్టాడే రావణుడని మిక్కిలి ఆందోళనతో తన అన్నయైన కుబేరుని కొడుకైన నలకూబరుడు శపించగా, కామపీడితుడైన రావణునికి చలివేస్తున్న సమయంలో స్త్రీ యొక్క కౌగిలింత అత్యంత విచారాన్ని కూడబెట్టింది.

132. సమస్య: చాచా నెహ్రూయె బాలశత్రువు చూడన్

132.190 కం. సూచించె పంచశీలను
చాచా నెహ్రూయె; బాల! శత్రువు చూడన్
పేచీల పొరుగు దేశమె,
ఆ చింతయె నేడును మన కధికం బయ్యెన్.

ప్రపంచ శాంతి కోసం పంచశీల అనే పేరుతో ఐదు సూత్రాలు సూచించింది చాచా నెహ్రూగారే. పరిశీలించి చూస్తే, తగాదాలు పెట్టుకునే పొరుగు దేశమే శత్రువు. ఆ తలపే ఇవాళ్టికి కూడా మనకు ఎక్కువగా ఉంది.

132.191 కం. వాచా బాలల నేస్తము
చాచా నెహ్రూయె; బాలశత్రువు చూడన్,
దాచగ నాస్తుల నీయక
దాచగ లేనట్టి యప్పు తలనిడు తండ్రే.

చెప్పాలంటే పిల్లలకు స్నేహితుడు చాచా నెహ్రూగారే. చూడబోతే, దాచుకోవడానికి ఆస్తుల నివ్వకుండా, దాచలేనట్టి అప్పు మాత్రమే తలమీద పెట్టే తండ్రే పిల్లలకి అసలైన శత్రువు.

132.192 కం. ఈ చెడుగు రాజకీయమె
యాచారము వంశవృత్తి యను బాలురకున్,
తాచెడ్డ కోతి యెవరన,
చాచా నెహ్రూయె బాలశత్రువు, చూడన్.

తాచెడ్డ కోతి వనమెల్లా చెరిచిందని సామెత ఉంది. ఈ కుత్సితమైన రాజకీయమే ఆచారము, వంశవృత్తి అనే బాలురకు, తాచెడ్డ కోతి ఎవరంటే చాచా నెహ్రూయే. ఈ విధంగా పరిశీలించి చూస్తే, ఆయనే బాలశత్రువు. అంటే, రాజకీయము వంశపారంపర్యంగా మారడానికి ఒక విధంగా ఆయనే కారణం.

133. సమస్య: చావొసఁగున్ విశేష సుఖ సంచయమన్నది వాస్తవమ్మగున్

133.193 ఉ. జీవన మందు యౌషధుల చేత చికిత్సల చేత మానకన్,
జీవి నచేతనస్థితికిఁ జేర్చెడి హింసనుఁ బెట్టు రోగముల్,
తావిక నొక్కటే ననుచు తత్త్వముఁ జెప్పును, జీవి హక్కుగన్,
చావొసఁగున్, విశేష సుఖ సంచయమన్నది వాస్తవమ్మగున్.

(ఔషధి = మంచి మందు, చికిత్స = వైద్యము, తావు = చోటు, తత్త్వము = మౌలిక సత్యము, హక్కు = అధికారము, ఒరగు = ఇచ్చు, విశేష = సంపూర్ణమైన, సంచయము = సమూహము, వాస్తవము = నిజము)

జీవితంలో మందుల చేత, వైద్యం చేత మానకుండా జీవిని కదల లేని స్థితికి చేర్చే హింసను పెట్టే రోగాలు, ఉన్నది ఇక ఒకటే స్థానం అన్న మౌలిక సత్యము బోధిస్తాయి. జీవికి హక్కుగా మరణం నిజంగా సంపూర్ణమైన సుఖాలన్నీ ఇస్తుంది.

134. సమస్య: చిరుగుల గుడ్డల సొబగును జెప్పగ వశమా

134.194 కం. వరవుగ నీవున్నను నీ
చిరుగుల గుడ్డల సొబగునుఁ జెప్పగ వశమా?
తరుణులకే తమి నిడు నీ
మరు గెల్లగు నని సుధేష్ణ మాలిని నడిగెన్.

(వరవు = సేవిక, సొబగు = సౌందర్యము, వశము = స్వాధీనము, తరుణి = యౌవనము గల స్త్రీ, తమి = కుతూహలము, ఇడు = ఇచ్చు, మరుగు = చాటుగా ఉన్న, అగు = అగును, సుధేష్ణ = విరాటరాజు భార్య, మాలిని = అజ్ఞాతవాసంలో సైరంధ్రీవేషమును ధరించిన ద్రౌపది మారు పేరు, అడుగు = ప్రశ్నముచేయు)

నువ్వు సేవికగా ఉన్నా కూడా చిరిగిన బట్టలలో నీ సౌందర్యాన్ని గురించి చెప్ప తరమా? యువతులకే ఆసక్తిని కలిగించే నీకు చాటు ఎలా కుదురుతుంది? అని సుధేష్ణ మాలినిని ప్రశ్నించింది.

134.195 కం. గరగరి కన దమయంతిదె,
సిరి లేకున్నను నలుడు త్యజించిఁ జనిన, యం
బర మరె యున్న, పథికులకు
చిరుగుల గుడ్డల సొబగునుఁ జెప్పగ వశమా!

(గరగరిక = అందము, సిరి = సంపద, త్యజించు = విడిచిపెట్టు, చను = వెళ్ళు, అంబరము = వస్త్రము, అర = సగము, పథికుడు = బాటసారి, చిరుగు = చినుగు, సొబగు = సౌందర్యము, వశము = స్వాధీనము)

సంపద లేకపోయినా, భర్తయైన నలుడు విడిచిపెట్టి వెళ్ళిపోయినా, సగము వస్త్రమే ఉన్నా, అందము అంటే దమయంతిదే. బాటసారులకు చిరిగిన వస్త్రాల చక్కదనము గురించి చెప్పడం సాధ్యమా!

135. సమస్య: చుట్టములను కలసినంత సుఖములు తగ్గుస్

135.196 కం. పట్టణ వాసము కలవడి,
గుట్టుగ తమ బ్రతుకు నీడ్చు కొంపల లోనస్,
తట్టుకొను టెంతొ కష్టము,
చుట్టములను కలసి నంత సుఖములు తగ్గుస్.

పట్టణ వాసానికి అలవాటు పడి, గుట్టుగా తమ బ్రతుకును సాగించే ఇళ్ళలో తట్టుకోవడం చాలా కష్టము. వాళ్ళు చుట్టాలని కలిస్తే సుఖాలు తగ్గిపోతాయి.

135.197 కం. ముట్టీ యంటని బంధము
లట్టుల యవసరము మీర యందరి తోడస్
నట్టువ మాడెడు వారికి,
చుట్టములను కలసి నంత సుఖములు తగ్గుస్.

ముట్టీ అంటనట్లుగా ఉండే బంధాలలాగా, అవసరమున్నంత వరకే అందరితో నటనము ఆడే వాళ్ళకి, చుట్టాలని కలవగానే సుఖాలు తగ్గిపోతాయి.

135.198 కం. గిట్టని మనుషులు చెప్పిరి,
'చుట్టములను కలసినంత సుఖములు తగ్గుస్'

ఒట్టి యబద్ధము లట్టివి,
అట్టుల సూత్రీకరింప యన్యాయంబౌ.

చుట్టాలను కలిస్తే సుఖాలు తగ్గిపోతాయి అన్నది గిట్టని వాళ్ళు చెప్పారు. అవన్నీ ఒట్టి అబద్ధాలు. అట్లా సూత్రప్రాయముగా చెప్పడం అన్యాయం.

136. సమస్య: చూడ నేగును సిగ్గిల్లి చూడదయ్యె

136.199 తే. గీ. మోహనాకారు రాముని ముదితలు కను
లారఁ గాంచి యిట్టు లనిరి, ప్రశ్నఁ గాదె,
చెలుల మాట నవధరించి సీత రాముఁ
జూడ నేగును, సిగ్గిల్లి చూడదయ్యె.

(ముదిత = వనిత, అవధరించు = దయతోవిను)

మోహింప జేసే రూపం ఉన్న శ్రీరాముని స్త్రీలు కనులారా చూసి ఈ విధంగా అన్నారు: తన స్నేహితురాండ్ర మాట విని, సీత రాముణ్ణి చూడడానికి వెళ్ళి సిగ్గుతో చూడకుండా ఉండడం ప్రశ్న కాదా?

137. సమస్య: చెడుమతమున్నపుడు శాంతి చెలగును భువిలో

137.200 కం. బడుగులను ప్రగతి బాటను,
మిడిమేలపు దొరల గొలిచి మిడుకని బాటన్,
నడవడిని తీర్చి, నడిపిం
చెడు మత మున్నపుడు, శాంతి చెలగును భువిలో.

(బడుగు = దుర్బలుడు, ప్రగతి = అభివృద్ధి, మిడిమేలపు = అహంకరించే, దొర = యజమానుడు, కొలుచు = సేవించు, మిడుకు = బ్రతుకు, నడవడి = ప్రవర్తనము, తీర్చు = చక్కబరుచు, చెలగు = విలసిల్లు)

అశక్తులను ప్రగతిబాటలో, అహంకరించే దొరలను సేవించి బ్రతకని బాటలో, ప్రవర్తనను చక్కబరచి నడిపించే మతముంటే లోకంలో శాంతి విలసిల్లుతుంది.

138. సమస్య: చెడువానిన్ గొలువంగఁ గామ్యములు నక్షీణంబుగాఁ దీరులే

138.201 మ. కడు దారిద్ర్యము చేత పీడితుడవై, కైశోరమం దెచ్చు యా
ప్తుడు, శ్రీకృష్ణుని విస్మరించితివి, నీ బోంట్లెందరో వేడఁ, బ్రో
చెడువానిన్ గొలువంగఁ, గామ్యములు నక్షీణంబుగాఁ దీరు, లే,
యెడబాటేలనుచున్ కుచేలు నటకున్ యేగించె బ్రాణేశ్వరే.

(కడు = అత్యంతము, దారిద్ర్యము = పేదఱికము, పీడితుడు = బాధితుడు, కైశోరము = బాల్యము, ఎచ్చు = అధికమగు, ఆప్తుడు = స్నేహితుడు, విస్మరించు = మఱచిపోవు, బోంట్లు = వంటివారు, వేడు = ప్రార్థించు, ప్రోచు = పోషించు, కొలుచు = సేవించు, కామ్యము = కోరదగినది, అక్షీణము = శాశ్వతము, తీరు = ఈడేఱు, లే = లెమ్ము, ఎడబాటు = వియోగము, ఏగించు = పంపు, ప్రాణేశ్వరి = భార్య)

అత్యంత పేదఱికంతో బాధపడుతూ, బాల్యంలో పెద్ద స్నేహితుడైన శ్రీకృష్ణుని మఱచిపోయావు. నీ వంటివారు ప్రార్థిస్తే పోషించేవాడిని సేవిస్తే శాశ్వతముగా కోరికలు ఈడేఱుతాయి. లెమ్ము. వియోగము ఎందుకు అని అంటూ కుచేలుణ్ణి అక్కడికి ఆతని భార్యే పంపింది.

139. సమస్య: చెన్నపురి నుండి మద్రాసు కెన్ని మైళ్ళు

139.202 తే.గీ. ఉన్న యూరిని వదలక యున్న వాని
నన్ని విధముల బ్రతిమాలి యనుమతించ
వీడు కెళ్ళగ, ప్రశ్నించె వెంగళప్ప,
చెన్నపురి నుండి మద్రాసు కెన్ని మైళ్ళు.

(వీడు = పట్టణము, వెంగళప్ప = వెఱ్ఱిబాగులవాడు)

ఉన్న ఊరు వదలకుండా ఉన్న వాణ్ణి అన్ని విధాలా బ్రతిమాలి అనుమతించగా పట్టణానికి వెళ్ళడానికి ఆ వెఱ్ఱిబాగులవాడు చెన్నపురి నుండి మదరాసుకు ఎన్ని మైళ్ళు అని అడిగాడు.

140. సమస్య: చెప్పుల దండ వేసి మరి చెప్పగ నొప్పును స్వాగతంబికన్

140.203 ఉ. దప్పికఁ బెంచ యెండ జమదగ్ని దినేశు శపింపఁ బోవగా,

తప్పును తాప మంచు రవి తాపసి కిచ్చెను యొక్క ఛత్రముస్
చెప్పుల, దండ వేసి మరి చెప్పగ నొప్పును స్వాగతం బికస్,
చెప్పులు ఛత్రముస్ గొనగ స్వీకృతి, విందుల కన్ని వేళలస్.

(దప్పిక = దాహము, ఎండ = సూర్యప్రకాశము, దినేశుడు = సూర్యుడు, తప్పు = తొలగు, తాపము = వేడిమి, రవి = సూర్యుడు, తాపసి = ముని, ఛత్రము = గొడుగు, ఒప్పు = తగు, స్వీకృతి = స్వీకారము, విందు = అతిథి)

ఎండ దాహాన్ని పెంచిందని జమదగ్ని సూర్యుణ్ణి శపించబోగా, వేడిమి తొలగిపోతుందని సూర్యుడు ఆ మునికి ఒక గొడుగు, చెప్పులు ఇచ్చాడు. ఇంకా గొడుగు, చెప్పులు స్వీకరించడానికి అతిథులకు అన్ని వేళలా దండ వేసి మరీ స్వాగతం చెప్పడం తగిన పని.

141. సమస్య:చెలువలు రసవత్కవితలు చెప్పం గలరే

141.204 కం. తలపున విశ్వం బందలి
చెలువమ్ములఁ జూడలేక, సిరి యొక్కటె మా
కిల ముద మిచ్చుననిఁ దలచు,
చెలువలు, రసవత్కవితలు చెప్పం గలరే.

(చెలువము = అందము, చెలువ = అందగత్తె)

విశ్వంలో ఉన్న అందాలను ఊహలలో చూడలేక, సంపద ఒక్కటే మాకు ఈ లోకంలో సంతోషాన్ని ఇస్తుందని అనుకునే అందగత్తెలు రసభరితమైన కవితలు చెప్పగలరా?

142. సమస్య: చేతికి దక్కినంత నది చేరగ నోటికి చేత మొప్పునే

142.205 ఉ. ఖ్యాతి గడించి దానమున ఖాదముఁ గోరు క్షుధార్తు లుండినస్,
చేతికి దక్కినంత నదిఁ జేరగ నోటికి చేత మొప్పునే
దాతగు రంతిదేవునికి, ధాత్రిని యట్టి మహాత్ములుందురే?
యాతన లెన్నొ యోర్చి తన యాచక బృందము కోర్కెఁ దీర్చగస్.

(ఖ్యాతి = కీర్తి, గడించు = సంపాదించు, ఖాదము = ఆహారము, క్షుధ = ఆకలి, ఆర్తుడు = బాధితుడు, దక్కు = లభించు, చేతము = మానసము, ఒప్పు = సమ్మతించు, దాత = ఇచ్చువాడు, ధాత్రి = భూమి, యాతన = తీవ్రవేదన, ఓర్చు = సహించు, యాచకుడు = భిక్షుకుడు, బృందము = సమూహము, తీర్చు = నెఱవేర్చు)

దానం చేయడంలో కీర్తిని సంపాదించి ఆహారాన్ని కోరే ఆకలి బాధితులు ఉన్నప్పుడు చేతికి అందినదంతా నోటికి చేర్చడానికి, అంటే దొరికినది తినడానికి, దాత అయిన రంతిదేవునికి మనస్సు అంగీకరిస్తుందా? ఎన్నో తీవ్రవేదనలు సహించి తన భిక్షుక సమూహము కోరిక నెఱవేర్చే అలాంటి మహాత్ములు భూమి మీద ఉంటారా?

143. సమస్య: జగద్వ్యాప్తములయ్యె నిరులు ఖరకరుడుండఁన్

143.206 కం. సద్వ్యూహము సైంధవు వధ,
తద్వ్యోమము నందు చక్రి దాచగ సూర్యున్,
తద్వ్యుష్టి క్రీడి పొంద, జ
గద్వ్యాప్తములయ్యె నిరులు, ఖరకరుడుండఁన్.

(సత్ = మంచి, వ్యూహము = రచన, వధ = మారణము, తత్ = ఆ, వ్యోమము = ఆకాశము, చక్రి = కృష్ణుడు, దాచు = చాటుచేయు, తత్ = దాని, వ్యుష్టి = ప్రయోజనము, క్రీడి = అర్జునుడు, జగత్ = లోకమంతా, వ్యాప్తము = వ్యాపించినది, ఇరులు = చీకట్లు, ఖరకరుఁడు = సూర్యుడు)

సమస్యగా ఇచ్చినది కంద పద్య పాదానికి ఒక్క అక్షరము ఎక్కువ. అందుకని "ద్వ్య" ప్రాసగా పద్యం చెప్పాలి. సైంధవ వధ అన్నది మంచి వ్యూహము. ఆ ఆకాశంలో కృష్ణుడు సూర్యుణ్ణి దాయగా, దాని ప్రయోజనాన్ని అర్జునుడు పొందడానికి సూర్యుడు ఉండగానే లోకాలన్నీ చీకట్లు కమ్మాయి.

144. సమస్య: జగము లెరిగిన ద్విజునకు జందెమేల

144.207 తే.గీ. సంపదలు లేని కొంపకు కాపు యేల?
కఠిన చిత్తుల శిక్షింప కరుణ యేల?
నీతి నియమము లేనట్టి నేత లేల?
జగము లెరిగిన ద్విజునకు జందెమేల?

సంపదలు లేని ఇంటికి కాపు కాసే వాడు ఎందుకు? కఠినమైన మనస్సు కలవారిని శిక్షించడానికి దయ ఎందుకు? నీతి నియమము లేని నాయకుడు ఎందుకు? లోకాలు తెలిసిన బ్రాహ్మణుడికి జందెము ఎందుకు?

145. సమస్య: జనము ఛీకొట్టినప్పుడే ఘనము నేడు

145.208 తే. గీ. నాయకత్వ సంక్షోభ మానాటి నుండి
కలదు, పట్టంబు సచ్ఛరిత్రులకుఁ గట్టి,
సంఘ విద్రోహ శక్తుల శాస్తిఁ జేసి,
జనము ఛీకొట్టినప్పుడే, ఘనము నేడు.

నాయకత్వ సంక్షోభం ఆనాటినుండీ ఉన్నదే. మంచి నడవడి ఉన్నవాళ్ళకి పట్టం కట్టి, సంఘ విద్రోహ శక్తులను శిక్షించి ప్రజలు ఛీకొట్టినప్పుడే నేడు మంచి జరుగుతుంది.

145.209 తే. గీ. ఎన్నికలలోన నేతల కెన్ని కలలు?
ఎన్ని వాగ్దానములు చేతు రెన్నికందు?
అన్ని మరతురేల గెలిచి? యట్టి వారి
జనము ఛీకొట్టినప్పుడే, ఘనము నేడు.

ఎన్నికలలలో నేతలు ఎన్ని కలలు కంటారో, ఎన్ని వాగ్దానాలు చేస్తారో. గెలిచిన తర్వాత అన్నీ మరిచిపోతారే. అటువంటి వారిని ప్రజలు ఛీకొట్టినప్పుడే నేడు మంచి జరుగుతుంది.

145.210 తే. గీ. శాసనములు కలిగినంత, సంఘమునకు
సంస్కరణ లబ్బునే, యట్టి సంస్కరణల
సమ్మతించి, యడ్డు పడెడి స్వార్థ పరుల
జనము ఛీకొట్టినప్పుడే, ఘనము నేడు.

చట్టములు ఉన్నంత మాత్రాన సంఘానికి సంస్కరణలు ప్రాప్తించవు. అటువంటి సంస్కరణలను అంగీకరించి, వాటికి అడ్డుపడే స్వార్థ పరులను ప్రజలు ఛీకొట్టినప్పుడే నేడు మంచి జరుగుతుంది.

145.211 తే. గీ. పుణ్యపాపము లెరుగని పురజనులను,
దైవమని, దయ్యమని, మంత్ర తంత్రములని,

మోసగించుచు, సర్వస్వ మూడ్చు వారి,
జనము ఛీకొట్టినప్పుడే, ఘనము నేడు.

(మోషకుడు = దొంగ)

పుణ్యం పాపం ఎరగని నగర ప్రజలను, దేవుడు, దెయ్యం అనీ, మంత్రతంత్రాలనీ మోసం చేస్తూ ఉండే దొంగలను ప్రజలు ఛీకొట్టినప్పుడే నేడు మంచి జరుగుతుంది.

146. సమస్య: జన్మదినోత్సవంబనుచు సంబరముల్ జరుపంగ మేలొకో

146.212 ఉ. కన్మరుగయ్యె 'బాలు' యను గాయక ముఖ్యుడు నేడటంచు నా
జన్మదినంబు నందు యవసాదము చెందిరి లోకు లందరుస్
మృణ్మయమై యశాశ్వతము మేనని చేకొని యట్టి రోజునస్
జన్మదినోత్సవం బనుచు సంబరముల్ జరుపంగ మేలుకో?

(అవసాదము = దుఃఖము, లోకులు = ప్రజలు, మృణ్మయము = మట్టితో చేయబడినది, అశాశ్వతము = క్షణభంగురము, మేను = శరీరము, చేకొను = గ్రహించు, ఉత్సవము = పండుగ, సంబరము = వేడుక, మేలు = శ్రేష్ఠము, ఒకో = ప్రశ్నార్థకం)

'బాలు' అనే ప్రధానమైన గాయకుడు నేడు కనుమరుగయ్యాడు, అంటే మరణించాడు, అని అంటూ నా పుట్టినరోజు నాడు (నిజంగా సెప్టెంబరు 25 నా పుట్టిన రోజు, బాలుగారు స్వర్గస్థులైన రోజు) ప్రజ లందరూ దుఃఖము చెందారు. మట్టితో చేయబడింది (మట్టిలో కలవాల్సింది), క్షణభంగురము ఐన శరీరము అని తెలిసి, అటువంటి రోజున పుట్టినరోజు పండుగని వేడుకలు జరపడం మంచిదా?

147. సమస్య: జమునకు క్రింది భాగమున జల్లదనంబులు చూచితే కవీ

147.213 చం. రమణి కరంబునస్ విడెము లాస్యపు భంగిమలో, వివిక్తముస్,
శమనము నిచ్చు మారుతము చల్లగ వీచగ, నీరు పోయ క్ష్మా
జమునకు క్రింది భాగమునఁ జల్లదనంబులు, చూచితే కవీ!
విమల కవిత్వ మల్లుటకు వీలగు ప్రేరణ లివ్వియేఁ గదా.

(రమణి = సుందరి, కరము = చేయి, విడెము = తాంబూలము, లాస్యపు భంగిమ = నాట్య భంగిమ, వివిక్తము = ఏకాంతము, శమనము = శాంతి, మారుతము = గాలి, క్ష్మాజము = వృక్షము, విమల = నిర్మలమైన, అల్లు = రచించు, ప్రేరణ = పురికొల్పునవి, ఇవ్వి = ఇవి)

నాట్యభంగిమలో ఉన్న సుందరి చేతిలో తాంబూలము, ఏకాంతము, శాంతియుత వాతావరణం ఇవ్వడానికి చల్లటి గాలి వీచేటట్లుగా నీరు పోయడం వలన వృక్షానికి క్రింది భాగంలో చల్లదనాలు, చూశావా కవీ! నిర్మలమైన కవిత్వం అల్లడానికి ఇవే కదా ప్రేరణ ఇచ్చేవి.

148. సమస్య: జమునను౹ జూడ౹గా విజయశాంతి లభించె జయప్రదమ్ముగన్

148.214 చం. గుమికొని కౌరవాధములు గోగ్రహణంబున కుద్యమించ, భీ
తమునను యుత్తరుం డట శతాంగు బృహన్నల౹ గాంచి యిట్లనెన్,
సమరము౹ జేసి గెల్వ౹ గల సత్తువ తోడను నిన్ను భాను తే
జమునను౹ జూడ౹గా, విజయ! శాంతి లభించె జయప్రదమ్ముగన్.

(గుమికొను = గుంపుకట్టు, గోగ్రహణము = గోవులను హరించుట, ఉద్యమించు = యత్నించు, భీతము = భయము, శతాంగుడు = రథికుడు, సత్తువ = బలము, భాను = సూర్యుడు, తేజము = తేజస్సు, విజయ = అర్జునుడు, జయప్రదము = సఫలము)

నీచులైన కౌరవులు గుంపుకట్టి గోవులను హరించడానికి యత్నించగా, భయంతో ఉత్తరుడు అక్కడ రథికుడైన బృహన్నలను చూసి ఇట్లా అన్నాడు. అర్జునా! యుద్ధం చేసి గెలవగల సత్తువతో నిన్ను సూర్యతేజస్సులో చూడగా సఫలముగా శాంతి లభించింది.

149. సమస్య: జయ జయ జయ భారతాంబ జయ జయ జయహే

149.215 కం. జయగాథల భాండారము,
జయ కావ్యప్రేరితంబు, జనగణ గీతా
న్వయి, త్యాగధనుల ప్రజనిక,
జయ! జయ! జయ భారతాంబ! జయ! జయ! జయహే!

(భాండారము = ఖజానా, జయకావ్యము = మహాభారతము, ప్రేరితము = ప్రేరేప బడినది, అన్వయి = అన్వయముకలది, ప్రజనిక = జనయిత్రి)

వీరగాథలకు ఖజానా, మహాభారతము చేత ప్రేరేపించబడినది, జనగణ గీతముతో అన్వయము కలది, త్యాగమూర్తులకు పుట్టిల్లు అయిన భారత మాతకు జయము.

149.216 కం. నియతి గల దేశభక్తుల
ప్రయాసల ఫలముగ దక్క స్వాతంత్ర్యము, య
క్షయముగ నీ కీర్తి నిలిచె,
జయ! జయ! జయ భారతాంబ! జయ! జయ! జయహే!

(నియతి = నియమము, ప్రయాస = శ్రమము, దక్కు = లభించు, అక్షయము = స్థిరమైనది)

నియమాలు ఉన్న దేశభక్తుల శ్రమ ఫలితంగా స్వాతంత్ర్యము లభించగా, నీ కీర్తి శాశ్వతముగా నిలిచింది, భారత మాతా, జయము.

150. సమస్య: జయ జయ యంచుఁ గౌరవులు చాల విషాదముఁ జెంద నాత్మలోన్

150.217 చం. దయ విడి ద్రోణు వ్యూహమున దారుణ రీతిని పుత్రుఁ జంపి దు
ర్నయమునుఁ జేయఁ గాంచిన ధనంజయు డుగ్ర ప్రతిజ్ఞఁ జేసి య
త్యయమునుఁ బాపె సైంధవుని యంతముచే, తన సేనఁ బల్కగా
జయ జయ యంచుఁ, గౌరవులు చాల విషాదముఁ జెంద నాత్మలోన్.

(దుర్నయము = అన్యాయము, ధనంజయుడు = అర్జునుడు, ఉగ్ర = భయంకరమైన, అత్యయము = దుఃఖము, పాపు = పాయజేయు, అంతము = చావు)

కరుణ విడనాడి ద్రోణుని పద్మవ్యూహంలో భయంకరమైన విధంగా పుత్రుడైన అభిమన్యుని చంపి అన్యాయము చేయగా చూచిన అర్జునుడు, భీకరమైన ప్రతిజ్ఞ చేసి, తన సైన్యము జయజయ ధ్వానాలు చేయగా, కౌరవులు మనస్సులో చాలా ఖేదము చెందగా, సైంధవుని చావుతో దుఃఖాన్ని పోగొట్టాడు.

151. సమస్య: జలము జలమ్ములోఁ గలిసి సంతమసంబనఁ గ్రమ్మె దిక్కులన్

151.218 చం. బలమున దేవదానవులు పాలసముద్రముఁ జిల్కు వేళలో,
తొలుత విషమ్ముఁ బుట్టి, యది తోయధి పైఁగల నాకసమ్ముపై
పొలయగ కొంత, శేషము యపూటము రూపము నందు గాఢ క
జ్జలము జలమ్ములోఁ గలిసి సంతమసంబనఁ గ్రమ్మె దిక్కులన్.

(దానవులు = రాక్షసులు, తోయధి = సముద్రము, ఆకసము = ఆకాశము, పొలయు = వ్యాపించు, శేషము = మిగిలినది, అపూటము = తాకబడనిది, కజ్జలము = కాటుక, సంతమసము = సర్వత్రపూర్ణాంధకారము, క్రమ్ము = వ్యాపించు)

సత్తువ ఉపయోగించి దేవతలు, రాక్షసులు క్షీరసముద్రము మథించే వేళలో, మొదట విషము పుట్టి, అది కొంతభాగము సముద్రముపై నున్న ఆకాశాన్ని వ్యాపించగా, మిగిలినది తాకబడనిది, చూడడానికి దట్టమైన కాటుక వంటిది నీటిలో కలిసి, దిక్కుల నంతటా సంపూర్ణ అంధకారము వ్యాపించింది.

152. సమస్య: జారకులావతంసమును సాక దగున్ నృపతుల్ నరేశ్వరా

152.219 ఉ. తీరుగ నొక్క చోట తమ ధిష్ణ్యము లన్ని యమర్చి సంస్కృతిన్
గారవమున్ సుభిక్షముగఁ గాచు బలాఢ్యుల జాతి వాడు, వ్యా
పార మదేది యైన తగు పద్ధతిగా యొనఁగూర్చు వాడు, బం
జారకులావతంసమును సాకఁ దగున్ నృపతుల్, నరేశ్వరా!

(ధిష్ణ్యము = గృహము, సుభిక్షము = సమృద్ధి, కాయు = రక్షించు, బలాఢ్యుడు = బలవంతుడు, వ్యాపారము = పని, ఒనగూర్చు = సిద్ధించునట్లు చేయు, బంజార = లంబాడి, సాకు = పోషించు)

ఓ రాజా! పద్ధతిగా ఒక చోటే తమ ఇళ్ళన్నీ అమర్చుకొని సంస్కృతిని, గౌరవాన్ని కాపాడుకునే బలవంతుల జాతికి చెందిన వాడు, ఏ పని ఐనా చక్కగా చేసేవాడు, లంబాడి కులశ్రేష్ఠుడు రాజులు పోషించ తగినవాడు.

152.220 ఉ. ధీరుడు, దేశమంతయును దీక్షగఁ ద్రిమ్మరి యన్ని వార్తలన్
నేరుగఁ జెప్పుటందు కడు నేర్పరి, స్వార్థము లేని పాత్రునిం
జారకులావతంసమును సాకఁ దగున్ నృపతుల్, నరేశ్వరా!

నేరములన్ దమింప యని నెమ్మిగఁ జెప్పెను, మంత్రి రాజుకున్.

(ధీరుడు = ధైర్యముగలవాడు, దీక్ష = పట్టుదల, త్రిమ్మరు = సంచరించు, నేరుగ = చక్కగా, పాత్రుడు = యోగ్యుడు, చారకులము = రాజ్యములో జరుగు మంచి చెడులను రాజుకు నివేదించువారి వంశము, సాకు = పోషించు, నృపతి = రాజు, నరేశ్వరా = రాజా, దమించు = అణగద్రొక్కు, నెమ్మిగ = ప్రేమతో)

ఓ, రాజా! నేరాలు అణగద్రొక్కడానికి, ధైర్యము కలవాడు, దేశమంతా తిరిగి వార్తలు చక్కగా చెప్పడంలో నైపుణ్యము కలవాడు, స్వార్థము లేని యోగ్యుడైన వాణ్ణి, వేగుల వంశ శ్రేష్ఠుణ్ణి రాజులు పోషించాలి అని మంత్రి రాజుకు ప్రేమతో చెప్పాడు.

152.221 ఉ. వారలు రామలక్ష్మణులు, వచ్చిరి, సూర్యజ! మైత్రిఁ సేయ, కం
జారకులావతంసమును సాకఁ దగున్ నృపతుల్, నరేశ్వరా!
వారల సాయముం గొనుచు వాలినిఁ జంపుము, సీత జాడకై
వారికి సాయ మిమ్మనుచు వాయుసుతుండనె, మేలుగోరుచున్.

(సూర్యజ = సూర్యపుత్రుడైన సుగ్రీవా, కంజార = సూర్యుడు, సాకు = పోషించు, వాయుసుతుడు = హనుమంతుడు)

ఓ, సుగ్రీవా! వాళ్ళు రామలక్ష్మణులు, స్నేహం చేయడానికి వచ్చారు, సూర్యవంశ శ్రేష్ఠుని పోషించడం రాజులకి తగిన పనే రాజా! వారి సాయంతో వాలిని చంపుము, సీత జాడ కోసం వారికి సాయం అందించుము అని మేలు కోరుతూ హనుమంతుడు అన్నాడు.

153. సమస్య: జారుల గాంచి వందనము సల్పిరి భక్తులు ముక్తి కాంతకై

153.222 ఉ. మారిన కాల మందు పలు మార్పులు వచ్చిన నేమి? మూలముల్
మారునె? దైవభక్తిని సమాజము పోనిడునే? సనాతనా
చారము లందు నమ్మకము సమ్మతి నిండుగ నుండెఁ గాన, పూ
జారులఁ గాంచి వందనము సల్పిరి భక్తులు ముక్తి కాంతకై.

(పలు = అనేక, మూలము = ఆధారము, పోనిడు = త్యజించు, సనాతన = ప్రాచీనము, ఆచారము = పరంపరగా వచ్చు వాడుక, సమ్మతి = అంగీకారము, నిండు = పరిపూర్ణము, పూజారి = అర్చకుడు, కాంచు = చూచు, వందనము = నమస్కారము, చల్పు = చేయు, ముక్తి = మోక్షము, కాంత = స్త్రీ)

మారిన కాలంలో అనేకమైన మార్పులు వస్తేనేం, మూలాలు మారతాయా? దైవభక్తిని సమాజం వదులుకుంటుందా? పూర్వాచారాల్లో నమ్మకము, అంగీకారము ఉన్నాయి కాబట్టే భక్తులు అర్చకులను చూసి మోక్షకాంత కోసం నమస్కారం చేశారు.

154. సమస్య: జారుల నిత్యకృత్యములు సజ్జనమోదముఁ గూర్చకుండునే

154.223 ఉ. ఓరిమి నన్ని వాడలకు నొంటరిగా నడయాడి వార్తలన్
దీరుగ సేకరించుచు నధీశ్వరుకున్ దలలోని నాల్కలై
చేరువనుండిఁ బాపుదురు చింతలు, యట్టివి దేశభక్తితోఁ
జారుల నిత్యకృత్యములు, సజ్జనమోదముఁ గూర్చకుండునే.

(ఓరిమి = ఓర్పు, వాడ = వీథి, ఒంటరిగా = ఏకాకిగా, నడయాడు = సంచరించు, వార్త = సమాచారము, తీరుగ = సరిగా, అధీశ్వరుడు = రాజు, తలలోని నాల్కలు = ముఖ్యమైన వారు, చేరువ = సమీపము, పాపు = తీసివేయు, చింత = మనోవ్యధ, చారుడు = వేగువాడు, నిత్యకృత్యములు = రోజూ చేసే పనులు, సజ్జన = మంచివారి, మోదము = సంతోషము, కూర్చు = కూడబెట్టు)

ఓర్పుతో అన్ని వీథులలోను ఒంటరిగా సంచరించి సమాచారాలను సరిగా సేకరించి రాజుకు ముఖ్యమైన వాళ్ళుగా దగ్గరే ఉండి చింతలు లేకుండా చేస్తారు. అటువంటివి దేశభక్తితో వేగువారు రోజూ చేసే పనులు. మంచివాళ్ళకు సంతోషం కలిగించకుండా ఉంటాయా?

155. సమస్య: జ్యోత్స్నల్ వీడెను చంద్రుడుద్ధతి గనన్ చోద్యంబిదే లోకమున్

మహా సహస్రావధాని శ్రీ గరికిపాటి నరసింహారావు గారు బందరులో చేసిన అష్టావధానంలో ఈ సమస్యని అద్భుతంగా పూరించారు. ఎలా అంటే: సత్స్నిగ్ధంబగు క్షీర సాగరమునన్ జన్మించి యా ముగ్ధతా, కృత్స్నోద్భూత ధనాంగి చేకొనెను లోకేశున్ సుధామూర్తి తో, యొ త్స్నిగ్ధంబుగ గడ్డమందునిచె సూర్యోత్సేకతన్ బెల్లమున్, జ్యోత్స్నల్ వీడెను చంద్రుడుద్ధతి గనన్ చోద్యంబిదే లోకమున్. నా పూరణలు క్రింద ఇవ్వబడ్డాయి.

155.224 శా. సత్స్నిగ్ధుండగు ధర్మరాజు ననఘున్ సన్మార్గినిన్ గట్టగా,
మృత్స్నా కుంభజు డల్లు వ్యూహమున, నిర్జీవుం డయెన్ చంద్రమా
కృత్స్నోద్భూతుడు పార్థు పుత్రుడు, జనుల్ గీర్తింప, మాయం బయెన్
జ్యోత్స్నల్, వీడెను చంద్రు డుద్ధతిఁ, గనన్ చోద్యం బిదే లోకమున్.

(సత్ = నిజమైన, స్నిగ్ధుడు = ఆప్తుడు, అనఘు = పాపరహితుడు, సన్మార్గి = సత్ప్రవర్తకుడు, కట్టు = బంధించు, మృత్స్న = మంచిమన్ను, కుంభజుడు = కండలో పుట్టినవాడు, అల్లు = రచించు, వ్యూహము = సైన్యరచన లేక మొగ్గరము, నిర్జీవుడు = జీవములేనివాడు, చంద్రమాకృత్స్న = సంపూర్ణ చంద్రాంశతో, ఉద్భూతుడు = పుట్టినవాడు, పార్థు పుత్రుడు = అర్జునుని పుత్రుడైన అభిమన్యుడు, జ్యోత్స్న = వెన్నెల, ఉద్ధతి = పైకెగయుట, చోద్యము = ఆశ్చర్యము)

తనకి నిజంగా ఆప్తుడు, పాపరహితుడు, సత్ప్రవర్తకుడు అయిన ధర్మరాజును బంధించుటకు మట్టికుండలో పుట్టిన వాడైన ద్రోణాచార్యుడు రచించిన వ్యూహంలో (పద్మవ్యూహంలో) సంపూర్ణ చంద్రాంశలో పుట్టిన అభిమన్యుడు జనులు కీర్తింపగా మరణించాడు. వెన్నెలలు మాయమయ్యాయి. చంద్రుడు అస్తమించాడు. లోకంలో చూడడానికి ఇదే వింత.

155.225 శా. మృత్స్నాంబున్ యొక బండిఁ జేసిఁ జను సన్మిత్రుండు, వధ్యస్థలిన్
సత్స్నిగ్ధంబుగ శిక్షకై నిలువ, నాశన్ చారుదత్తున్ రహీ
కృత్స్నోద్భూత వసంతసేన కనియెన్, కీడ్పాటు తోడన్ విడెన్
జ్యోత్స్నల్, వీడెను చంద్రు డుద్ధతిఁ, గనన్ చోద్యం బిదే లోకమున్.

(మృత్స్నాంబున్ = మంచిమట్టిని, చను = తిరుగు, సన్మిత్రుండు = మంచి స్నేహితుడు, వధ్యస్థలిన్ = మరణశిక్ష విధింపబడిన వారి తలనరుకు చోటున, సత్ = నిజమైన, స్నిగ్ధంబుగ = శోభతో, శిక్ష = దండనము, ఆశన్ = ఆశతో, రహీకృత్స్న = సంపూర్ణ ప్రేమమూర్తిగా, ఉద్భూత = పుట్టినదైన, కనియెన్ = చూచెను, కీడ్పాటు = అపకారము, విడెన్ = విడిపోయెను, జ్యోత్స్న = వెన్నెల, ఉద్ధతి = పైకెగయుట, చోద్యము = ఆశ్చర్యము)

మట్టిబండి మీద తిరిగే మంచి మిత్రుడు, వధ్యస్థలంలో శిక్ష కోసం నిజమైన శోభతో నిలిచే చారుదత్తుని సంపూర్ణ ప్రేమమూర్తిగా ఉదయించిన వసంతసేన ఆశతో చూసింది. కీడ్పాటు తోడవ్వగా, వెన్నెలలు మాయమయ్యాయి. చంద్రుడు అస్తమించాడు. లోకంలో చూడడానికి ఇదే వింత.

155.226 శా. సత్స్నిగ్ధంబుగ రోహిణిన్ విడువకన్, సంపర్కముల్ నిర్దయా

కృత్స్నుండై శశిఁ ద్రుంచె, నా సుతల వీక్షింపంగ రాడంచు, తో
యోత్స్నిగ్ధంబుగ శాప మివ్వగనె, దక్షోగ్రుండు, మాయం బయెన్
జ్యోత్స్నల్, వీడెను చంద్రు డుద్ధతిఁ, గనన్ చోద్యం బిదే లోకమున్.

(సత్ = నిజమైన, స్నిగ్ధంబుగ = స్నేహముతో, సంపర్కము = సంభోగము, నిర్దయాకృత్స్నుండై = నిర్దయతో నిండినవాడై, శశి = చంద్రుడు, త్రుంచె = విరిచి వేసెను, తోయోత్స్నిగ్ధంబుగ = పానీయ సమేతంగా, దక్షోగ్రుండు = ఉగ్రుడైన దక్షుడు, జ్యోత్స్న = వెన్నెల, ఉద్ధతి = పైకెగయుట, చోద్యము = ఆశ్చర్యము)

అశ్వని, భరణి మొదలైన 27 నక్షత్ర బాలలు దక్షుని దత్తపుత్రికలు. వారిని చంద్రుడి కిచ్చి వివాహం చేస్తాడు. మిగిలిన నక్షత్రకాంతలను ఆదరించక చంద్రుడు రోహిణీలోలుడై కాలం గడపటంతో తమకు అన్యాయం జరిగిందని వారంతా దక్షునికి చెబుతారు. దానికి కోపోద్రిక్తుడైన దక్షుడు చంద్రుని క్షయ గ్రస్తుడు కమ్మని శాపం ఇస్తాడు. నిజమైన స్నేహముతో రోహిణిని విడవకుండా, నిర్దయతో నిండినవాడై నా కూతుళ్ళతో చేరికను చంద్రుడు త్రుంచేశాడని దక్షుడు ఉగ్రుడై నీళ్ళు తీసుకుని చంద్రుణ్ణి శపించగానే, వెన్నెలలు మాయమయ్యాయి. చంద్రుడు అస్తమించాడు. లోకంలో చూడడానికి ఇదే వింత.

156. సమస్య: జ్యోత్స్నాలేప మమాసరేయి కొదవెన్ చోద్యంబు నల్మూలలన్

156.227 శా. సత్స్నిగ్ధుండగు చక్రి యర్జుననికిన్ సారథ్యమున్ జేయగా
కృత్స్నంబై తిమిరమ్ము గ్రమ్మె ననిలో గిట్టింపగా సైంధవున్
తత్స్నేహంబున క్రీడి చిత్త మిటులన్ తర్కించె భావోన్నతిన్
జ్యోత్స్నాలేప మమాసరేయి కొదవెన్ చోద్యంబు నల్మూలలన్

(సత్ = యథార్థమైన, స్నిగ్ధుడు = స్నేహితుడు, చక్రి = కృష్ణుడు, కృత్స్నము = అంతయు, తిమిరము = చీకటి, క్రమ్ము = వ్యాపించు, అని = యుద్ధము, గిట్టించు = చంపు, తత్ = ఆ, స్నేహము = చెలిమి, క్రీడి = అర్జునుడు, చిత్తము = మనస్సు, ఇటుల = ఈ విధంగా, తర్కించు = ఆలోచించు, భావోన్నతి = భావము యొక్క పరిపూర్ణత్వము, జ్యోత్స్న = వెన్నెల, ఆలేపము = పూత, అమాస = అమావాస్య, రేయి = రాత్రి, ఒదవు = సమకూరు, చోద్యము = ఆశ్చర్యము, నల్మూలలు = నాలుగు మూలలు)

సన్మిత్రుడైన కృష్ణుడు అర్జుననికి సారథ్యం చేయగా సైంధవుణ్ణి చంపడానికి అంతటా చీకటి వ్యాపించింది. ఆ మిత్రత్వము వలన అర్జునుని మనస్సు భావము యొక్క పరిపూర్ణత్వముతో ఈ విధంగా ఆలోచించింది, "నాలుగు దిక్కులందు ఆశ్చర్యము కలిగించేటట్లుగా అమావాస్య రాత్రికి వెన్నెల పూత సమకూరింది".

157.   సమస్య: ఝుల్కరిబాయి వైరులను ఝంఝుగ దాకె పరాక్రమంబుగన్

157.228   ఉ. పుల్కసజాతి రత్నము యపూర్వ స్వతంత్ర సమీక మందునన్
గల్కికి మారు రూపముగఁ గ్రన్నన రాణికి రక్ష నివ్వగా
కల్కముఁ జేసి యాంగ్ల బలగాలకుఁ జూపడి ఝాన్సిరాణిగా,
ఝుల్కరిబాయి వైరులను ఝంఝుగఁ దాకె పరాక్రమంబుగన్.

(పుల్కస = దళిత, అపూర్వ = ఇంతకుమునుపు లేనిది, సమీకము = యుద్ధము, కల్కి = కలికి అవతారము, మారు = ప్రతి, క్రన్నన = శీఘ్రముగా, రక్ష = రక్షణము, కల్కము = కపటము, బలగము = సైన్యము, చూపడు = కనిపించు, వైరి = శత్రువు, ఝంఝు = తుపాను, తాకు = ఎదుర్కొను, పరాక్రమము = శౌర్యము)

దళితజాతి రత్నము, ప్రథమ స్వతంత్ర సంగ్రామములో కలికికి ప్రతిరూపంగా, శీఘ్రంగా తన రాణికి రక్షణ ఇవ్వడానికి మోసము చేసి తానే ఆంగ్ల సైన్యాలకు ఝాన్సిరాణిగా కనపడి, ఝుల్కరిబాయి శత్రువులను శౌర్యంతో తుపాను లాగా ఎదుర్కొంది.

157.229   ఉ. పల్కున రూపమందుఁ గనుపట్టుచు లక్ష్మిగ ఝాన్సిరాణిగా,
చిల్కుచు పౌరుషంబు తమ సేనల యందున ముఖ్యరాలిగా,
ఝుల్కరిబాయి వైరులను ఝంఝుగఁ దాకె పరాక్రమంబుగన్,
పల్క చరిత్రలో తిరుగుబాటు సిపాయిల దాంగ్ల శిష్టిపై.

(పల్కు = మాట, చిల్కు = ఆవేశించు, పౌరుషము = పరాక్రమము, ముఖ్యరాలు = నాయకురాలు, వైరి = శత్రువు, ఝంఝు = తుపాను, తాకు = ఎదుర్కొను, పరాక్రమము = శౌర్యము, శిష్టి = పాలన)

చరిత్ర ఆంగ్లపాలనపై సిపాయిల తిరుగుబాటు అని పలికే విధంగా, మాటలోను రూపంలోను లక్ష్మిగా ఝాన్సిరాణిగా కనబడుతూ, నాయకురాలిగా తమ సైన్యంలో పౌరుషాన్ని చిలుకుతూ, ఝుల్కరిబాయి శత్రువులను శౌర్యంతో తుపాను లాగా ఎదుర్కొంది.

158.   సమస్య: టీవీ లుండెను చూచి మెచ్చ మునివాటిన్ పూర్వకాలంబునన్

158.230   శా. చేవన్ నేటి సమాజమందు నెమకన్ చేవాడికాళ్ళన్ నిఘా
టీవీ లుండెను, చూచి మెచ్చ మునివాటిన్ పూర్వకాలంబునన్

యీ వింతల్ గనరావు, ప్రుచ్చిల యటస్ యే సంపదల్ లేవుగా,
హేవాకమ్మును భక్తి సంయతులకే యెల్లప్పుడుస్ నిల్పగస్.

(చేవ = ధైర్యము, నెమకు = అన్వేషించు, చేవాడికాడు = దొంగ, నిఘా = రహస్యముగా గమనించు, మునివాటి = ముని ఆశ్రమము, ప్రుచ్చిలి = దొంగతనము, అట = అక్కడ, హేవాకము = నేర్పు, సంయతి = తపస్సు, నిల్పు = నిలుపునది)

ధైర్యముతో దొంగలని అన్వేషించడానికి ఈ నాటి సమాజంలో నిఘా టీవీలు ఉన్నాయి. పూర్వకాలంలో ముని ఆశ్రమంలో, చూసి మెచ్చుకోవడానికి ఇలాంటి వింతలు కనపడవు. నేర్పుని భక్తి తపస్సుల కోసమే నిత్యమూ నిలపడం చేత, దొంగతనానికి అక్కడ ఏ రకమైన సంపదలూ లేవుగా.

159. సమస్య: తండ్రీ రమ్మని ప్రాణనాథు పిలిచెస్ తన్వంగి మోహాంధయై

159.231 శా. మండ్రాటమ్మున లక్ష్మి పద్మయును సంవాదమ్ములస్ యొండొరుల్
యొండ్రించస్, పతి వేంకటేశ్వరుడు సంయోగమ్ము సాధించగస్
బండ్రాయై రమ నూరడించగనె, సంభావించి లోకాలకుస్
తండ్రీ! రమ్మని ప్రాణనాథు పిలిచెస్ తన్వంగి మోహాంధయై.

(మండ్రాటము = సంతాపము, సంవాదము = కలహము, ఒండొరులు = పరస్పరం, ఓండ్రించు = అగౌరవపరుచు, పతి = భర్త, సంయోగము = కలయిక, సాధించు = నెరవేర్చు, బండ్రాయి = బండ రాయి, రమ = లక్ష్మి, ఊరడించు = సముదాయించు, సంభావించు = ఆదరించు, లోకాలు = సమస్త భువనములు, తండ్రి = భక్తి సూచించుటకు జనకుడు అనడం, ప్రాణనాథుడు = భర్త, తన్వంగి = స్త్రీ, మోహ = వలపు, అంధ = గ్రుడ్డిది)

సంతాపంతో లక్ష్మీదేవి పద్మావతీదేవి కలహాలతో పరస్పరం అగౌరవపరుచుకోగా, భర్తయైన వేంకటేశ్వరస్వామి వారి కలయిక సాధించడం కోసం శిలయై లక్ష్మీదేవిని సముదాయించగా, ఆమె ఆదరించి వలపుతో గ్రుడ్డిదై జగత్పితా! రమ్మని భర్తని పిలిచింది.

160. సమస్య: తండ్రులకు మ్రొక్కెను పతివ్రతా సుతుండు

160.232 తే.గీ. అనిని క్రీడిని మరపింతు నని పిన పెద
తండ్రులకు మ్రొక్కెను పతివ్రతా సుతుండు

వీరుడగు యభిమన్యుండు, వేగఁ జనుచు
తమ్మిమొగ్గరమున దూఱి తరుమ నరుల.

(అని = యుద్ధము, క్రీడి = అర్జునుడు, మరపించు = మరచునట్లు చేయు, పిన = చిన్న, పెదతండ్రి = పెదనాయన, మ్రొక్కు = నమస్కరించు, పతివ్రత = పతిభక్తిగల యిల్లాలు, సుతుడు = కుమారుడు, వేగ = త్వరగా, చను = వెళ్ళు, తమ్మిమొగ్గరము = పద్మవ్యూహము, దూఱు = ప్రవేశించు, తరుము = వెంబడించి పరుగెత్తించు, అరి = శత్రువు)

యుద్ధంలో అర్జునుణ్ణి మరపిస్తానని పతివ్రతా పుత్రుడు, వీరుడు ఐన అభిమన్యుడు పద్మవ్యూహములో ప్రవేశించి శత్రువులని తరమడానికి త్వరగా వెళుతూ పెదతండ్రులకి బాబాయిలకి నమస్కరించాడు.

161. సమస్య: తగవుల్ పెట్టుకొనంగ రాదెపుడు వ్యర్థంబౌ నుడుల్ పల్కుచున్

161.233 మ. భగవంతుండని యగ్రపూజ సలుపన్ వారించు చేదీశుకున్
తెగె చూడాలము రాజసూయ సభలో, దృష్టించు దుర్యోధనా!
తగవుల్ పెట్టుకొనంగ రాదెపుడు వ్యర్థంబౌ నుడుల్ బల్కుచున్,
పగవారిన్ గెలువంగ యీ శకునికిన్ పాళుండగా యంచనెన్.

(అగ్రపూజ = మొదటి సత్కారము, సలుపు = చేయు, వారించు = ఆటంకపఱచు, చేదీశుడు = చేది రాజైన శిశుపాలుడు, తెగు = ఖండితమగు, చూడాలము = తల, దృష్టించు = చూచు, తగవు = కలహము, వ్యర్థము = ప్రయోజనములేనిది, నుడి = మాట, పగవారు = శత్రువులు, పాళి = జూదము)

రాజసూయ సభలో భగవంతుడని శ్రీకృష్ణునికి అగ్రపూజ చేస్తుంటే ఆటంకపఱచిన చేదిరాజైన శిశుపాలునికి తల తెగింది. చూడు, దుర్యోధనా! శత్రువులను జయించడానికి ఈ శకునికి జూదం ఉండగా, పనికిరాని మాటలు మాట్లాడి తగవులు పెట్టుకోకూడదు (శిశుపాలుడి లాగా), అని అన్నాడు.

162. సమస్య: తద్ధిత ప్రాయోగ రీతి తాండవ శివమే

162.234 కం. ఉద్ధతిని దశగ్రీవుడు
క్రుద్ధుండై రుద్రవీణ మ్రోగింపంగా,
సిద్ధిదు డగుపడి సలిపెను

తద్ధిత ప్రాయోగ రీతి తాండవ శివమే.

(ఉద్ధతి = గర్వము, దశగ్రీవుడు = రావణుడు, క్రుద్ధుడు = కోపము నొందినవాడు, మ్రోగించు = వాదనముచేయు, సిద్ధిదుడు = శివుడు, అగుపడు = కనబడు, సలుపు = చేయు, తద్ధిత ప్రాయోగ రీతి = వానికి హితకరమైన ప్రయోగ విధానమున, తాండవము = ఉద్ధతమైన నృత్యము, శివము = ఆవేశము)

గర్వంతో రావణుడు కోపంతో రుద్రవీణావాదనం చేయగా, శివుడు ప్రత్యక్షమై వానికి హితకరమైన ప్రయోగ విధానమున ఆవేశపూరితంగా ఉద్ధతమైన నృత్యము చేశాడు.

163. సమస్య: తన ప్రాణమ్ముల్గొన్న బిడ్డకు నిజస్తన్యం బిడెన్ తల్లియున్

163.235 మ. చనుబాలివ్వగ వచ్చి కృష్ణునకు యోషారత్న రూపంబునన్
చనులన్ బూసి విషంబు, నందు నిలు యా చంద్రాస్యుఁ జూడన్ యశో
దను మాటల్ వినకుండ, బాలు కిడ తా స్తన్యంబు రాకాసి పూ
తన, ప్రాణమ్ములుఁ గొన్న బిడ్డకు నిజస్తన్యం బిడెన్ తల్లియున్.

(యోష = వనిత, రాకాసి = రాక్షసి)

ఒక ఉత్తమజాతి యువతి రూపంలో కృష్ణుడికి చనుబాలు ఇవ్వడానికి చనులకు విషం పూసుకుని నందుని ఇంటిలో ఆ చంద్రబింబం వంటి ముఖము ఉన్న బాలుని చూసి యశోద మాటలు పట్టించుకోకుండా తాను బాలునికి చన్ను కుడపగా, ఆ రాక్షసి పూతన ప్రాణాలు తీసిన బిడ్డడైన కృష్ణునికి యశోదా మాత తన స్తన్యాన్ని ఇచ్చింది.

164. సమస్య: తనను తన్నగ తత్త్వబోధను తాల్మి నిచ్చె దయాళువై

164.236 తరలము. అనిని భీముడు యూరుభంగము నాచరించి శిరంబునన్
తననుఁ దన్నగ, తత్త్వబోధను తాల్మి నిచ్చె దయాళువై
యనుచు కృష్ణు నుతించు ధర్మజు యాదతో నిరసించుచున్,
దనువు డస్సిన రాజరాజుకు, దర్పమే యడుగంటెగా.

(అని = యుద్ధము, ఊరుభంగము = తొడలు విరగగొట్టుట, ఆచరించు = చేయు, శిరము = తల, తాల్మి = ధైర్యము, దయాళువు = కనికరము గలవాడు, నుతించు = స్తోత్రము చేయు, ఆద = విచారము, నిరసించు = నిరాదరించు, తనువు = దేహము, డయ్యు = బలహీనమగు, రాజరాజు = దుర్యోధనుడు, దర్పము = గర్వము, అడుగంటు = క్షీణించు)

యుద్ధంలో భీముడు తొడలు విరగగొట్టడం చేసి తలపై తనని తన్నగా, తత్వబోధను, ధైర్యాన్ని ఇచ్చాడని కృష్ణుణ్ణి స్తోత్రం చేసే ధర్మరాజుని విచారంతో నిరాదరిస్తూ శరీరం బలహీనమైన దుర్యోధనుడికి గర్వమే అడుగంటి పోయిందిగా.

164.237 తరలము. ఘనుడు విశ్వము నందెవండను కచ్చకాళ్ళకుఁ జూపగన్,
సనతు శంభులు కారటంచని చక్రినే పరికించగన్
కునుపుతో భృగుమౌని తన్నగ క్రోడ మందున, విష్ణువే
తనను తన్నగ తత్త్వబోధను తాల్మి నిచ్చె దయాళువై.

(ఘనుడు = గొప్పవాడు, విశ్వము = లోకము, ఎవండు = ఎవ్వడు, కచ్చకాడు = ముని, సనతుడు = బ్రహ్మ, శంభుడు = శివుడు, చక్రి = విష్ణువు, పరికించు = పరీక్షించు, కునుపు = కోపము, మౌని = ముని, క్రోడము = వక్షము, తాల్మి = ఓర్పు, దయాళువు = కనికరముగలవాడు)

జగత్తులో గొప్పవా డెవ్వడనే మునులకు చూపించడానికి, బ్రహ్మ శివుడూ కారంటూ విష్ణువునే పరీక్షించడం కోసం కోపముతో భృగు మహాముని వక్షస్థలంలో తన్నగా, విష్ణువే తనని తన్నగానే కరుణ కలవాడై తత్వబోధను, ఓర్పును ఇచ్చాడు.

164.238 తరలము. కినుకతో భృగుమౌని చేష్టకు క్లేశ మందని విష్ణువే
తనను తన్నగ తత్త్వబోధను తాల్మి నిచ్చె దయాళువై
యను మనోవ్యథ వేఱుపుచ్చెను యబ్ధిజన్ ఋతదాముకున్
వినుతి వేంకటనాథుగన్ యలివేలుమంగగఁ జేయగన్.

(కినుక = కోపము, మౌని = ముని, క్లేశము = బాధ, తాల్మి = ఓర్పు, దయాళువు = కనికరముగలవాడు, మనోవ్యథ = దుఃఖము, వేఱుపుచ్చు = వేఱుపడ జేయు, అబ్ధిజ = లక్ష్మీదేవి, ఋతదాముడు = విష్ణువు, వినుతి = స్తోత్రము)

కోపముతో భృగు మహాముని చేష్టకు బాధపడని విష్ణుమూర్తే, తనని తన్నగానే కరుణ కలవాడై తత్వబోధను, ఓర్పును ఇచ్చాడనే దుఃఖము వేంకటేశ్వరుడి గానూ, అలివేలుమంగ గానూ స్తోత్రము చేయడం కోసం లక్ష్మీదేవిని విష్ణువు నుండి వేరుచేసింది.

165. సమస్య: తనయను పరిమార్చి జనుల దైవం బయ్యెస్

165.239 కం. వనిలో తాపసులను జీ
వనమును యాటంక పఱుప, భరతాగ్రజు డా
వనితను, యక్షు సుకేతుని
తనయను, పరిమార్చి జనుల దైవం బయ్యెస్.

(వని = అడవి, తాపసి = ముని, ఆటంకపఱచు = నిరోధించు, భరతాగ్రజుడు = భరతుని అన్నయైన శ్రీరాముడు, యక్షు సుకేతుని తనయ = సుకేతుడను యక్షుని కూతురైన తాటక అను రాక్షసి, పరిమార్చు = చంపు)

అడవిలో మునులను, జీవనాన్ని ఆటకపఱచడం చేత శ్రీరాముడు ఆ తాటకి అను స్త్రీని చంపి ప్రజలకు దేవుడయ్యాడు.

166. సమస్య: తనయుని తల నరికినట్టి తల్లికి జేజే

166.240 కం. వనితారత్నము సత్యయె
రణరంగము నందు కృష్ణు రథమున తోడై
తునిమెస్ నరకుని, ధరణీ
తనయుని తల నరికినట్టి తల్లికి జేజే

(తునుము = ఖండించు, జేజే = నమస్కారము)

స్త్రీరత్నమైన సత్యభామ యుద్ధరంగంలో కృష్ణుని రథము మీద తోడుగా ఉండి నరకాసురుణ్ణి చంపింది. భూదేవి కుమారుని తల ఖండించి నట్టి ఆ తల్లికి నమస్కారము.

167.   సమస్య: తన్నిరి ప్రాశ్నికుల్ శతవధానిని వేదిక మీఁదఁ జూచితే

167.241   ఉ. పిన్నలు పెద్దలుస్ బెదరి విహ్వాల మందెడు చిక్కు ప్రశ్నలస్
ఖిన్నము నొంద ధర్మజునిఁ గేరిన మాన్యుని యక్షునే తలస్
తన్నిరి ప్రాశ్నికుల్, శతవధానిని వేదిక మీఁదఁ జూచితే?
తిన్నగ నుత్తరంబులు యుధిష్ఠిరు మాదిరి యిచ్చుచుండగస్.

(పిన్నలు = చిన్నవాళ్ళు, బెదరు = భయపడు, విహ్వాలము = తికమక, చిక్కు = కష్టమైన, ఖిన్నము = దుఃఖము, ఒందు = కలుగు, కేరు = పరిహసించు, మాన్యుడు = పూజ్యుడు, తలస్ తన్ను = మీఋ, ప్రాశ్నికుడు = ప్రశ్నవేయువాడు, శతవధాని = ఒకే సమయమున నూఱంశములను గూర్చి కవితలో చెప్పి ధారణ చేయగల కవి, తిన్నగ = సూటిగా, ఉత్తరము = జవాబు, యుధిష్ఠిరుడు = ధర్మరాజు, మాదిరి = పోలికగా)

చిన్నవాళ్ళు పెద్దవాళ్ళు భయపడి తికమక అయ్యే కష్టమైన ప్రశ్నలతో దుఃఖము కలిగేటట్లుగా ధర్మరాజుని పరిహసించిన పూజ్యుడైన యక్షుణ్ణే తలదన్నారు పృచ్ఛకులు. సూటిగా జవాబులు ధర్మరాజు మాదిరిగా చెప్తుండగా శతావధానిని వేదిక మీద చూశావా?

168.   సమస్య: తపనున కారీతి గ్రీష్మతాపము తీరెస్

168.242   కం. కుపితుని శాపముఁ దప్పెను
తపనున కా రీతి, గ్రీష్మతాపముఁ దీరెస్
తపసి జమదగ్ని కాతడు
యుపకృతిగా నాతపత్ర ముద్దా లొసగస్.

(కుపితుడు = కోపించినవాడు, తపనుడు = సూర్యుడు, రీతి = విధము, గ్రీష్మ = వేసంగి, తాపము = బాధ, తీరు = తొలగు, తపసి = ముని, ఉపకృతి = ఉపకారము, ఆతపత్రము = గొడుగు, ఉద్దాలు = చెప్పులు, ఒసగు = ఇచ్చు)

మునియైన జమదగ్నికి తాను ఉపకారముగా గొడుగు, చెప్పులు ఇవ్వడం వలన వేసవి బాధ తొలగి, సూర్యుడికి కోపించిన వాని శాపము ఆ విధంగా తప్పింది.

168.243   కం. స్తపమున యాపగలను రత

నపు గనులను నిర్ఝరముల నానా స్థలులన్
క్షప మింకించి హరింపగ
తపనున కా రీతి గ్రీష్మతాపము‌ఁ దీరెన్.

(స్తపము = గ్రీష్మఋతువు, ఆపగ = నది, రతనపుగని = సముద్రము, నిర్ఝరము = సెలయేఱు, నానా = వివిధమైన, స్థలి = ప్రదేశము, క్షపము = జలము, ఇంకించు = ఇగిరిపోవునట్లు చేయు, హరించు = దొంగిలించు, తపనుడు = సూర్యుడు, రీతి = విధము, గ్రీష్మ = వేసంగి, తాపము = బాధ, తీరు = తొలగు)

గ్రీష్మఋతువులో నదులలోను, సముద్రాలలోను, సెలయేళ్ళలోను, వివిధమైన ప్రదేశాలలోను నీళ్ళు ఇంకింప జేసి హరించడం వల్ల సూర్యునికి ఆ విధంగా వేసవి బాధ తప్పింది.

169. సమస్య: తమ్ముల కూల్చు చుండు గద ధార్మికు డెప్పుడు సంతసంబునన్

169.244 ఉ. ఇమ్ముగ మంచి కార్యముల నేతరి చూచిన యంత పక్షపా
తమ్ముల కూల్చుచుండుఁ గద, ధార్మికు డెప్పుడు సంతసంబునన్
సమ్మతి కూడగట్టి జనసార్థకమౌ పనులన్ యొనర్చుచున్,
యుమ్మలికమ్ములన్ యుడుపు నోర్పుగ, నెల్లరు ప్రస్తుతించగన్.

(ఇమ్ముగ = కుదురుగా, కార్యము = పని, ఏతరి = దుర్జనుడు, పక్షపాతము = ఏకపక్షము, కూల్చు = భగ్నమొనర్చు, ధార్మికుడు = పుణ్యాత్ముడు, సంతసము = సంతోషము, సమ్మతి = అంగీకారము, కూడగట్టు = సేకరించు, సార్థకము = ప్రయోజనపడునది, ఒనర్చు = చేయు, ఉమ్మలికము = కష్టము, ఉడుపు = పోగొట్టు, ఓర్పు = సహనము, ఎల్లరు = అందఱు, ప్రస్తుతించు = పొగడు)

సౌకర్యంగా మంచి పనులని దుర్జనుడు చూస్తే పక్షపాతాలతో భగ్నం చేస్తూ ఉంటాడు కదా. పుణ్యాత్ముడు ఎప్పుడూ సంతోషంగా అంగీకారం కూడగట్టి ప్రజోపయోగమైన పనులను చేస్తూ, అందరూ మెచ్చుకోగా, సహనంతో కష్టాలు పోగొడతాడు.

169.245 ఉ. వమ్మవ రాయబార మిట వాయుసుతుండు రణాన నిన్ను నీ
తమ్ముల కూల్చుచుండుఁ గద, ధార్మికు డెప్పుడు సంతసంబునన్
యిమ్మహి శాంతి నిల్ప తన యిచ్చనుఁ జూపును రాజరాజ! తం
త్రమ్ములు మాను మంచు గిరిధారి యనెన్, ధృతరాష్ట్రు ముంగటన్.

(వమ్మ = వ్యర్థము, రాయబారము = సంధికార్యము, ఇట = ఇక్కడ, వాయుసుతుడు = భీముడు, రణము = యుద్ధము, తమ్ముడు = వెనుక పుట్టినవాడు, కూల్చు = అధోగతి నొందించు, ధార్మికుడు = పుణ్యాత్ముడు, సంతసము = సంతోషము, ఇమ్మహి = ఈ భూమి, నిల్పు = సుస్థిరము చేయు, ఇచ్ఛ = కోరిక, రాజరాజు = దుర్యోధనుడు, తంత్రము = ఉపాయము, మాను = విడుచు, గిరిధారి = శ్రీకృష్ణుడు, ముంగట = ఎదురుగా)

ఓ, దుర్యోధనా! ఇక్కడ సంధికార్యము విఫలం అవ్వగా, భీముడు యుద్ధంలో నిన్నూ నీ తమ్ముళ్ళనీ పడగొడతూ ఉంటాడు కదా. పుణ్యాత్ముడు ఎప్పుడూ సంతోషంగా ఈ భూమి మీద శాంతిని సుస్థిరం చెయ్యడానికి తన కోరికని చూపిస్తాడు. ఉపాయాలు విడిచిపెట్టు అని ధృతరాష్ట్రుని ఎదురుగా శ్రీకృష్ణుడు చెప్పాడు.

170. సమస్య: తల దన్నం జనునట్లు మించె నవినన్ తప్పేమి? యొప్పే యగున్

170.246 మ. నెలతన్ కృష్ణను వేశ్య యన్న ఖలునిన్ నీ శిష్యు దుర్యోధనున్,
కలహమ్మందున నూరుభంగమునఁ బోకార్చెన్ గదన్ భీముడే,
తల దన్నం జనునట్లు మించె నవినన్ తప్పేమి? యొప్పే యగున్,
బలరామా! యిక మిన్నకుండు మనుచున్ వార్ష్ణేయు డడ్డెన్ బొరిన్.

(నెలత = స్త్రీ, కృష్ణ = ద్రౌపది, ఖలుడు = నీచుడు, కలహము = యుద్ధము, ఊరుభంగము = తొడలు విరుగగొట్టుట, పోకార్చు = చంపు, తలదన్ను = తలమీద తన్ను, చను = వెళ్ళు, మించు = అతిశయించు, ఒప్పు = యుక్తము, మిన్నకుండు = విషయాన్ని పట్టించు కొనకపోవు, వార్ష్ణేయుడు = కృష్ణుడు, అడ్డు = నిరోధించు, పొరి = దృఢముగా)

స్త్రీయైన ద్రౌపదిని వేశ్య అని అన్న నీచుడైన నీ శిష్యుడు దుర్యోధనుణ్ణి యుద్ధంలో గదతో తొడలు విరుగగొట్టి భీముడే చంపాడు. తలమీద తన్నడానికి వెళ్ళుతున్నట్లుగా అతిశయించాడనడంలో తప్పేముంది, సరియైనదే కదా. ఓ, బలరామా! ఇక ఈ విషయాన్ని పట్టించుకోవద్దు అంటూ కృష్ణుడు దృఢంగా అడ్డుపడ్డాడు.

171. సమస్య: తల నరకుట తప్పు గాదు ధర్మంబె యగున్

171.247 కం. కొలనున జాగుకు గంధ
ర్వుల కేళి సతికి మిషయని రుచ్యుడు జమద
గ్ని లలి మరచి సుతుల కనెను
తల నరకుట తప్పు గాదు ధర్మంబె యగున్

(మిష = వంక, రుచ్యుడు = భర్త, లలి = ప్రేమ)

సరస్సు దగ్గర ఆలస్యానికి గంధర్వుల ఆట భార్యకి వంక అని భర్తయైన జమదగ్ని ప్రేమ మర్చిపోయి, తల నరకడం తప్పు కాదు, ధర్మమే అని తన పుత్రులతో అన్నాడు.

171.248 కం. జలమును త్రావగ బొండము
తల నరకుట తప్పుఁ గాదు, ధర్మంబె యగుస్,
వెల యిచ్చి నారికేళము
విలిచిన తరువాత యట్లు ప్రేయుటఁ జేయస్.

(బొండము = కొబ్బరి బొండము, విలుచు = కొను, ప్రేయు = నఱకు)

నీళ్ళు తాగడం కోసం కొబ్బరి బొండము తల నరకడం తప్పు కాదు. ధర ఇచ్చి కొబ్బరి బొండము కొన్న తర్వాత, అట్లా నరకడం ధర్మమే అవుతుంది.

171.249 కం. తలమీఱెను యాశ్రమవిధి
తలకిందుల తపముఁ జేసి, దండనగా కో
సలపతి వడి శంబూకుని
తల నరకుట తప్పుఁ గాదు ధర్మంబె యగుస్.

(తలమీఱు = అతిక్రమించు, ఆశ్రమవిధి = బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థ, సన్న్యాసులు ఆయా ఆశ్రమానికి ఆచరించవలసిన, విధించిన ధర్మములు, దండన = శిక్ష, కోసలపతి = కోసల దేశపు రాజైన శ్రీరాముడు, వడి = వేగంగా)

తలకిందులుగా తపస్సు జేసి తనకు విధించిన ఆశ్రమ ధర్మాలు అతిక్రమించినందుకు గాను దండనగా శ్రీరాముడు శంబూకుని తల నరకడం తప్పు కాదు, ధర్మమే అవుతుంది.

172. సమస్య: తల లోపల నున్న కల్లుఁ ద్రావి రనేకుల్

172.250 కం. పులకించిరి పావని పై
ధిలినిఁ గనుగొనెనని, ప్రూనుదిమ్మరు లెలమిస్

సలిపిరి వని ధ్వంసము చే
తల, లోపల నున్న కల్లుఁ ద్రావి రనేకుల్.

(పులకించు = గగుర్పొడుచు, పావని = హనుమంతుడు, మైథిలి = సీత, కనుగొను = అన్వేషణ ద్వారా తెలుసుకొను, వ్రానుదిమ్మరి = కోతి, ఎలమి = సంతోషము, వని = అడవి, ధ్వంసము = నాశము, చేతల = చేష్ఠలతో)

హనుమంతుడు సీత జాడ తెలుసుకున్నాడని పులకించిన వానరులు సంతోషంతో వనిని (మధువనిని) తమ చేష్ఠలతో ధ్వంసము చేశారు. చాలా మంది లోపల ఉన్న కల్లు త్రాగారు.

172.251 కం. జలధి కడ యాదవులు పిడ
తల లోపల నున్న కల్లుఁ ద్రావి, రనేకుల్
కలహించిరి, క్షయము సలుప
కులమును గాంధారిదేవిఁ గోరిన రీతిస్.

(జలధి = సముద్రము, కడ = సమీపము, పిడత = మిక్కిలి చిన్న కుండ, క్షయము = నాశనము)

సముద్రం దగ్గర యాదవులు పిడతలో ఉన్న కల్లు త్రాగారు. గాంధారీ దేవి అనుకున్న విధంగా కులనాశనము చేయడానికి అనేకులు పోట్లాడుకున్నారు.

173. సమస్య: తలమీదం గుసుమప్రసాద మలికస్థానంబుపై భూతియుస్ (ఈ పద్యపాదం ధూర్జటి కాళహస్తీశ్వర శతకం లోనిది. ఆయన వ్రాసిన అర్థంలో కాకుండా వేరే అర్థంలో పద్యం వ్రాయాలి.)

ధూర్జటి పద్యం:

మ. తలమీదం గుసుమప్రసాద మలికస్థానంబుపై భూతియుస్
గళసీమంబున దండ నాసికతుదస్ గంధప్రసారంబు లో
పల నైవేద్యము జేర్చునే మనుజు డా భక్తుండు నీకెప్పుడుం
జెలికాడై విహరించు రౌప్య గిరిపై శ్రీకాళహస్తీశ్వరా

(కుసుమప్రసాదము = నిర్మాల్యపుష్పము, అలికస్థానము = నుదురు, భూతి = విభూతి, గళసీమ = కంఠము, దండ = మాల (రుద్రాక్ష), నాసికతుద = ముక్కుకొన, గంధప్రసారంబు = పరిమళము ఆఘ్రాణించుట, నైవేద్యము = నీకు నివేదించిన ఆహారము, లోపల = కదుపు లోపల, చేర్చు = చేరునట్లు చేయునో, చెలికాడు = సహచరుడు, రౌప్యగిరి = వెండికొండ)

శ్రీ కాళహస్తీశ్వరా! ఎవరైతే ఎప్పుడూ నిన్ను పూజిస్తూ, నీ నిర్మాల్యాన్ని తలపై ధరిస్తూ, నుదుట విభూతితోనూ, మెడలో రుద్రాక్షలతోనూ, ముక్కొనపై సుగంధాలతోనూ, నైవేద్యాన్ని లోనికి తీసుకుంటాడో అతడిని కష్టాలు ఏమాత్రం అంటవు. అతడు వెండికొండ (కైలాసం)పై నీ సహచరుడిగా రాణించగలడు. నా పద్యం క్రింద ఇవ్వబడింది.

173.252 మ. తలమీదం గుసుమప్రసాద, మలికస్థానంబుపై భూతియుస్,
బలిమిస్ జూపెడి పాదఘట్టనలతో ధ్వానంబులుస్, మూపులస్
హలముల్, నందులు ముద్దుఁ గొల్పు, ముదితల్ హల్లీసకం బాడగస్,
పొలముల్ దున్నుచు నేరువాక జరుపస్, పుణ్యంబు గ్రామంబులస్.

(కుసుమప్రసాదము = నిర్మాల్యపుష్పము, అలికస్థానము = నుదురు, భూతి = విభూతి, ఘట్టన = దిమ్మిసువేయుట, ధ్వానము = ధ్వని, మూపు = భుజ శిరస్సు, హలము = నాగలి, నంది = ఎద్దు, ముదిత = స్త్రీ, హల్లీసకము = స్త్రీలు మండలాకారంగా తిరుగుతూ చేసే నృత్యము, ఏరువాక = జ్యేష్ఠ శుద్ధపూర్ణిమ నాడు దుక్కియొక్క ఆరంభముతో చేసే పండుగ)

శిరస్సు మీద అలంకారంగా దేవుడికి పూజ చేసిన పుష్పాలు, నుదుటను విభూతి, బలాన్ని ప్రదర్శించే పాదఘట్టనలతో రంకెలు, భుజాల మీద నాగళ్ళు, కలిగిన ఎద్దులు ముద్దు గొలుపుతుంటే, స్త్రీలు చుట్టూ తిరుగుతూ నాట్యం చేస్తూ ఉంటే, పొలాలు దున్నుతూ ఏరువాక పండుగ జరుపుకోవడం గ్రామాలలో పుణ్యంగా భావిస్తారు.

174. సమస్య: తల్లి పాలు విషము తరచి చూడ

174.253 ఆ.వె. శుభ్రతను మరచియు సుఖముల కాంక్షించి
తనువు నత్తరలను తడుపు సొగసు
గత్తె జననియైన, కలిగెడు శిశువుకు
తల్లి పాలు విషము తరచి చూడ.

శుభ్రంగా ఉండడం మర్చిపోయి, సుఖాలు కావాలనుకుని, ఒంటిని అత్తరులతో ముంచెత్తే సొగసుగత్తె తల్లి అయితే, పుట్టే బిడ్డకి తల్లిపాలు విషము అవుతాయి.

175. సమస్య: తల్లికి తిండి పెట్టుటయె దండుగ యంచనె నీతిశాస్త్రముల్

175.254 ఉ. తల్లయె కుంతి యంచు విని తత్తరగా తన గర్భపిండముస్
బిల్లలు చేసి కన్న తొలి బిడ్డ మిగుల్చును గర్భశోకముస్
తల్లికి, తిండి పెట్టుటయె దండుగ యంచనె నీతిశాస్త్రముల్
యెల్లిదు సాక, వీడ నిడె యెచ్చరముస్ విదురుండి టన్నకుస్.

(తత్తర = ఆందోళన, బిల్ల = ఖండము, తొలి = మొదటి, దండుగ = నష్టము, ఎల్లిదుడు = దుష్టుడు, సాకు = పెంచు, వీడు = వదలు, ఇడు = ఇచ్చు, ఎచ్చరము = హెచ్చరిక, ఇటు = ఈప్రకారము)

కుంతి తల్లి అయ్యింది అని విని ఆందోళనగా తన గర్భపిండాన్ని ముక్కలుగా చేసి కన్న మొదటి బిడ్డయైన దుర్యోధనుడు తల్లియైన గాంధారికి గర్భశోకాన్ని మిగులుస్తాడు. దుష్టుణ్ణి పెంచడానికి తిండి పెట్టడమే దండుగ అని నీతిశాస్త్రాలు చెప్పాయి. వదిలి పెట్టమని విదురుడు ఈ విధంగా అన్నయైన ధృతరాష్ట్రునికి హెచ్చరిక ఇచ్చాడు.

176. సమస్య: తల్లికి మూడు మాసములు తత్తను సంభవ కారుమాసముల్

176.255 ఉ. పిల్లల సంఖ్యపై యదుపు, పెంచగ లేమను చింత లేశముస్
యిల్ల గతంబునస్, యటుల యెల్లరు యుండెడి కాల మందునస్
తల్లికి మూడు మాసములు తత్తను సంభవ కారుమాసముల్
కల్లను మాట వింటయును, కాదని యంటయు, లేనె లేవులే.

(అదుపు = హద్దు, పెంచు = పోషించు, చింత = వగపు, లేశము = కొంచెము, ఇల్ల = లేదు, గతము = లోగడ, అటుల = ఆ విధంగా, ఎల్లరు = అందరు, తత్తను సంభవ = ఆమె కూతురు, కల్ల = అసత్యము, వింట = వినుట, అంట = అనుట)

పిల్లల సంఖ్య మీద ఏ రకమైన హద్దు, పోషించలేమని కొంచెము కూడా బెంగ మునుపు లేవు. అలా అందరు ఉండే కాలంలో, తల్లికి మూడు నెలలు ఆమె కూతురికి ఆరు నెలలు అన్నది అసత్యము అన్న మాట వినడం కాని, కాదు అని అనడం కాని, లేనే లేవుగా.

177. సమస్య: తల్లికి సాటి లేదు కద తల్లడిలంగను లోక రక్షణన్

177.256 ఉ. తొల్లి జనించి హాహలము తోయధిఁ జిల్కగ దేవదానవుల్
యెల్లెడ వ్యాప్తిఁ జెందె నని యెంతయొ కుందిన మాతఁ, గ్రక్కునన్
వల్లభుఁ బిల్చి త్రాగుమనె ప్రక్షయ మాపగ విశ్వ మందు, యా
తల్లికి సాటి లేదు కద తల్లడిలంగను లోక రక్షణన్.

(తొల్లి = తొలుత, జనించి = పుట్టి, హాహలము = విషము, తోయధి = సముద్రము, చిల్కు = చిలుకు, ఎల్లెడ = అంతటా, కుందు = దుఃఖించు, మాత = పార్వతి, గ్రక్కునన్ = తటాలున, వల్లభుడు = భర్తయైన శివుడు, ప్రక్షయము = నాశనము, ఆపు = ఆగునట్లు చేయు, విశ్వము = లోకము, తల్లడిలు = చలించు)

దేవతలు, రాక్షసులు సముద్రాన్ని చిలకగా మొదట విషం పుట్టి అంతటా వ్యాపించిందని ఎంతగానో బాధపడ్డ పార్వతి విశ్వంలో నాశనాన్ని ఆపడానికి వెంటనే భర్తయైన శివుణ్ణి పిలిచి త్రాగమంది. ఆ తల్లికి భయంతో చలించడంలోను, లోక రక్షణలోను ఎవరూ సాటి లేరు కదా.

177.257 ఉ. మల్లడిగొన్న విప్రవరు మన్ననఁ గావగ, నేకచక్ర మం
దెల్లరకున్ బకాసురుని యెడ్డమిఁ దీర్చగ, భీతి మాటునన్
బల్లిదు భీముఁ బంపఁగల భావన కుంతికిఁ గల్గె నట్టిదౌ
తల్లికి సాటి లేదు కద తల్లడిలంగను లోక రక్షణన్.

(మల్లడిగొను = దుఃఖించు, విప్రవరుడు = బ్రాహ్మణ శ్రేష్ఠుడు, మన్నన = గౌరవము, కాచు = రక్షించు, ఎల్లరు = అందరు, ఎడ్డమి = ఆపద, తీర్చు = తొలగించు, భీతి = భయము, మాటు = మరుగుపరచు, బల్లిదుడు = బలవంతుడు, భావన = తలపు, తల్లడిలు = చలించు)

దుఃఖించే బ్రాహ్మణుని గౌరవం కాపాడటానికి, ఏకచక్రపురంలో అందరికీ బకాసురుడి పీడ వదిలించడానికి, భయం మాటుగా బలవంతుడైన భీముణ్ణి పంపగలిగే ఆలోచన కుంతికి కలిగింది. అట్టిదైన తల్లికి భయంతో చలించడంలోను, లోక రక్షణలోను ఎవరూ సాటి లేరు కదా.

178.   సమస్య: తల్లిని దూఱుచున్ సవతి తల్లికి మ్రొక్కె నొకండు విజ్ఞుఁడై

178.258   ఉ. తల్లిని దూఱుచున్, సవతి తల్లికి మ్రొక్కె నొకండు విజ్ఞుఁడై
యల్లరి పిల్లలార! యెవరాతడు చెప్పు మటన్న తండ్రికిన్,
తెల్లము నాకటం చొకడుఁ దెల్పెను రాముని సోదరుం డతం
డెల్లర మానసంబులను యీవిని గెల్చిన కైక పుత్రుడే.

(దూఱు = తిట్టు, విజ్ఞుడు = తెలిసినవాడు, తెల్లము = స్పష్టము, ఎల్లర = అందరి, మానసంబు = మనస్సు, ఈవి = త్యాగము)

తెలిసి, తల్లిని తిడుతూ సవతి తల్లికి నమస్కరించా డొకడు, అల్లరి పిల్లలారా! ఎవరు అతడు, చెప్పమని అన్న తండ్రికి, నాకు తెలుసు అంటూ ఒకడు తెలిపాడు: రాముని తమ్ముడు, అందరి మనసులను తన త్యాగంతో గెలిచిన కైక పుత్రుడైన భరతుడే.

178.259   ఉ. తల్లికి దూరమై వనికి తర్లెను నొక్కడు తండ్రియాజ్ఞపై
తల్లియె మెచ్చగా నొకడు తర్లెను యన్ననుఁ గూడి కానకున్
తల్లిని దూఱుచున్, సవతి తల్లికి మ్రొక్కె నొకండు విజ్ఞుఁడై
తల్లుల మూడు రూపముల తత్త్వముఁ జూపెను రాము గాథయే.

(వని = అడవి, తర్లు = ప్రయాణమగు, కూడు = కలియు, కాన = అడవి, దూఱు = తిట్టు, విజ్ఞుడు = తెలిసినవాడు, తత్త్వము = సారము)

ఒకడు తండ్రి యానతిని తల్లికి దూరమై అడవికి వెళ్ళాడు. ఒకడు తల్లి మెచ్చుకోగా అన్నతో కలసి అడవికి వెళ్ళాడు. ఒకడు తెలిసి తల్లిని తిడుతూ సవతి తల్లికి నమస్కరించాడు. తల్లుల మూడు రూపాల సారాన్ని చూపించింది రాముని కథే.

179.   సమస్య: తల్లీ రమ్మని పిల్చె భర్త నిజకాంతన్ మన్మథక్రీడకున్

179.260   శా. ఇల్లాలిన్ నిను వీడి సంపదలనే యిచ్చించి వేసారితిన్,
కల్లోలంబుగ నున్న దీ మనసు సాంగత్యమ్ముకై, తాళ నీ
సల్లాపంబుల కాలయాపనము, నా సంతానమున్ గన్న యో

తల్లీ! రమ్మని పిల్చె భర్త, నిజకాంతన్ మన్మథక్రీడకున్.

(వీడు = వదలు, ఇచ్ఛించు = కోరు, వేసారు = విసిగిపోవు, కల్లోలము = సంతోషము, సాంగత్యము = చేరిక, తాళు = సహించు, సల్లాపము = పరస్పర సంభాషణము, కాలయాపనము = పొద్దుపుచ్చుట)

ఇల్లాలివైన నిన్ను వదలి సంపాదన మీద మోజుతో విసిగిపోయాను. నిన్ను చేరడానికి ఈ మనసు ఊగిపోతోంది. మాటలతో పొద్దుపుచ్చడం నేను సహించలేను. ఓ, నా పిల్లల తల్లీ, రమ్మని భార్యను మన్మథక్రీడకై భర్త పిలిచాడు.

180. సమస్య: తాగిన వారే సతతము ధన్యులు సుమ్మీ

180.261 కం. రాగము తానము పల్లవి
బాగుగ సమ్మిళితమైన పాటలు వినుచున్
నాగుల వలె గాన సుధను
తాగిన వారే సతతము ధన్యులు సుమ్మీ.

(సమ్మిళితము = బాగా కలిసిన, సుధ = అమృతము, ధన్యుడు = కృతార్థుడు)

రాగము, తానము, పల్లవి బాగా సమపాళ్ళలో కలిసిన పాటలు వింటూ పాముల వలె గానామృతాన్ని తాగిన వారే నిత్యమూ కృతార్థులు సుమా.

181. సమస్య: తాగుడుతోనె మానవులు తథ్యము రోగ విముక్తులే యగున్

181.262 ఉ. సాగదు జీవితమ్ము కొనసాగదు శాంతి గృహంబు లందునన్
తాగుడు తోనె; మానవులు తథ్యము రోగ విముక్తులే యగున్
తాగుడు మాని, పద్ధతిగ తాపము తగ్గగఁ జేయు మందులన్,
బాగగు దాక పుచ్చుకొని బాధ్యతగా బ్రతుకంగ నేర్చినన్.

తాగుడుతోనే జీవితం సాగదు, ఇళ్ళలో శాంతి వర్ధిల్లదు. తాగుడు మానేసి, పద్ధతి ప్రకారం బాధ తగ్గేడట్లు చేసే మందులు బాగయ్యే దాకా తీసుకుని, బాధ్యతగా జీవించడం ఎలాగో నేర్చుకుంటే, మనుషులు నిజంగా రోగ విముక్తులు అవుతారు.

182. సమస్య: తాగుబోతు తీర్పు తగవు తీర్చె

182.263 ఆ.వె. భర్త తాగుబోతు, భార్యకు గృహ హింస,
పెద్ద లచటి కేగి బుద్ధి జెప్ప,
తప్పు తన దటంచు, తాగుట మానె నా
తాగుబోతు, తీర్పు తగవు తీర్చె.

భర్తేమో తాగుబోతు. భార్యకేమో గృహ హింస. పెద్దవాళ్ళు అక్కడికి వెళ్ళి బుద్ధి చెప్పగానే, తనదే తప్పు అని, ఆ తాగుబోతు తాగుడు మానేశాడు. ఆ విధంగా, పెద్దల తీర్పు తగాదా తీర్చింది.

182.264 ఆ.వె. మనసులోన బుట్టు యెనలేని కాంక్షల
తీర్చు దారి లేదు, ఆర్చుటెట్లు?
మదిర యిచ్చు శాంతి, మనసున కని యన్న
తాగుబోతు తీర్పు, తగవు తీర్చె.

(ఎనలేని = అపరిమితమైన, ఆర్చు = ఉపశమింప జేయు)

మనస్సులో పుట్టే అంతులేని కోరికలు తీర్చే మార్గము లేదు. ఆర్చే దెట్లా? మద్యము మనసుకు శాంతి ఇస్తుంది అన్న తాగుబోతు తీర్పు న్యాయం చెప్పింది.

182.265 ఆ.వె. తిరుగుబోతు మాట పరువును నిలబెట్టె,
తాగుబోతు తీర్పు తగవు తీర్చె,
పాఱుబోతు నిలచె ధీర పురుషునిగ,
యనుచుఁ జెప్పు మాట లన్ని కల్ల.

తిరుగుబోతు పరువు నిలబెట్టాడు, తాగుబోతు తీర్పు తగాదా తీర్చింది, పిరికివాడు ధీర పురుషుడుగా నిలబడ్డాడు, అని చెప్పే మాటలు అన్నీ అబద్ధాలే.

183. సమస్య: తాన ననదాన ననదాన తాన నాన

183.266 తే.గీ. ఎండలకు బీడు వారిన యిడికకు పరి

మళము తెచ్చు తొలకరి సుమాళము నిడ
రైతు లొకటిగ చిలుకు కలస్వన మిది
తాన ననసాన ననసాన తాన నాన.

(బీడు = దున్నని భూమి, ఇడిక = నేల, పరిమళము = సువాసన, తొలకరి = ఎండాకాలం తరవాత ఆరంభమయ్యే వాన, సుమాళము = సంతోషాదులవలన కలిగే పారవశ్యము, ఇడు = ఇచ్చు, చిలుకు = చల్లు, కలస్వనము = శ్రావ్యధ్వని)

ఎండాకాలంలో బీడు వారిన నేలకి మంచి మట్టి సువాసన తెచ్చే తొలకరి అని అనబడే మొదటి జల్లు పారవశ్యాన్ని ఇవ్వగా రైతులు ఒకటై చల్లే శ్రావ్యధ్వనియే "తాన ననసాన ననసాన తాన నాన".

184. సమస్య: తాపము రవి రాక తగ్గె తరుణికి ధరణిన్

184.267 కం. రూపసి కుంతికి తోచెను,
తాపసి దూర్వాసు మంత్ర దక్షత నెంచన్,
లోపలి సందేహము, పరి
తాపము, రవి రాక తగ్గె తరుణికి ధరణిన్.

(రూపసి = చక్కని స్త్రీ, తాపసి = ఋషి, దక్షత = సమర్థత, ఎంచు = గణించు, పరితాపము = భయము)

అందకత్తె అయిన కుంతీదేవికి దూర్వాస మహాముని ఇచ్చిన మంత్రబలాన్ని పరీక్షించాలని మనస్సులో తోచింది. లోపలి సందేహము, భయము ఆ అమ్మాయికి సూర్యుని రాకతో తగ్గింది.

185. సమస్య: తార్క్ష్యని చూచినంత రఘునాథుని పాములు వీడిపోయెగా

185.268 ఉ. తార్క్ష్యుడు దాస్య ముక్తి నిడ తల్లికి యింద్రుని గెల్చె; రావణీ
తార్క్ష్యము నాగ యస్త్రముల దాశరథిన్ స్పృహ లేకఁ జేసినన్,
తార్క్ష్యుడు యుద్ధభూమిఁ జనె తత్క్షణమే కడతేర్చగా, యనిన్
తార్క్ష్యునిఁ జూచినంత రఘునాథుని పాములు వీడిపోయెగా.

(తార్క్ష్యుడు = గరుత్మంతుడు, రావణి = రావణుని కుమారుడు ఇంద్రజిత్తు, తార్క్ష్యము = పక్షి, దాశరథి = శ్రీరాముడు, స్పృహ = శరీరచైతన్యము, తత్క్షణము = వెంటనే, కడతేర్చు = రక్షించు, అనిన్ = యుద్ధరంగమున, వీడిపోవు = విడిచిపోవు)

గరుత్మంతుడు తల్లియైన వినతకు దాస్య విముక్తి చేయడం కోసం ఇంద్రుణ్ణి జయించాడు. ఇంద్రజిత్తు అనే పక్షి (ఆకాశం నుండి కనపడకుండా యుద్ధం చేశాడు కాబట్టి) నాగాస్త్రాలతో రాముణ్ణి స్పృహ లేకుండా చేయగా, గరుత్మంతుడు వెంటనే రక్షించడానికి యుద్ధభూమికి వెళ్ళాడు. రణరంగంలో గరుత్మంతుణ్ణి చూడగానే పాములు రాముణ్ణి వదిలిపెట్టి వెళ్ళిపోయాయి.

186. సమస్య: తుని లోపల జగము లెల్ల తూగుచు నుండెన్

186.269 కం. మను తిన లేదని యను కృ
ష్ణుని వదనమునన్ యశోద చోద్యముఁ గనె, నే
మనగా, నా వసుదేవ సు
తుని లోపల జగము లెల్ల తూగుచు నుండెన్.

(మను = మన్ను, వదనము = నోరు, చోద్యము = ఆశ్చర్యము, కను = చూచు, వసుదేవ సుతుడు = వసుదేవుని పుత్రుడైన శ్రీకృష్ణుడు, జగము = లోకము, ఎల్ల = సమస్తము, తూగు = ఊగు)

మన్ను తినలేదని చెప్పే కృష్ణుని నోట్లో యశోద ఆశ్చర్యాన్ని చూసింది. అది ఏమంటే, ఆ వసుదేవుని పుత్రుడైన శ్రీకృష్ణుని లోపల లోకాలన్నీ ఊగుతూ ఉన్నాయి.

187. సమస్య: తురకంబందున రచించె తుగ్లకు గీతన్

187.270 కం. పరిదానము కలిమా గురు
తు రకం బందున రచించె తుగ్లకు, గీతన్,
కరణమ్ముల దుపు నుంచుట,
నెరవేర్చుట బాధ్యతలను, నేర్పెను నరుకున్.

(పరిదానము = వస్తువులను మార్చుకొనుట, కలిమా = ఇస్లాంలో విశ్వాసపు వాక్కు, రకము = డబ్బు, రచించు = సమకూర్చు, కరణము = ఇంద్రియము, నరుడు = అర్జునుడు)

వస్తువుల మార్పిడి చేయడం కలిమా గుర్తున్న డబ్బుతో (నాణాలతో) ఉండేటట్లుగా తుగ్లకు ఏర్పాటు చేశాడు. తుగ్లకు కాలంలో కలిమా గుర్తున్న నాణాలు ఉండేవి. భగవద్గీతలో ఇంద్రియనిగ్రహము, బాధ్యతలను నెరవేర్చడం గురించి అర్జునునికి నేర్పబడింది.

187.271 కం. పరిపాలన, తన యావ
త్తు రకం బందున రచించె తుగ్లకు, గీతన్
పరమాత్ముడైన కృష్ణుడు
నరునికి మార్గంబుఁ జూపి నడుపగఁ జెప్పెన్.

(పరిపాలన = ప్రభుత్వనిర్వహణము, యావత్తు = మొత్తమంతా, రకము = భూమిపన్ను, రచించు = సమకూర్చు, నడుపు = ప్రవర్తింప జేయు)

తుగ్లకు తన ప్రభుత్వనిర్వహణము, మొత్తం భూమిపన్నుతోనే సమకూర్చాడు. గీతను, కృష్ణపరమాత్మ, అర్జునునికి మార్గము చూపించి ఆ విధంగా ప్రవర్తింప జేయడానికి చెప్పాడు.

188. సమస్య: తురకలు సంధ్య వార్తురట తోయములన్ కొనితెమ్ము జానకీ

188.272 చం. మరువక యైదు సార్లుగ నమాజు దినమ్మునఁ గూడిఁ జేతురీ
తురకలు, సంధ్య వార్తు రట, తోయములన్ కొనితెమ్ము జానకీ!
చెఱువుకు వెళ్ళ లేక మముఁ జేరిన భూసురు లందరున్, యిటుల్
యిరువురి సేవఁ జేసి తరియింతు మటంచునుఁ జెప్పె భర్తయే.

(నమాజు = ప్రార్థన, కూడు = కలియు, తురకలు = మహమ్మదీయులు, సంధ్యవార్చు = సంధ్యావందనము చేయు, తోయము = నీరు, కొనితెచ్చు = తీసికొనివచ్చు, చెఱువు = తటాకము, భూసురుడు = బ్రాహ్మణుఁడు, తరియించు = స్వర్గమును చేరు)

మర్చిపోకుండా రోజుకి ఐదు సార్లు మహమ్మదీయులు నమాజు చేస్తారు కదా. చెఱువుకి వెళ్ళ లేక మన దగ్గరకి వచ్చిన బ్రాహ్మణులు అందరూ సంధ్య వారుస్తారుట, నీళ్ళు తీసుకురా జానకీ! ఈ విధంగా, రెండు మతాల వారికి సేవచేసి తరిద్దాం అంటూ భర్త చెప్పాడు.

189. సమస్య: తులువల దారియౌ నిదియె దోషము వారికి జెప్ప నెప్పుడున్

189.273 చం. నిలకడ లేక తా కణిక నీతిని పుత్రులఁ ద్రోలె, నేర్చియున్
తులువల దారియౌ నిదియె దోషము వారికిఁ జెప్ప నెప్పుడున్
తలపడు, రాజయోగ మటు దక్కు నటంచును యాంబికేయు డా
శల నిలిపెన్, యనంతరము సంగర మయ్యెను పుత్రు లీల్గగన్.

(నిలకడ = చీటికీమాటికీ మారిపోకుండా స్థిరంగా ఉండటం, కణిక నీతి = నమ్మించి మోసం చేయడం గురించి కణికుడనే మంత్రి ధృతరాష్ట్రునికి చెప్పిన నీతి, త్రోలు = నడిపించు, నేర్చు = ఎఱుకపడు, తులువ = కుత్సితుఁడు, దోషము = పాపము, తలచు = అనుకొను, రాజయోగము = రాజగునట్టి అదృష్టము, అటు = ఆప్రకారము, ఆంబికేయుడు = ధృతరాష్ట్రుడు, నిలుపు = ఏర్పరచు, ఈల్గు = చచ్చు)

స్థైర్యము లేక, కుత్సితుల మార్గమని తెలిసి కూడా తాను, పుత్రులను కణిక నీతిలో నడిపించాడు. అది పాపమని వారికి చెప్పాలని ఎప్పుడూ అనుకోలేదు. రాజయ్యే అదృష్టము ఆ విధంగా దక్కుతుందని ధృతరాష్ట్రుడు ఆశలు పెట్టుకున్నాడు. తరువాత, యుద్ధము అయ్యి పుత్రుల చావు కొచ్చింది.

190. సమస్య: తెలివి రవంత లేకయె సుధీవరు డన్న ప్రశస్తి నందితిన్

190.274 చం. వెలితినిఁ జూపి దుస్తులవి వింతనిఁ జెప్పగ దర్జి, నమ్మి తా
వెలుపల కొచ్చె నగ్నగతి వేడుకఁ జేయగ రాజు, భీతిచే
పలువురు మిన్నకుండినను, బాలుడ నేను నిజంబుఁ జెప్పగన్,
తెలివి రవంత లేకయె, సుధీవరు డన్న ప్రశస్తి నందితిన్.

(వెలితి = ఖాళీ, దర్జి = టైలరు, పలువురు = అనేకులు, మిన్నకుండు = ఊరక ఉండు, రవంత = కొంచెము, సుధీవరుడు = పండితుడు, ప్రశస్తి = పొగడ్త)

ఖాళీని చూపించి, అవి వింత దుస్తులన్న దర్జి మాటలు నమ్మి, రాజుగారు వేడుక చేయడానికి తాను నగ్నంగా బయటకి రాగా, భయంతో చాలామంది ఊరకుంటే, పిల్లవాడినైన నేను నిజం చెప్పి, కొంచెము కూడా తెలివి లేక పోయినా, పండితుడినన్న కీర్తిని పొందాను.

191. సమస్య: తెలుగును తల్లిగా దలచి దించును వృద్ధుల యాశ్రమంబులో

191.275 చం. తెలుగును నేర్పు పూర్వ వసతిన్ మన స్కూళ్ళను యాపుఁసేయగా,
తెలుగు యొకింత వృద్ధుల మదిన్ మనుచున్న దటంచు నెంచ యో
నెలతుక, వేరు దారి యని నిచ్చలు బిడ్డల వెంటఁ బోయి, తా
తెలుగును తల్లిగాఁ దలచి దించును వృద్ధుల యాశ్రమంబులో.

తెలుగు నేర్పే అదివరకున్న వసతిని మన స్కూళ్ళలో మాని వేయడం వల్ల, తెలుగు ఒక మాదిరిగా ముసలి వారి మనసులోనే బతికి ఉన్నదని అనిపించగా, ఒక స్త్రీ, తాను తెలుగును తల్లిగా అనుకుని, వేరే మార్గమని, రోజు బిడ్డల వెంట పోయి వృద్ధుల ఆశ్రమంలో దించుతుంది.

192. సమస్య: తొలి సంధ్యన్ తగు పూజ చేవలదు సంతోషంబు నువ్వొంగినన్

192.276 మ. అలవాటయ్యెఁ గదా పురందరుని మీ రర్చించుటల్, వానికిన్
తొలి సంధ్యన్ తగు పూజ చేవలదు, సంతోషంబు నువ్వొంగినన్
మల గోవర్ధనమున్ పయస్విను సమ్మానించి కైసేయ, భం
దిల మీడేరు నటంచు కృష్ణు డనె నుద్దీడుల్ ప్రశంసించగన్.

(అలవాటు = వాడుక, పురందరుడు = ఇంద్రుడు, తగు = యుక్తమగు, మల = పర్వతము, పయస్విని = ఆవు, కైసేయు = పూజించు, భందిలము = మేలు, ఈడేరు = సిద్ధించు, ఉద్దీడు = జతకాడు, ప్రశంసించు = పొగడు)

ఇంద్రుని మీరు అర్చించడం అలవాటయ్యింది కదా. వానికి పూర్వసంధ్యలో పూజ చేయ వద్దు. సంతోషం పొంగి పొర్లితే గోవర్ధన పర్వతాన్ని, గోవులను గౌరవించి పూజ చేస్తే మేలు కలుగుతుంది అని కృష్ణుడు మిత్రులు పొగడగా అన్నాడు.

193. సమస్య: త్రుంచెన్ రామశిరంబు రావణుడు సంతోషించి రా నిర్జరుల్

193.277 శా. పంచారించెను రాము డాలమునకున్ పౌలస్త్య! యంచున్ వినన్,
వంచింపన్నిటుఁ బల్కె జానకికి 'శంపాంగీ! ప్రహస్తుం డిదే
త్రుంచెన్ రామశిరంబు' రావణుడు, సంతోషించి రా నిర్జరుల్
గాంచన్ మాయ యిదంచు, తా కపి వరాకారంబులం దంశలై.

(పంచారించు = సిద్ధపడు, ఆలము = యుద్ధము, పౌలస్త్య = రావణా, వంచించు = మోసముచేయు, ఇటు = ఇట్లు, జానకి = సీత, శంపాంగి = మెరుపు తీగె వంటి దేహము గలది, త్రుంచు = విఱుచు, నిర్జరులు = దేవతలు, కాంచు = చూచు, కపివరుడు = వానరశ్రేష్ఠుడు, అంశ = భాగం)

"రాముడు యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు, రావణా!" అని విన్నంతనే, మోసం చేయడానికి సీతతో "ఓ మెరుపు తీగె వంటి దేహము గలదానా! ఇదిగో ప్రహస్తుడు రాముని తల ఖండించాడు" అని రావణుడు అన్నాడు. వానరశ్రేష్ఠుల ఆకారాలలో అంశలుగా ఉన్న దేవతలు చూడగా ఇది మాయ అని సంతోషించారు.

194. సమస్య: దంష్ట్రల మీద శంకరుడు తాండవ మాడెను రాము కైవడిన్

194.278 ఉ. దంష్ట్రలు యున్న బొమ్మల యుదాకర ముండగ, సంకురాత్రికిన్
దంష్ట్రుల బొమ్మ లందుకొని తత్ప్రతిమల్ కొలు వందు యుంచ, యా
దంష్ట్రల నంటి పెక్కు యధిదైవత మూర్తులు ప్రేలఁ, జూడగన్
దంష్ట్రల మీద శంకరుడు తాండవ మాడెను రాము కైవడిన్.

(దంష్ట్ర = కోఱపల్లు, ఉదాకరము = సముద్రము, సంకురాత్రి = సంక్రాంతి, దంష్ట్రి = పంది, తత్ = ఆ, ప్రతిమ = విగ్రహము, కొలువు = బొమ్మల కొలువు, అంటు = పట్టుకొను, పెక్కు = అనేకము, అధిదైవతము = అభిమాన దేవత, మూర్తి = ప్రతిమ, ప్రేలు = ప్రేలాడు, తాండవము = నృత్యము, కైవడి = విధము)

కోఱపల్లు ఉన్న బొమ్మల సముద్రము ఉండగా, సంక్రాంతికి పంది బొమ్మలు అందుకొని ఆ విగ్రహాలను బొమ్మల కొలువులో ఉంచగా వాటి కోరలు పట్టుకొని అనేకమైన అభిమాన దేవతల ప్రతిమలు ప్రేలాడు చుండగా చూస్తే కోఱపల్ల మీద రాముడి లాగా శంకరుడు నృత్యం చేశాడు.

195. సమస్య: దగ్ధంబైనది జాతి సంస్కృతులు విద్యాజ్ఞానముల్ గల్గగన్

195.279 శా. ముగ్ధత్వమ్ము త్యజింప యాంగ్ల మనగా మోహంబు సంపూర్తిగా
దగ్ధంబైనది, జాతి సంస్కృతులు విద్యాజ్ఞానముల్ గల్గగన్
స్నిగ్ధత్వమ్మున పెంపుఁ జేయ సమతా శీలంబు, దేశంబు సం
దిగ్ధం బన్నది లేక సాగె ప్రగతిన్ ధ్యేయంబుగా నిల్పుచున్.

(ముగ్ధత్వము = అమాయకత్వము, త్యజించు = విడిచిపెట్టు, మోహము = మనో వైకల్యము, దగ్ధము = కాల్పబడినది, స్నిగ్ధత్వము = చెలిమి, పెంపు = వృద్ధి, సమత = సమానత్వము, శీలము = స్వభావము, సందిగ్ధము = సందేహము, సాగు = బాగా వృద్ధిపొందు, ప్రగతి = అభివృద్ధి, ధ్యేయము = లక్ష్యము)

అమాయకత్వాన్ని విడిచిపెట్టడం వల్ల ఆంగ్లానికి సంబంధించిన మనో వైకల్యము సొంతం కాల్చబడింది. నాగరికతలు, విద్య, జ్ఞానములు లభించగా జాతి, స్నేహవాతావరణంలో సమతాస్వభావము వృద్ధి చేయడం వలన, దేశము సందేహం లేకుండా ప్రగతిని లక్ష్యంగా నిలుపుకొని బాగా వృద్ధి పొందింది.

196. సమస్య: దయ్యము నే ఎన్నుకున్న ధర్మంబగురా

196.280 కం. తియ్యని సుఖ సంసారము
కయ్యము లెన్నున్న ప్రణయ కావ్యమెగా, యా
నెయ్యపు భార్యయె, కాదది
దయ్యము, నే యెన్నుకున్న ధర్మం బగురా.

(తియ్యని = మధురమైన, కయ్యము = కలహము, ప్రణయ = ప్రేమ, నెయ్యపు = స్నేహితురాలైన, దయ్యము = పిశాచము, ధర్మము = స్వభావము)

మధురమైన సుఖసంసారము కలహాలు ఎన్ని ఉన్నా ప్రేమ కావ్యమేగా. ఆ స్నేహితురాలైన భార్యే, నేను కావాలనుకున్న ధర్మము. దయ్యం కాదు.

197. సమస్య: దానము జేసిన కలుగును దారుణ బాధల్

197.281 కం. ఆనందము తా నవయవ
దానముఁ జేసినఁ గలుగును, దారుణ బాధల్
మానక తరుమును యరయక
దాన మపాత్రునికిఁ జేయు దాతల మదిలో.

(దారుణ = భయంకరమైన, తరుము = వెంబడించు, అరయక = విచారించక, అపాత్రుడు = అయోగ్యుడు)

ఎవరైతే అవయవ దానం చేస్తారో వారికి ఆనందము కలుగుతుంది. సరిగా విచారించకుండా దానం అయోగ్యునికి చేసే దాతల మనస్సులో భయంకరమైన బాధలు మానకుండా వెంట తరుముతాయి.

198. సమస్య: దానముఁ జేయఁ బూను టుచితమ్మొకొ తిండికి లేనివారికిన్

198.282 ఉ. పూని వివాహమందు నొక భోగ్యముగా కని పెంచు కన్యకన్
దానముఁ జేయఁ బూను టుచితమ్మొకొ? తిండికి లేని వారికిన్
మానము యుండ దంచు నవమానముఁ జేయుట పాడియే? పర
ధ్యానముతో ప్రమాదములు తప్పునెఁ జెప్పుము యెట్టి వారికిన్.

(పూను = ప్రయత్నించు, భోగ్యము = భోగింపఁదగినది, ఉచితము = యుక్తము, మానము = గౌరవము, పాడి = న్యాయము, పరధ్యానము = మనసు వేరే చోట లగ్నమై ఉండుట)

ఎట్లాంటి వారైనా, పూనుకొని పెళ్ళిలో కనిపెంచిన కన్యను భోగ్యముగా దానం చేయడం సరియైన పనా? తిండికి లేని కటిక దరిద్రులకి గౌరవము అంటూ ఉండదని అవమానం చేయడం న్యాయమా? మనస్సు వేరే చోట ఉంటే ప్రమాదాలు తప్పిపోతాయా? చెప్పండి.

199. సమస్య: దారము లేకున్న బ్రతుకఁ దరమే ప్రజకున్

199.283 కం. పారగతు మనికి యే దా
ధార మనుచు యక్షు డడుగ, ధర్మజు డంతన్
బోరన బదు లిడె నిటు, కం
దారము లేకున్న బ్రతుకఁ దరమే ప్రజకున్.

(పారగతు = మనుష్యుడు, మనికి = జీవించుట, బోరన = శీఘ్రముగా, బదులిడె = బదులిచ్చాడు, ఇటు = ఇట్లు, కందారము = మేఘము)

మానవుని జీవనమునకు ఏది ఆధారమని యక్షుడు అడుగగా, ధర్మరాజు అప్పుడు వెంటనే ఇలా జవాబు ఇచ్చాడు: "మేఘము లేకుండా ప్రజలకు బ్రతుకుటకు వీలవుతుందా".

200.   సమస్య: దారము లేని హారము నితంబిని నీ కెవఁ డిచ్చెఁ జెప్పుమా

200.284   ఉ. నారు లలంకరింపఁ బలు నవ్య ప్రసాధన లున్నవీ ధరస్,
తీరుగ భూషలస్ బటు నదీష్ణుడుఁ జేసినఁ గాని యందు బం
గారము తగ్గుఁ గాదె కసిగాటు, ప్రలంభముఁ గాక యేమి? చే
దారము లేని హారము నితంబిని నీ కెవఁ డిచ్చెఁ జెప్పుమా.

(నారులు = స్త్రీలు, ప్రసాధన = అలంకార సామాగ్రి, తీరుగ = చక్కగా, భూష = నగ, పటు = చాతుర్యం కల, నదీష్ణుడు = నేర్పరి, కసిగాటు = అల్పము, ప్రలంభము = మోసము, చేదారము = నగలు చేయించుటలో తఱిగిపోవు బంగారము, నితంబిని = స్త్రీ)

స్త్రీలు అలంకరించుకోవడానికి లోకంలో చాలా క్రొత్త అలంకార సామగ్రు లున్నవి. చక్కగా నగలను మంచి నేర్పరి చేసినా కూడా అందులో బంగారము అల్పంగా తగ్గుతుంది కదా. మోసం కాకపోతే ఏమిటి, అమ్మాయీ? బంగారం తరుగు లేని హారము నీ కెవడు ఇచ్చాడో చెప్పవమ్మా.

201.   సమస్య: దాసరి తప్పులు దండముతో సరి

201.285   కం. తా సంధి నడుగ, కౌరవు
లీసున కాదనగ, చక్రి యీయది మర్యా
దా! సరి, తప్పులు దండము
తో, సరికొనుటే సరియగు త్రోవని పలికెస్.

(ఈసు = ఈర్ష్య, సరి = యుక్తము, దండము = రాజశిక్ష, సరికొను = చంపు)

తాను సంధి కోరగా, కౌరవులు ఈర్ష్యతో కాదనగా, ఇది మర్యాదైన పనా, తప్పులకి శిక్షయే యుక్తము, చంపుటే సరియైన మార్గమని కృష్ణుడు అన్నాడు.

202.   సమస్య: దివ్వె వెలుంగుచుండిన గదిస్ నలువైపుల నిండె జీకటుల్

202.286   ఉ. కెవ్వని విన్న కంసు కెరిగించు భటావళి మత్తిలంగ, తా
సవ్వడి లేకఁ బుట్టె చెరసాల గదిస్ వనమాలి, మాయచే

దివ్వె వెలుంగుచుండిన గదిన్ నలువైపుల నిండెఁ జీకటుల్,
నివ్వెరఁ బోవ దేవకియు నిర్మల చిత్తుడు యామె భర్తయున్.

(కెవ్వు = ధ్వని, ఎరిగించు = తెలియజేయు, భటుడు = సేవకుడు, ఆవళి = సమూహము, మత్తిలు = మత్తులో ఉండగా, తా = తాను, సవ్వడి = చప్పుడు, చెరసాల = జైలు, వనమాలి = విష్ణువు, దివ్వె = దీపము, నివ్వెర = ఆశ్చర్యము, నిర్మల చిత్తుడు = స్వచ్ఛమైన మనస్సు కలవాడు)

కెవ్వని వింటే, అంటే బిడ్డ ఏడుపు వింటే, కంసుడికి తెలియఁజెయ్యాల్సిన భటవర్గము మత్తులో ఉండగా, చప్పుడు లేకుండా జైలు గదిలో విష్ణువు పుట్టాడు. మాయ చేత, దేవకీ దేవి, స్వచ్ఛమైన మనస్సుగల ఆమె భర్తయైన వసుదేవుడు ఆశ్చర్యపోగా, దీపం వెలుగుతున్న గదిలో నాలుగు ప్రక్కలా చీకట్లు నిండాయి.

203. సమస్య: దుగ్ధపయోధి మధ్యమున దుమ్ములు రేగె నిదేమి చోద్యమో

203.287 ఉ. సగ్ధిని తోటి తాపసులు శాంతిని యెవ్వరు యెక్కుడన్న, పై
దగ్ధినిఁ జూప విష్ణు కడ దర్శనమున్ భృగుమౌనిఁ గోరి, సం
దిగ్ధము తాళ కాతనిని దిగ్గున తాచగ, మేని గంధమే
దుగ్ధపయోధి మధ్యమున దుమ్ములు రేగె, నిదేమి చోద్యమో.

(సగ్ధి = పంక్తిభోజనము, తాపసి = ముని, ఎక్కుడు = అధికము, పైదగ్ధి = నేర్పు, కడ = సమీపము, సందిగ్ధము = సందేహమైనది, తాళు = సహించు, దిగ్గున = ఒక్క ఉదుటున, తాచు = తన్ను, మేను = శరీరము, గంధము = చందనము, దుగ్ధ = పాలు, పయోధి = సముద్రము, రేగు = పైకిలేచు, చోద్యము = ఆశ్చర్యము)

పంక్తిభోజనంలో తన తోటి మునులు శాంతగుణంలో ఎవరు ఎక్కువ అనగా, నేర్పును చూపించడం కోసం విష్ణుమూర్తి వద్ద దర్శనము కోరి భృగు మహర్షి, అక్కడ సందేహాస్పదంగా ఉండడం సహించ జాలక విష్ణుమూర్తిని ఒక్క ఉదుటున తన్నగా, ఆతని శరీరానికి ఉన్న చందనము పాల సముద్రము మధ్యలో దుమ్ములుగా రేగింది. ఇదేమి ఆశ్చర్యమో!

204. సమస్య: దుర్గమ కష్టమ్ము లెల్ల దూరమ్మవుగా

204.288 కం. దుర్గమ్మ గిరిని విజయుఁడు
భర్గుఁని ప్రార్థించి పొందె పాశుపతమ్మున్

దుర్గను నమ్మిన వారికి
దుర్గమ కష్టమ్ము లెల్ల దూరమ్మవుగా.

(గిరి = కొండ, విజయుఁడు = అర్జునుఁడు, భర్గుఁడు = శివుఁడు, దుర్గమము = పొందుట కష్టమైనది, ఎల్ల = సమస్తము, దూరమగు = తొలగు)

కనకదుర్గమ్మ కొండ మీద అర్జునుఁడు శివుణ్ణి ప్రార్థించి పాశుపతాస్త్రాన్ని పొందాడు. దుర్గా మాతను నమ్మిన వారికి పెద్దపెద్ద కష్టాలన్నీ తొలగి పోతాయి.

205. సమస్య: దుర్మతి రాజు కాగ పరితోషము గైకొని రెల్ల వారలున్

205.289 ఉ. ధర్మము నాల్గు పాదముల తాండవ మాడగఁ జేయు నంచు స
త్కర్మల నాచరించు నని తర్కముఁ జెప్పుచు, యట్టివాడు, తా
దుర్మతి కాడు, లేదుఁ గద దోషము, యాతని నామమేఁ గదా
దుర్మతి, రాజు కాగ పరితోషముఁ గైకొని రెల్ల వారలున్.

(ధర్మము = న్యాయము, తాండవము = నృత్యము, సత్కర్మలు = మంచి పనులు, ఆచరించు = చేయు, తర్కము = కారణము, దుర్మతి = దుర్బుద్ధికలవాఁడు, దోషము = తప్పు, పరితోషము = సంతోషము, కైకొను = గ్రహించు, ఎల్ల = సమస్తము)

ధర్మము నాలుగు పాదాల నడిపిస్తాడనీ, మంచి పనులు చేస్తాడనీ కారణం చెబుతూ, అలాంటివాడు, తను దుర్బుద్ధి ఉన్నవాడు కాదు, ఏ దోషమూ లేని వాడు, పేరు మాత్రమే దుర్మతి, రాజవ్వగా అందరూ సంతోషాన్ని పొందారు.

206. సమస్య: దుష్యంతుడు పెండ్లియాడె ద్రుపద తనూజన్

206.290 కం. ఆన్యోటని కణ్వసుతను
దుష్యంతుడు పెండ్లియాడె, ద్రుపద తనూజన్
సశ్యామలన్ వరించి ర
ధృష్యులు పాండుసుతులు, యసదృశమగు లీలన్.

(ఆస్ఫోటని = అడవిమల్లె, సశ్యామల = నల్లనిది, అధృష్యులు = ఎదిరింప అలవి కానివారు, అసదృశము = సాటిలేని, లీల = విధము)

అడవిమల్లె లాంటి కణ్వసుత, శకుంతలను దుష్యంతుడు పెళ్ళి చేసుకున్నాడు. ద్రుపదుని కుమార్తె, శ్యామ వర్ణము గల ద్రౌపదిని, జయింప శక్యము కాని పాండు కుమారులు, పోల్చుటకు వీలు లేని విధంగా, పెళ్ళి చేసుకున్నారు.

207. సమస్య: దృష్టద్యుమ్నుండు ద్రౌపదికి భర్త యగుస్

207.291 కం. స్పష్టము చేసెను సభలో
దృష్టద్యుమ్నుండు, ద్రౌపదికి భర్త యగుస్
క్లిష్టమగు మత్స్యయంత్రము
నష్టం బొనరించి నట్టి నరుడే యనుచుస్.

(స్పష్టముచేయు = తెలియజెప్పు, క్లిష్టమగు = కష్టమగు, నష్టము = నాశనము, ఒనరించు = చేయు, నరుడు = అర్జునుడు)

కష్టమైన మత్స్యయంత్రాన్ని నాశనము చేసిన అర్జునుడే ద్రౌపదికి భర్త అవుతాడు అంటూ సభలో దృష్టద్యుమ్నుడు తెలియజెప్పాడు.

208. సమస్య: దేవుని సొమ్ము నంతయును దేరగ దోచెడి వాడె భక్తుడౌ

208.292 ఉ. చేవనుఁ జూపి యెన్నికలఁ జివ్వను గెల్చి, యథాక్రమమ్ముగా
దేవుని సొమ్ము నంతయునుఁ దేరగ దోచెడి వాడె, భక్తుడౌ
కైవడి నిత్య పూజలను కానుకలస్ సలుపంగఁ జూడమే,
దైవము లంచగొండి యను దాసుని తీరు యిదేఁ గదా భువిస్.

(చేవ = ధైర్యము, చివ్వ = యుద్ధము, యథాక్రమము = క్రమప్రకారముగా, తేరగ = ఉచితంగా, దోచు = కొల్లగొట్టు, కైవడి = విధముగా, దాసుడు = భక్తుడు)

ధైర్యము ప్రదర్శించి ఎన్నికల యుద్ధంలో గెలిచి క్రమంగా దేవుడు సొమ్ము అంతా తేరగా కొల్లగొట్టేవాడు భక్తుడి మాదిరిగా కానుకలతో నిత్యపూజలు చేయడం చూడమా. లోకంలో దేవుడు లంచకొండి అనే భక్తుడి తీరు ఇదే కదా.

209. సమస్య: దేహమ్మున్ విడనాడి చూడుము సఖా ధీరత్వ మేపారఁగన్

209.293 శా. సాహాయ్యంబును రామలక్ష్మణులకున్ సఖ్యంబునన్ గూర్పు ప్రో
త్సాహం బిచ్చుచు వాయుజాతు డనె నందంతుండు సుగ్రీవుకున్
బాహాటమ్ముగ, వాలి సూచకులు సంప్రాపించి నారన్న సం
దేహమ్మున్ విడనాడి చూడుము సఖా! ధీరత్వ మేపారఁగన్.

(సాహాయ్యము = సహాయము, సఖ్యము = స్నేహము, కూర్చు = అనుసంధించు, ప్రోత్సాహము = ఉత్సాహము, వాయుజాతుడు = హనుమంతుడు, నందంతుడు = రాజు, బాహాటము = బహిరంగము, సూచకుడు = గూఢచారి, సంప్రాపించు = సమీపించు, సందేహము = సంశయము, విడనాడు = వదలిపెట్టు, సఖ = మిత్రుడు, ధీరత్వము = ధైర్యము, ఏపారు = అతిశయించు)

రామలక్ష్మణులకు సహాయాన్ని స్నేహంతో అనుసంధించడానికి ప్రోత్సాహము ఇస్తూ హనుమంతుడు రాజైన సుగ్రీవునితో వాలి గూఢచారులు సమీపించారన్న సంశయాన్ని వదలిపెట్టి ధైర్యము అతిశయించగా చూడు మిత్రమా! అని బహిరంగంగా అన్నాడు.

210. సమస్య: దొంగకు మ్రొక్కినన్ నవ నిధుల్ లభియించు శుభంబు చేకురున్

210.294 ఉ. అంగ నృపుండు యీ శకుని యండనె నీకు జయమ్ము దక్కునా
సంగర మందు, వేగఁ జని సైన్యము తోడుగఁ దెమ్ము కృష్ణు నీ
సంగడి, రాజరాజ! యిక సంశయమా, దధిజమ్ము దోచు యా
దొంగకు మ్రొక్కినన్ నవ నిధుల్ లభియించు శుభంబు చేకురున్.

(నృపుడు = రాజు, అండ = సహాయము, జయము = గెలుపు, దక్కు = లభించు, సంగరము = యుద్ధము, వేగ = త్వరగా, చను = వెళ్ళు, సంగడి = ప్రక్క, రాజరాజు = దుర్యోధనుడు, సంశయము = సందేహము, దధిజము = వెన్న, దోచు = అపహరించు, మ్రొక్కు = నమస్కరించు, నవనిధులు = తొమ్మిది రకాల ఐశ్వర్యాలు, శుభము = మేలు, చేకురు = ఒనగూడు)

ఓ, దుర్యోధనా! అంగరాజైన కర్ణుడు, ఈ శకుని అండతోనే నీకు యుద్ధంలో విజయం దక్కుతుందా, త్వరగా వెళ్ళి సైన్యంతో సహా కృష్ణుణ్ణి నీ పక్కకి తీసుకొనిరా, ఇంకా సందేహమా, వెన్న అపహరించే ఆ దొంగకి దండం పెడితే నవనిధులూ దక్కి మేలు కలుగుతుంది అని చెప్పాడు.

211. సమస్య: ధర్మము ధర్మమం చనుచు ధర్మము దప్పెను ధర్మజుం డిలన్

211.295 ఉ. ధర్మము సత్యభాషణమె, తల్లడమౌ నది యన్న మిన్నయౌ
ధర్మము శుక్రనీతి యని, ద్రౌణి హతుండయె నన్న కల్లనే
మర్మము దాచి కుంభజు సమక్షము నందు వచించు సూక్ష్మమౌ
ధర్మము ధర్మమం చనుచు, ధర్మము దప్పెను ధర్మజుం డిలన్.

(ధర్మము = కర్తవ్యము, సత్యభాషణము = నిజము మాటాడుట, తల్లడము = బాధ, మిన్న = శ్రేష్ఠము, ద్రౌణి = అశ్వత్థామ, హతుడు = చంపబడినవాడు, కల్ల = అసత్యము, మర్మము = రహస్యము, దాచు = మఱుగు పఱచు, కుంభజుడు = ద్రోణుడు, సమక్షము = ముందర, వచించు = చెప్పు, సూక్ష్మము = అధ్యాత్మము, ఇల = భూమి)

నిజం చెప్పడమే ధర్మము. కానీ, అది బాధ అవుతుంది అంటే, శ్రేష్ఠమైన ధర్మము శుక్రనీతి (ఆడవారి విషయంలోనూ, పెళ్లిళ్లలోనూ, ప్రాణ ధన మానాలకు భంగం కలిగేటప్పుడూ, భీతిల్లిన గో బ్రాహ్మణ జాతులను ఆదుకునే రీతిలోనూ అసత్యం ఆడవచ్చు నన్నది శుక్రనీతి.) అనీ, అశ్వత్థామ చంపబడ్డాడు అన్న అసత్యాన్ని రహస్యం దాచి ద్రోణాచార్యుడి ఎదుట చెప్పడమే ధర్మసూక్ష్మము, ధర్మము అని ధర్మరాజు లోకంలో ధర్మము తప్పాడు.

212. సమస్య: ధర్మవర్తన మడ్డు కర్తవ్యమునకు

212.296 తే.గీ. ద్రౌపదిని కురుసభలో పరాభవించు
దుర్మతుల మద మణచగ ధర్మరాజు
ధర్మవర్తన మడ్డు, కర్తవ్యమునకు
వేళ కాదని తలచెను భీము డపుడు.

(దుర్మతి = దుర్బుద్ధికలవాడు, మదము = గర్వము, వర్తనము = నడవడి, అడ్డు = ప్రతిబంధకం, కర్తవ్యము = చేయదగినది, వేళ = సమయము, అపుడు = అప్పుడు)

ద్రౌపదిని కౌరవ సభలో అవమానించిన దుష్టుల గర్వాన్ని అణచడానికి ధర్మానికి అనుగుణంగా ఉండే ధర్మరాజు నడవడియే ప్రతిబంధకం. కర్తవ్యానికి ఇది సమయము కాదని అప్పుడు భీముడు అనుకున్నాడు.

213. సమస్య: ధర్మాచరణము జనులకు దైన్యము బెంచుస్

213.297 కం. మర్మము మోక్షమ్మునకు స్వ
ధర్మాచరణమ్ము తోడి దాతృగుణంబే,
కర్మయుగమున పెరిగెడి య
ధర్మాచరణము జనులకు దైన్యముఁ బెంచుస్.

(మర్మము = కిటుకు, దాతృ = దానముచేయు, కర్మయుగము = కలియుగము, దైన్యము = దీనత్వము)

స్వధర్మాన్ని ఆచరించడంతో పాటు దానగుణ ముండడమే మోక్షానికి కిటుకు. కలియుగంలో పెరిగే అధర్మాచరణము జనాల్లో దీనత్వం పెంచుతుంది.

214. సమస్య: ధర్మాధర్మ విచక్షణా రహితుడే తత్త్వజ్ఞు డిద్ధాత్రిలో

214.298 శా. కర్మాకర్మ విచక్షణల్ విడచి దుష్కార్యంబు లందుస్ యలం
కర్మీణుండు మమత్వశీలి యగుచుస్ కల్మచ్చుగా నున్నచో
ధర్మాధర్మ విచక్షణా రహితుడే, తత్త్వజ్ఞు డిద్ధాత్రిలో
కర్మాసక్తిని వీడి సంతతము సత్కర్తవ్య నిష్ఠస్ మనుస్.

(అకర్మ = చేయదగని కార్యము, విచక్షణ = యుక్తాయుక్త జ్ఞానము, అలంకర్మీణుడు = పనియందు నేర్పరియైనవాడు, మమత్వశీలి = 'నాది' అను భావము కలవాడు, కల్మచ్చు = దుష్టుడు, రహితుడు = లేనివాడు, తత్త్వజ్ఞుడు = మౌలిక సత్యము తెలిసిన వాడు, ధాత్రి = భూమి, సంతతము = ఎల్లప్పుడు, మను = జీవించు)

చేయదగిన చేయకూడని పనుల యందు విచక్షణ లేకుండా, చెడ్డ పనులు చేయడంలో సమర్థుడు, మమత్వబుద్ధి కలవాడు దుష్టుడుగా ఉంటే ధర్మము అధర్మము అన్న విచక్షణ లేనివాడే అవుతాడు. ఈ లోకంలో మౌలిక సత్యము తెలిసిన వాడు ఎప్పుడూ కూడా కర్మల యందు ఆసక్తిని (కర్మఫలమందు) విడిచిపెట్టి మంచి పనులు చేయడమే నిష్ఠగా జీవిస్తాడు.

215. సమస్య: ధవుని పరాభవించుటయె ధర్మము సాధ్వికి తప్పు లేదిలన్

215.299 చం. బవరముఁ జేయఁ గల్గు తన భర్తలు లేర నెరింగి, తన్ను కా
మ వశుడు స్యందనంబున నమాంతము చేకొన వచ్చె దుస్సలా
ధవుడని, కృష్ణ యాతనిని ధౌమ్యుడుఁ జూడగ తాకనాడె, సైం
ధవుని పరాభవించుటయె ధర్మము సాధ్వికి తప్పు లేదిలన్.

(బవరము = యుద్ధము, స్యందనము = రథము, అమాంతము = తటాలున, ధవుడు = భర్త, కృష్ణ = ద్రౌపది, తాకనాడు = దూషించు)

యుద్ధము చేయగలిగిన తన భర్తలు లేరని తెలుసుకొని, తనను కామవశుడు రథంలో తటాలున తీసుకొని పోవడానికి దుస్సల భర్తయైన సైంధవుడు వచ్చాడని, ద్రౌపది ఆతనిని ధౌమ్యుడు చూస్తూ ఉండగానే దూషించింది. సైంధవుణ్ణి అవమానించడమే పతివ్రతయైన ద్రౌపదికి ధర్మము. లోకంలో అది తప్పు కాదు.

216. సమస్య: ధైర్యము స్థైర్యమున్ గలియ దక్కు సుభిక్షము దేశమందికన్

216.300 ఉ. ఆర్యుల ద్రావిడప్రజల యంచిత సంస్కృతి మూల మివ్వ, యౌ
దార్యము, శాస్త్రనైపుణి, విధానములందు సమత్వభావమున్,
కార్యములందు సిద్ధియు, యకాయకి చిక్కుల తీర్చు నేర్పుతో
ధైర్యము స్థైర్యమున్ గలియ దక్కు సుభిక్షము దేశ మందికన్.

(అంచిత = గౌరవింపబడినది, సంస్కృతి = నాగరికత, మూలము = ఆధారము, ఔదార్యము = దయాదాక్షిణ్యము, సమత్వము = సమానత్వము, సిద్ధి = ఈడేఱుట, యకాయకి = వేగముగా, చిక్కు = సంకటము, స్థైర్యము = స్థిరత్వము, సుభిక్షము = సమృద్ధి)

ఆర్యద్రావిడ ప్రజల పూజ్యమైన నాగరికత ఆధారము నివ్వగా, ఉదారత్వము, శాస్త్రజ్ఞానంలో నిపుణత్వము, కార్యపాలనలో సమభావము, అనుకున్న పనులు సిద్ధించడం, వేగంగా సమస్యలను తీర్చే నేర్పుతో పాటు ధైర్యస్థైర్యాలు కలిస్తే ఇంక దేశానికి సమృద్ధి దక్కుతుంది.

216.301 ఉ. భార్యల గౌరవించు పరివార నిబంధన, విద్య నేర్పు యా
చార్యుల కార్యదీక్ష, వ్యవసాయము వృత్తుల యందు హెచ్చు నై

శ్వర్యము, స్వాస్థ్య మందు కడు భద్రము, యాపద లందునన్ మనో
ధైర్యము స్థైర్యమున్ గలియ దక్కు సుభిక్షము దేశమందికన్.

(నిబంధన = నియమము, వృత్తి = జీవనోపాధి, హెచ్చు = పెరుగు, ఐశ్వర్యము = సంపద, స్వాస్థ్యము = ఆరోగ్యము, భద్రము = జాగరూకత, స్థైర్యము = స్థిరత్వము, సుభిక్షము = సమృద్ధి)

భార్యలను గౌరవించే కుటుంబ నియమము, చదువు చెప్పే ఉపాధ్యాయుల కార్యదీక్ష, వ్యవసాయము తదితర వృత్తులలో పెరిగే సంపద, ఆరోగ్య విషయంలో మిక్కిలి జాగ్రత్త, ఆపదలలో మనోధైర్యము, స్థిరత్వము కలిస్తే ఇంక దేశానికి సమృద్ధి దక్కుతుంది.

217. సమస్య: నన్నయ తిక్కనాదులె ఘనంబని మెచ్చిరి నా కవిత్వమున్

217.302 ఉ. సన్నుతిఁ జేసి పెద్దల ప్రసన్నకథాకవితార్థ యుక్తితో,
యన్నువ ధైర్యమున్ కొలది యక్షర రమ్యత మేళవించి నే
నన్నియు పద్యముల్ నటితియా యను నట్టుగఁ జెప్పఁ జూచి, యా
నన్నయ తిక్కనాదులె ఘనంబని మెచ్చిరి నా కవిత్వమున్.

(సన్నుతి = చక్కని స్తుతి, అన్నువ = కొంచెము, నటితి = నాటకము)

నన్నయ కవిత్వ లక్షణాలలో ప్రసన్నకథాకవితార్థయుక్తి, అక్షర రమ్యత ఉన్నాయి. తిక్కన కవిత్వంలో నాటక శైలి ఉంది. వాళ్ళిద్దరూ మెచ్చే కవిత్వానికి ఇవన్నీ ఉండాలి అని అనుకుని వ్రాసిన పద్యం ఇది. పెద్దలను ప్రార్థించి ప్రసన్నకథాకవితార్థయుక్తితో, కొంచెం ధైర్యము, కొంచెం అక్షర రమ్యత కలిపి నేను అన్నీ పద్యాలే నాటకమా అనేటట్లుగా చెప్పడం చూసి నా కవిత్వాన్ని నన్నయ, తిక్కన మొదలైన వాళ్ళు మెచ్చుకున్నారు.

218. సమస్య: నన్నయ యాంధ్రభోజుఁ డనినన్ సరి యంచును మెచ్చి రెల్లరున్

218.303 ఉ. పన్ని ప్రణాళికన్ తెలుగు వాఙ్మయ మందున భారతమ్ము తా
చెన్నుగ వెల్గు రీతి విరచించిన వాగనుశాసనుండు మా
నన్నయ, యాంధ్రభోజుఁ డనినన్ సరి యంచును మెచ్చి రెల్లరున్
దన్నుగ నిల్చి తెల్గు కవితన్ వెలయించిన కృష్ణరాయనిన్.

(పన్ను = సిద్ధపఱచు, ప్రణాళిక = పథకము, వాఙ్మయము = సాహిత్యము, చెన్ను = అందము, దన్ను = అండ, వెలయించు = దీపింపచేయు)

పథకము సిద్ధపఱచి తెలుగు సాహిత్యంలో భారతాన్ని తాను అందంగా ప్రకాశించే విధంగా రచించిన వాగనుశాసనుడు మా నన్నయ. అండగా నిలిచి తెలుగు కవిత్వాన్ని దీపింప చేసిన కృష్ణదేవరాయలను ఆంధ్రభోజుడు అని అంటే అది సరియైనదేనని అందరూ మెచ్చుకున్నారు.

219. సమస్య: నమ్మిన వారికే కలుగు నాశము దుఃఖము నిన్ను కేశవా

219.304 ఉ. దమ్మము నాచరింపక నితాంతము దారుణ క్షుద్ర విద్యలన్
నమ్మిన వారికే కలుగు నాశము దుఃఖము, నిన్ను, కేశవా!
నెమ్మిక తోడఁ గొల్చెడి యనేకులుఁ గందురు విశ్వరూపుగన్,
నమ్మిన నిన్ను నాశ మను నానుడు లేదని విశ్వశించితిన్.

(దమ్మము = ధర్మము, నితాంతము = అధికము, దారుణ = భయంకరమైన, క్షుద్ర విద్యలు = చేతబడులు, బానామతి మొదలైనవి, నెమ్మిక = ప్రేమము, కొల్చు = ఆరాధించు, విశ్వరూపుడు = అన్ని రూపములలో నుండువాఁడు, నానుడు = మాట, విశ్వశించు = నమ్ము)

ధర్మము ఆచరించకుండా, ఎక్కువగా భయంకరమైన క్షుద్రవిద్యలని నమ్మిన వాళ్ళకి మాత్రమే వినాశనము దుఃఖము కలుగుతాయి. ఓ కేశవా! నిన్ను ప్రేమతో ఆరాధించే అనేక భక్తులు విశ్వవ్యాపకుడిగా నిన్ను చూస్తారు, నిన్ను నమ్మితే నాశము అనే మాట లేదని నమ్మాను.

220. సమస్య: నాటి రోజు లిక రావిక రావిక రావు మిత్రమా

220.305 ఉ. ఆలిని బిడ్డలన్ వదలి యారడిఁ బెట్టు బ్రిటీషు పాలనన్
తాలిమితో నెదిర్చిరి స్వతంత్రము కోసము, స్వంత లాభమున్
మాలికొనన్ ప్రతిజ్ఞ తలమానిక మప్పుడు, నేడు మెండయెన్
లాలస, నాటి రోజు లిక రావిక రావిక రావు మిత్రమా!

(ఆరడి పెట్టు = బాధపెట్టు, పాలన = ఏలుబడి, తాలిమి = ధైర్యము, ఎదుర్చు = ప్రతిఘటించు, మాలికొను = త్యజించు, తలమానికము = శ్రేష్ఠము, మెండు = అధికము, లాలస = దురాశ)

భార్యాబిడ్డలను వదలి కష్టాలు పెట్టే బ్రిటీషు పాలనను, స్వతంత్రము కోసము, ధైర్యంతో ఎదిరించారు. స్వంతలాభాన్ని త్యజించాలనే ప్రతిజ్ఞ చాలా గొప్ప విషయం ఆ రోజుల్లో. ఈ కాలంలో, దురాశ ఎక్కువైంది. నాటి రోజులు మళ్ళీ రావు మిత్రమా.

220.306 ఉ. ఆలికి సాగుమానమని యామెను భర్త చితిన్ దహించిరే,
బాలను వృద్ధు కిచ్చుచు వివాహము శుల్కముఁ గోరిఁ జేసిరే,
చాల యమానుషమ్మనిరి జ్ఞానులు నాడె, మరిప్పుడేమొ నే
రాలవి, నాటి రోజు లిక రావిక రావిక రావు మిత్రమా!

(సాగుమానము = సహగమనము, దహించు = కాల్చు, శుల్కము = కన్యాశుల్కము)

సతీసహగమనము అని బతికున్న భార్యను భర్త చితిలో వేసి కాల్చారు కాదా. చిన్న పిల్లను ముసలాడి కిచ్చి కన్యాశుల్కం కోసం పెళ్ళి చేశారు కాదా. అలా జరిగే రోజుల్లోనే, పండితులు ఇవి చాలా అమానుషం అని అన్నారు కదా. మరిప్పుడైతే, అవి నేరాలు. అందుచేత, మిత్రమా, నాటి రోజులు మళ్ళీ రావు.

221. సమస్య: నానాటికి నీరసించె నవలా మణియున్

221.307 కం. ఆ నాటి విలువ లన్నియు
నానాటికి నీరసించె, నవలా మణియున్
బోనాడెను వెనుకటి స
మ్మానము, పైమెఱుగులే ప్రమాణంబు లయెన్.

(విలువలు = నీతికి, ధర్మానికి కట్టుబడి ప్రవర్తించటం, నానాటికి = క్రమక్రమముగా, నీరసించు = బలహీనమగు, నవలా = స్త్రీ, పోనాడు = పోగొట్టుకొను, పైమెఱుగులు = వట్టి తళుకులు, ప్రమాణము = కొలమానిక)

ఆ నాటి విలువలన్నీ క్రమక్రమముగా తగ్గిపోయాయి. వనితారత్నము కూడా వెనుకటి గౌరవాన్ని పోగొట్టుకొంది. పై మెరుగులే ప్రమాణాలు అయ్యాయి.

221.308 కం. మానినుల నణచు నైజము
నానాటికి నీరసించె, నవలా మణియున్
తానెందున మగవానికి

న్యూనముఁ గాదనుచుఁ దెలిపె నుత్సాహముతో.

(మానిని = మానవతి యగు స్త్రీ, నైజము = స్వాభావికము, నానాటికి = క్రమక్రమముగా, నీరసించు = బలహీనమగు, నవలా మణి = నారీరత్నము, న్యూనము = తక్కువైనది)

స్త్రీలను అణచే స్వభావము క్రమక్రమముగా బలహీనమయ్యింది. నారీరత్నము కూడా తాను ఎందులోనూ మగవానికి తక్కువైనది కాదని ఉత్సాహంగా చెప్పింది.

222. సమస్య: నానాటికిఁ దీసికట్టు నాగంభొట్లూ

222.309 కం. పోనాడి పూర్వ విభవము,
ఈనా డునికిని వెదకుచు యిక్కట్లఁ బడన్,
మానిత రాచరికమ్ములు
నానాటికిఁ దీసికట్టు నాగంభొట్లూ.

(పోనాడు = పోగొట్టుకొను, పూర్వ = ముందుండునది, విభవము = ఉన్నతస్థితి, ఉనికి = స్థితి, ఇక్కట్లు = యాతనలు, మానితము = సన్మానితము, నానాటికి = క్రమక్రమముగా, తీసికట్టు = నిరాశాజనకమైన స్థితి)

వెనకటి వైభవాన్ని పోగొట్టుకొని, ఈ నాడు ఉనికిని వెతుక్కుంటూ యాతనలు పడగా గౌరవనీయమైన రాచరికాలు "నానాటికిఁ దీసికట్టు నాగంభొట్లూ" అన్నట్లుగా అయ్యాయి.

223. సమస్య: నాలుగు రెండు నయ్యెనట నల్లని వాని కదేమి చిత్రమో

223.310 ఉ. నాలుగు హస్తముల్ వెలయు నందను సాత్వతిఁ జూచి కుందగా,
బాలుడు వీడటంచు శిశుపాలుని కృష్ణుడు చంకనెత్తగన్,
మేలము పాలుఁ జేయు వొడ మేనను మాయముఁ గాగ, హత్తముల్
నాలుగు రెండు నయ్యెనట, నల్లని వాని కదేమి చిత్రమో!

(హస్తము = చేయి, వెలయు = బయలుపడు, నందనుడు = కొడుకు, కుందు = శోకించు, మేలము = పరిహాసము, పాలు = వశము, వొడ = రూపు, మేను = శరీరము, హత్తము = చేయి, చిత్రము = ఆశ్చర్యము)

నాలుగు చేతులూ బయటపడ్డ కుమారుని చూసి కృష్ణుని మేనత్తయైన సాత్వతి బాధపడగా, వీడు బాలుడు అని శిశుపాలుణ్ణి కృషుడు చంకనెత్తుకోగానే పరిహాసము పాలు చేసే రూపము శరీరంలో మాయం కాగా, చేతులు నాలుగూ రెండయ్యాయిట. నల్లని వాడైన కృష్ణునికి ఇదేమి వింతో!

224. సమస్య: నాస్తికులకు దైవమన్న నయముస్ భయముస్

224.311 కం. జాస్తి నిరీశ్వర వాదము
నాస్తికులకు; దైవమన్న నయముస్ భయముస్
'అస్తి' యనెడు విశ్వాసము
ఆస్తికులకు; కలవటంచు యందురు జగతిస్.

నాస్తికులకు నిరీశ్వర వాదము ఎక్కువ. దేవుడంటే ఆస్తికులకు ధర్మదృష్టి, భయము, కలడు అను విశ్వాసము ఉన్నాయని లోకంలో అంటారు.

224.312 కం. అస్తిత్వము యాస్తికులకు
నాస్తికులకు, దైవమన్న నయముస్ భయముస్
'అస్తి'య, 'నాస్తి'య, యను య
ప్రస్తుత సంవాద మందె, రాజీ లేకస్.

ఆస్తికులకు, నాస్తికులకు ఉనికి దేవుడంటే ధర్మదృష్టి, భయము, కలదు, లేదు అను రాజీ లేని అప్రస్తుత సంవాదములోనే.

225. సమస్య: నిందారోపణముల్ హితమ్ము నొసగుస్ నీరేజ పత్రేక్షణా

225.313 శా. నిందించెస్ మణి దొంగ వీవె యనుచుస్ నీ తండ్రి నన్నుస్ మునుస్,
యందించెస్ నిను దాని తోడ యది కల్లంచుస్ నిరూపించగా,
నిందారోపణముల్ హితమ్ము నొసగుస్, నీరేజపత్రేక్షణా!
కందాయమ్మది యంచు మేలుకొలిపెస్ కంసారి సాత్రాజితిస్.

(మణి = శమంతకమణి, మును = ముందు, కల్ల = అబద్ధము, నింద = అపవాదు, ఆరోపణ = లేనిది మోపుట, హితము = మంచిది, ఒసగు = ఇచ్చు, నీరేజపత్రేక్షణా = పద్మదళములవంటి కనులు కలదానా, కందాయము = లాభము, మేలుకొలుపు = మేలుకొనజేయు)

ఓ, పద్మదళములవంటి కనులు కలదానా! శమంతకమణి దొంగిలించింది నువ్వే అని మొదట నీ తండ్రి నన్ను నిందించాడు. అది అబద్ధము అని నిరూపించగానే ఆ మణితో నిన్ను నాకు అందించాడు. నిందలు అరోపణలు మేలు చేస్తాయి. అది లాభము అంటూ శ్రీకృష్ణుడు సత్యభామను మేలుకొలిపాడు.

226. సమస్య: నిదురించెడి వాడె ధారుణిన్ యశమందున్

226.314 కం. వదలని వర్షం బందున
కదలక వటపత్ర శాయి కడుపున సృష్టిన్
పదిలముగఁ గాచె, మాయన్
నిదురించెడి వాడె ధారుణిన్ యశ మందున్.

ప్రళయం వచ్చినపుడు వదలకుండా ఏకధారగా వర్షం పడుతుంటే, చలించక మర్రి ఆకు మీద శయనిస్తున్న వటపత్రశాయియైన విష్ణుమూర్తి కడుపులో సృష్టి నంతటినీ పదిలంగా రక్షించాడు. అలా, మాయతో నిద్రపోతున్న వాడే లోకంలో కీర్తి పొందుతాడు.

227. సమస్య: నిస్పృహ జీవితమ్మునకు నిత్య శుభమ్ముల నిచ్చు నెచ్చెలీ

227.315 ఉ. నిస్పృహ యుండ వీల్పడదు నీదగు కర్మల నాచరింప, పా
ర్థా! స్పృహ తోడి యుద్ధమును ధైర్యముగా నిటఁ జేయు మంచు ధ
ర్మస్పృహ నిచ్చి కృష్ణు డనుమానముఁ దీర్ప ననెన్, ఫలంబుపై
నిస్పృహ జీవితమ్మునకు నిత్య శుభమ్ముల నిచ్చు నెచ్చెలీ!

(నిస్పృహ = కోరిక లేకపోవడం, కర్మలు = బాధ్యతలకి సంబంధించిన పనులు, స్పృహ = ఇచ్ఛ, ఫలము = ఫలితము, నెచ్చెలి = స్నేహితుడు)

ఓ, పార్థా! నువ్వు చెయ్యవలసిన కర్మలు ఆచరించడంలో నిస్పృహ ఉండడానికి కుదరదు. స్పృహ కలిగి ధైర్యంగా ఇక్కడ యుద్ధం చెయ్యమంటూ, ధర్మము ఆచరించుట యందు స్పృహను ఇచ్చి, అనుమానం తీర్చడం కోసం

కృష్ణుడు ఏమన్నాడంటే, మిత్రమా! చేసే కర్మల ఫలితం మీద నిస్పృహ, జీవితానికి ఎప్పుడూ మంచిని చేకూరుస్తుంది.

228. సమస్య: నీతులు లేని పాలనము నిర్మల శాంతి సుఖంబు లీయవే

228.316 ఉ. చేతల మాటలన్ ప్రజల క్షేమమె గమ్యముగా, హితంబె సం
కేతముగా యనామయము, కీలక పాత్రను విద్య కిచ్చుచున్,
నేతల వర్తనమ్ము యనునిత్యము తోడుగ యున్న, యట్టి దు
ర్నీతులు లేని పాలనము నిర్మల శాంతి సుఖంబు లీయవే.

(గమ్యము = పొందదగినది, హితము = మంచి, సంకేతము = గుర్తు, అనామయము = ఆరోగ్యము, కీలక = ముఖ్యము, వర్తనము = ప్రవర్తన, అనునిత్యము = ప్రతి నిత్యము, దుర్నీతి = అన్యాయము, నిర్మల = స్వచ్ఛమైన)

చేతలలోనూ మాటలలోనూ ప్రజాక్షేమమే గమ్యంగా, మంచికి గుర్తుగా ఆరోగ్యము, విద్యారంగానికి ముఖ్య పాత్ర ఇస్తూ, నాయకుల ప్రవర్తన ప్రతి నిత్యము మనకి తోడుగా ఉన్నటువంటి అన్యాయాలు లేని పరిపాలన స్వచ్ఛమైన శాంతి సుఖాలని ఇవ్వవా.

229. సమస్య: నీలగళుఁడు హరి శివుండు నీలాంగుండే

229.317 కం. పోలుదురే నా కిప్పుడు
నీలగళుఁడు, హరి; శివుండు, నీలాంగుండే
యాలమునన్ నా కెదురుగ
కాలూనరనుచు, హిరణ్యకశిపుం డనియెన్.

(పోలు = సరిపోలు, నీలగళుడు = శివుడు, హరి = విష్ణువు, నీలాంగుడు = విష్ణువు, ఆలము = యుద్ధము, కాలూను = కాలు నిలువ ద్రొక్కుకొను)

శివుడు, విష్ణువు నాతో సరిపోలతారా, వాళ్ళిద్దరూ, యుద్ధంలో నాకు ఎదురుగా కాలు నిలద్రొక్కుకోలేరని హిరణ్యకశిపుడు అన్నాడు.

230. సమస్య: నెలలో సుతుఁగన్న తల్లి నిగనిగ లాడెస్

230.318 కం. కలతలు మదిలో నింపక
సులభంబుగ కాన్పు తెచ్చు చొప్పులు సలుపస్
యలవోకవోలె పదియవ
నెలలో సుతుఁగన్న తల్లి నిగనిగ లాడెస్.

(కలత = చీకాకు, మది = మనస్సు, నింపు = నిండించు, చొప్పు = విధానము, చలుపు = ఆచరించు, అలవోకవోలె = అనాయాసంగా)

మనస్సులో చీకాకులు నింపకుండా, తేలికగా కాన్పు తెచ్చే విధానాలు ఆచరించడం వల్ల, అనాయాసంగా పదియవ నెలలో కొడుకుని ప్రసవించిన తల్లి నిగనిగా మెరిసింది.

231. సమస్య: నేత్రము లగ్నిహోత్రములు నెయ్యము లేదిక కయ్యమే యనెస్

231.319 ఉ. చిత్రము, భారతోర్వి రణ సీమనుఁ గూడి బ్రిటీషు వారికిస్
మిత్రుని వోలె పాల్గొనగ మేకొన మంచు, యజాదు హిందు ఫౌ
జాత్రముగా నహింస విడి యాంగ్ల ప్రభుత్వము నడ్డగించి, మా
నేత్రము లగ్నిహోత్రములు నెయ్యము లేదిక కయ్యమే యనెస్.

(చిత్రము = ఆశ్చర్యము, ఉర్వి = భూమి, రణసీమ = యుద్ధభూమి, కూడు = కలియు, పాల్గొను = పాలు పంచుకొను, మేకొను = సమ్మతించు, ఆత్రము = హుటాహుటి, విడు = త్యజించు, అడ్డగించు = ఆటంకపఱచు, నెయ్యము = స్నేహము, కయ్యము = యుద్ధము)

భారతావని యుద్ధభూమిలో (రెండవ ప్రపంచ యుద్ధము) కలిసి బ్రిటీషు వారికి మిత్రుడి లాగా పాల్గొనటం ఆశ్చర్యము, ఒప్పుకోము అని అంటూ, అజాద్ హింద్ ఫౌజ్ హుటాహుటిని అహింసని విడనాడి ఆంగ్లేయ ప్రభుత్వాన్ని నిరోధించి, మా కళ్ళు అగ్నిగుండాలు, ఇక స్నేహం లేదు, యుద్ధమే అని అంది.

231.320 ఉ. హాత్రముఁ జేయ నాజ్ఞ జలియన్వలబాగున డయ్య రివ్వగా,
యాత్రముగా బ్రిటీషు దళ మచ్చట కాల్పులు సల్పఁ జూచి, నా
నేత్రము లగ్నిహోత్రములు, నెయ్యము లేదిక కయ్యమే యనెస్,

క్షాత్రముఁ జూపి డయ్యరును చంపగ యుద్ధమ సింగుఁ బూనుచున్.

(హాత్రము = హత్య, ఆత్రము = హుటాహుటి, దళము = సైన్యము, నెయ్యము = స్నేహము, కయ్యము = యుద్ధము, క్షాత్రము = హింస నుండి రక్షించే క్షత్రధర్మము, పూను = ఉద్యమించు)

జలియన్ వాలా బాగ్ లో హత్య చేయడానికి జనరల్ డయ్యర్ ఆజ్ఞ ఇవ్వగా, హుటాహుటిన ఆంగ్ల సైన్యము అక్కడ కాల్పులు జరపడం చూసి నా కళ్ళు అగ్నిగుండా లయ్యాయి, ఇక స్నేహం లేదు, యుద్ధమే అని క్షత్రధర్మము చూపించి డయ్యర్ని చంపడానికి ఉద్యమించిన ఉద్ధం సింగ్ అన్నాడు.

232. సమస్య: నేనును నేను నే నను నే నన నెన్నను నన్ను నేనునున్

232.321 ఉ. నేనె మహా ధనుర్ధరుడ, నేనె సుయోధను మేలుఁ గోరుదున్
నే ననిఁ బోరగా గెలుపు నిశ్చయ మంచను కర్ణుఁ గాంచి క్రో
ధానల మూర్తి భీష్ముడనె దర్పము వీడక మాటిమాటికిన్
నేనును నేను నే నను నే నన నెన్నను నన్ను నేనునున్.

(ధనుర్ధరుడు = విలుకాడు, సుయోధనుడు = దుర్యోధనుడు, అని = యుద్ధము, పోరు = పోట్లాడు, నిశ్చయము = ఖాయము, క్రోధము = కోపము, అనలము = అగ్ని, దర్పము = గర్వము, వీడు = వదలు, ఎన్ను = గణించు)

నేనే గొప్ప విలుకాడిని, నేనే దుర్యోధనుడి మేలు కోరే వాడిని, నేను యుద్ధం చేస్తే విజయము ఖాయము అని చెప్పే కర్ణుణ్ణి చూసి, గర్వము వదలిపెట్టక మాటిమాటికి నేను, నేను, నేను అనంటాడు, నేను అని అంటే నన్ను నేనే పట్టించుకోను అని కోపాగ్ని స్వరూపుడైన భీష్ముడు అన్నాడు.

232.322 ఉ. ప్రాణుల చావు పుట్టుకల వగ్గెరఁ దేల్చును పూర్వకర్మలే,
జ్ఞానము లేని వాడె బలజమ్మున చావుకు హేతు వేమనన్
నేనును నేను నే నను, నే నన నెన్నను నన్ను నేనునున్,
కాన నరా! స్వధర్మమె సుకర్మనిఁ జెప్పెను కృష్ణు డొజ్జయై.

(వగ్గెర = పాశము, బలజము = యుద్ధము, ఎన్ను = గణించు, నరా = అర్జునా, స్వధర్మము = తన విధి, సుకర్మ = మంచి పని, ఒజ్జ = గురువు)

జీవుల పుట్టుకల మరణముల పాశమును పూర్వకర్మలే నిర్ధారిస్తాయి. అజ్ఞాని మాత్రమే యుద్ధంలో చావుకి కారణం ఏమిటి అని అడిగితే నేను, నేను, నేను అని అంటాడు. కాబట్టి అర్జునా! స్వధర్మమే మంచిదని కృష్ణుడు గురువై బోధించాడు.

233. సమస్య: పంచెఁ గట్టు టిపుడు ఫ్యాషనాయె

233.323 ఆ.వె. దైవకార్యములను దారకర్మము లందు
తళుకు లీను వస్త్ర తతులఁ జూప,
స్త్రీలు కట్ట పట్టుచీర, పురుషు లేమొ
పంచెఁ గట్టు టిపుడు ఫ్యాషనాయె.

(దారకర్మము = పెండ్లి, తళుకు = మిక్కిలి ప్రకాశము, ఈను = వెలువరించు, తతి = సమూహము)

దైవకార్యాలలోనూ, పెళ్ళిళ్ళలోనూ ఎక్కువగా మెరిసే దుస్తులు చూపించడానికి స్త్రీలు పట్టుచీర కడితే పురుషులేమో పంచె కట్టడం ఇప్పుడు ఫ్యాష (Fashion) నయ్యింది.

233.324 ఆ.వె. సాంప్రదాయకమగు సకల పురుషులకు
పంచెఁ గట్టు, టిపుడు ఫ్యాషనాయె,
ప్యాంటు, షర్టు, టైలు, పాశ్చాత్య దొర వోలె
వేసి, విఱ్ఱవీగ వీటిపట్ల.

(విఱ్ఱవీగు = అహంకారంతో ప్రవర్తించు, వీటిపట్టు = పట్టణము)

పురుషు లందరికీ పంచెకట్టు సాంప్రదాయకము. ఇప్పుడు పడమటి దేశాల దొరల లాగా ప్యాంటు (Pant), షర్టు (Shirt), టైలు (Ties) వేసి పట్టణాల్లో మిడిసిపడటం ఫ్యాష (Fashion) నయ్యింది.

233.325 ఆ.వె. తెలుగుతనము నెల్ల దీపింప జేసిన
పంచెఁ గట్టు టిపుడు ఫ్యాషనాయె
ఫ్యాన్సి డ్రెస్సు వోలె పార్టీల, రెడిమేడు
పంచె లందుకు సులభముగ దొరుక.

(ఎల్ల = అంతటా, దీపించు = ప్రసిద్ధమై యుండు)

తెలుగుతనాన్ని అంతటా వాసికెక్కించిన పంచె కట్టుట, ఇప్పుడు రేడీమేడు (Readymade) పంచెలు సులభంగా దొరకడం వల్ల ఫ్యాన్సీ (Fancy) డ్రెస్సు(Dress) లాగా పార్టీలలో ఫ్యాష(Fashion) నయ్యింది.

234. సమస్య: పండుగ నాడును లభించె పాత మగండే

234.326 కం. షండుడు కాదు విజయుడా
తండు, విజయదశమి నాడు తరుముటఁ గని భీ
ష్ముం డనియె కౌరవులతో,
పండుగ నాడును లభించె పాత మగండే.

(షండుడు = నపుంసకుడు, విజయుడు = అర్జునుడు, తరుము = వెన్నాడి పరుగెత్తించు)

ఉత్తర గోగ్రహణ ఘట్టంలో కౌరవుల నెదిరించడానికి బృహన్నల యుద్ధానికి వచ్చి అందరినీ ఓడిస్తాడు. వచ్చినది నపుంసకుడు కాదు, అతడు విజయుడు. విజయదశమి రోజున కౌరవులను తరిమి కొట్టడం చూసిన భీష్ముడు వాళ్ళతో "పండగనాడు కూడా మీకు పాత మొగుడే దొరికాడు" అని అన్నాడు.

234.327 కం. రండిది రవికెల పండుగ
కండటు మీ రవిక యే మగడు పొందెనో యా
గండడె తోడన్న సతికి
పండుగ నాడును లభించె పాత మగండే.

[కండటు (కండు + అటు) = అటు చూడండి, గండడు = మగడు, సతి = భార్య]

గతంలో 'కంచుకోత్సవం' లేదా 'రవికల పండుగ' అని ఒక ఉత్సవం ఉండేదట. స్త్రీలంతా రవికలు విడిచి ఒక చోట గుట్టగా పోస్తే, పురుషులు ఆ గుట్టలోంచి తలా ఒక రవికను గ్రహించి, ఆ రవికను ఎత్తిచూపుతూ, ఎవరిదీ రవిక అని అడుగుతూ ఆ రవిక స్వంత దారు ఎవరో కనుగొనే ప్రయత్నం చేస్తారు. ఆ రవిక నాదే అంటూ వచ్చే స్త్రీకి, ఆ రవిక తెచ్చినవాడే, ఆ రాత్రికి రమణుడు. ఒక సారి ఒకతనికి తన భార్య రవికే దొరికిందట. ఆమె 'పండగ నాడు కూడా పాత మొగుడేనా' అని నిట్టూర్చిందట. ఆ విధంగా పుట్టిన సామెతే 'పండగ నాడు కూడ పాత మొగుడేనా' అన్నది. ఈ వివరాలు 'పెళ్ళి దాని పుట్టు పూర్వోత్తరాలు' అన్న పుస్తకంలో తాపీ ధర్మారావు గారు చెప్పారు.

ప్రముఖ సినీదర్శకుడు విశ్వనాథ్ గారు తీసిన 'స్వయంకృషి' సినిమాలో, కాలేజీలో జరిగే సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రవికెల పండుగని చూపించారు.

రండు, ఇది రవికెల పండుగ, అటు చూడండి, మీ రవికె ఏ మగడు పొందాడో, ఆ మగడే తోడు అన్న భార్యకి పండగ నాడు కూడా పాత మగడే దొరికాడు.

235. సమస్య: పంది పటుక్కునన్ కొరికె పంకజలోచన మోవి గ్రక్కునన్

235.328 ఉ. సుందరియౌ కళత్రము వసుంధర రాక్షసుచే రసాతలం
బందున బందిఁ గాగ, వనమాలియె శ్వేత వరాహ రూపుడై
వ్రందగఁ జేసె రక్కసుని, మాతను యంబుధి నిల్పుచున్ రహిన్
పంది పటుక్కునన్ కొరికె పంకజలోచన మోవి గ్రక్కునన్.

(కళత్రము = భార్య, వసుంధర = భూదేవి, రసాతలము = పాతాళలోకము, బంది = నిర్బంధము, వనమాలి = విష్ణువు, శ్వేతవరాహము = శ్రీమహావిష్ణువు మూడవ అవతారమైన తెల్లని పంది, వ్రందు = చచ్చు, రక్కసుడు = రాక్షసుడు, అంబుధి = సముద్రము, రహి = ప్రేమ, పటుక్కున = తటాలున, పంకజలోచన = కమలముల వంటి కన్నులు కలది, మోవి = పెదవి, గ్రక్కున = శీఘ్రముగా)

అందమైన తన భార్య భూదేవి పాతాళ లోకములో రాక్షసుని (హిరణ్యాక్షుడు) బందీ అవ్వగా, విష్ణుమూర్తి శ్వేత వరాహావతారంలో రాక్షసుణ్ణి తుదముట్టించాడు. భూదేవిని సముద్రం మీద నిలబెట్టే సమయంలో, ప్రేమతో ఆ కమలాక్షి పెదవిని, వరాహము (పంది) వెంటనే పటుక్కున కొరికాడు.

236. సమస్య: పందే తెమ్ము తినంగ నంచు పలికెన్ బాపండు పేరాసతో

236.329 శా. విందుల్ యెక్కుడుఁ గాగ మేను బరువై వేధింపు మెండయ్యె, నే
నెందున్ బోనిక, నూనె వస్తువుల నే నీ యింట ముట్టన్ యనన్
యుందేఁ గాని క్షుదార్తు డైతిని సతీ! యున్నంత భక్ష్యంబు వే
పందే తెమ్ము తినంగ నంచు పలికెన్ బాపండు పేరాసతో.

(ఎక్కుడు = అధికము, మేను = శరీరము, వేధింపు = బాధించుట, మెండు = అధికము, క్షుదార్తుడు = ఆకలి బాధ యున్నవాడు, సతి = భార్య, భక్ష్యము = తిన దగినది, వేపు = బాణలిలో వేయించుట, బాపడు = బ్రాహ్మణుడు, పేరాస = కక్కుర్తి)

విందు భోజనాలు ఎక్కువ అవడం వల్ల శరీరం బరువై బాధ అధికం అయ్యింది. నేను ఇంకా ఎక్కడికీ పోను. నేను నూనె వస్తువులను ఈ యింటిలో ముట్టను అని అనాలని ఉంది గానీ, ఓ భార్యామణీ! ఆకలితో బాధ పడుతున్నాను, ఉన్నంత భక్ష్యమే వేపుడు కానిది తీసుకొని రా, తినడానికి అంటూ బ్రాహ్మణుడు కక్కుర్తితో చెప్పాడు.

237. సమస్య: పందే నా కిష్ట మనుచు బాపడు పలికెన్

237.330 కం. వ్రుందించి హిరణ్యాక్షుని
క్రిందితలము నుండి యద్రికీలను దంష్ట్రన్
సందరము పై నిలుపు, తొలు
పందే నా కిష్ట మనుచు బాపడు పలికెన్.

(వ్రుందించు = చంపు, క్రిందితలము = పాతాళము, అద్రికీల = భూమి, దంష్ట్ర = కోఱదంతము, సందరము = సముద్రము, తొలుపంది = విష్ణుమూర్తి మూడవ అవతారమైన ఆదివరాహము, బాపడు = బ్రాహ్మణుడు)

హిరణ్యాక్షుణ్ణి చంపి పాతాళంలో ఉన్న భూమిని తన దంష్ట్రతో సముద్రము పైన నిలిపిన ఆదివరాహమే తనకు ఇష్టమని బ్రాహ్మణుడు అన్నాడు.

238. సమస్య: పగలు కృశాంగు డంబరముపై విలసిల్లు కళా సమగ్రుడై

238.331 చం. గగనము లోని తారలు యకాయకి జన్మదు దక్షుఁ జేరి మా
మగడు నిరాదరించె నన మామ శపించెను యల్లు వాని, యా
సెగ వలనన్ క్షయించ శశి, చింతనుఁ బాపె శివుండుఁ గాన రే
పగలు కృశాంగు డంబరముపై విలసిల్లు కళా సమగ్రుడై.

(గగనము = ఆకాశము, తార = నక్షత్రము, యకాయకి = ఆకస్మికముగ, జన్మదుడు = తండ్రి, చేరు = సమీపించు, నిరాదరించు = ఆదరించకుండ నిర్లక్ష్యము చేయు, అల్లువాడు = అల్లుడు, సెగ = తాపము, క్షయించు = క్షీణించు,

శశి = చంద్రుడు, చింత = బాధ, పాపు = పోగొట్టు, కాన = కనుక, రేపగలు = ఎల్లప్పుడు, కృశాంగుడు = సన్నగిల్లిన శరీరము కలవాడు, అంబరము = ఆకాశము, విలసిల్లు = ప్రకాశించు, కళాసమగ్రుడు = 16 భాగాలు లేక కళలతో సంపూర్ణుడైనవాడు)

ఆకాశంలోని నక్షత్రాలు యకాయకి తండ్రియైన దక్షుని సమీపించి మా భర్తయైన చంద్రుడు ఆదరించకుండ నిర్లక్ష్యము చేశాడని చెప్పగా మామయైన దక్షుడు అల్లుణ్ణి శపించాడు. ఆ శాపం వల్ల చంద్రుడు క్షీణించగా ఆ బాధను శివుడు పోగొట్టాడు కాబట్టి అహోరాత్రము సన్నగిల్లిన శరీరము కల చంద్రుడు ఆకాశంలో పదునారు కళలతో సంపూర్ణుడుగా ప్రకాశిస్తాడు.

239. సమస్య: పగలే రాత్రిగను రాత్రి పగలుగ నయ్యెన్

239.332 కం. పగతుడు సైంధవుని దునుమ
జగదీశ్వరు డడ్డుపెట్టె చక్రము రవికిన్,
గగనమున వెంటవెంటనె
పగలే రాత్రిగను రాత్రి పగలుగ నయ్యెన్.

(పగతుడు = శత్రువు, దునుమ = చంపుటకు, జగదీశ్వరుడు = పరమాత్మ, రవికిన్ = సూర్యునికి)

శత్రువైన సైంధవుని చంపటానికి పరమాత్మ సూర్యునికి చక్రాయుధము అడ్డుపెట్టాడు. ఆకాశంలో వెంటవెంటనే పగలే రాత్రిగా రాత్రి పగలుగా అయ్యింది.

240. సమస్య: పగవానికి దాసుడగుటె పౌరుషము కదా

240.333 కం. నగుబాటని విజయుం డా
పగ, చక్రి తనన్ దునుమగ వచ్చుట గని యా
పగసుతు డనె, యర్చన సలు
పగ వానికి దాసు డగుటె పౌరుషము కదా.

(నగుబాటు = అపహాస్యము, విజయుడు = అర్జునుడు, ఆపు = నివారించు, చక్రి = కృష్ణుడు, తునుము = చంపు, ఆపగసుతుడు = భీష్ముడు, అర్చన = పూజ, సలుపు = చేయు, దాసుడు = సేవకుడు, పౌరుషము = పరాక్రమము)

ఇది నగుబాటని అర్జునుడు ఆపుతుంటే, కృష్ణుడు తనని చంపడానికి రావడం చూసి భీష్ముడు, పూజ చేయడానికి ఇతనికి సేవకుణ్ణి అవడమే పౌరుషం కదా అని అన్నాడు.

241. సమస్య: పట్టపగలు చుక్కలు పొడిచెన్ (కందం గానో మరో ఛందంగానో చెయ్యటం)

241.334 కం. విద్యాప్రదర్శన నిడిరి
విద్యార్థులు ధర్మజాది వీరు, లట ధను
ర్విద్యన్ విజయుని శరముల
చోద్యం బిది, పట్టపగలు చుక్కలు పొడిచెన్.

ధర్మరాజు మొదలుగా గల వీరులు విద్యార్థులు ఇచ్చే విద్యా ప్రదర్శన చేశారు. అక్కడ, విలువిద్యలో అర్జునుని బాణాలకి ఆశ్చర్యంగా పట్టపగలు చుక్కలు పొడిచాయి.

242. సమస్య: పడతులు సరిపోరు మధురపద్య రచనకున్

242.335 కం. సడిలో మంజుల రవమును,
జడి లోగిలి సుఖముఁ గాంచ జాలని, భాషన్
నుడికారము లయ గిట్టని,
పడతులు సరిపోరు మధురపద్య రచనకున్.

(సడి = ధ్వని, మంజుల = మనోహరమైన, రవము = స్వనము, జడి = బాధ, లోగిలి = ఇల్లు, నుడికారము = మాటచమత్కారము, లయ = స్వరగీతముల కనుగుణముగా తాళము)

ఏ సవ్వడిలోనైనా మంజులస్వనాన్ని, బాధల లోగిలిలో సుఖాలనీ చూడలేని, భాషలో చమత్కారము లయ గిట్టని, స్త్రీలు మధురమైన పద్యరచనకు సరిపోరు.

243. సమస్య: పతి యల్లుండుగ పుత్రియే సవతిగా ప్రాప్తించె చిత్రంబుగన్

243.336 మ. సతి యయ్యెన్ వసుగర్భ విష్ణునికి ముస్తాదంబుగాఁ గావగన్,
సుతయై ధాత్రికి విష్ణువంశ యగు సుశ్లోకుండు శ్రీరాముకున్
సతి యయ్యెన్ గద సీత, యన్న కథలే సాక్ష్యంబుగా భూమికిన్

పతి యల్లుండుగ పుత్రియే సవతిగా ప్రాప్తించె చిత్రంబుగన్.

(సతి = భార్య, వసుగర్భ = భూమి, ముస్తాద = పంది, కాచు = రక్షించు, సుత = కూతురు, ధాత్రి = భూమి, సుశ్లోకుడు = గొప్ప కీర్తి గలవాడు, సతి = భార్య, సాక్ష్యము = ప్రమాణము, పుత్రి = కూతురు, సవతి = సపత్ని, ప్రాప్తించు = లభించు, చిత్రము = ఆశ్చర్యము)

వరాహావతారంలో వరాహమై రక్షించడం వల్ల భూదేవి విష్ణువుకు భార్య అయ్యింది, భూదేవికి కూతురై విష్ణుమూర్తి అంశయైన సుప్రసిద్ధుడు శ్రీరామునికి భార్య అయ్యింది సీత, అన్న కథలే ప్రమాణంగా భూదేవికి ఆశ్చర్యకరంగా భర్తయైన విష్ణువే రాముని రూపంలో అల్లుడిగా కూతురైన సీతయే సవతిగా లభించారు.

244. సమస్య: పతిని పరిత్యజించి ఒక భామ పతివ్రత యయ్యె నిమ్ముగన్

244.337 చం. పతిని పరిత్యజించి ఒక భామ పతివ్రత యయ్యె, నిమ్ముగన్
వెతికి యుదాహరింప యలివేణి లభించునె యిట్టి దన్న స్నే
హితునికిఁ జెప్ప, చంద్రమతి హేయముగా నొక బాని సౌట, భూ
సుత దశకంఠు వంచన నశోక వనిన్ మనుటల్, లభించులే.

(పతి = భర్త, పరిత్యజించు = విడిచిపెట్టు, భామ = స్త్రీ, పతివ్రత = పతిభక్తిగల యిల్లాలు, ఇమ్ముగ = యుక్తముగా, వెతుకు = అన్వేషించు, ఉదాహరించు = దృష్టాంతముగా చెప్పు, అలివేణి = తుమ్మెద వంటి వెంట్రుకలు కల స్త్రీ, ఇట్టిది = ఈ లక్షణాలు ఉన్నది, స్నేహితుడు = మిత్రుడు, హేయముగా = తుచ్ఛమైన విధంగా, బానిస = దాసి, ఔట = అగుట, భూసుత = సీత, దశకంఠుడు = రావణుడు, వంచన = మోసము, వని = వనము, మనుట = జీవించుట)

భర్తను విడిచిపెట్టి ఒక స్త్రీ పతివ్రత అయ్యింది. సరియైన విధంగా అన్వేషించి దృష్టాంత మివ్వడానికి ఇటువంటి స్త్రీ దొరుకుతుందా మిత్రుడికి చెప్పడానికి అంటే, హరిశ్చంద్రుని భార్యయైన చంద్రమతి తుచ్ఛమైన రీతిలో దాసి యగుట, శ్రీరాముని పత్నియైన సీత రావణుని మోసానికి అశోకవనంలో జీవించడాలు, లభిస్తాయి.

245. సమస్య: పద్యము వ్రాయరాదనుచు భర్త పదమ్ముల వ్రాలె పత్నియే

245.338 ఉ. హృద్యములైన పద్యముల నెన్నియొ తా పఠియించి వాటికిన్
సద్యము మంచి వ్యాఖ్యలను చర్చలఁ జెప్పెడి భార్య, నాశగా

పద్యము వ్రాయఁ గోర పతి, వ్రాయుట కష్టము కోరినంతనే
పద్యము వ్రాయ రాదనుచు భర్త పదమ్ముల వ్రాలె పత్నియే.

(హృద్యము = మనస్సునకింపైన, పఠియించు = చదివు, సద్యము = తత్కాలమందు, వ్యాఖ్య = అర్థ వివరణము, చర్చ = సంవాదము, పతి = భర్త)

మనస్సున కింపైన పద్యాలు ఎన్నో తాను చదివి వాటికి వెంటనే మంచి వ్యాఖ్యలను చర్చలలో చెప్పే భార్యను ఆశగా భర్త పద్యము వ్రాయమని కోరగా, వ్రాయడం కష్టం, కోరంగానే పద్యము వ్రాయడం రాదు అని పత్ని భర్త పాదాల మీద రాలింది.

246. సమస్య: పర ధర్మమె మేలని హరి పలికెను గీతన్

246.339 కం. వెఱపును పుట్టించునుఁ గద
పరధర్మమె, మేలని హరి పలికెను గీతన్
నరునికి స్వధర్మము, యది గు
ణ రహిత మైనన్ జతనము, నడత కటంచున్.

(వెఱపు = భయము, మేలు = శుభము, హరి = కృష్ణుడు, గీత = భగవద్గీత, నరుడు = అర్జునుడు, గుణరహితము = గుణము లేనిది, జతనము = శ్రేష్ఠము, నడత = ప్రవర్తనము)

పర ధర్మము భయాన్ని పుట్టిస్తుంది కదా. గీతలో కృష్ణుడు అర్జునునికి స్వధర్మము గుణ రహితమైనా ప్రవర్తనకు శ్రేష్ఠము అనీ మేలనీ చెప్పాడు.

247. సమస్య: పరనారీ సోదరుండు పంక్తిముఖుండే

247.340 కం. ఖరు డుగ్రత నిట్లనె, దా
శరథీ! జరిపింప శాస్తి చానకు, నీ పో
టరితన మగుపడె, యా యొ
ప్పరనారీ సోదరుండు, పంక్తిముఖుండే.

(ఉగ్రత = తీక్ష్ణత, దాశరథి = శ్రీరాముడు, శాస్తి = శిక్ష, చాన = అబల, పోటరితనము = శూరత్వము, అగుపడు = కనబడు, ఒప్పర = కురూపి, నారి = స్త్రీ, పంక్తిముఖుడు = రావణుడు)

ఖరుడు ఉగ్రత్వంతో ఇలా అన్నాడు: ఓ రామా! ఒక అబలకు శిక్ష వేయించడంలో నీ శూరత్వము కనపడింది. ఆ కురూపియైన స్త్రీకి తోడబుట్టినవాడు రావణుడే.

248. సమస్య: పరమపదమ్ము లభ్యమగు పాపులకే సులభమ్ముగా భువిన్

248.341 చం. సరసిజనాభుడే తమదు శాప మహత్వము మార్చ ద్వాస్థు లి
ర్వురు ప్రతివాదులై యిలనుఁ బుట్టి యనేకములైన పాపముల్
వెరవకఁ జేసి చచ్చి హరి వేశ్మముఁ జేరిరి, వాని ప్రీతిచే
పరమపదమ్ము లభ్యమగు పాపులకే సులభమ్ముగా భువిన్.

(సరసిజనాభుడు = విష్ణువు, మహత్వము = ప్రభావము, ద్వాస్థుడు = ద్వారపాలకుడు, ఇర్వురు = ఇద్దరు, ప్రతివాది = శత్రువు, వెరవక = భయపడక, వేశ్మము = సదనము, ప్రీతి = దయ, పరమపదము = వైకుంఠము, ఇల = భువి = భూమి)

విష్ణువే తమ శాప ప్రభావము మార్చగా, ద్వారపాలకులు ఇద్దరూ (జయవిజయులు) భూమిపై శత్రువులుగా పుట్టి అనేకములైన పాపాలు భయపడకుండా చేసి చనిపోయిన తరువాత హరినివాసము చేరుకున్నారు. ఆయన దయ ఉంటే, పాపులకే సులభంగా వైకుంఠము దక్కుతుంది.

249. సమస్య: పరమేశ్వరు గొల్చు వారు పతితులు గారే

249.342 కం. పరహితముఁ జేయు వారలె
పరమేశ్వరుఁ గొల్చు వారు, పతితులుఁ గారే
పరపీడనమే వ్రతమగు
చరితముఁ గల, పిసినిగొట్టు చందము వారల్.

(పతితుడు = భ్రష్టుడు, వ్రతము = నియమము, చరితము = నడవడి)

మానవ సేవే మాధవ సేవ అన్నట్లుగా ఇతరులకు మంచి చేసే వారే పరమేశ్వరుణ్ణి పూజించే వారు. ఇతరులను పీడించడమే నియమమనే నడవడి గల పిసినారి లక్షణాలు ఉన్నవారు భ్రష్టులు కారా.

250. సమస్య: పరుపున వాలినంత సుఖభావన గల్గెను నల్లి కుట్టినన్

250.343 చం. పరిణయ వేడుకల్ ముగియ బంధువు లందర నంపి భార్య తా
పరుపున వాలినంత సుఖభావనఁ గల్గెను, నల్లి కుట్టినన్
సరగున మేలుకొన్న తన స్వామికి దక్కగ మైథునమ్ము, సం
వరణమిదే యటంచు కడు భక్తిగ మ్రొక్కిరి నల్లి కిద్దరున్.

(అంపు = పంపించు, సరగున = శీఘ్రముగా, స్వామి = భర్త, మైథునము = సంగమము, సంవరణము = కారణము, కడు = మిక్కిలి)

వివాహ వేడుకలు ముగియగానే బంధువులందరినీ సాగనంపి భార్య తాను పరుపు మీద వాలగానే సుఖ మనిపించింది. నల్లి కుట్టగానే చప్పున మేలుకున్న తన భర్తకు సంగమము దక్కగా, దానికి కారణము ఇదే యని ఆ నల్లికి ఇద్దరూ చాల భక్తిగా మ్రొక్కారు.

251. సమస్య: పరులన్ జంపుటకే కదా, పరమ గీతా బోధనల్ మాధవా

251.344 మ. తరుణిన్ కృష్ణను కౌరవాధములు పెద్దల్ జూచుచుండన్ మదో
ద్ధురులై యీడ్చి పరాభవించియు సభన్ దుర్మార్గ మంచున్ యెరిం
గి రణోత్సాహులుఁ గారె భీమమగు భంగిన్, యట్టి దుష్కార్య త
త్పరులన్ జంపుటకే కదా పరమ గీతా బోధనల్ మాధవా.

(తరుణి = యువతి, కృష్ణ = ద్రౌపది, అధములు = వావి వరుసలు, సిగ్గు వెఱపులు లేని నీచులు, మదోద్ధురులు = పొగరు పెరిగి చెలరేగినవారు, ఈడ్చు = లాగు, పరాభవించు = అవమానించు, భీమము = భయంకరము, భంగి = విధము, తత్పరులు = ఆశగలవారు, పరమ = శ్రేష్ఠమైన)

ఇది మత్తేభ వృత్తము. ప్రతిపాదంలో 14వ అక్షరము యతి స్థానము. ఇచ్చిన సమస్యలో, మొదటి అక్షరము ‘ప’ కి 14వ అక్షరము ‘తా’ కి యతి చెల్లదు. అందుకని, మొదటి అక్షరంలో సంయుక్తాక్షరంతో తకారము వచ్చేటట్లు చేసుకోవాలి. అంటే, ‘త్ప’ అని రావాలి. అలా చేసిన పూరణ ఇది. యువతియైన ద్రౌపదిని పెద్దలందరూ

చూస్తుండగానే నీచులైన కౌరవులు మదమెక్కినవారై లాక్కొచ్చి సభలో పరాభవించారు. దుర్మార్గమని తెలిసి కూడా యుద్ధంలో ఆసక్తి చూపించారు. అటువంటి చెడ్డపనులు చేయడంలో శ్రద్ధ ఉన్నవాళ్ళని భయంకరంగా చంపడానికే కదా, శ్రీకృష్ణా! భగవద్గీతని బోధించింది.

252. సమస్య: పరువు హత్య లొసగు పట్టమోయి

252.345 ఆ.వె. పాదుషా యగుటకు పథము కాదులె తల
పరువు, హత్య లొసగు పట్టమోయి,
మొఘలు రాజ్యరమను మూర్ధాభిషిక్తుల
గుట కనుజులఁ జంపు గుట్టు యిదియె.

(తలపరువు = యోగ్యత)

పాదుషా అవడానికి మార్గము యోగ్యత కాదులే. హత్యలు చేస్తే పట్టం దక్కుతుంది. మొఘలు రాజ్యానికి చక్రవర్తులవడానికి సహోదరులను చంపడంలో రహస్యము ఇదే.

252.346 ఆ.వె. లక్క యింటఁ గాల్చ, లభ్య మగును తల
పరువు, హత్య లొసగు పట్టమోయి,
పాండు సుతులఁ జంపు పథక మిదే, విను
మనుచు శకునిఁ జెప్పె, యల్లునికిని.

లక్క ఇంట్లో పెట్టి కాల్చేస్తే, యోగ్యత లభిస్తుంది. ఆ కాల్చడం వల్ల జరిగే హత్యల వల్ల రాజ్యము దక్కుతుంది. పాండు కుమారులను చంపడానికి ఇదే పథకము, వినుమని అల్లుడైన దుర్యోధనునికి శకుని చెప్పాడు.

252.347 ఆ.వె. మతము, కులము, ధనము, మహి రాజ్యమేలంగ,
పరువు హత్య లొసగు పట్టమోయి,
అట్టి ఘాతుకముల నరికట్ట వలె నన్న,
సమసమాజ మిచ్చు సరి జవాబు.

మతము, కులము, ధనము ఈ మూడూ లోకంలో రాజ్యం ఏలుతున్నంత కాలం, పరువు కోసం చేసే హత్యల వల్ల పట్టం దక్కుతుంది. అలాంటి దారుణాలు అరికట్టాలంటే సమసమాజమే సరియైన జవాబు ఇస్తుంది.

253. సమస్య: పరువును దీయువారలె శుభంబును గూర్చు హితుల్ సుబాంధవుల్

253.348 చం. ధరణముఁ జేయ నాయుధము దందడి యందని చక్రి కల్ల జే
సి, రణము నే శిఖండిఁ గన శీఘ్రమె మానెద నంచు భీష్ముడుస్,
తరుణముఁ జూచి సాయపడు తక్కిన వైరులు, సవ్యసాచికిస్
పరువునుఁ దీయు వారలె, శుభంబునుఁ గూర్చు హితుల్ సుబాంధవుల్.

(ధరణము = ధరించుట, దందడి = యుద్ధము, చక్రి = కృష్ణుడు, కల్ల = అబద్ధము, శీఘ్రము = త్వరితముగ, తరుణము = సమయము, వైరి = శత్రువు, సవ్యసాచి = అర్జునుడు, పరువు = గౌరవము, శుభము = క్షేమము, కూర్చు = కూడబెట్టు, హితుడు = మంచిచేయువాడు, బాంధవుడు = చుట్టము)

యుద్ధంలో ఆయుధము ధరించనని ఆ మాట అబద్ధము చేసి కృష్ణుడు, శిఖండిని చూడగానే వెంటనే యుద్ధం మానేస్తానని భీష్ముడు, సమయం చూసి సాయపడ్డ మిగిలిన శత్రువులు, అర్జునునికి పరువు తీసే వాళ్ళే. క్షేమాన్ని కూడబెట్టే హితులు మంచి చుట్టాలు.

254. సమస్య: పర్వదినమ్మటంచు పరివారము బంధుల నేడిపింతురో

254.349 ఉ. పర్వదినమ్మె పేరునకు, పంచగ బాధ హుసేను త్యాగమే
సర్వజనుల్ మొహర్ర మను సంబర మందు, మహమ్మదీయులే
పర్వదినమ్మటంచు పరివారము బంధుల నేడిపింతురే
చర్వితచర్వణమ్ముగను, సంబరమా యది, శార్వరే కదా!

(చర్వితచర్వణము = మళ్ళీ మళ్ళీ చేయుట, పర్వదినము = సంబరము = పండుగ, శార్వరి = చీకటి)

పేరుకు మాత్రమే పండుగ. హుసేను చేసిన త్యాగము బాధను పంచగా అందరూ మొహర్రం అనే సంబరంలో మహమ్మదీయులే పండుగ రోజు అంటూ కుటుంబ సభ్యులనీ బంధువులనీ మాటిమాటికీ ఏడిపిస్తారుగా. పండుగా అది, చీకటే కదా.

255. సమస్య: పలుకగ లేని వాడె ఘన పండితు డంచు గడించు కీర్తులస్

255.350 చం. వలుమున పెండ్లి యాయె నొక బాలికుతో కవి కాని వానితో,

చలిమలచూలి! యో దశభుజా! నిను నమ్మినఁ జాలు, తీరుగన్
పలుకగ లేని వాడె ఘన పండితు డంచు గడించు కీర్తులన్,
పలుమరు కాళిదాసు సతి ప్రార్థనఁ జేసెను యివ్విధంబుగన్.

(వలుమున = మోసము, ఆయె = ఐనది, బాలిశుడు = మూర్ఖుడు, చలిమలచూలి = పార్వతి, దశభుజా = పది భుజములు కలది, తీరుగ = సరియైన విధంగా, ఘన = గొప్ప, అంచు = అనుచు, గడించు = సంపాదించు, కీర్తి = యశస్సు, పలుమరు = చాల తడవలు, సతి = భార్య)

మోసంతో ఒక మూర్ఖుడితో, కవి కాని వాడితో పెళ్ళి అయ్యింది. ఓ, పది భుజములు కల పార్వతీ మాతా! నిన్ను నమ్ముకుంటే చాలు, సరిగ్గా పలుకలేని వాడు గొప్ప పండితుడుగా కీర్తి సంపాదిస్తాడు. ఈ విధంగా పలుమార్లు కాళిదాసు భార్య ప్రార్థన చేసింది.

256. సమస్య: పలుకలేనివాఁడె పండితుండు

256.351 ఆ.వె. అలతి పదము లెనిపి యలవరించి యనల్ప
భావము పలుకుటయె కవి గుణంబు,
అట్ల నల్ప భావ మలతి పదములతో
పలుక లేని వాఁడె పండితుండు.

(అలతి = తేలిక, పదము = మాట, ఎనుపు = కలుపు, అలవరించు = అలంకరించు, అనల్ప = గొప్ప)

తేలిక మాటలని కలిపి అలంకరించి గొప్ప భావాన్ని పలకడమే కవి లక్షణము. ఆ విధంగా గొప్ప భావాన్ని తేలిక మాటలతో చెప్పలేని వాడే పండితుడు.

257. సమస్య: పసులన్ కొల్చెడి వారి కబ్బుటరుదే భద్రంబు లెల్లప్పుడున్

257.352 మ. పసులన్ జంపు టమానుషంబు బలులన్ వాణిజ్య యాకాంక్షలన్,
పశు హింసన్నిరసించు నట్టి మతముల్ భద్రంబు నిచ్చెన్ కృషిన్,
పశు సంవర్ధక వృత్తి నున్న ప్రజ సంపాదించరే దండిగన్,
పసులన్ కొల్చెడి వారి కబ్బు టరుదే? భద్రంబు లెల్లప్పుడున్.

(పసులు = పశువులు, అమానుషము = మనుష్య కృత్యము కానిది, ఆకాంక్ష = ఆసక్తి, నిరసించు = నిరాదరించు, భద్రము = శుభము, కృషి = వ్యవసాయము, సంవర్ధక = వృద్ధిని పొందించువాడు, దండిగ = అధికముగా, అరుదు = దుర్లభమైనది)

బలులనీ వాణిజ్యపరమైన ఆసక్తులనీ పశువులని చంపడం అమానుషం. పశుహింసని నిరసించేటటువంటి మతాలు వ్యవసాయానికి భద్రత నిచ్చాయి. ఎందుకంటే, పశువుల సంఖ్య తగ్గిపోతే వ్యవసాయానికి అనేక రకాలైన ఇబ్బందులు వస్తాయి. పశు సంవర్ధక వృత్తి చేసే జనాలు దండిగా సంపాదిస్తున్నారు. అందుకని, పశువుల సేవ చేసే వారికి శుభాలు కలగడం అరుదా?

258. సమస్య: పాతివ్రత్యముఁ జూపుచుండి విటులన్ బైకొందు రబ్జాననల్

258.353 శా. నాతిన్ జూచినఁ జాలు వెంటఁబడి నానా బాధలన్ బెట్టు, యా
రాతిన్ రావణుఁ జూచి రంభ కడు విభ్రాంతిన్ ప్రధావించ, యా
దైతేయుం డనె, పార కింక, తొలుతన్ దైన్యంబు, క్రన్నన్ బహిన్
బాతివ్రత్యముఁ జూపుచుండి విటులన్ బైకొందు రబ్జాననల్.

(నాతి = స్త్రీ, నానా = పలు రకములు, ఆరాతి = శత్రువు, కడు = మిక్కిలి, విభ్రాంతి = ఊహించనిది జరిగినప్పుడు కలిగే ఆశ్చర్యం, ప్రధావించు = పారు = పరుగెత్తు, దైతేయుడు = రాక్షసుడు, తొలుత = మొదట, దైన్యము = దీనత్వము, క్రన్నన్ = తరువాత, బహి = బయట, విటుడు = వేశ్యాలోలుడు, పైకొను = కౌగిలించు, అబ్జానన = పద్మము వంటి ముఖము కలది)

అమ్మాయిని చూస్తే చాలు ఆమె వెంటపడి నానా బాధలు పెట్టే శత్రువైన రావణున్ని చూచి రంభ అత్యంత విభ్రాంతితో పరుగెత్తగా, ఆ రాక్షసుడు ఇంకా పరుగెత్తకు, మొదట్లో దీనత్వము, తరువాత బయటికి పాతివ్రత్యము చూపిస్తూ పద్మముఖులైన స్త్రీలు విటులను కౌగిలించుకుంటారు అని అన్నాడు.

259. సమస్య: పాదమ్ములు లేని తరులు పరుగిడజొచ్చెన్

259.354 కం. మీద హరిత శాఖల నా
చ్ఛాదించిన సేన సాగ స్థావరములలో
రోదసిని చూచు జనులకు
పాదమ్ములు లేని తరులు పరుగిడ జొచ్చెన్.

(మీద = పైన, హరిత శాఖ = ఆకుపచ్చని కొమ్మ, ఆచ్ఛాదించు = కప్పు, స్థావరము = కొండ, రోదసి = ఆకాశము, తరులు = చెట్లు)

వంటిపైన ఆకుపచ్చని కొమ్మలు కప్పుకొన్న సైన్యము కొండలలో సాగుతుంటే, ఆకాశము నుండి చూచే జనాలకి కాళ్ళు లేని చెట్లు పరుగెత్త సాగాయి.

260. సమస్య: పాపపు కర్మలే మనకు పావన సద్గతు లంద జేసెడిన్

260.355 ఉ. చేపలు నీట నుండగను చేయగ నోపునె త్రాగకుండగన్,
ప్రాపు ప్రభుత్వ మందుఁ గల వానికి లంచము కూడ నట్టిదౌ
వ్యాపృతె, దాని నాప దగు పాలన నివ్వ నరేశు డంగలా
ర్పా? పపు కర్మలే, మనకు పావన సద్గతు లందఁ జేసెడిన్.

(ఓపు = సమర్థమగు, ప్రాపు = చోటు, లంచము = తనపని చక్కఁబెట్టుకొనుటకై యొకనికి రహస్యముగా నిచ్చు ధనము, వ్యాపృతి = వ్యాపారము, నరేశుడు = రాజు, అంగలార్పు = దుఃఖం, పపు = రాజు, కర్మలు = పనులు, పావన = పవిత్రమైన, సద్గతి = స్వర్గము)

చేపలు నీటిలో ఉండగా అవి నీరు త్రాగకుండా చేయడం వీలవుతుందా? ప్రభుత్వంలో చోటు ఉన్న వానికి లంచం కూడా అట్లాంటి వ్యాపారమే. ఈ విషయం కౌటిల్యుని అర్థశాస్త్రము చెప్పింది. దాన్ని ఆపగలిగే పాలన రాజు ఇవ్వగా, దుఃఖమా? రాజు పాటించే ధర్మాలే మనకు స్వర్గ ప్రాప్తి కలిగిస్తాయి.

260.356 ఉ. కూపము వంటి దీ జగతి, కోరిక లీడ్చును చెడ్డ తోవలన్
చేపలఁ బట్టి లాగు వల చెన్నున, యప్పు డొనర్చు కార్యముల్
పాపపు కర్మలే, మనకు పావన సద్గతు లందఁ జేసెడిన్
కోప భయాదులన్ విడచి కొందరి మేలిడు పుణ్య కర్మలే.

(కూపము = నుయ్యి, జగతి = లోకము, ఈడ్చు = లాగు, చెన్ను = విధము, ఒనర్చు = చేయు, కార్యము = కర్మ = పని, పావన = పవిత్రమైన, సద్గతులు = మంచి గతులు (స్వర్గము), ఇడు = ఇచ్చు)

ఈ లోకం ఒక కూపం లాంటిది. చేపలని పట్టి లాగే వల లాగా కోరికలు చెడు మార్గాలలోకి లాగుతాయి. అప్పుడు చేసే పనులు పాప కర్మలే. కోపం భయం త్యజించి కొందరికి మేలు కలిగించే పుణ్య కర్మలే మనకు సద్గతులు అందజేస్తాయి.

261. సమస్య: పాపులు పుణ్యభాజనులు పావన మూర్తులు దుఃఖభాజనుల్

261.357 ఉ. ఏపునుఁ గూర్చుచున్ వసువు లేడ్గురు మ్రుచ్చిలి మౌని ధేనువున్
శాపవశాత్తు గంగ ధుని సంతుగఁ బుట్టి నశించినారు, యా
పాపులు పుణ్యభాజనులు, పావన మూర్తులు దుఃఖభాజనుల్
పాపలు గంగపాలవగ పార్థుడు శంతనుడున్, త్రివేణియున్.

(ఏపు = బాధ, మ్రుచ్చిలు = దొంగిలించు, ధేనువు = ఆవు, ధుని = నది, సంతు = సంతానము, భాజనుడు = అర్హత కలవాడు, పావన = పవిత్రమైన, పార్థుడు = రాజు, త్రివేణి = గంగ)

బాధ కలిగిస్తూ ఏడుగురు వసువులు ముని (వశిష్ఠుడు) ఆవుని దొంగిలించి, శాపం కారణంగా గంగానది సంతానంగా పుట్టి చచ్చిపోయారు. ఆ పాపులు పుణ్యానికి అర్హులు. ఎందుకంటే, ఆవుని దొంగిలించినందుకు పాపులు, గంగకి జన్మించినందుకు పుణ్యానికి అర్హులు. పుణ్య అంటే గంగ అని కూడా అర్థం ఉంది. పవిత్రమూర్తులైన శంతన మహారాజు, గంగ, వాళ్ళ సంతానం గంగ పాలవడం వల్ల, దుఃఖానికి అర్హులు.

262. సమస్య: పాలొనరించె ముక్కలుగ బల్లిదుడై జను లెల్ల మెచ్చగన్

262.358 ఉ. వేళకు కాన్పు రాక తన ప్రేకటి కోడలు గ్రుద్ద, స్రావమున్
పాలనఁ జేసి వ్యాసు డది భాండము లందునఁ బెంచి పిండపున్
పాలొనరించ ముక్కలుగ, బల్లిదుడై జను లెల్ల మెచ్చగన్
బాలుడుఁ బుట్టె తొంటి కురువంశము నిల్పగ ధార్తరాష్ట్రుడై.

(కాన్పు = ప్రసవము, ప్రేకటి = గర్భము, గ్రుద్దు = పిడికిటితో పొడుచు, పాలన జేసి = రక్షించి, భాండము = కుండ, పెంచు = పోషించు, పిండము = ముద్ద, పాలు = భాగము, ఒనరించు = చేయు, బల్లిదుడు = మిక్కిలి బలము గలవాడు, మెచ్చు = శ్లాఘించు, తొంటి = మొదట, ధార్తరాష్ట్రుడు = ధృతరాష్ట్రుని కొడుకు)

సమయానికి ప్రసవము రాకపోవడం వలన తన గర్భాన్ని కోడలు పిడికిటితో పొడవగా, వ్యాసుడు స్రావాన్ని కాపాడి దాన్ని కుండలలో పోషించడానికి దానిలో ముద్ద భాగాన్ని ముక్కలుగా చేశాడు. ప్రజలందరూ శ్లాఘించగా, కురువంశాన్ని నిలపడానికి ధృతరాష్ట్రుని కొడుకుగా, తొలుదొల్త బలవంతుడైన బాలుడు పుట్టాడు.

263. సమస్య: పితరుల నింద సేసిననె బిడ్డలకుస్ సిరి దక్కు నిచ్చలుస్

263.359 చం. సతతము ప్రక్కవారి సిరిసంపదఁ జూచి చలించి దీనమౌ
స్థితి తమ కిచ్చి తమ్ము కడు తిప్పలు పెట్టితి రంచు న్యాయమా
పితరుల నింద సేసిననె, బిడ్డలకుస్ సిరి దక్కు నిచ్చలుస్
గత గుణపాఠముల్ చదివి కార్యము లందున శ్రద్ధఁ జూపినస్.

ఎప్పుడూ పొరుగు వారి సిరి సంపద చూసి అల్లాడి పోయి, దీనమైన స్థితిని తమకి ఇచ్చి తమని చాలా తిప్పలు పెట్టారని తండ్రులని నింద చేయడం న్యాయమా? వెనకటి గుణపాఠాలు చదివి పనుల్లో శ్రద్ధ చూపిస్తే సంతానానికి ఎల్లప్పుడూ సిరి దక్కుతుంది.

264. సమస్య: పీత తాతయె సరియైన నేతయగును

264.360 తే.గీ. దేని కష్టాలు పోల్తు్రు వైదేహి కష్ట
ములకు? తండ్రి కంటెను మెండు ముద్దెవరి వ
డిని? పరోపకారి యగు వాడేమి యగును?
పీత, తాతయె, సరియైన నేత యగును.

సీత కష్టాలు సీతవి, పీత కష్టాలు పీతవి అని అంటారు. ఈ పద్యం ప్రశ్నలు, జవాబులలో క్రమాలంకారంతో ఉంటుంది. దేని కష్టాలు వైదేహి (సీత) కష్టాలతో పోలుస్తారు? తండ్రి కంటే ఎవరి వడిలో ముద్దెక్కువ? పరోపకారియైన వాడు ఏమవుతాడు? వీటికి సమాధానాలు వరుసగా, పీత, తాతయె, సరియైన నేతయగును.

264.361 తే.గీ. థాకరే పౌత్రుడుఁ గనెను యొక నవీన
పీత, తాతయె సరి యైన నేతయగును
ధరణి ననుచు, యా జాతికి థాక్రె నామ
మిచ్చి జంతుశాస్త్రజ్ఞుల మెప్పుఁ బొందె.

బాల్‌ఠాక్రే మనుమడు, ఉద్ధవ్ తనయుడు తేజస్‌ఠాక్రే, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు (Zoological Survey of India) చెందిన పరిశోధకులు డాక్టర్ ఎస్‌కే పతి, అనిల్‌ఖైరే, ఇతర స్నేహితులతో కలిసి, సహ్యాద్రి రేంజ్ పరిధి లోని వెస్ట్రన్‌ఘాట్స్‌లో జరిపిన పరిశోధనలో ఐదు కొత్తరకం పీత జాతులను కనుగొన్నారు. వాటిలో ఒకదానికి తమ ఇంటిపేరు ఠాక్రే అని నామకరణం చేశాడు. దాని పేరు గుబర్నెటోరియానా ఠాకెరాయి. ఇక పద్యంలోకి వస్తే, థాకరేగారి మనుమడు ఒక క్రొత్త పీతను చూశాడు. లోకంలో తాతే సరియైన నేత అని, ఆ జాతికి థాకరే పేరు పెట్టాడు. జంతు శాస్త్రవేత్తల ప్రశంశలు పొందాడు.

265. సమస్య: పున్నమ యమవస యనంగఁ బొల్పందె భువిన్

265.362 కం. ఎన్నో పున్నమ లందున
వెన్నెల కురిపించు చుండు విబుధుండే, ప్ర
చ్ఛన్న మయెడి ప్రతి గ్రహణపు
పున్నమ యమవస యనంగఁ బొల్పందె భువిన్.

(విబుధుడు = చంద్రుడు, ప్రచ్ఛన్నము = కప్పబడినది, గ్రహణము = రాహు కేతువులు సూర్యచంద్రులను పట్టుట, అమవస = అమావాస్య, పొల్పు = స్థిరము)

ఎన్నో పౌర్ణమి రోజుల్లో వెన్నెల కురిపించే చంద్రుడే కప్పబడే ప్రతి గ్రహణం నాటి పౌర్ణమి అమావాస్యగా లోకంలో స్థిరమైంది.

266. సమస్య: పురుషుని పెండ్లాడె మగువ పుణ్యము పోవన్

266.363 కం. తరుణి యహల్యయె యొక ముని
పురుషుని పెండ్లాడె, మగువ పుణ్యము పోవన్
సురపతిఁ గూడగ పొందిన
వరుశాపముఁ బాపె రాము పాదరజమ్మే.

యౌవనము గల స్త్రీయైన అహల్య ఒక ముని పురుషుని పెళ్ళి చేసుకుంది. ఆ స్త్రీ చేసుకున్న పుణ్యము పోగా దేవతల రాజైన ఇంద్రుడితో సంగమించడం చేత భర్త ఇచ్చిన శాపము రాముని పాదధూళియే పోగొట్టింది.

266.364 కం. గిరిజ తపోనిధియగు యధి

పురుషుని పెండ్లాడె, మగువ పుణ్యము, పోవన్
హరు బింకము వరమయ్యెను
మరుని యనంగునిగఁ జేయ మానిని రతికై.

(గిరిజ = పార్వతి, తపోనిధి = తపస్సుయే నిధిగా కలవాడు, అధిపురుషుడు = పరమేశ్వరుడు, బింకము = బిగువు, అనంగుడు = అంగము లేని వాడైన మన్మథుడు, మానిని = ఆత్మగౌరవము గల స్త్రీ)

పార్వతి తపోనిధియైన పరమేశ్వరుని పెళ్ళి చేసుకుంది. శివుని బిగువు పోగా, మగువ పుణ్యము, ఆత్మగౌరవము గల రతి కోసం మన్మథుణ్ణి శరీరం లేనివాడుగా చేయడంలో వరమయ్యింది.

266.365 కం. చిరు యాయుష్మంతుం డగు
పురుషుని పెండ్లాడె, మగువ పుణ్యము పోవన్
వరు జీవము మరలించె కొ
సరి యముని పరిపరి, యామె సావిత్రియెగా.

తక్కువ ఆయుస్సు కలవాడని తెలిసికూడా ఆ పురుషుని పెళ్ళి చేసుకుంది. భర్త జీవము పోగా, యముణ్ణి మాటిమాటికి కొసరి మగువ పుణ్యము మరలించింది. ఆమె సావిత్రియే కదా.

266.366 కం. సురవైరి జలంధరుడను
పురుషుని పెండ్లాడె మగువ, పుణ్యము పోవన్
పరమశివుడు వరు జంపగ,
వరమున పూజిత తులసిగ వర్ధిల్లె నిలన్.

దేవతలకి శత్రువైన జలంధరుడనే పురుషుని మగువ పెళ్ళి చేసుకుంది. ఆమె పుణ్యము పోగా, పరమశివుడు భర్తను చంపగా వరప్రభావంతో పూజ్యురాలైన తులసిగా లోకంలో వర్ధిల్లింది.

267. సమస్య: పులు లావులు గూడి యొక్క పొలమున మెలగెన్

267.367 కం. తిలకింప నెంత రమ్యము
మలిగను పెట్టిన పలు ప్రతిమల సోయగమున్,
కులభేదము లన్ని మరచి

పులు లావులుఁ గూడి యొక్క పొలమున మెలగెన్.

(తిలకించు = చూచు, రమ్యము = మనోహరము, మలిగ = అంగడి, పలు = అనేకము, ప్రతిమ = విగ్రహము, సోయగము = చక్కదనము, కులభేదము = జాతిభేదము, కూడు = చేరు, పొలము = ప్రదేశము, మెలగు = వర్తించు)

అంగడిలో పెట్టిన అనేకమైన విగ్రహాల చక్కదనం చూడడానికి ఎంత మనోహరమో. జాతిభేదాలన్నీ మరిచిపోయి పులులు, ఆవులు కలిసి ఒక ప్రదేశంలో ఉన్నాయి.

268. సమస్య: పూలకు లేమి యేర్పడెను పూజల గొల్వగ పుణ్యమూర్తులన్

268.368 ఉ. కాలము చెల్ల నాంగ్ల బలగమ్ముల పాలన భారతావనిన్,
మేలుకొనంగ దేశము సమీకృత సంఘ విదగ్ధతన్, లలిన్
యేలు ప్రజా ప్రభుత్వమును యేర్పడఁ జేసిన త్యాగ మెన్నగన్,
పూలకు లేమి యేర్పడెను, పూజలఁ గొల్వగ పుణ్యమూర్తులన్.

(కాలముచెల్లు = కాలము తీఱు, బలగము = సైన్యము, అవని = భూమి, సమీకృత = ఒకటిగాచేయబడిన, విదగ్ధత = నైపుణ్యము, లలి = ప్రేమ, ఎన్ను = గణించు, లేమి = కొరత)

ఆంగ్ల సైన్య పరిపాలనకు కాలము చెల్లిపోగా, సమైక్యంగా ఉన్న సంఘము లోని నైపుణ్యమును మేలుకొలుపుతూ, ప్రేమతో పరిపాలించే ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన త్యాగాన్ని గణించడానికి పుణ్యమూర్తులను ఆరాధించడానికి పూలకు కొరత ఏర్పడింది.

268.369 ఉ. నూలును తీయు రాట్నమును నుంకు నహింసకు చిహ్నితంబుగా
నాలము గాంధి నేర్ప, భరతావని స్వేచ్ఛను పొందగన్, స్వయం
పాలనమున్ ఘటింప, తమ ప్రాణము లొడ్డిన వీరు లెందరో,
పూలకు లేమి యేర్పడెను పూజలఁ గొల్వగ పుణ్యమూర్తులన్.

(నూలు = ప్రత్తివడికిన పోగు, రాట్నము = నూలు వడుకు యంత్రము, నుంకు = ఉపవాసము, చిహ్నితముగా = గుర్తు ఇవ్వబడినట్లుగా, ఆలము = యుద్ధము, అవని = భూమి, స్వేచ్ఛ = స్వతంత్రత, స్వయంపాలన =

తమకుతామే ఏర్పఱచుకొన్న పాలనవ్యవస్థ, ఘటించు = సంపాదించు, ఒడ్డు = పందెంగా పెట్టు, లేమి = లేకపోవుట, కొల్చు = ఆరాధించు, పుణ్యమూర్తి = పవిత్ర స్వరూపము)

నూలు తీసే రాట్నమూ, ఉపవాసమూ అహింసకు గుర్తులుగా కదనం గాంధీజీ నేర్పగా భరత భూమి స్వాతంత్ర్యం పొందడానికి, స్వపరిపాలన సంపాదించడానికి తమ ప్రాణాలు పణంగా పెట్టిన వాళ్ళు ఎందరో. అలాంటి పుణ్యమూర్తులను పూజలతో ఆరాధించడానికి పూలు సరిపోవడం లేదు.

269. సమస్య: పూవై తన్మకరందమై కరగె బోబో నీళ్ళకున్ బల్చనై

269.370 శా. జీవన్ముక్తికిఁ జేయు యత్నము వృథాఁ జేయంగ యింద్రాజ్ఞచే
స్త్రీవాంఛన్ మది నింప మేనక, తమిన్ జిజ్ఞాస గాధేయుకున్
పూవై తన్మకరందమై కరగెఁ బోఁబో నీళ్ళకున్ బల్చనై,
యా విన్యాస మొసంగ యాత్మజను సన్యాసంబునేఁ గేరుచున్.

(జీవన్ముక్తి = బ్రతికి వుండగానే కర్తృత్వ భోక్తృత్వములు, భవ బంధాలు బాధించని స్థితి, వృథా = నిరుపయోగము, మది = మనస్సు, నింపు = నిండఁజేయు, తమి = మోహము, జిజ్ఞాస = మోక్షము పొందనిచ్ఛ, గాధేయుడు = విశ్వామిత్రుడు, తత్ = ఆ, మకరందము = పూదేనె, కరగు = విన్యాసము = చక్కని ప్రదర్శన, ఒసంగు = ఇచ్చు, ఆత్మజ = పుత్రిక, సన్యాసము = సన్యాసాశ్రమ స్వీకారము, కేరు = పరిహసించు)

ఇది మహాకవి సారంగు తమ్మయ రచించిన వైజయంతీవిలాస మనే కావ్యం లోని "ఆవిప్రోత్తము వజ్రపంజర నిభంబై నిశ్చలంబైన ... " అన్న పద్యం లోని ఒక పాదం. జీవించి ఉండగానే ముక్తి కోసం చేసే ప్రయత్నము పనికిరాకుండా చేయడం కొరకు, ఇంద్రుని ఆజ్ఞ వలన మేనక అనే అప్సరస స్త్రీవాంఛని మనస్సులో నింపగా, మోహంతో విశ్వామిత్రుడికి మోక్షము పొందాలనే కోరిక, ఆ విన్యాసం సన్యాసాశ్రమాన్నే వెక్కిరించే అంతగా కూతుర్ని (శకుంతలని) ప్రసాదించడం వల్ల, పువ్వై, తరువాత అందులోని తేనై, రాను రాను నీళ్ళకన్నా పల్చనై కరిగిపోయింది.

270. సమస్య: పెండిలి లోన కట్నమను పేరిట ద్రవ్యము గోర ధర్మమా

270.371 ఉ. పెండిలి లోన కట్నమను పేరిట ద్రవ్యముఁ గోర ధర్మమా,
పిండుదు రేల యిట్ల పలపించిన సొమ్ముల నంచు యార్యకుల్
యండగ నిల్చి తప్పనగ యన్నెముగా ప్రజ సమ్మతించి లే

కుండగ చేతు రీ నడత, యొప్పుగ మార్చ వివాహ పద్ధతుల్.

(కట్నము = వరదక్షిణ, పేరిట = పేరు మీద, ద్రవ్యము = ధనము, పిండు = బలవంతముగా డబ్బు రాబట్టు, అపలపించు = దాచిపెట్టు, ఆర్యకుడు = పూజ్యుడు, అండ = ఆసరా, అన్నెము = అన్యాయము, ప్రజ = జనము, సమ్మతించు = అంగీకరించు, నడత = ఆచరణము, ఒప్పు = మేలైన దగు, పద్ధతి = విధానము)

పెళ్ళిలో కట్నం పేరు చెప్పి ధనం కోరడం ధర్మమా, ఈ విధంగా దాచిపెట్టుకున్న సొమ్ములని పిండుతారెందుకు, అని పూజ్యులైనవారు అండగా నిలబడి తప్పు అని అంటే ప్రజలు అన్యాయంగా అంగీకరించి పెళ్ళి విధానాలు మేలైనవిగా మార్చడానికి ఈ ఆచారము లేకుండా చేస్తారు.

271. సమస్య: పెనిమిటి వేగరా ప్రసవ వేదన గల్గును మిక్కుటంబుగన్

271.372 చం. జననిగ మారఁ గోరు సతి సాంత్వనఁ గోరగ గర్భిణీస్థితిన్,
పనివడి యామె కోరికను పాటనఁసేసి సపర్యఁ జేయగా
పెనిమిటి, వేగరా ప్రసవ వేదనఁ, గల్గును మిక్కుటంబుగన్
మనమున సంప్రతిష్ఠ యిక మైథున మన్నది చేయకుండగన్.

(సాంత్వన = ఓదార్పు, పనివడి = ప్రయత్నపూర్వకముగా, పాటనసేయు = పాటించు, సంప్రతిష్ఠ = పట్టుదల, మైథునము = రతి)

ప్రసూతి వైరాగ్యం ఆధారంగా వ్రాసిన పద్యం ఇది. అమ్మగా మారాలని కోరుకునే ఒక భార్య గర్భిణీగా ఉన్న పరిస్థితిలో ఓదార్పు కోరగా, కావాలని ఆమె కోరికని పాటించడానికి భర్త సపర్య చేయగా, పురిటినెప్పులు తొందరగా రాగా, అధికంగా మనస్సులో ఇక మైథునమన్నది చేయకుండా ఉండాలి అన్న పట్టుదల కలుగుతుంది.

272. సమస్య: పొగ త్రాగని వాడు దున్నపోతై పుట్టున్

272.373 కం. వగవడు రోగపు బాధల
పొగ త్రాగని వాడు, దున్నపోతై పుట్టున్
యెగతాళిఁ జేయఁ బట్టక
నగుబాటు పనులు సలుపు యనదయే నెపుడున్.

(వగచు = దుఃఖించు, ఎగతాళి = పరిహాసము, పట్టక = పట్టించుకొనక, నగుబాటు = తలవంపు, సలుపు = చేయు, అనద = అల్లుడు)

ఈ సమస్య కన్యాశుల్కం నాటకంలో గిరీశం పాత్ర చేత చెప్పించిన పద్యంలోని ఒక పాదము. పొగ త్రాగని వాడు రోగపు బాధలకు దుఃఖించడు. ఎగతాళి పట్టించుకోకుండా ఎప్పుడూ తలవంపుల పనులు చేసే అల్లుడు దున్నపోతుగా పుడతాడు.

273. సమస్య: పోగులు చెవుల కడ లేక భుజముల వెలసెన్

273.374 కం. సాగెడి వామనునకు చెవి
పోగులుగా నగుపడె శశి పూషులు, యంతన్
నోగులయి మెడను దాటుచు
పోగులు చెవుల కడ లేక భుజముల వెలసెన్.

(సాగు = వ్యాపించు, అగుపడు = కనబడు, శశి = చంద్రుడు, పూషుడు = సూర్యుడు, అంతన్ = వెంటనే, నోగు = మాల, కడ = సమీపము, వెలయు = ప్రకాశించు)

వ్యాప్తి చెందే వామనుడికి సూర్యచంద్రులు చెవిపోగులుగా కనబడ్డాయి. వెంటనే, మాలలై మెడను దాటుతూ పోగులు, అంటే సూర్యచంద్రులు, చెవుల దగ్గర లేకుండా భుజాల మీద ప్రకాశించాయి.

273.375 కం. వేగముగా సుగ్రీవుడు
కాగల కార్యమని కుంభకర్ణుని చెవులన్
లాగుచుఁ గొరుకగ యూడిన
పోగులు చెవుల కడ లేక భుజముల వెలసెన్.

అవ్వాల్సిన పని ఇదే కదా అని వేగంగా సుగ్రీవుడు కుంభకర్ణుడి చెవులని లాగుతూ కొరకగానే ఊడిన కర్ణాభరణాలు చెవుల దగ్గర లేకుండా భుజాల మీద ప్రకాశించాయి.

274. సమస్య: ప్రాశ్నికు డవధానిని గని పక్కున నవ్వెన్

274.376 కం. అశ్నకు యశ్నాంతమునకు,

ప్రశ్నించితి వేమిఁ గలదు బంధ మనుచు, వి
ప్రశ్నికయే యెరుగు ననగ,
ప్రాశ్నికు డవధానినిఁ గని పక్కున నవ్వెన్.

(అశ్న = మేఘము, అశ్నంతము = ప్రొయ్యి, బంధము = సంబంధము, విప్రశ్నిక = సోదె చెప్పే ఎఱుకసాని, ప్రాశ్నికుడు = ప్రశ్నవేయువాడు, అవధాని = అనేక విషయములను ధారణ చేయువాడు, పక్కున = తటాలున)

మేఘానికీ, ప్రొయ్యికీ ఏమి సంబంధము అని ప్రశ్నించావు, అది ఎఱుకసానికే తెలుసు అని అనగా అవధానిని చూసి ప్రాశ్నికుడు పక్కున నవ్వాడు.

275. సమస్య: ఫలముఁ దినందగునె చూతఫలముం బోలెన్

275.377 కం. ఫలముల తీపుండును, ప్రతి
ఫలముఁ దినం దగునె? చూత ఫలముం బోలెన్
ఫలములు పెక్కులు, మేనన్
బలు వ్యాధులఁ బెంచు నంచు, వైద్యులు యనరే?

(చూత = మామిడి, మేను = శరీరము)

పళ్ళలో తీపి ఉంటుంది. ప్రతి పండునీ తినచ్చా? మామిడి పండు లాగా చాలా పళ్ళు శరీరంలో కొన్ని వ్యాధులు పెంచుతాయని వైద్యులు అనరా?

276. సమస్య: ఫలితము లేదు పూర్వకవివర్యుల కావ్యములం బఠించినన్

276.378 చం. తెలు గన చిన్నచూపు సరిదిద్దుట లేదని పాఠశాలలన్
బలుమరు తిట్టిపోసినను భాషకు న్యాయము సంక్రమించునే,
ఫలితము లేదు, పూర్వ కవివర్యుల కావ్యములం బఠించినన్,
తలపులు స్వచ్ఛ మౌను, సమ తన్నది సత్యముగా దృశించుగా.

(చిన్నచూపు = చులకన, సరిదిద్దు = చక్క జేయు, పాఠశాల = విద్యాలయము, పలుమరు = మాటిమాటికి, సంక్రమించు = లభించు, పఠించు = చదువు, తలపు = ఆలోచన, స్వచ్ఛము = నిర్మలము, సమత = సమత్వము, సత్యము = యథార్థమైన, దృశించు = కనబడు)

తెలుగు భాష అంటే ఉన్న చులకన భావాన్ని సరిదిద్ద లేదని విద్యాలయాలని అనేక సార్లు తిట్టి పోసినా భాషకు న్యాయం దక్కుతుందా? ప్రయోజనం లేదు. వెనకటి తరం కవిపుంగవుల కావ్యాలు చదివితే అలోచనలు నిర్మలంగా అవుతాయి. సమత్వ మన్నది యథార్థమైనదిగా కనపడుతుంది.

277. సమస్య: బకమున్ వడి మ్రింగుచున్న బల్లిన్ గనుమా

ఈ సమస్యను తిరుపతి వేంకట కవులు అద్భుతంగా ఎలా పూరించారంటే, "ప్రకటతర కప్పగంతుల, సుకులోదధి పూర్ణచంద్ర! సూరిజనేంద్రా!, సుకరముగ మక్షికా శా, బకమున్ వడి మ్రింగుచున్న బల్లిన్ గనుమా". నా పూరణ క్రింద ఇవ్వబడింది.

277.379 కం. ఒక గోడకు పటమున దం
డకుఁ గల విరు లందు దూరి, టక్కరి వోలెన్
మకరందముఁ గ్రోలు, యలిం
బకమున్ వడి మ్రింగుచున్న బల్లిన్ గనుమా.

(విరులు = పూలు, టక్కరి = మోసకత్తె, అలింబకము = తేనెటీగ)

ఒక గోడకు పటముంది, ఆ పటానికి దండ, ఆ దండలో వున్న పూల చాటున దూరి మోసగత్తె లాగా పూదేనె తాగే తేనెటీగని వడిగా పట్టుకుని మ్రింగుతున్న బల్లిని చూడుమా.

278. సమస్య: బడి కేగని పంతులె కడు ప్రాభవ మందున్

278.380 కం. బుడతల కాంగ్లము నేర్పెడి
బడి కేగని పంతులె, కడు ప్రాభవ మందున్
నడవడియు మాతృభాషకు
గుడిగా నున్న బడి లోన గురువుగ నుండన్.

(బుడతలు = బిడ్డలు, కడు = మిక్కిలి, ప్రాభవము = ఆధిక్యము, నడవడి = ప్రవర్తనము)

ప్రవర్తనా, మాతృభాషలకి గుడిగా ఉన్న పాఠశాలలలో ఉపాధ్యాయుడుగా, పిల్లలకి ఇంగ్లీషు నేర్పే పాఠశాలకు వెళ్ళని పంతులే ఉంటే, గణనీయమైన ప్రాభవాన్ని పొందుతాడు.

279. సమస్య: బడి పంతులు చదువుకున్న భ్రష్టుండగురా

279.381 కం. నడవడి సరి లేని గురువు
బడి పంతు లయినను వాని పాండితియె వృధా,
బడి యగును నేర స్థలముగ,
బడి పంతులు చదువు కున్న భ్రష్టుం డగురా.

(నడవడి = ప్రవర్తనము, పాండితి = పాండిత్యము, వృధా = దండుగ, భ్రష్టుడు = చెడినవాడు)

సరియైన ప్రవర్తన లేని గురువు బడిపంతులైతే వాని పాండిత్యము దండుగ అవుతుంది. ఆ బడి నేర స్థలమవుతుంది. బడిపంతులు చదువుకున్న చెడ్డవాడవుతాడు.

279.382 కం. పడికట్టు పదములస్ గొని
మిడిమిడి జ్ఞానంబు నేర్చి మిడిసెడి యనదే
బడి నడిపిన గడబిడ యగు,
బడి పంతులు చదువుకున్న భ్రష్టుండగురా.

(పడికట్టు పదములు = మర్యాద మాటలు, కొని = తీసుకొని, మిడిమిడి జ్ఞానం = తెలిసీ తెలియకపోవటం, మిడియు = ఎగురు, అనద = అల్పుడు, గడబిడ = గందరగోళం)

పడికట్టు పదాలు పట్టుకుని సగము సగము జ్ఞానం నేర్చుకుని మిడిసిపాటు పడే అల్పుడు బడి నడిపితే గందరగోళం అవుతుంది. బడిపంతులు చదువుకున్న చెడ్డవాడవుతాడు.

280. సమస్య: బలిని పొగడె విష్ణు భక్తు డొకడు

280.383 ఆ.వె. దాన దీక్ష బెంచ దర్పము, గుర్వాజ్ఞ

ధిక్కరించిన బలి, నిక్కువముగ
నన్ని వామనునికి యప్పగించె ననుచు,
బలిని పొగడె విష్ణు భక్తు డొకడు.

(దీక్ష = పట్టుదల, దర్పము = గర్వము, ధిక్కరించు = ఎదిరించు, నిక్కువము = యథార్థము, అప్పగించు = అధీనము చేయు)

దానము చేయడంలో పట్టుదల గర్వాన్ని పెంచగా గురువైన శుక్రాచార్యుని ఆనతిని ఎదిరించిన బలిచక్రవర్తి, నిజంగా అన్నీ వామనుడికి అధీనము చేశాడు అని బలిని ఒక విష్ణు భక్తుడు స్తుతించాడు.

281. సమస్య: బారును చూడ గానె మది పర్వులు పెట్టిన వింత యెట్లగుస్

281.384 ఉ. మాఱుపు తెత్తు మంచనిరి మద్యనిషేధము పెట్టినంత బీ
హారున, మానిరే ప్రజలు యర్రులుఁ జాచుట యాసవమ్ముకై,
చేరువ నున్న రాష్ట్రముల సీధువు యంగడు లుండవే, యటస్
బారును చూడగానె మది పర్వులుఁ పెట్టిన వింత యెట్లగుస్.

(మాఱుపు = మార్పు, అర్రులుచాచు = ఆశగా పాకులాడు, ఆసవము = సీధువు = మద్యము, చేరువ = సమీపము, అంగడి = దుకాణం, బారు = గుంపు)

బీహారులో మద్యనిషేధము పెట్టగనే మార్పు తెస్తామని అన్నారు. జనాలు మద్యం కోసం ఆశగా పాకులాడడం మానారా. సమీప రాష్ట్రాలలో మద్యం దుకాణాలు ఉండవా. అక్కడ గుంపుని చూడగానే మనసు పరుగులు పెడితే వింత ఎలా అవుతుంది.

282. సమస్య: బారులె శరణ్యములు వేద పండితులకు

282.385 తే.గీ. తీరి కన్నది లేని సంసార మందు
ధర్మకార్యములు సలుప తరుణ మిల్లఁ,
గాన, యద్వైత తత్త్వంబుఁ గరప, గుడుల
బారులె శరణ్యములు వేద పండితులకు.

(తీరిక = విరామము, సంసారము = ప్రపంచము, ధర్మకార్యములు = యజ్ఞాదికములు, సలుపు = చేయు, తరుణము = సమయము, ఇల్ల = లేదు, కాన = కనుక, అద్వైతము = జీవేశ్వరుల కైక్యము చెప్పెడి మతము, తత్త్వము = సారము, కరపు = నేర్పు, బారు = సమూహము, శరణ్యము = దిక్కు)

తీరుబడి అన్నది లేని ప్రపంచంలో ధర్మకార్యాలు చేయడానికి సమయం లేదు. కనుక, అద్వైత తత్త్వం నేర్పాలంటే, వేద పండితులకి దేవాలయాల సమూహాలే దిక్కు.

283. సమస్య: బాల రసాల సాల నవపల్లవ కోమల కావ్యకన్యగన్

పోతన గారి చాటు పద్యం "బాల రసాల ..... కావ్య కన్యకన్" లోని "కావ్య కన్యకన్" అన్న భాగాన్ని "కావ్య కన్యగన్" గా మార్చి సమస్యగా ఇచ్చారు.

283.386 ఉ. బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్యగన్
కాల పరీక్షకున్ నిలచి, క్రాంతి పథమ్మున మానవాళికిన్
శీలము నేర్పు గ్రంథ మని శిష్టులు మెచ్చగ, వ్యాసు పేరిటన్
నేలను నాల్గు దిక్కులను నెక్కొనె, భారత మగ్ర పూజ్యమై.

(బాల = గున్న లేక చిన్న, రసాల = మామిడి, సాల = చెట్టు, నవ = లేత, పల్లవ = చివుళ్ళు వలె, కోమల = కోమలమైన, కావ్యకన్య = కావ్యము అనెడి అమ్మాయి, కాల పరీక్ష = ఒడిదుడుకులు తట్టుకొనుట, క్రాంతి పథము = అభివృద్ధి మార్గము, ఆళి = సమూహము, శీలము = మంచి నడత, గ్రంథము = కావ్యము, శిష్టుడు = సజ్జనుడు, నెక్కొను = వ్యాపించు, అగ్ర = ప్రధానమైనది, పూజ్యము = పూజింప దగినది)

గున్న మామిడి చెట్టు లేత చివుళ్ళ లాగా కోమలమైన కావ్య మనే కన్య కాలపరీక్షకి నిలిచి అభివృద్ధి పథంలో మానవాళికి మంచి నడత నేర్పే గ్రంథమని సజ్జనులు మెచ్చే విధంగా వ్యాసుని పేరిట భూలోకంలో నాలుగు దిక్కులందు భారతము మొదటగా పూజింపదగినదై వ్యాపించింది.

284. సమస్య: బాలలు నచ్చరని నెహ్రు బలముగ పలికెన్

284.387 కం. బాలిశులుఁ గూడ వదరరు
బాలలు నచ్చరని, నెహ్రు బలముగ పలికెన్
భోళాతనము గులాబి గు

బాళింపులు దొరకు మనకు బాలల చెంతే.

(బాలిశుడు = మూర్ఖుడు, వదరు = ఉపయోగము లేనిమాటలు ఊరకమాటాడు, భోళాతనము = తనకు సంబంధించిన ఏ విషయాన్నీ దాచుకోకుండా బయటపెట్టే మనస్తత్వం, గుబాళింపు = సువాసన)

పిల్లలు నచ్చరని మూర్ఖులు కూడా వదరరు. బోళాతనము, గులాబీల సువాసన మనకి పిల్లల దగ్గరే దొరుకుతుందని నెహ్రూ గట్టిగా చెప్పారు.

284.388 కం. కోలాహలములు చేయని
బాలలు నచ్చరని నెహ్రు బలముగ పలికెన్,
బేలతనముఁ బోఁగొట్టగ
హాళిని దరిఁజేరి వారి కండగ నుండన్.

(కోలాహలము = సందడి, బేలతనము = పిఱికితనము, హాళి = ఉత్సాహము, దరిచేరు = దగ్గఱచేరు, అండ = ఆసరా)

పిఱికితనము పోగొట్టి ఉత్సాహంగా పిల్లలకి దగ్గరై వాళ్ళకి ఆసరాగా ఉండగా సందడి చెయ్యని పిల్లలు నచ్చరని నెహ్రూ గట్టిగా చెప్పారు.

284.389 కం. గాలికి పెరిగిన నేరికి
బాలలు నచ్చరని, నెహ్రు బలముగ పలికెన్
బాలల బహుముఖ ప్రజ్ఞా
శాలురఁ జేయుటె సమాజ శస్త మటంచున్.

(శస్తము = మేలైనది)

గాలికి పెరిగితే పిల్లలు ఎవరికీ నచ్చరు కాబట్టి, పిల్లలని బహుముఖ ప్రజ్ఞాశాలురుగా తయారు చేయడమే సమాజానికి మేలు అని నెహ్రూ గట్టిగా చెప్పారు.

284.390 కం. బాలలు రేపటి పౌరులు,
పాలన సరిగా సలుపక, వారల, జగతిన్

జాలికుల౯ జేయు, పిత ల
మ్మాలలు నచ్చరని నెప్రు బలముగ పలికెన్!

(పాలన = రక్షణము, సలుపు = చేయు, జాలికుడు = మోసగాడు, అమ్మాల = మాత)

పిల్లలు రేపటి పౌరులు. వాళ్ళ పాలన సరిగ్గా చెయ్యకుండా, వాళ్ళని లోకంలో మోసగాళ్ళుగా తయారు చేసే తల్లిదండ్రులు నచ్చరని నెప్రూ గట్టిగా చెప్పారు.

285. సమస్య: బాలవ్యాకరణము జదువన్ దోషమగున్

285.391 కం. బాలలు భాష నుతింతురు
బాలవ్యాకరణము౯ జదువన్, దోష మగున్
వీలగు విధమున భాషను
తేలికగా౯ దీసుకొనుచు తికమక౯ బెంచన్.

బాలవ్యాకరణం చదివితే పిల్లలు భాషను మెచ్చుకుంటారు. ఎట్లా వీలయితే అట్లా భాషను తేలికగా తీసుకుంటూ తికమక పెంచితే దోషమవుతుంది.

286. సమస్య: బుద్ధ మతావలంబనులు పూజలు సల్పిరి విష్ణుమూర్తికిన్

286.392 ఉ. బుద్ధుని బోధనల్ వినగ బుద్ధిగ జీవన మందు కోరికల్
బద్ధము౯ జేయ వచ్చనెడి భాష్యము లన్నియు నంతరింపగన్,
వృద్ధిని౯ జేయ శంకరు డభేద మతమ్మును దేశ మంత, మున్
బుద్ధ మతావలంబనులు పూజలు సల్పిరి విష్ణుమూర్తికిన్.

(బుద్ధిగ = తెలివిగా, బద్ధము = కట్ట౯బడినది, భాష్యము = వ్యాఖ్యానము, అంతరించు = రూపుమాయు, వృద్ధి = అభివృద్ధి, అభేదమతము = అద్వైతమతము, మున్ = పూర్వము, అవలంబనము = ఆశ్రయము)

గౌతమ బుద్ధుని బోధనలు వింటే తెలివిగా కోరికలని అదుపులో పెట్టుకోవచ్చనే వ్యాఖ్యానాలన్నీ రూపుమాసేటట్లుగా, ఆది శంకరుడు దేశ మంతటా అద్వైతమతాన్ని వృద్ధి చేయగా, పూర్వము బౌద్ధ మతాన్ని అనుసరించే వారు విష్ణుమూర్తికి పూజలు చేశారు.

287. సమస్య: బొమ్మా నీకింత సిగ్గు పోలదు సుమ్మా

287.393 కం. అమ్మాయిలు విద్యఁ గఱచి
సమ్మానముగ పనిఁజేసి సంపాదించన్
కమ్మని గాత్రీ! బంగరు
బొమ్మా! నీకింత సిగ్గు పోలదు సుమ్మా!

కమ్మని గాత్రం కలదానా! బంగారపు బొమ్మా! అమ్మాయిలు విద్య నేర్చుకొని గౌరవంగా పనిజేసి సంపాదిస్తూ ఉంటే, నీకు ఇంత సిగ్గు సరియైనది కాదు సుమా!

288. సమస్య: భర్తకు పెట్టకుండ తిను భార్యయె సాధ్వీలలామ యిద్ధరన్

288.394 ఉ. వర్తన మందు సీత వలె, వర్ధిలు మంచను మాతఁ వోలె, కా
మార్తినిఁ దీర్చు రంభ వలె, యర్మిలితో సతతంబు భర్తకున్
యర్తిని పంచభక్ష్య పరమాన్నములన్ యిడి, చద్ది యన్నమున్
భర్తకు పెట్టకుండ తిను భార్యయె, సాధ్వీలలామ యిద్ధరన్.

(వర్తనము = నడవడి, వర్ధిలు = వృద్ధిపొందు, మాత = తల్లి, కామార్తి = శృంగారేచ్ఛ, తీర్చు = ఉపశమింపజేయు, అర్మిలి = ప్రేమ, సతతము = ఎల్లప్పుడు, అర్తి = ఆప్యాయము, పంచభక్ష్యపరమాన్నములు = భక్ష్యము, భోజ్యము, లేహ్యము, చోష్యము, పానీయము అన్న ఐదు విధములైన ఆహార పదార్థములు, ఇడు = ఇచ్చు, చద్ది = చల్లని, సాధ్వి = పతివ్రత, లలామ = శ్రేష్ఠమయినది, ధర = భూమి)

నడవడిలో సీతలాగా, బాగుపడమని దీవించమనే తల్లిలాగా, శృంగారేచ్ఛను తీర్చే రంభలాగా, ప్రేమతో నిత్యము భర్తకు ఆప్యాయంగా పంచభక్ష్యపరమాన్నములు ఇచ్చి, చద్ది అన్నము భర్తకు పెట్టకుండా తిను భార్యే ఈ లోకంలో పతివ్రతాశిరోమణి.

289. సమస్య: భర్తను పుత్రుగాఁ దలఁపఁ బాడి యగున్ సతి కెల్లవేళలన్

289.395 ఉ. కీర్తికరంబుగా తనదు గేస్తుడు తోడయి సప్త సంతతిన్
స్ఫూర్తిగఁ బెంపుఁ జేసె, మది పూర్తిగ దైవము నందు నిల్పి దే
హార్తి ముదిన్ లభింప నిక హోంత్రము కోసమె వేచి యున్న యా

భర్తను పుత్రుగాఁ దలఁపఁ బాడి యగుస్ సతి కెల్ల వేళలస్.

(గేస్తుడు = భర్త; సప్త సంతతి = కూపము, తటాకము, ఉద్యానము, మండపము, జలశాల, సద్ధర్మాచరణము, పుత్రుడు అను సప్త సంతానములు; స్ఫూర్తి = ఆవేశంతో కూడిన పట్టుదల, పెంపు = వృద్ధి, మది = మనస్సు, దేహార్తి = శరీరబాధ, ముది = ముసలితనము, హంత్రము = మరణము, పాడి = ధర్మము, సతి = భార్య)

కీర్తిని కలిగించే విధంగా తన భర్త తోడుగా ఉండి సప్తసంతానాలని వృద్ధి చేశాడు. మనస్సు పూర్తిగ దైవం మీద నిలిపి, ముసలితనములో శరీరబాధ కలుగగా ఇక మరణం కోసమే ఎదురుచూస్తున్న యా భర్తను పుత్రునిగా చూడడం భార్యకు అన్ని వేళలలోను ధర్మమే అవుతుంది.

290. సమస్య: భర్తయె భామ యౌట గని భార్యకు కష్టము గల్గె నెంతయుస్

290.396 ఉ. ఆర్తిని వేడ శంకరుని యంబగ యావలి జన్మ మందు సం
హర్త శిఖండి యయ్యె, ద్రుపదాత్మజగా తొలినాళ్ళ లోన తా
వర్తిలి పూరుషుండుగ వివాహము నాడెను, తెల్ల మవ్వగా
భర్తయె భామ యౌటఁ గని భార్యకు కష్టముఁ గల్గె నెంతయుస్.

(ఆర్తి = దుఃఖము, వేడు = ప్రార్థించు, శంకరుడు = శివుడు, ఆవలి = తరువాతి, సంహర్త = చంపువాడు, ఆత్మజ = పుత్రిక, తొలినాళ్ళు = కొత్తల్లో, తా = తాను, వర్తిలు = వ్యవహరించు, పూరుషుడు = మగవాడు, తెల్లము = స్పష్టము, భామ = స్త్రీ, ఔట = అవు, కను = చూచు)

అంబగా ఉన్నప్పుడు దుఃఖంతో శివుని ప్రార్థించగా తరువాతి జన్మలో సంహర్తయైన (భీష్ముని చంపేవాడు) శిఖండి అయ్యాడు. ద్రుపద మహారాజు పుత్రికగా తొలినాళ్ళలో తాను మగవాడిగా వ్యవహరించి వివాహ మాడెను. భర్తయే స్త్రీ అవ్వటం స్పష్టమవ్వగా చూచి భార్యకు ఎంతో కష్టం కలిగింది.

291. సమస్య: భారత దేశమ్ము కన్న భాగ్యము కలదే

291.397 కం. తీరులు భాషల మతముల,
వేరగు నానాత్వమం దభేదముతో, సం
సారపు విలువలు పెంచెడి
భారత దేశమ్ము కన్న భాగ్యము కలదే.

(నానాత్వము = వైవిధ్యము, అభేదము = ఏకీభావము, సంసారము = కుటుంబము)

భాషల మతముల తీరులు వేరుగా నున్న భిన్నత్వంలో ఏకత్వంతో కుటుంబ విలువలు పెంచే భారత దేశము కన్నా భాగ్యము ఉందా?

292. సమస్య: భారత రాజనీతి పరిపక్వత జెంది జగాన వెల్గగన్

292.398 ఉ. ధోరణి బానిసత్వమె యధోగతి కీడ్చెను చేతివృత్తులన్,
చోరులఁ బోలె దోచుకొని సొత్తు తరల్చె పరాయి పాలకుల్
తీరును మార్చి రెందరొ సుధీవరు లెంతయొ పోరి, స్వేచ్ఛతో
భారత రాజనీతి పరిపక్వతఁ జెంది జగాన వెల్గగన్.

(ధోరణి = తరతరము, బానిస = పరతంత్రుడు, అధోగతి = పతనము, ఈడ్చు = లాగు, చోరుడు = దొంగ, పోలె = వలె, దోచుకొను = అపహరించు, సొత్తు = సంపద, తరల్చు = తీసుకొనిపోవు, పరాయి పాలకులు = విదేశీ దొరలు, తీరు = విధము, సుధీవరుడు = మేధావి, పోరు = ఎదిరించు, స్వేచ్ఛ = స్వతంత్రత, రాజనీతి = రాజధర్మము, పరిపక్వత = పరిపాకము నొందినది, జగము = లోకము, వెల్గు = ప్రకాశించు)

తరతరాల పరతంత్రమే చేతివృత్తులని పతనావస్థకి ఈడ్చింది. విదేశీదొరలు దొంగల లాగా సంపదని దోచుకొని తరలించారు. స్వతంత్రతతో భారత రాజధర్మము పరిపాకము పొంది లోకంలో వెలగాలని మేధావు లెందరో పోరాడి తీరును మార్చారు.

293. సమస్య: భారతమాత పుత్రులకు భాగ్యము లయ్యవి త్యాగధీరముల్

293.399 ఉ. సారపు ధర్మముస్ విమల సత్యము కార్యము లందు నిల్పుచున్,
కోరి యనేక కష్టములకున్ యెదురొడ్డి, బ్రిటీషు నేతలన్
బారగఁ జేసి, సుస్వపరిపాలనఁ గూర్చిన దేశభక్తులౌ
భారతమాత పుత్రులకు భాగ్యము లయ్యవి త్యాగధీరముల్.

(సారపు ధర్మము = శ్రేష్ఠమైన కర్తవ్యము, విమల సత్యము = నిర్మలమైన నిజము, కార్యము = పని, నిల్పు = నిలుపు, ఎదురొడ్డు = ప్రతిఘటించు, నేత = ప్రభువు, పారు = పారిపోవు, సుస్వపరిపాలన = మంచిగా తమ

వ్యవహారాలు తామే నిర్వహించుకునే స్వేచ్ఛ గల వ్యవహార సరళి, కూర్చు = సిద్ధ మొనరించు, భాగ్యము = ధీరము = సుకృతము, ధైర్యము కలిగి యుండుట)

శ్రేష్ఠమైన కర్తవ్యము, నిర్మలమైన సత్యము పనుల్లో నిలుపుతూ, కోరి అనేక కష్టాలకు ఎదురు నిలిచి ఆంగ్లేయ ప్రభువులను పారిపోయేటట్లు చేసి, మంచి స్వపరిపాలన సిద్ధం చేసిన దేశభక్తులైన భారతమాత బిడ్డలకి త్యాగము ధైర్యము అనేవి అదృష్టాలు.

294. సమస్య: భారతి ఫాలభాగమున భాగ్యము తీరెను మూడు వన్నెలై

294.400 ఉ. గౌరము వర్తనంబు సమకట్టెడి సూనృతముస్, హరిత్తు కుం
డీరులకుస్ ధరిత్రికిని డెక్కొను బంధము, కావి స్వేచ్ఛకై
వీరుల త్యాగముస్ దెలుప, వెంకయ జాతి పతాక మివ్వగస్
భారతి ఫాలభాగమున భాగ్యము తీరెను మూడు వన్నెలై.

(గౌరము = ధవళ వర్ణము, వర్తనము = నడవడి, సమకట్టు = సిద్ధపరుచు, సూనృతము = ప్రియమును సత్యమునైనది, హరిత్తు = ఆకుపచ్చ వర్ణము, కుండీరుడు = మనుష్యుడు, ధరిత్రి = నేల, డెక్కొను = నెలకొను, కావి = కాషాయ వర్ణము, స్వేచ్ఛ = స్వాతంత్ర్యము, ఫాల = నుదురు, భాగ్యము = అదృష్టము, తీరు = చక్కబడు, వన్నె = రంగు)

తెలుపు రంగు నడవడిని నిర్దేశించే సత్యమును, ఆకుపచ్చ రంగు మట్టితో మనిషికి నెలకొన్న అనుబంధాన్ని, కాషాయ రంగు స్వతంత్రము కోసము వీరులు చేసిన త్యాగాన్ని తెలిపే విధంగా పింగళి వెంకయ్య గారు జాతికి పతాక మివ్వగా, అది భారత మాత నుదుటను మూడు వన్నెలుగా భాగ్యరేఖ అయింది.

294.401 ఉ. తీరుగ పాలనస్ సలుప తిన్నని శాసనముల్ జనాళికిస్
గూరుచు ప్రాతినిధ్య సభ, కొప్రపు టండగ న్యాయపీఠముస్,
పౌరుల హక్కులస్ నిలుపు భవ్య ప్రభుత్వము, భిన్న శాఖలై
భారతి ఫాలభాగమున భాగ్యము తీరెను మూడు వన్నెలై.

(తీరుగ = సరియైన విధంగా, పాలన = ఏలుబడి, సలుపు = చేయు, తిన్నని = యుక్తము, శాసనము = చట్టము, జనాళి = జన సమూహము, కూరుచు = కూడబెట్టు, ప్రాతినిధ్య సభ = ప్రజలు కలిసి తమ కార్యనిర్వహణమునకై ఎన్నుకొనిన పెద్దల సభ, కొప్రము = శిఖరము, అండ = ఆశ్రయము, పౌరుడు = నాగరికుడు, నిలుపు =

స్థిరపఱచు, భవ్య = యోగ్యమైన, ప్రభుత్వము = అధికారము, భిన్న శాఖలు = వేరు అంగములు, ఫాల = నుదురు, భాగ్యము = అదృష్టము, తీరు = చక్కబడు, వన్నె = రంగు)

సరియైన విధంగా పరిపాలన చేయడానికి యుక్తమైన చట్టాలు జన సమూహానికి అందించే ప్రజా ప్రాతినిధ్యం ఉన్న సభ, కొండంత అండగా న్యాయపీఠము, పౌరుల హక్కులను నిలిపే యోగ్యమైన ప్రభుత్వము వేరు అంగాలుగా భారత మాత నుదుటను మూడు వన్నెలుగా భాగ్యరేఖ అయింది.

295. సమస్య: భారతి భర్త శంభుడని పల్కుట లోకవిరుద్ధమెట్లగున్

295.402 ఉ. ఘోర తపంబుఁ జేసి శివుఁ గోరెను పార్వతి, భర్తగా, వడిన్
జేరెను శంభు డున్న గిరి, సేవలుఁ జేయుచు నిచ్చె వాన్కి కుం
భారతి, భర్త శంభు డని పల్కుట లోకవిరుద్ధ మెట్లగున్,
మారుని పంచ బాణములు మార్చ మహేశుని మానసంబునే.

(ఘోర = భయంకరమైన, గిరి = పర్వతము, వాన్కి = వానికి, కుంభారతి = హారతి విశేషము, శంభుడు = శివుడు, విరుద్ధము = సరిపడనిది, మారుడు = మన్మథుఁడు, మహేశుడు = శివుడు, మానసము = మనస్సు)

పార్వతి ఘోరమైన తపస్సు జేసి శివుణ్ణి భర్తగా కోరింది. శీఘ్రంగా, శివుడున్న పర్వతం మీదకి చేరింది. సేవలు చేస్తూ వానికి హారతి ఇచ్చింది. మన్మథుని ఐదు బాణాలు శివుని మనస్సు మార్చగా, భర్త శివుడే అని చెప్పడం లోక విరుద్ధము ఎట్లా అవుతుంది.

296. సమస్య: భార్య లిద్దరు శ్రీరామభద్రునకును

296.403 తే.గీ. తండ్రి చిన్న భార్య తనను తల్కమునకుఁ
బంపి భరతు రాజుగఁ సేయు వరము లడుగ,
వనము కేగించి వీడ్కోలు పలికె పెద్ద
భార్య లిద్దరు శ్రీరామభద్రునకును.

(తల్కము = అడవి = వనము, ఏగించు = ఏగునట్లుచేయు)

శ్రీరామచంద్రునికి, తండ్రియైన దశరథుని చిన్న భార్యయైన కైకేయి తనని అడవికి పంపి భరతుని రాజుగా చేయాలని వరములు అడుగగా, పెద్ద భార్యలైన కౌసల్యా సుమిత్రలు అడవికి వెళ్ళేటట్లు చేసి వీడ్కోలు పలికారు.

297. సమస్య: భార్యను గనినన్ గడగడ భర్తయె వణకెన్

297.404 కం. ఫిర్యాదు దేవయానిది
యార్యుడు శర్మిష్టఁ గూడె నని, విన శుక్రా
చార్యుడు శపించు ననుచున్,
భార్యను గనినన్ గడగడ భర్తయె వణకెన్.

(ఫిర్యాదు = నేరము మోపడము, ఆర్యుడు = భర్త, కూడు = సంభోగించు)

భర్తయైన యయాతి శర్మిష్టతో సంభోగించాడని అతని భార్య దేవయాని ఫిర్యాదు చేసింది. అది వింటే, దేవయాని తండ్రియైన శుక్రాచార్యుడు శపిస్తాడని, భార్యని చూడగానే భర్తయే గడగడ వణికాడు.

298. సమస్య: భార్యలు ముర్వురా పరమపావనుడౌ రఘురామమూర్తికిన్

298.405 ఉ. ధుర్యు డధీశుడౌ దశరథుం డొక కామ పిశాచమా? యతం
డార్యుడె? గేస్తురా లొకటియా? త్రిశతంబులు, యందు ముఖ్యమౌ
భార్యలు ముర్వురా? పరమ పావనుడౌ రఘురామ మూర్తికిన్
భార్యన యొక్కతే, మరియు బాణము మాటయు యొక్కటే కదా.

(ధుర్యుడు = శిష్టుడు, అధీశుడు = సమస్త సామంతుల చేత సేవింప బడిన రాజు లేక చక్రవర్తి, పిశాచము = బూచివాడు, ఆర్యుడు = పూజ్యుడు, గేస్తురాలు = ఇల్లాలు, త్రిశతములు = మూడు వందలు, ముర్వురు = ముగ్గురు, పరమ పావనుడు = పుణ్యమూర్తి)

శిష్టుడు, చక్రవర్తియైన దశరథుడు ఒక కామ పిశాచమా? అతడు పూజ్యుడా? ఇల్లాలు ఒక్కతా? మూడు వందల మంది. అందులో ముఖ్యమైన భార్యలు ముగ్గురా? పుణ్యమూర్తియైన రఘురామ మూర్తికి భార్య అనగా ఒక్కతే. ఇంకా, బాణము, మాటా కూడా ఒకటే కదా.

299. సమస్య: భీమ సేనుడు గాంధారి పెద్ద కొడుకు

299.406 తే.గీ. అన్న యాజ్ఞను తా నొక హద్దుఁ గనెను
భీమ సేనుడు; గాంధారి పెద్ద కొడుకు
యన్నయై యుండి తమ్ముల నదుపుఁ జేసి
తప్పుఁ దోవను నడిపింప తిప్ప లొచ్చె.

(హద్దు = పరిమితి, తిప్పలు = కష్టములు)

అన్నయైన ధర్మరాజు ఆజ్ఞలో తాను ఒక హద్దు చూశాడు భీమసేనుడు. గాంధారి పెద్ద కొడుకైన దుర్యోధనుడు, అన్న అయ్యుండి కూడా తమ్ముళ్ళని అదుపులో పెట్టి తప్పుదారిలో నడిపించడం వల్ల కష్టాలు వచ్చాయి.

300. సమస్య: భీముడు పార్వతిని మెచ్చి పెండ్లాడె గదా

300.407 కం. కాముని శరముల తాపము
నీమముగా తప మొనర్చు నెలతుక నగజన్
ప్రేముడి చేరువఁ జేయగ
భీముడు పార్వతిని మెచ్చి పెండ్లాడెఁ గదా.

(కాముని = మన్మథుని, తాపము = బాధ, నీమము = నియమము, నెలతుక = అతివ, నగజ = పార్వతి, ప్రేముడి = ప్రేమతో, చేరువ = సమీపము, భీముడు = శివుడు)

భీముడు అంటే శివుడు అన్న అర్థం కూడా ఉంది. మన్మథుని బాణముల బాధ వల్ల నియమముగా తపస్సు చేసుకుంటున్న శైలజను ప్రేమతో దగ్గర చేయగా శివుడు పార్వతిని పెళ్ళిచేసుకున్నాడు కదా.

301. సమస్య: భీష్మద్రోణుల కావహంబు గలిగెన్ భీష్మంబుగా నత్తఱిన్

301.408 శా. గ్రీష్మం బందు పురాణ నాటకములన్ ఖేటమ్ము లందాడు, యా
భీష్మద్రోణుల పాత్రధారులు నిశన్ వేషంబులన్ మార్చకే
యూష్మం బంచు సురన్ గ్రసించఁ బెరిగెన్ యుద్రేక మాభీలమై,
భీష్మద్రోణుల కావహంబుఁ గలిగెన్ భీష్మంబుగా నత్తఱిన్.

(గ్రీష్మము = వేసంగి, ఖేటము = కర్షకగ్రామము, ఆడు = నటించు, నిశ = రాత్రి, ఊష్మము = వేడిమి, సుర = మద్యము, గ్రసించు = మ్రింగు, ఉద్రేకము = ఆవేశము, ఆభీలము = భయమును పుట్టించునది, ఆవహము = యుద్ధము, భీష్మము = భీషణము, తఱి = సమయము)

వేసవి కాలంలో కర్షక గ్రామాలలో పౌరాణిక నాటకాలు ఆడే ఆ భీష్మద్రోణ పాత్రధారులు రాత్రి వేళ వేషాలు మార్చుకోకుండా వేడి అంటూ మద్యము సేవించగా, కోపం భయం పుట్టించే విధంగా పెరిగింది. ఆ సమయంలో భీష్మద్రోణులకి యుద్ధం జరిగింది.

302. సమస్య: భీష్మునితో గూడి రంభ భీముని గనియెన్

302.409 కం. గ్రీష్మంబున యాసవ మొక
డూష్మము తగ్గించు నంచుఁ గ్రోలుచు ప్రేలెన్
భీష్మ నటునిఁ గేరుచు నిటు
"భీష్మునితో గూడి రంభ భీముని గనియెన్".

(గ్రీష్మము = వేసంగి, ఆసవము = మద్యము, ఊష్మము = వేడిమి, క్రోలు = త్రాగు, ప్రేలు = వదరు, నటుడు = పాత్రధారి, కేరు = పరిహసించు, ఇటుల = ఈ ప్రకారముగ, కూడు = రమించు, కను = ప్రసవించు)

వేసవిలో ఒకడు వేడిమి తగ్గిస్తుందని మద్యం త్రాగుతూ భీష్మ పాత్రధారిని ఎగతాళి చేస్తూ ఈ విధంగా ప్రేలాడు, "భీష్ముడితో రంభ కూడి భీముణ్ణి కంది".

303. సమస్య: మంగల వాడె భర్తయగు మానుము దుఃఖ మికన్ తలోదరీ

303.410 ఉ. సాంగముగా సభోదితుడు, చక్కని రూపసి, పెద్ద లానతిన్
భంగముఁ జేయ నేర్వని స్వభావము పుట్టుకతోఁ గలట్టి వా,
డంగన లన్న నాదరము నర్పణఁ జేసెడి వాడు, నిన్ను నో
మం గల వాడె, భర్తయగు మానుము దుఃఖ మికన్, తలోదరీ!

(సాంగముగా = సంపూర్ణముగా, సభోదితుడు = పండితుడు, రూపసి = అందగాడు, ఆనతి = ఆజ్ఞ, భంగము = ఆటంకము, అంగన = స్త్రీ, ఆదరము = గౌరవము, ఓము = రక్షించు, తలోదరి = వనిత)

సంపూర్ణముగా పండితుడు, చక్కటి అందగాడు, పెద్దల ఆజ్ఞకు ఆటంకము చేయుట నేర్చుకొనని స్వభావము పుట్టుకతో ఉన్నవాడు, ఆడువారంటే గౌరవం ఇచ్చే వాడు, నిన్ను కాపాడగల వాడే భర్త అవుతాడు. ఓ వనితా! దుఃఖమిక మానుము.

304. సమస్య: మంగలవాడు నీ మగడు మానిని శ్రీసతి సంతసింపుమీ

304.411 ఉ. అంగన రుక్మిణిన్ గదిసి యామెను కృష్ణుడు తోడ్కొనన్, యదే
భంగ మటన్న రుక్మిఁ గని భండన మందున చక్రి యోర్చి త
త్సంగర మందుఁ జేయ తల క్షౌరము, హాలుడు యామె కిట్లనెన్,
మంగలవాడు నీ మగడు మానిని శ్రీసతి సంతసింపుమీ.

(అంగన = స్త్రీ, కదియు = సమీపించు, తోడ్కొను = వెంటబెట్టుకొను, భంగము = అవమానము, భండనము = సంగరము = యుద్ధము, చక్రి = కృష్ణుడు, ఓర్చు = ఓడించు, క్షౌరము = మంగలిపని, హాలుడు = బలరాముడు, మంగల = క్షౌరముచేయు జాతి, మానిని = మానవతి యగు స్త్రీ, శ్రీసతి = లక్ష్మీదేవి, సంతసించు = సంతోషించు)

యువతియగు రుక్మిణిని కలిసి యామెను కృష్ణుడు వెంటబెట్టుకొని పోవుచుండగా, అదే అవమానమని అన్న ఆమె సోదరుడైన రుక్మిని యుద్ధంలో కృష్ణుడు ఓడించి తల క్షౌరము చేయగా, బలరాముడు రుక్మిణితో ఇలా అన్నాడు: ఓ మానవతియైన లక్ష్మీదేవీ, సంతోషించు, నీ భర్త మంగలవాడు. ఇక్కడ, సంతోషించడానికి కారణం ఏమిటంటే, రుక్మిని చంపకుండా, కేవలము క్షవరం చేసి వదిలిపెట్టడం.

305. సమస్య: మంచి నొనర్చెడు జనులకు మరణము దక్కున్

305.412 కం. వంచనతో పేద జనుల
పంచనఁ జేరి శ్రమశక్తి పఱిగొని ధనమున్
సంచుల నింపి స్వజనులకె
మంచి నొనర్చెడు జనులకు మరణము దక్కున్.

(వంచన = మోసము, పంచన = నీడన, పఱిగొని = అపహరించి)

మోసంతో పేద ప్రజల నీడన చేరి వారి శ్రమశక్తిని దోచుకుని ధనం సంచుల్లో నింపి చివరికి స్వంత మనుషులకి మాత్రమే మంచి చేసే జనాలకి మరణం సంభవిస్తుంది.

306. సమస్య: మగం డుత్తముఁడంచుఁ బేర్కొని యయో సతి గోరుకొనెన్ విడాకులన్

306.413 ఉ. చిత్తము చంచలంబు, దరిఁ జేర్చును ధూర్తుల రాత్రు లందునన్,
విత్తము రిత్తఁ జేసి పుర వీధులఁ గ్రుమ్మరు నప్పు కోసమై,
యెత్తుకపోయి యమ్ము నగ, లే విధిఁ జెప్పెద నయ్య నా మగం
డుత్తముఁడంచుఁ, బేర్కొని యయో సతిఁ గోరుకొనెన్ విడాకులన్.

(చంచలము = చలించునది, ధూర్తుడు = జూదరి, రిత్త = శూన్యము, క్రుమ్మరు = తిరుగు, ఎత్తుకపోవు = అపహరించు, ఉత్తముడు = మంచివాడు, పేర్కొను = చెప్పు)

నిలకడ లేని మనసు, రాత్రులు జూదరులను దగ్గరకు చేరుస్తాడు, డబ్బు అవగొట్టేసి అప్పుకోసం నగర వీధులలో తిరుగుతాడు, నగలు దొంగిలించి అమ్ముతాడు, ఇలాంటి లక్షణాలున్న మా ఆయన్ని ఏ విధంగా మంచివాడని చెబుతానయ్యా అని చెప్పి ఆ భార్య విడాకులు కోరుకుంది, పాపం.

307. సమస్య: మగనికి కట్టినది చీర మదిని మురియుచున్

307.414 కం. తగ దన్నను వెంటఁబడెడి
పగతుఁడు కీచకునిఁ బిల్చి పాంచాలి నిశన్
దెగటార్చగ నేకతమున
మగనికి కట్టినది చీర మదిని మురియుచున్.

(పగతుడు = శత్రువు, నిశ = రాత్రి, తెగటార్చు = చంపు, ఏకతము = నిర్జన ప్రదేశము)

తగదని అన్నా కూడా వెంటపడే శత్రువు కీచకుణ్ణి పిలిచి ద్రౌపది అర్థరాత్రి వేళ నిర్జన ప్రదేశంలో చంపడానికి మనస్సులో సంతోషిస్తూ మగడైన భీమునికి చీర కట్టింది.

308. సమస్య: మట్టికి గల మహిమ యిద్ది మాన్యవరేణ్యా

308.415 కం. పుట్టిన గడ్డకు స్వేచ్ఛయు
చట్టపరంబుగ జనులకు సమ న్యాయంబున్
ముట్టగఁ జేసిరి, వీరుల

మట్టికిఁ గల మహిమ యిద్ది, మాన్యవరేణ్యా!

(స్వేచ్ఛ = స్వతంత్రము, మహిమ = గొప్పతనము, ఇద్ది = ఇది, మాన్య = గౌరవింప దగిన, వరేణ్యుడు = శ్రేష్ఠుడు)

ఓ, మాన్యవరా! జన్మభూమికి స్వతంత్రము, ప్రజలకు శాసనం ద్వారా సమ న్యాయము అందేటట్లుగా చేశారు, వీరులను కన్న మట్టికి ఉన్న మహిమ ఇదే.

308.416 కం. తట్ట నహింసోపాయము
బిట్టున యాంగ్లేయ శిష్టి విచ్చుతిఁ జేయస్,
దిట్టరులకు జన్మ మిడిన
మట్టికిఁ గల మహిమ యిద్ది, మాన్యవరేణ్యా!

(తట్టు = తోచు, బిట్టు = శీఘ్రము, శిష్టి = పాలన, విచ్చుతి = నాశనము, దిట్టరి = సమర్థుడు, మహిమ = గొప్పతనము, ఇద్ది = ఇది, మాన్య = గౌరవింప దగిన, వరేణ్యుడు = శ్రేష్ఠుడు)

ఓ, మాన్యవరా! అహింస అనే ఉపాయము తోచగా శీఘ్రముగా ఆంగ్లేయుల పాలన అంతము చెయ్యడానికి సమర్థులను కన్న మట్టికి ఉన్న మహిమ ఇదే.

308.417 కం. ముట్టము విదేశ వస్తువు
కట్ట మితర దేశ యంశుక మనుచు, దేశం
బట్టుడు కించె జనావళి,
మట్టికిఁ గల మహిమ యిద్ది, మాన్యవరేణ్యా!

(ముట్టు = తాకు, కట్టు = ధరించు, అంశుకము = వస్త్రము, అట్టుడికించు = తీవ్రమైన అలజడి సృష్టించు, ఆవళి = సమూహము, మహిమ = గొప్పతనము, ఇద్ది = ఇది, మాన్య = గౌరవింప దగిన, వరేణ్యుడు = శ్రేష్ఠుడు)

ఓ, మాన్యవరా! విదేశ వస్తువు తాకము, విదేశ వస్త్రము ధరించము అంటూ జనసమూహము దేశంలో తీవ్రమైన అలజడి సృష్టించారు. మట్టికి ఉన్న మహిమ ఇదే.

309.   సమస్య: మతి లేని నరుండు మిగుల మన్నన వొందుస్

309.418   కం. అతి వినయము ధూర్తులకు గు
రుతు, యతి దానమ్ముు బలిని క్రుంగగఁ జేసెస్,
అతి వదలి మితి నెరుగు యతి
మతి లేని నరుండు మిగుల మన్నన వొందుస్.

(ధూర్తుడు = మోసగాడు, క్రుంగు = తగ్గిపోవు, అతి = అధికము, మితి = హద్దు, అతిమతి = గర్వము, నరుడు = మనుష్యుడు, మిగుల = మిక్కిలి, మన్నన = సమ్మానము)

ఎక్కువ వినయము చూపించడం మోసగాళ్ళకు చిహ్నము. అతిగా దానం అంటే దానంలో ఆధిక్యము బలిని తొక్కేసింది. అతిని వదలిపెట్టి హద్దును తెలుసుకున్న గర్వము లేని మనిషి ఎక్కువ గౌరవాన్ని పొందుతాడు.

310.   సమస్య: మతిలేనట్టి పవనజుని మానక గొల్తుస్

310.419   కం. సతి జాడఁ గనక యడవుల
గతిమాలి తిరుగు రఘుపతిఁ గలిసెను, సీతస్
వెతకి వెతలుఁ దీర్చిన, యతి
మతి లేనట్టి పవనజుని, మానకఁ గొల్తుస్.

భార్యయైన సీత జాడ కనపడక అడవుల్లో దిక్కు తోచక తిరుగుతున్న రాముని కలిసి, సీతను వెతికి, కష్టాలు పోగొట్టిన, నిగర్వియైన వాయుపుత్రుడు హనుమంతుని విడవక ఉపాసిస్తాను.

311.   సమస్య: మత్స్యము కన్నుగొట్ట నొక మానిని చిక్కె విచిత్ర రీతిగస్

311.420   ఉ. తత్స్యదముస్ గ్రహించి యట స్తంభముపై తిరుగాడు చున్నదౌ
మత్స్యము కన్నుఁగొట్ట నొక మానిని చిక్కె విచిత్ర రీతిగస్
మత్స్యపు యంత్రముస్ దునుచు మధ్యమ పాండవు వీర్యశుల్కగా
మత్స్యపు కళ్ళ ద్రౌపదియె మానిని పాండవ ధర్మపత్నియెస్.

(తత్ = ఆ, స్యదము = వేగము, గ్రహించు = గమనించు, మత్స్యము = చేప, మానిని = మానవతి, చిక్కు = దొరకు, విచిత్ర = ఆశ్చర్యము, రీతి = విధము, తునుచు = భేదించు, మధ్యమ పాండవు = అర్జునునికి, వీర్యశుల్క = వీరత్వాన్ని కట్నంగా ఇచ్చి పొందే కన్య)

ఆ వేగాన్ని గమనిస్తూ, స్తంభము పైన తిరిగే చేప కంటిని కొట్టగా మానవతియైన యువతి మత్స్య యంత్రాన్ని భేదించిన మధ్యమ పాండవుడైన అర్జునునికి వీర్యశుల్కంగా, ఆశ్చర్యకరంగా, దొరికింది. ఆ మీనాక్షి, మానవతి ద్రౌపదియే పాండవుల ధర్మపత్ని అయ్యింది.

312. సమస్య: మత్స్యాహారమ్ము మేలు మౌని వరులకున్

312.421 కం. మాత్స్యికుల కుపాధి యగును
మత్స్యాహారమ్ము, మేలు మౌని వరులకున్
మత్స్య పురాణజ్ఞానము,
వాత్స్యాయన సూత్రములు యువతకు వరమ్మౌ.

(మత్స్యము = చేప, మాత్స్యికుడు = చేపలను చంపువాడు, ఉపాధి = కుటుంబ పోషకము, వరము = ఒక నిధి)

చేపలను చంపే వాళ్ళకి చేపల ఆహారము జీవనోపాధి అవుతుంది. మునీశ్వరులకు మత్స్యపురాణము నందు జ్ఞానము మేలు చేస్తుంది. వాత్స్యాయన కామ సూత్రాలు యువతకు ఒక నిధి అవుతాయి.

313. సమస్య: మదనుని కంటి మంటలకు మాడెఁ, ద్రినేత్రుఁడు చిత్రమయ్యెడిన్

313.422 చం. చెదరని దీక్షతో గిరిజ చిచ్చఱకంటినిఁ గూర్చి వేడగన్
కదల డటంచు బాణముల కాముకుఁ జేసియు యీశుడేఁ గనన్
మదనుడు కంటి మంటలకు మాడెఁ, ద్రినేత్రుఁడు చిత్రమయ్యెడిన్
చదురున పెండ్లియాడె నగజన్, యభిరూపు ననంగుఁ జేయుచున్.

(చెదరు = సడలు, దీక్ష = పట్టుదల, గిరిజ = నగజ = పార్వతి, చిచ్చఱకంటి = ఈశుడు = త్రినేత్రుడు = శివుడు, వేడు = ప్రార్థించు, కదలడు = చలించడు, కాముకుడు = ఇచ్ఛగలవాఁడు, కను = చూచు, మదనుడు = అభిరూపుడు = మన్మథుడు, మాడు = దగ్ధమగు, చిత్రము = ఆశ్చర్యము, చదురున = విధముగా, అనంగుడు = మేనులేనివాఁడు)

సడలని పట్టుదలతో పార్వతి శివుని ప్రార్థించగా, చలించడు అని అనుకుని బాణాలతో (పుష్ప) ఇచ్చగలవానిని చేసికూడా శివుడే చూడగా మన్మథుడు కంటి మంటలకు కాలి బూడిద అయ్యాడు. శివుడు ఆశ్చర్యం అనిపించే విధంగా మన్మథుణ్ణి శరీరం లేనివాడుగా చేస్తూ పార్వతిని పెళ్ళి చేసుకున్నాడు.

314. సమస్య: మదిలో వీణెలు మ్రోగె నా ముదితకున్ మధ్యాహ్న కాలమ్మునన్

314.423 మ. తుదకీ యద్రినిఁ జిక్కితిన్ ప్రవరుడన్ తోడ్పాటుతోఁ జేరెదన్
సదనమ్మందు, వరూధినీ! యనుచు తా సాయంబు కాంక్షింపఁ, జ
క్కదనంబున్ గని రెప్పపాటు మరువన్ ఘర్మంబులున్ గ్రమ్మగా
మదిలో వీణెలు మ్రోగె నా ముదితకున్ మధ్యాహ్న కాలమ్మునన్.

చివరికి ఈ కొండ మీద చిక్కుపడిపోయాను, నేను ప్రవరుణ్ణి, నీ తోడ్పాటు ఉంటే ఇల్లు చేరుకుంటాను, వరూధినీ, అని అంటూ తాను సాయం కోరగా, ఆతని చక్కదనాన్ని చూసి రెప్పపాటు మరిచిపోగా, చెమటలు కమ్మగా మధ్యాహ్న సమయంలో మనస్సులో ఆ వనితకి వీణలు మ్రోగాయి.

314.424 మ. సదనంబున్ విడి కాలి పూత మహిమన్ సందర్శనోత్సాహియై
కదలాడన్ ప్రవరుండు మంచు గిరిపై, కర్తారు తేజమ్మునన్
గుదిసెన్ బూత, వరూధి నింటఁ జన యంకూరించు కామార్తిచే
మదిలో వీణెలు మ్రోగె నా ముదితకున్ మధ్యాహ్న కాలమ్మునన్.

(సదనము = ఇల్లు, కదలాడు = తిరుగు, కర్తారుడు = సూర్యుడు, కుదియు = అడగు, నశించు; అంకూరించు = మొలకెత్తు)

ఇల్లు వదిలి పెట్టి కాలిపూత మహిమతో సందర్శనాభిలాష చేత ప్రవరుడు మంచు కొండ మీద కదలాడుతుంటే, సూర్యునితాపం వల్ల పూత కరిగి పోయింది. వరూధిని ఇంటికి వెళ్ళగా, అంకురించిన కామదాహంతో మధ్యాహ్న సమయంలో ఆ వనితకి మనస్సులో వీణలు మ్రోగాయి.

315. సమస్య: మనగల వాడే మహితుడు మహిలో నరయన్

315.425 కం. తన కోప మదుపు పెట్టుచు,
యునికిని నిలబెట్టుకొనుచు, యోపికకు తగన్

జనులకు సాయముఁ జేయుచు,
మన గల వాడే మహితుడు, మహిలో నరయన్.

(ఉనికి = స్థితి, ఓపిక = శక్తి, అరయు = విచారించు)

విచారిస్తే, తన కోపాన్ని అదుపున పెట్టుకుంటూ, తన స్థితిని నిలబెట్టుకుంటూ, తన శక్తికి తగ్గట్టుగా ప్రజలకు సాయం చేస్తూ జీవించగలవాడే లోకంలో గొప్పవాడు.

316. సమస్య: మరణము కోరి వచ్చినది మానిని నీ వెటు లాదరింతువో

316.426 చం. శరణని కుంతి పాదముల సన్నిధి కొచ్చెను నిన్నుఁ గోరుచున్
తరుణి హిడింబి కాదనకు, తమ్ముడ! భీమ! యటంచు, ధర్మరా
జరుసము తోడఁ జెప్పె నిటు, యన్న హిడింబకు దక్క నీ వలన్
మరణము, కోరి వచ్చినది మానిని, నీ వెటు లాదరింతువో.

(అరుసము = హర్షము, ఇటు = ఇట్లు)

శరణు కోరి మన తల్లి కుంతి పాదముల చెంతకు నిన్ను కోరుతూ హిడింబి అనే స్త్రీ వచ్చింది, తమ్ముడా! భీమా! కాదనకు అని అంటూ సంతోషముతో ధర్మరాజు ఈ విధంగా చెప్పాడు: అన్నయైన హిడింబకు నీ వల్ల మరణము దక్కగా, కోరి వచ్చింది మానవతి, నీవు ఎట్లా ఆదరిస్తావో అని.

317. సమస్య: మరణమును జయించువాడె మర్త్యుండన్నన్

317.427 కం. పరులకుఁ జేసిన యుపకృతి
మరువగ వలయున్, సహజమె మరచుటఁ గానీ,
పరు లుపకృతిఁ జేసిన వి
స్మరణమును జయించు వాడె మర్త్యుం డన్నన్.

ఇతరులకు ఉపకారం చేస్తే దాన్ని మరచిపోవాలి. మరచిపోవడం సహజమే అయినా, ఇతరులు ఉపకారం చేస్తే, దాన్ని విస్మరించడాన్ని జయించిన వాడే మనిషి అంటే.

318.   సమస్య: మలమును గనినంత ముక్తిమార్గము దోఁచున్

318.428   కం. అలమటల నోర్చి పావన
చలిమల కైలాస యాత్ర సలుపగ భక్తిన్
దెలియును మహిమ లట గల య
మలమునుఁ గని నంత ముక్తి మార్గముఁ దోఁచున్.

(అలమట = కష్టం, ఓర్చు = సహించు, పావన = పవిత్రమైన, చలిమల = హిమాచలము, కైలాస = స్ఫటికమువలె శుభ్రంగా తెల్లగా నున్న కైలాస పర్వతము, సలుపు = చేయు, అమలము = నిర్మలత్వము, కను = చూచు, తోచు = భావ ముదయించు)

కష్టాలను సహించి పవిత్రమైన హిమాలయ కైలాస యాత్ర భక్తితో చేస్తే మహిమలు తెలుస్తాయి. అక్కడ ఉన్న నిర్మలత్వము చూడగానే ముక్తిమార్గము తడుతుంది.

319.   సమస్య: మల్లియ తీవియకు గాసె మామిడి కాయల్

319.429   కం. సల్లాపంబుల కనువుగ
మల్లియ తీవియకుఁ గాసె, మామిడి కాయల్
కొల్లలుగఁ గాసె, రెండున్
వెల్లడిఁ జేసె లలి మండు వేసవి యందున్.

(సల్లాపము = ముచ్చట, అనువు = అనుకూలము, కొల్లలు = అధికము, వెల్లడిచేయు = బహిర్గతము చేయు. లలి = ఉత్సాహము)

ముచ్చట్లకి వీలుగా తీగెకు మల్లియ కాసింది. మామిడి కాయలు అధికంగా కాశాయి. రెండూ, మండు వేసం కాలంలో ఉత్సాహాన్ని బహిర్గతము చేశాయి.

320.   సమస్య: మహిమలు గల దేవుడెపుడు మంచిని గనడే

320.430   కం. సహనము పరీక్ష పెట్టును
మహిమలుఁ గల దేవు డెపుడు, మంచినిఁ గనడే?

విహిత మవిహితముఁ దెలిసి ప
ర హితముఁ గోరు మహితాత్ముల నడత లందుస్.

(సహనము = ఓర్పు, విహితము = తగినది, నడత = ప్రవర్తన)

మహిమలున్న దేవుడెప్పుడూ ఓర్పుకి పరీక్ష పెడతాడు. ఏది తగినది, ఏది తగనిది అన్న జ్ఞానం కలిగి పరహితము కోరే గొప్ప మనసున్న వారి ప్రవర్తనలలో మంచిని చూడడా?

320.431 కం. రహి శివ పార్వతులకు లో
క హితార్థ మవశ్య మంచు కంతుడుఁ దలచెస్,
దహనం బయ్యెను శివుచే,
మహిమలుఁ గల దేవు డెపుడు, మంచినిఁ గనడే?

(రహి = ప్రేమ, కంతుడు = మన్మథుడు)

లోకహితం కోసం శివపార్వతుల మధ్య ప్రేమ అవసరమని మన్మథుడు అనుకున్నాడు. శివుని వలన కాలి బూడిద అయ్యాడు. మహిమలున్న దేవుడెప్పుడూ మంచిని చూడడా?

320.432 కం. సహజ మొడుదుడుకు లన్నవి
సహజీవనమున్న చోట, సాక్షిగ తనచే
విహితము, యందున చెడుఁ గను
మహిమలుఁ గల దేవు డెపుడు, మంచినిఁ గనడే?

(సహజము = స్వాభావికము, ఒడుదుడుకులు = సంకటములు, సహజీవనము = కలిసి జీవించుట, సాక్షి = సర్వసాక్షి యగు పరమాత్మ, విహితము = విధింప బడినది)

సహజీవనము ఉన్న చోట సంకటము లన్నవి స్వాభావికము. అవి సర్వసాక్షియైన పరమాత్మచే విధింప బడినవి. అందు, చెడును చూసే మహిమలు గల దేవుడు, ఎప్పుడూ మంచిని చూడడా?

321. సమస్య: మాంసము తిననట్టివాడు మనుజుండగునా

321.433 కం. మాంసపు కృత్తులు దండిగ
మాంసము పప్పులను పాల మన కమరగ యా
శంసింప, కెదో రీతిగ
మాంసము తిననట్టి వాడు మనుజుం డగునా?

(మాంసపు కృత్తులు = ప్రోటీన్లు, దండిగ = సమృద్ధిగా, అమరు = లభించు, ఆశంసించు = కోరు)

మాంస కృత్తులు ఎక్కువగా మాంసము, పప్పులలో, పాల యందు, మనకు లభించగా కోరక, ఏదో రకంగా మాంసము తిననట్టివాడు మనిషేనా?

321.434 కం. మాంసాకృతి రుచియుఁ గలిగి
మాంసముఁ గానట్టి దైన మాంసము దొరుకన్,
హింసను విడచి యహింసా
మాంసము తిననట్టి వాడు మనుజుం డగునా?

జంతువులను వధించకుండానే, జంతువుల మూల కణాల నుంచి మాంసాన్ని తయారు చేసే ప్రాజెక్టును సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులార్ బయాలజీ – సీసీఎంబీ (CCMB), నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ మీట్ - ఎన్ఆర్సీఎం (NRCM) సంయుక్తంగా చేపట్టాయి. ‘అహింసా మీట్’ పేరుతో పిలిచే ఈ మాంసం అచ్చం జంతువుల మాంసం లానే రంగు, రుచి, వాసన కలిగి ఉంటాయని సీసీఎంబీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. చికెన్, మటన్ లాంటి భిన్న రకాల మాంసాన్ని ల్యాబ్‌లలోనే తయారు చేయొచ్చని తెలిపారు. సహజ సిద్ధంగా లభించే మాంసంలో ఎలాంటి పోషకాలు ఉంటాయో అహింసా మీట్‌లోనూ అవే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమాచారాన్ని పద్యంలో ఉపయోగించడం జరిగింది. మాంసము యొక్క ఆకృతి, రుచి కలిగి యుండి మాంసము కానట్టిదైన మాంసము దొరుకుతుంటే, హింసను విడనాడి, అహింసా మాంసము తిననట్టివాడు మనిషేనా?

322. సమస్య: మాట వినని వాడె మంచి నేత

322.435 ఆ.వె. మట్టి తినకు మన్న మాత యశోదమ్మ
మాట వినని వాడె, మంచి నేత
గా యెదిగెను, మట్టి కరిపించి దుష్టాత్ము

ల నగధరుగ ధర్మ రక్షఁ జేసె.

మట్టి తినద్దని అన్న తల్లి యశోదమ్మ మాట వినని వాడే, మంచి నేతగా ఎదిగాడు. చెడ్డవాళ్ళని మట్టి కరిపించి కృష్ణుడుగా ధర్మ రక్షణ చేశాడు.

322.436 ఆ.వె. పదవి యున్న యుండు ప్రత్యర్థి వర్గంబు,
భజనపరులఁ గూడి భంగ పరుప,
స్వార్థజనుల బాటఁ బట్టక, యవ్వారి
మాట వినని వాడె, మంచి నేత.

పదవి ఉంటే, స్వలాభము కోసము ఎదుటి వారిని స్తుతించే భజనపరులతో చేరి నవ్వులపాలు చేయడానికి వ్యతిరేక వర్గము ఉండడం సహజం. స్వార్థజనుల మార్గము వెంట వెళ్ళక, వాళ్ళ మాట వినని వాడే మంచి నేత.

322.437 ఆ.వె. శాంత్యహింసల నిజ సార మెరిగి, సంఘ
సేవ కంకిత మిడి జీవితమును,
గాంధి వలె చెడు యనక చెడుఁ గనక చెడు
మాట వినని వాడె, మంచి నేత.

శాంతి అహింసల అసలైన అర్థాన్ని తెలుసుకొని జీవితాన్ని సంఘసేవకి అంకితం చేసి గాంధీగారి లాగా చెడు అనకుండా, చెడు చూడకుండా, చెడు మాట వినని వాడే మంచి నాయకుడు.

322.438 ఆ.వె. కల్లలు నిజములుగ కన్పించు కలుష వా
తావరణము నందు తాను యుండి,
మాట నమ్మి నటుల నాటక మాడుచు,
మాట వినని వాడె, మంచి నేత.

అబద్ధాలు నిజాలుగా కనిపించే కలుషిత వాతావరణంలో తానుండి, మాట నమ్మినట్లుగా నాటక మాడుతూ, మాట వినని వాడే మంచి నాయకుడు.

322.439 ఆ.వె. పదవియున్నఁ జాలు వత్తురు పదుగురు,
పదుగు రున్న యుండు బాగు యోగు,

మంచిచెడుల నడుమ మనుట నేర్వని వారి
మాట విననివాడె మంచి నేత.

పదవి ఉంది అంటే పదిమంది వస్తారు. పదిమంది ఉన్న చోట మంచి, చెడు రెండూ ఉంటాయి. మంచి చెడుల మధ్య జీవించడం ఎరగని వాళ్ళ మాట వినని వాడే మంచి నాయకుడు.

323. సమస్య: మానవుడయ్యె దానవ సమాను డటంచు తలంతురే బుధుల్

323.440 ఉ. మానిని కృష్ణ నీడ్చి యవమానముఁ జేసిన వాని, బాసకై,
శోణము మోవి నల్ది, యొక సోకునిగా రణమందు నాడితిన్,
మానవుడయ్యె దానవ సమాను డటంచుఁ దలంతురే బుధుల్
యా నటనమ్ముఁ జూచి, యని యానిలిఁ బల్కెను జ్యేష్ఠ మాతకున్.

(మానిని = మానవతి, కృష్ణ = ద్రౌపది, బాస = ప్రతిజ్ఞ, శోణము = రక్తము, మోవి = పెదవి, అల్దు = రాయు, సోకుడు = రాక్షసుడు, రణము = యుద్ధము, ఆడు = నర్తించు, దానవుడు = రాక్షసుడు, తలంచు = యోచించు, బుధుడు = బుద్ధిశాలి, నటనము = నటన, ఆనిలి = భీముడు, జ్యేష్ఠ మాత = పెద్దతల్లి)

ప్రతిజ్ఞ కోసం, మానవతియైన ద్రౌపదిని ఈడ్చి అవమానము చేసిన వాడైన దుశ్శాసనుని రక్తాన్ని పెదవికి అద్ది ఒక రాక్షసుడి లాగా యుద్ధభూమిలో నర్తించాను. ఆ నటన చూసి బుద్ధిశాలురు మనిషి రాక్షసుడు అయ్యాడు అని అనుకుంటారా? అని భీముడు పెద్దతల్లియైన గాంధారితో అన్నాడు.

324. సమస్య: మానిసి మానుషంబు విడి మర్కట మయ్యె నిదేమి చోద్యమో

324.441 ఉ. పూని సినీ ప్రపంచమున పోరులఁ జూపెడి తీరు వేరుగా
తానెటు చేయునో విఠల దర్శకు డంచను నట్టి వారికిన్
మానస మందు నున్న యనుమానముఁ దీర్పగఁ బోరు మధ్యలో
మానిసి మానుషంబు విడి మర్కట మయ్యె నిదేమి చోద్యమో.

(పూను = పట్టుపట్టు, పోరు = పోరాటము, మానసము = మనస్సు, మానిసి = మనిషి, మానుషము = మనుష్య లక్షణము, విడి = వదలిపెట్టి, మర్కటము = కోతి, చోద్యము = ఆశ్చర్యము)

పట్టుబట్టి సినిమా లోకంలో పోరాటాలు చూపే విధానము వేరుగా తాను ఎట్లా చేస్తాడో దర్శకుడు విఠలాచార్య గారు అనే వారికి మనస్సులో ఉన్న అనుమానము తీర్చడానికి, ఇదేమి ఆశ్చర్యమో, పోరాటము మధ్యలో మనిషి, మనిషి లక్షణాలు వదిలి, కోతి అయ్యాడు.

325. సమస్య: మామిడి మిడి కూర్పు టెరుక మాధ్యాహ్నికమౌ

325.442 కం. ఏమని చెప్పుదు కవితల
మా మిడిమిడి కూర్పు టెరుక, మాధ్యాహ్నికమౌ
భాముని వేడిమి యందున
యే మధుపము ముట్టని విరియే యగుపించుస్.

(మిడి మిడి కూర్పు టెరుక = రచనలో తెలిసీ తెలియని జ్ఞానము, మాధ్యాహ్నికము = మధ్యాహ్నమందైనది, భాముడు = సూర్యుడు, వేడిమి = ఉష్ణత, మధుపము = తుమ్మెద, ముట్టు = తాకు, విరి = పుష్పము, అగుపించు = కనిపించు)

కవిత్వాలలో కూర్పుకి సంబంధించిన మా తెలిసీ తెలియని జ్ఞానము ఏమని చెబుతాను. మధ్యాహ్న సమయంలో సూర్యుని మండుటెండలో ఏ తుమ్మెదా ముట్టనటువంటి పువ్వే కనిపిస్తుంది.

325.443 కం. ఈ మిహికాహార్యంబున
మా మిడిమిడి కూర్పు టెరుక, మాధ్యాహ్నికమౌ
సోమలమున పసరుఁ గరుగ
బాములు కలిగించె నంచు ప్రవరుడు తలచెస్.

(మిహిక = మంచు, అహార్యము = కొండ, మిడిమిడి కూర్పు టెరుక = సందర్శించడానికి తెలిసీ తెలియని జ్ఞానము, మాధ్యాహ్నికము = మధ్యాహ్నమందైనది, సోమలము = వేడి, బాము = కష్టము, తలచు = పరిగణించు)

ఈ మంచుకొండను సందర్శించడానికి మా తెలిసీ తెలియని జ్ఞానము మధ్యాహ్న మందు పసరు కరగడం వల్ల కష్టాలు కలిగించిందని ప్రవరుడు అనుకున్నాడు.

326. సమస్య: మార్తాండుం డపరాద్రిఁ గ్రుంకె నిదిగో మధ్యాహ్న కాలంబునన్

326.444 శా. స్ఫూర్తిన్ యివ్వగ సర్వ జీవులకు నంభోభృత్పథమ్మందు తా
కర్తవ్యంబుగ తూర్పు దిక్కు వెలసెన్ కాషాయ వర్ణంబునన్,
మార్తాండుం డపరాద్రిఁ గ్రుంకె నిదిగో, మధ్యాహ్న కాలంబునన్
వర్తించెన్ జలరాశి యావిరిని సంస్ఫాలమ్ముగాఁ జేయగన్.

(స్ఫూర్తి = ప్రకాశము, అంభోభృత్పథము = ఆకాశము, కర్తవ్యము = చేయతగినది, మార్తండుడు = సూర్యుడు, అపర = పడమట, అద్రి = కొండ, క్రుంకు = అస్తమించు, వర్తించు = వ్యవహరించు, జలరాశి = సముద్రము, సంస్ఫాలము = మేఘము)

అన్ని జీవరాసులకి ప్రకాశాన్ని ఇవ్వడానికి ఆకాశంలో తాను తన కర్తవ్యంగా తూర్పుదిక్కున కాషాయ రంగులో సూర్యుడు పుట్టాడు. అదిగో పడమటి కొండ మీద అస్తమించాడు. మధ్యాహ్న సమయంలో సుముద్రపు ఆవిరిని మేఘంగా చేయడానికి వ్యవహరించాడు.

327. సమస్య: మాలను తాకంగ తాను మైల పడె ననెన్

327.445 కం. ఏల కనిపించ వన బలి
భాలుని, యాకాశ మంత వ్యాపించి నినున్
గూలుచు వామనుడే ఘన
మాలను తాకంగ తాను మైలపడె ననెన్.

(భాలుడు = సూర్యుడు, కూలుచు = అధోగతి నొందించు, ఘనమాల = మేఘ పంక్తి, మైలపడు = నిస్తేజమగు)

ఎందుకని కనిపించవు? అని బలి చక్రవర్తి సూర్యుడితో అనగా ఆకాశమంతా వ్యాపించి నిన్ను అధోగతి పాలు చేసే వామనుడే మేఘ పంక్తిని తాకగానే తాను కాంతిహీనుణ్ణి అయ్యాను అని చెప్పాడు.

328. సమస్య: మాసములన్ పదంశ గల మాసము మాత్రము మార్గశీర్షమే

328.446 ఉ. వేసరు చున్న పార్థుఁ గని భీమర మందున, ప్రోత్సహించుచున్
బాసట నిచ్చి శంకలనుఁ బాపె, ప్రబోధకు డొచు గీతగాఁ

జేసెను జ్ఞాన బోధ తన స్నేహికిఁ గృష్ణుడు, యా విభూతికిన్
మాసములన్ పదంశఁ గల మాసము మాత్రము మార్గశీర్షమే.

(వేసరు = విచారపడు, పార్థుడు = అర్జునుడు, కను = చూచు, భీమరము = యుద్ధము, బాసట = సహాయము, శంక = సందేహము, పాపు = తొలగించు, ప్రబోధకుడు = ఉద్బోధకుడు, గీత = భగవద్గీత, స్నేహి = మిత్రుడు, విభూతి = మహాత్మ్యము, మాసము = నెల, పద = పాదము, అంశ = భాగము)

యుద్ధంలో విచారపడుతున్న అర్జునుణ్ణి చూచి, కృష్ణుడు ప్రోత్సహిస్తూ సహాయమును ఇచ్చి సందేహాలని తొలగించి, ప్రబోధకుడౌతూ భగవద్గీతగా తన మిత్రుడికి జ్ఞాన బోధ చేశాడు. ఆ మహాత్మ్యమునకు నెల లన్నిటిలో కాలి ముద్ర లాంటి నెల మాత్రము మార్గశిరమే.

328.447 ఉ. మోసులు యెత్తుచున్న చలి ముంగట స్వాగత మిచ్చు మిత్రమై,
డాసిన చాలు దేహము తటాలున కంపము నొందఁ జేయు యు
ష్ణాసహ కాల మందు తొలి శ్రామము, నిక్కపు విష్ణుభక్తికిన్
మాసములన్ పదంశఁ గల మాసము మాత్రము మార్గశీర్షమే.

(మోసులు = మొలకలు, ముంగట = ఎదురుగా, డాయు = సమీపించు, దేహము = శరీరము, తటాలున = వెంటనే, కంపము = వణకు, ఒందజేయు = కలుగజేయు, ఉష్ణాసహము = హేమంత ఋతువు, తొలి = మొదటి, శ్రామము = మాసము, నిక్కము = నిజము, మాసము = నెల, పద = పాదము, అంశ = భాగము)

మొలకలు ఎత్తే చలికి ఎదురుగా (చలి మొదలవుతుంటే) స్వాగత మిచ్చే స్నేహితుడై, సమీపిస్తే చాలు శరీరాన్ని వెంటనే వణికింప జేసే హేమంత ఋతు కాలంలో మొదటి నెల, నిజమైన విష్ణు భక్తికి నెల లన్నిటిలో కాలి ముద్ర లాంటి నెల మాత్రము మార్గశిరమే.

329. సమస్య: మీసముల్ మన భారతాంబకు మేదురంబగు భాసముల్

329.448 మ.కో. భాసురంబు స్వపాల నంచును బాధ లన్నిటి నోర్చిరే,
ఏ సుఖమ్ములు కోరకే తమ రెంత త్యాగముఁ జేసిరో,
వీస మెత్తగు స్వార్థ మన్నది వెంట లేని మహాత్ములే,
మీ సముల్, మన భారతాంబకు మేదురంబగు భాసముల్.

(భాసురంబు = స్వచ్ఛమైనది, స్వపాలన = స్వంత పాలన, వీసమెత్తు = ఏ మాత్రంకూడా, మేదురము = దట్టము, భాసము = కాంతి కిరణాలు)

స్వపరిపాలన స్వచ్ఛమైనదని అంటూ ఎన్నో బాధలని ఓర్చుకున్నారే. ఏ సుఖాలూ కోరుకోకుండా మీరు ఎంతో త్యాగం చేశారే. ఏ మాత్రం స్వార్థం వెంట తీసుకురాని మహాత్ములే. మీకు సమానమైన వారు, అంటే మీలాంటివారు, భారతమాతకు ప్రకాశింపజేసే దట్టమైన కాంతికిరణాలు.

330. సమస్య: ముక్కును గోయుము జలుబు మిమున్ బాధింపన్

330.449 కం. జక్కొనక జాయువు మనిషి
ముక్కునుఁ, గోయుము జలుబు మిమున్ బాధింపన్
గ్రక్కున యల్లము, యదియే
దిక్కగు తేనీట కలిపి త్రెక్కొన మందై.

(జక్కొను = లభించు, జాయువు = ఔషధము, ముక్కు = మూలుగు, కోయు = ఖండించు, జలుబు = పడిశము, గ్రక్కున = శీఘ్రముగా, దిక్కు = ఆధారము, తేనీరు = టీ, త్రెక్కొను = త్రాగు, మందు = ఔషధము)

ఔషధము దొరక్క మనిషి మూలుగుతాడు. పడిశము మిమ్మల్ని బాధిస్తే వెంటనే అల్లము కోయండి. టీలో కలిపి త్రాగితే ఔషధంగా అదే ఆధారము అవుతుంది.

331. సమస్య: ముద మారగ పద్య మొకటి ముద్దుగ పల్కెన్

331.450 కం. చదివించిరి నిను గురువులు
చదివిన దేమన జనకుడు, సారము హరి ప్రాఁ
జదువుల కని ప్రహ్లాదుడు
ముద మారగ పద్య మొకటి ముద్దుగ పల్కెన్.

(సారము = ప్రధానాంశము, ప్రాజదువులు = వేదము, ముదము = సంతోషము, ఆరు = నిండు)

నిన్ను గురువులు చదివించారు, ఏమి చదివావు అని తండ్రి అడుగగా వేదసారము హరి యని ప్రహ్లాదుడు సంతోషము నిండునట్లుగా ఒక పద్యము ముద్దుగా చెప్పాడు.

331.451 కం. పదనుగ తపము సలిపి తు
మ్మెదపై కసిని, చనుపకము మెలతకు ముక్కై
కుదురు కొనె ననుచు, తిమ్మన
ముద మారగ పద్య మొకటి ముద్దుగ పల్కెన్.

(పదను = తీక్ష్ణము, సలుపు = చేయు, కసి = కోపము, చనుపకము = సంపంగి, మెలత = స్త్రీ, కుదురుకొను = స్థిరపడు, ముదము = సంతోషము, ఆరు = నిండు)

తుమ్మెద పైన ఉన్న కోపంతో సంపెంగ తీవ్రమైన తపస్సు చేసి స్త్రీకి ముక్కుగా స్థిరపడింది అంటూ తిమ్మన సంతోషము నిండునట్లుగా ఒక పద్యము ముద్దుగా చెప్పాడు. "నానా సూన వితాన వాసనల ... " అన్న పద్యం అదే.

332. సమస్య: మునికిన్ గోపమె భూషణంబగు ప్రజామోదంబు సంధిల్లగన్

332.452 మ. రణమౌ నాఖరి యస్త్ర మెప్పుడును పార్థా! యాలమున్ గోరు భీ
మునికిన్ కోపమె భూషణంబగు, ప్రజామోదంబు సంధిల్లగన్
యనికిన్ జూపక శ్రద్ధ, శాంతి కొరకే యత్నంబుఁ గావించెదన్,
యను చక్రిన్ ప్రణుతించె ధర్మజుడు తానత్యంత భక్త్యంజలిన్.

(అస్త్రము = మంత్రము, రణము = ఆలము = అని = యుద్ధము, భూషణము = అలంకారము, ఆమోదము = అంగీకారము, సంధిల్లు = ప్రాప్తమగు, శ్రద్ధ = ఆసక్తి, చక్రి = కృష్ణుడు, ప్రణుతించు = స్తుతించు, అత్యంత = సంపూర్ణము, అంజలి = చేమోడ్పు)

యుద్ధమనేది ఆఖరి అస్త్రము అర్జునా! యుద్ధాన్ని కోరే భీమునికి కోపమే అలంకారము, ప్రజల అంగీకారము ప్రాప్తమయ్యే విధంగా యుద్ధం మీద ఆసక్తి చూపకుండా, శాంతి కోసమే ప్రయత్నం చేస్తాను అని చెప్పే కృష్ణుణ్ణి ధర్మరాజు సంపూర్ణమైన భక్తితో కూడిన నమస్కారంతో స్తుతించాడు.

332.453 మ. మొన దాటన్ దిమి నింకఁ జేతునను వ్యామోహమ్ము పీడింప రా
మునికిన్ గోపమె భూషణంబగు, ప్రజామోదంబు సంధిల్లగన్
గుణముల్ వీడవు పంచభూతములు, యాకూతమ్ము వేరొక్క సా
ధనమున్ జేకొనఁ జెప్పె రామునికి వైదగ్ధ్యమ్మునన్ సంద్రుడే.

(మొన = సైన్యము, తిమి = సముద్రము, ఇంకు = ఎండిపోవు, వ్యామోహము = అధికమైన మనో వైకల్యము, పీడించు = బాధించు, భూషణము = అలంకారము, ఆమోదము = అంగీకారము, సంధిల్లు = ప్రాప్తమగు, పంచభూతములు = పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, ఆకూతము = తలపు, సాధనము = ఉపాయము, చేకొను = గ్రహించు, వైదగ్ధ్యము = నేర్పు, సంద్రుడు = సముద్రుడు)

సైన్యము దాటడానికి సముద్రాన్ని ఎండగడతాననే అధికమైన మనో వైకల్యము బాధించగా రామునికి కోపమే అలంకారమయ్యింది. ప్రజల అంగీకారము ప్రాప్తించడానికి, అంటే, ప్రజాభీష్టం ప్రకారం, పంచభూతములు తమ గుణాలని వదిలిపెట్టవు. వేరే ఒక ఉపాయము గ్రహించమని రామునికి నేర్పుగా సముద్రుడు ఆలోచన చెప్పాడు.

333. సమస్య: మురిపెముగా మిరపదండ ముచ్చట గొలుపున్

333.454 కం. విరిదండ తురుము పడతుక
వరవీణాపాణి వంటి వారిజముఖియే,
కొరకొర చూపుల జాణకు,
మురిపెముగా మిరప దండ ముచ్చటఁ గొలుపున్.

పూలదండ కొప్పున ముడుచుకునే స్త్రీ వరవీణాపాణియైన సరస్వతీ దేవి వంటి పద్మముఖియే. కోపంగా చూసే నేర్పరికి ముద్దుగా మిరపదండ రమ్యంగా ఉంటుంది.

334. సమస్య: ముసుగు దొంగలై చరియింత్రు పుడమి జనులు

334.455 తే.గీ. నాడెఁ జెప్పెను విషగాలి పీడఁ గూర్చి,
బ్రహ్మమను స్వామి హెచ్చరింప, యిపు డదియె
కోవిడుగ వ్యాప్తిఁ జెంద, మాస్కు ధరియించి
ముసుగు దొంగలై చరియింత్రు పుడమి జనులు.

(పీడ = ఆపద, హెచ్చరించు = జాగ్రత చెప్పు, పుడమి = భూమి)

ఆనాడే వీరబ్రహ్మేంద్రస్వామి హెచ్చరికగా విషగాలి వల్ల వచ్చే ఆపద గురించి చెప్పాడు (ఈశాన్య దిక్కున విషగాలి పుట్టేను, లక్షలాది ప్రజలు సచ్చేరయ, కోరంకియను జబ్బు కోటి మందికి తగిలి, కోడి లాగా తూగి సచ్చేరయ).

ఇప్పుడు అదే కోవిడ్ (COVID) అనే పేరుతో వ్యాపిస్తుంటే, మాస్కు (mask) పెట్టుకుని, లోకంలో ప్రజలు ముసుగు దొంగలుగా తిరుగుతారు.

335. సమస్య: మూఢ నమ్మకములె ముదము నిచ్చు

335.456 ఆ.వె. రెండు నాల్క లున్న నుండు భేదము లెన్నొ
చెప్పు మాటలకును చేతలకును,
తగవని పలుకుచునె తామాచరించెడి
మూఢ నమ్మకములె ముదము నిచ్చు.

రెండు నాలికల ధోరణి ఉంటే చెప్పే మాటలకి చేతలకి చాలా తేడాలు ఉంటాయి. కుదరవని చెప్పుతూనే, తాము ఆచరించే మూఢ నమ్మకాలే సంతోషము ఇస్తాయి.

335.457 ఆ.వె. పైకిఁ జెప్ప లేని భయముల పోఁగొట్టి,
భావిఁ గూర్చి మదిని భద్రత నిడి,
నిత్య జీవితమున నియమము లనిపించు,
మూఢనమ్మకములె ముదము నిచ్చు.

పైకి చెప్పుకోలేని భయాలని పోగొట్టి, భవిష్యత్తును గురించి మనస్సులో నిర్భయత్వము ఇచ్చి, రోజువారీ జీవితంలో కట్టుబాట్లు అనిపించే మూఢ నమ్మకాలే సంతోషము ఇస్తాయి.

335.458 ఆ.వె. శకునములును మంత్ర శక్తుల వంటివి
మూఢ నమ్మకములె, ముదము నిచ్చు
జనులు యట్టి గుడ్డి సంప్రదాయముల నా
వలనుఁ బెట్ట యాత్మ బలము తోడ.

(సంప్రసాదము = విశ్వాసము, ఆవల పెట్టు = దూరము పెట్టు)

శకునములు, అంటే శుభాశుభ సూచకములు, మంత్రశక్తులు లాంటివి మూఢ నమ్మకాలే. ప్రజలు అటువంటి గుడ్డి విశ్వాసములు ఆత్మబలముతో దూరం పెడితే సంతోషాన్ని ఇస్తుంది.

336.   సమస్య: మూర్ఖుండొక్కడు రాజుగా నయినచో ముల్లోకముల్ వేగవే

336.459   శా. ముర్ఖత్వమ్మున నింద్రుడే సుధను గొంపోవన్ నిరోధింపగా,
వీర్ఖద్ధిన్ గరుడుండుఁ జెప్పె నిటులన్, వీక్షింపఁ దోచెన్ నినున్,
మూర్ఖుల్ యష్ట విధంబు లంద రొకటే మూర్తిత్వమున్ బొంద యా
మూర్ఖుం డొక్కడు రాజుగా నయినచో ముల్లోకముల్ వేగవే.

(ముర్ఖత్వము = అవివేకము, పిచ్చిపట్టు; సుధ = అమృతము; కొంపోవు = తీసికొనిపోవు; నిరోధించు = అడ్డగించు; వీర్ = విక్రమించుట, పరాక్రమించుట; ఖద్ది = బలము; గరుడుండు = గరుత్మంతుడు; వీక్షించు = చూచు; తోచు = మనసున ఏర్పడు; అష్టవిధ మూర్ఖులు = 1. నిర్లజ్జుడు, 2. శఠుడు, 3. క్లీబుడు, 4. వ్యసని, 5. అతిలోభి, 6. నిర్ఘృణుడు, 7. గర్వితుడు, 8. నిష్ఠురుడు; మూర్తిత్వము = ఒక శరీరంగా కనబడుట; వేగు = బాధపడు)

అమృతము తీసికొనిపోతుంటే, ఇంద్రు డంతటివాడు ఏదో పిచ్చిపట్టినట్లు తనను అడ్డగించగా, విజృంభించిన బలంతో ఉన్న గరుత్మంతుడు ఇట్లా చెప్పాడు: నిన్ను చూస్తుంటే నాకేమని అనిపిస్తోందంటే, మూర్ఖులు ఎనిమిది విధాలంటారు కదా, వాళ్ళంతా ఒకటిగా రూపం పొందితే తయారయే మూర్ఖుడు ఒక్కడు రాజయితే, మూడు లోకాలూ బాధలు పడవా, అని. అంటే, ఓ ఇంద్రుడా, నువ్వు అలాంటి మూర్ఖుడవని చెప్పడం.

337.   సమస్య: మేకను సాధువులు వండి మేలని తినరే

337.460   కం. వాకబుఁ జేయగఁ దెలిసెను,
పాకంబుల నాంధ్ర శాకపాకము లరుదే,
లేకన్ నిందింపగ ఫల
మే, కను, సాధువులు వండి మేలని తినరే.

(వాకబు చేయగ = విచారించగా, పాకంబులను = వంటలలో, ఆంధ్ర = తెలుగు వారి, శాకపాకములు = వంటలు, అరుదే = అద్భుతమే, లేకన్ = లేక పోవడం వల్ల, నిందింపగ = దూషించగా)

వంటలలో, తెలుగు వారి వంటలు అద్భుతమని విచారించగా తెలిసింది. అవి లేక, తిట్టడం వల్ల ప్రయోజనం ఉందా? చూడండి, సాధువులు అవి వండుకుని బాగున్నాయని తినడం లేదా?

338. సమస్య: మొలలో కత్తిని దూసి రేడు వొడిచెన్ మోదంబుతో తత్సుతున్

338.461 మ. కలుగున్ దేవకి యష్టమాంగజునిచే గండం బటంచున్ వినన్,
ఖలుడౌ కంసుడు భర్త నామెను వడిన్ కారాగృహంబం దిడెన్,
గలిగెన్ వారికి పుత్త్రు డంచును వినంగన్ యారు మార్లచ్చెరన్,
మొలలో కత్తిని దూసి రేడు వొడిచెన్ మోదంబుతో తత్సుతున్.

అష్టమ = ఎనిమిదవ, అంగజుడు = కుమారుడు, గండము = ఆపద, ఖలుడు = నీచుడు, వడి = వేగముగా, కారాగృహము = జైలు, ఇడు = ఉంచు, మారు = పర్యాయము, అచ్చెరన్ = అ + చెరన్ = ఆ జైలులో, మొల = నడుము క్రింది ప్రదేశము, దూయు = లాగు, రేడు = రాజు, మోదము = సంతోషము, తత్సుతున్ = తత్ + సుతున్ = ఆ కుమారుణ్ణి)

దేవకి ఎనిమిదవ కుమారునిచే ఆపద ఉందని వినగానే నీచుడైన కంసుడు భర్తని ఆమెని వేగంగా జైలులో ఉంచాడు. ఆరు సార్లు ఆ జైలులో వాళ్ళకి కొడుకు పుట్టాడని వినగానే మొలలో కత్తిని దూసి రాజు సంతోషంతో ఆ కొడుకుని వొడిచాడు.

338.462 మ. బలిఁ గోరన్ సిరియాళు దేహమును సాధ్వంతుండు భోగంబుగా,
మొలలో కత్తిని దూసి రేడు వొడిచెన్ మోదంబుతో తత్సుతున్,
దలచెన్ యివ్విధి వెంగనాంచి సుతునిన్ దర్శింపగా వేడుచున్,
వెలసెన్ యంతట భర్త నంబి యెదుటన్ బింగాక్షుడా పుత్త్రుతో.

(బలి = పూజార్థమైన కానుక, సాధ్వంతుడు = యోగి, భోగము = భోజనము, మొల = నడుము క్రింది ప్రదేశము, దూయు = లాగు, రేడు = మగడు, మోదము = సంతోషము, తత్సుతున్ = తత్ + సుతున్ = ఆ కుమారుణ్ణి, తలచు = భావించు, ఇవ్విధి = ఈ విధంగా, వేడు = ప్రార్థించు, వెలయు = బయలుపడు, అంతట = అనంతరము, పింగాక్షుడు = శివుడు)

సిరియాళుని శరీరాన్ని యోగి భోజనంగా బలి కోరగా, మొలలో కత్తిని దూసి భర్త సంతోషంతో ఆ కొడుకుని వొడిచాడు. కొడుకుని దర్శించాలని ప్రార్థిస్తూ, ఈ విధంగా వెంగనాంచి భావించింది. అనంతరము, భర్తయైన నంబి ఎదురుగా శివుడు ఆ పుత్త్రుడితో పాటు బయటపడ్డాడు.

339. సమస్య: మోక్షార్థికి వలయు మద్యమును శౌర్యంబుస్

339.463 కం. దీక్షగ జపములుఁ జేయుట
మోక్షార్థికి వలయు, మద్యమును శౌర్యంబుస్
శిక్షణ తోడనె కావలె
రక్షణ బాధ్యతఁ గల యతిరథులకు నెపుడుస్.

(అతిరథుడు = సైనికుడు)

పట్టుదలగా జపాలు చేయడం మోక్షము కోరేవానికి అవసరము. రక్షణ బాధ్యత ఉన్న సైనికులకు మద్యమూ, శౌర్యమూ శిక్షణతో పాటు ఎప్పుడూ కావాలి.

340. సమస్య: మోదము ఖేదమును గూర్చె ముదితల మదిలో

340.464 కం. పాదంబుల పారాణిని
మాదను కొన్న సుత పయన మాయె వరునితో,
యా దినము నప్పగింతలు
మోదము ఖేదమునుఁ గూర్చె ముదితల మదిలో.

(అప్పగింతలు = వివాహసందర్భమున తలిదండ్రులు పెండ్లికూతురును అత్త మామలకు అప్పగించు తంతు, మోదము = సంతోషము, ఖేదము = దుఃఖము, ముదిత = వనిత)

పాదముల కున్న పారాణితో, మాది అని అనుకున్న మా అమ్మాయి పెళ్ళికొడుకుతో ప్రయాణమయ్యింది. ఆనాటి అప్పగింతలు వనితల మనస్సులో సంతోషాన్ని, దుఃఖాన్ని కూడా కలిగించాయి.

341. సమస్య: మోసగించిన ప్రజలకు ముచ్చటగును

341.465 తే.గీ. ముఖ్య పరిపంథు లందర బుజ్జగించి
పదవు లెరఁ జూపి కూటమి ప్రభుత నిలిపి
మోసగించిన, ప్రజలకు ముచ్చటగును
రచ్చ పెరుగంగ ప్రభుతయే రద్దు కాగ.

వ్యతిరేక వర్గంలోని ముఖ్యమైన వాళ్ళందరినీ మచ్చిక చేసుకుని, వాళ్ళకి పదవుల ఆశ పెట్టి, కూటమి ప్రభుత్వాన్ని నిలబెట్టి, మోసం చేస్తే, వాళ్ళల్లో వాళ్ళకి గొడవలొచ్చి ప్రభుత్వమే రద్దయితే, ప్రజలకి సంతోషం కలుగుతుంది.

341.466 తే.గీ. దేవదూతల మనిఁ జెప్పి దీనజనుల
మానధనములు దోచుచు మాయఁ జేసి
మోసగించిన, ప్రజలకు ముచ్చటగును
చెఱను బంధించి వారికి శిక్ష నిడగ.

దేవుని ప్రతినిధులమని చెప్పి దరిద్రుల మానధనాలు దోచుకుంటూ మాయ చేసి మోసగిస్తే, జైలులో బంధించి వారికి శిక్ష వేస్తే ప్రజలకి సంతోషం కలుగుతుంది.

341.467 కం. విజయము యెన్నిక లం దస
హజ మని, యోటర్ల నోట్ల హామీలను భే
షజ మొప్ప మోసగించిన,
ప్రజలకు ముచ్చటగు నట్టి పని ఛీకొట్టన్.

ఎన్నికలలో గెలవడం అసహజము అని, ఓటర్లని నోట్లు, హామీలతో ఆడంబరంగా మోసం చేస్తే, ఆ పనిని ఛీకొట్టినప్పుడు, ప్రజలకి సంతోషం కలుగుతుంది.

341.468 కం. ధ్వజకీర్తిఁ గావ సైన్యము,
భుజబలమునఁ గాక, తాము బుద్ధిని పగ వా
ర జయింప మోసగించిన,
ప్రజలకు ముచ్చటగును చతురత ఫలియింపన్.

సైన్యానికి జెండా గౌరవము కాపాడటం చాలా ముఖ్యము. ఆ ఉద్దేశ్యంతో, భుజబలం కాక బుద్ధిబలంతో శత్రువులను జయించడానికి వాళ్ళని మోసం చేస్తే, నేర్పు ఫలితం ఇచ్చిన మీదట, ప్రజలకి సంతోషం కలుగుతుంది.

341.469 తే.గీ. ధరలు రెట్టింపుఁ జేసి, పిదప యదనుగ
రాయితీల నిచ్చి సరుకు లమ్మి తమను

మోసగించిన, ప్రజలకు ముచ్చటగును
వారి కసలు కథ తెలియు దారి లేక.

వస్తువుల ధరలు రెట్టింపు చేసి, ఆ తరువాత, వీలు చూసుకుని రాయితీలు ప్రకటించి, సరుకులు అమ్మి, తమను మోసగించినా, వాళ్ళకి అసలు కథ తెలిసే మార్గం లేదు కనుక, ప్రజలకి సంతోషం కలుగుతుంది.

341.470 కం. కుజనులను మోసగించిన,
ప్రజలకు ముచ్చటగును, మును బహు చతురతతో
భుజనిన్ దాచెను కృష్ణుడు,
విజయు ప్రతిన నిలుప సింధు విభు తలఁ ద్రుంచన్.

కుత్సితులను మోసం చేస్తే జనాలకి సంతోషం కలుగుతుంది. పూర్వము, గొప్ప చాతుర్యంతో, అర్జునుని ప్రతిజ్ఞ నిలబెట్టడానికి, సింధు రాజైన జయద్రథుడి తల తెగగొట్టడానికి, కృష్ణుడు సూర్యుని కనుమరుగు చేశాడు.

342. సమస్య: యుద్ధము చేయకుండగనె యోధునిగా వెలుగొందె నిద్ధరిన్

342.471 ఉ. బుద్ధుడు గాంధి యాదిగ ప్రబుద్ధులుఁ జూపిన బాట బద్ధమై
వృద్ధినిఁ గోరి జీవన గవేషణ సత్యము నందు నిల్చుచున్
సిద్ధ మెవండొ, స్వీయ క్రమశిక్షణలో యనుయాయి వారికిన్,
యుద్ధము చేయకుండగనె యోధునిగా వెలుగొందె నిద్ధరిన్.

(ప్రబుద్ధుడు = ప్రాజ్ఞుడు, బద్ధము = కట్టఁబడినది, గవేషణ = వెదకుట, అనుయాయి = అనుసరించువాఁడు, యోధుడు = బంటు, ధర = నేల)

బుద్ధుడు, గాంధి మొదలుగా ప్రాజ్ఞులు చూపిన త్రోవకి బద్ధుడై ఉంటూ అభివృద్ధిని కోరి జీవితంలో సత్యాన్వేషణకై నిలుస్తూ ఎవరైతే స్వంత క్రమశిక్షణలో వారిని అనుసరిస్తూ సిద్ధంగా ఉంటాడో వాడు యుద్ధము చేయకుండానే యోధుడుగా ఈ లోకంలో ప్రసిద్ధికెక్కుతాడు.

342.472 ఉ. యుద్ధముఁ గాదె యెన్నికలు, యోటరులన్ యుసిఁగొల్పి, యోట్లసం
బద్ధముఁ గాక కోరి నటువంటి దెసన్ బడయన్ ప్రణాళికల్
సిద్ధముఁ జేసి నేతను విజేతగ నిల్పెడి కార్యకర్త, తా

యుద్ధము చేయకుండగనె, యోధునిగా వెలుగొందె నిద్ధరిన్.

(ఉసిగొల్పు = ప్రేరేపించు, అసంబద్ధము = సంబంధములేనిది, దెస = విధము, పడయు = పొందు, ప్రణాళిక = పథకము, నేత = యజమానుఁడు, విజేత = విజయమును పొందినవాఁడు, కార్యకర్త = కార్యనిర్వాహకుఁడు)

ఎన్నికలు యుద్ధము కాదా! ఓటరులను ప్రేరేపించి ఓట్లు సంబంధము లేని విధంగా కాకుండా అనుకున్న విధంగా పొందడానికి పథకాలు సిద్ధం చేసి నాయకుణ్ణి జయశీలుడుగా నిలిపే కార్యకర్త, యుద్ధము చేయకుండానే యోధుడుగా ఈ లోకంలో చలామణీ అవుతాడు.

342.473 ఉ. యుద్ధము నందు పారినను యోరిమితో నిజ జీవనంబునన్
పద్ధతిగా యుధిష్ఠిరుడు వర్తనఁ జేసెను, యక్షు ప్రశ్నలన్
బుద్ధిని దీటుగా నిలిపి పూర్ణముగా బదు లిచ్చె, యుక్తితో
యుద్ధము చేయకుండగనె యోధునిగా వెలుగొందె నిద్ధరిన్.

(పారు = పారిపోవు, ఓరిమి = ఓర్పు, వర్తన = నడవడి, దీటు = సమానస్థాయి, బదులిచ్చు = సమాధానమిచ్చు, యుక్తి = ఉపాయము)

యుద్ధంలో పారిపోయినా కూడా, నిజ జీవితంలో ఓర్పుతో సరియైన విధంగా యుధిష్ఠిరుడు నడుచుకున్నాడు. యక్షుని ప్రశ్నలందు బుద్ధిని సమానంగా నిలిపి, పూర్తిగా సమాధాన మిచ్చాడు. ఉపాయంతో యుద్ధం చేయకుండానే, యోధుడుగా ఈ లోకంలో చలామణీ అయ్యాడు.

342.474 ఉ. యుద్ధమె జీవితమ్ము గెలు పోటము లుండునుఁ బోరు సాగగన్,
బుద్ధిని జాఱ్చు లోపలను పొంచిన దుష్ట విరోధి వర్గమున్
బద్ధముఁ జేయ సంతతముఁ బాయక నెవ్వడు నిల్చె, నాతడే
యుద్ధము చేయకుండగనె యోధునిగా వెలుగొందె నిద్ధరిన్.

జీవితమన్నది యుద్ధమే. గెలుపు ఓటమి ఉంటాయి. బుద్ధిని దిగజార్చే లోపల ఉన్న చెడ్డ శత్రువర్గాన్ని (అరిషడ్వర్గము) ఎప్పుడూ అణచి ఉంచడానికి సాగే యుద్ధంలో, విడవక ఎవరైతే నిలుస్తారో, ఆతడు యుద్ధము చేయకుండానే యోధుడుగా ఈ లోకంలో రాణిస్తాడు.

343. సమస్య: యోగభ్రష్టుండు గాంచు నొప్పుగ ముక్తిన్

343.475 కం. వేగన గుర్తింపున కు
ద్యోగభ్రష్టుండు గాంచు, నొప్పుగ ముక్తిన్
త్యాగము నందే వెతికెడి
యోగి, స్వధర్మమున గాంచు నున్నతి జగతిన్.

(వేగన = కలత, గుర్తింపు = పరిగణన, ఉద్యోగము = కొలువు, భ్రష్టుడు = వెలి వేయబడినవాడు, కాంచు = చూచు, ఒప్పుగ = తగినట్లుగా, ముక్తి = మోక్షము, వెతుకు = అన్వేషించు, యోగి = సాధువు, ఉన్నతి = ఔన్నత్యము, జగతి = ప్రపంచము)

ఉద్యోగం పోయినవాడు చూసేది గుర్తింపు కోసం కలత. తగిన విధంగా మోక్షాన్ని త్యాగంలోనే వెతికే సాధుపురుషుడు, తన పని తాను చేయడంలోనే లోకానికి ఔన్నత్యము చూస్తాడు.

344. సమస్య: యోగులలో వేమనయె యయోగ్యుడు స్తుతికిన్

344.476 కం. త్యాగము నేర్పిన యోగ్యుడు
యోగులలో వేమనయె, యయోగ్యుడు స్తుతికిన్
రాగద్వేషములకును, వి
రాగిగ గడుపుచు, జగతిని రాణించెఁ గదా.

(యోగ్యుడు = మంచివాడు, అయోగ్యుడు = అనర్హుడు, స్తుతి = పొగడ్త, రాగ = అనురాగము, ద్వేషము = పగ, విరాగి = విరక్తుడు)

త్యాగము నేర్పిన మంచివాడు, యోగులలో వేమనయే. పొగడ్తలకీ, రాగద్వేషాలకీ అనర్హుడు. బైరాగిగా గడుపుతూ లోకంలో కీర్తి పొందాడు.

345. సమస్య: రంగమ్మున నోడిన కవి రాణిని గెల్చెన్

345.477 కం. అంగీకృతముగ తా చద
రంగమ్మున నోడిన కవి, రాణిని గెల్చెన్

శృంగార భరిత మధుర త
రంగిణి యందోల లార్చి, లాహిరిఁ గ్రమ్మన్.

(అంగీకృతము = అంగీకరింపఁబడినది, రాణి = భార్య, తరంగిణి = నది, ఓలలార్చు = జలక్రీడ ఆడించు, లాహిరి = మైకము, క్రమ్ము = వ్యాపించు)

ఒప్పుకున్న విధంగా, చదరంగంలో ఓడిన కవి మత్తుగా శృంగారంతో నిండిన మధురమైన నదిలో జలక్రీడలందు ఆమెను తేల్చి గెలిచాడు.

346. సమస్య: రంభా! ఫలమెంతొ విషమొ రసికుడె యెరుగున్

346.478 కం. సంభావింపడు వావి, న
హంభావియు, కాముకుడును, యా రావణుకున్,
దంభముగా యెదురెళ్ళకు
రంభా! ఫలమెంతొ విషమొ, రసికుడె యెరుగున్.

(సంభావించు = మన్నించు, వావి = బంధుత్వము లేక వరుస, దంభము = గర్వము)

కోడలి వరుస అవుతావన్న విషయాన్ని మన్నింపడు. అహంభావి, కాముకుడు అయిన ఆ రావణుడికి గర్వంగా ఎదురెళ్ళకు రంభా. ఫలితమెంత వినాశకరమో సహృదయుడికే తెలుసు.

346.479 కం. దంభముగ కౌశికుడు యా
రంభించె తపమ్ము తాను బ్రహ్మర్షి యవన్,
జంభారిఁ జెప్ప నడ్డకు
రంభా! ఫలమెంతొ విషమొ రసికుడె యెరుగున్.

గర్వంగా విశ్వామిత్రుడు తాను బ్రహ్మర్షి అవడం కోసం తపస్సు ప్రారంభించాడు. ఓ రంభా! ఇంద్రుడు చెప్పాడని అడ్డాలని చూడకు. ఫలితమెంత వినాశకరమో సహృదయుడికే తెలుసు.

347. సమస్య: రక్తం బంచును నిర్మలోదకమునుం ద్రావంగ శంకించెఁ దాస్

347.480 శా. భోక్తృత్వం బధికంబుగాఁ గలిగి తా భోగమ్ములస్ నిచ్చలా
సక్తిం జూప నజీర్తి పట్టుకొనగా, జైవాతృకుం డాతనిస్
భక్తిస్ తామ్రపు చెంబు తోడి జలముస్ ప్రాశించుమన్నంత, సం
రక్తం బంచును నిర్మ లోదకమునుం ద్రావంగ శంకించెఁ దాస్.

(భోక్తృత్వము = భుజించువాని లక్షణము, భోగము = సుఖము, నిచ్చలు = నిత్యము, అజీర్తి = అజీర్ణరోగము, జైవాతృకుడు = వైద్యుడు, తామ్రము = రాగి, ప్రాశించు = త్రాగు, సంరక్తము = మిక్కిలి ఎఱ్ఱనైనది, నిర్మల = స్వచ్ఛమైన, ఉదకము = నీరు, శంకించు = సందేహించు)

భుజించే లక్షణము ఎక్కువగా ఉండి తాను నిత్యము సుఖాలలో ఆసక్తిని చూపడం వలన అజీర్ణ రోగము పట్టుకోగా, వైద్యుడు అతనికి భక్తిగా రాగి చెంబుతో నీళ్ళు త్రాగుమని చెప్పగానే చాలా ఎర్రగా ఉన్నాయని స్వచ్ఛమైన నీరు త్రాగడానికి తాను సందేహించాడు.

348. సమస్య: రణముం గోరుచు గొల్చు భక్తులను నార్యా రక్ష సేయంగదే

348.481 మ. మణి కోసం బిట కొచ్చి నట్టి పరమాత్మా! కృష్ణ! గుర్తించితిస్
నిను శ్రీరాముగ, నీదు ద్వాస్థుల వలెస్ నే నుంటి, నీ తోడనే
రణముం గోరుచుఁ గొల్చు భక్తులను, నార్యా! రక్ష సేయం గదే
యనుచుస్ వేడెను జాంబవంతుడు యనిస్ యంగాంగముల్ నొవ్వగస్.

(మణి = శమంతక మణి, ద్వాస్థులు = ద్వారపాలకులు (జయవిజయులు), ఆర్య = పూజ్యుడు, వేడు = ప్రార్థించు, అని = యుద్ధము, నొచ్చు = నొప్పిచెందు)

శమంతక మణి కోసం ఇక్కడి వచ్చిన పరమాత్మా! కృష్ణా! నిన్ను శ్రీరాముడిగా గుర్తించాను. నీ ద్వారపాలకుల (జయవిజయులు) లాగానే నేనున్నాను. ఓ పూజ్యుడా! నీతోనే యుద్ధం కావాలని కోరుకునే భక్తులని రక్షించవా! అని అంటూ యుద్ధంలో తన అంగాంగాలు నొప్పి పెడుతుంటే జాంబవంతుడు ప్రార్థించాడు.

349. సమస్య: రణమే పరమార్థమందురా దూత కహో

349.482 కం. చని కౌరవ సభలో శాం
తిని స్థాపనఁ జేయగా యుదియగొనెఁ గానీ,
మనమునఁ దలచెను కృష్ణుడు
రణమే పరమార్థ మందురా దూత కహో.

(ఉదియగొను = యత్నించు, పరమార్థము = ప్రయోజనము)

వెళ్ళి (హస్తినకు) కౌరవ సభలో శాంతిస్థాపన చేయడానికి ప్రయత్నం చేశాడు కానీ, కృష్ణుడు మనస్సులో అనుకున్నాడు, అయ్యో! యుద్ధమే దూతకి సాధించవలసిన ప్రయోజనమని అంటారా అని.

350. సమస్య: రతి చిత్రము తెలియ రాదు రవికైన నృపా

350.483 కం. గతిపడడు ఋష్యశృంగుఁడు,
వ్రతి, చిత్రము తెలియ రాదు రవి కైన, నృపా!
మతకమున రాగ నత డ
ప్పతి కరుణించె ననె రోమ పాదుని మంత్రుల్.

(గతిపడు = వచ్చు, ఋష్యశృంగుడు = విభాండక ముని పుత్రుడుగా తలపై కొమ్ముతో పుట్టిన వాడు, వ్రతి = యజ్ఞ దీక్షితుడు, చిత్రము = చిత్తరువు, రవి = సూర్యుడు, నృపుడు = రాజు, మతకము = మోసము, అప్పతి = వరుణుఁడు, కరుణించు = దయచూపు)

అంగ రాజ్యాన్ని రోమపాదుడు అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆ రాజ్యంలో అనావృష్టితో క్షామం వస్తుంది. అప్పుడు ఋష్యశృంగుడిని రాజ్యము లోకి రప్పిస్తే వర్షాలు పడతాయి అని మంత్రులు చెబుతారు. ఈ కథ ఆధారంగా సమస్య పూరించడం జరిగింది. రాజా! ఋష్యశృంగుడు యజ్ఞ దీక్షితుడు రాడు, సూర్యుడికి కూడా అతని చిత్తరువు తెలియదు (అంటే, ఎండ కన్నెఱుగడు అని). మోసంతో అతడు రావడం వల్ల వరుణుఁడు కరుణించాడు (అంటే, వాన పడింది అని) అని రోమపాదుని మంత్రులు అన్నారు.

351.   సమస్య: రతి మూలము సర్వధర్మ రక్షణకు భువిన్

351.484   కం. రతి లేక జీవు లుండవు,
కతుకగ భోజనము నీరు కరవగు, ధృతియున్
కుతి, కర్తవ్యము లుండవు
రతి మూలము సర్వధర్మ రక్షణకు భువిన్.

(రతి = మైథునము, కతుకు = భక్షించు, కరవగు = లోపించు, ధృతి = సంతోషము, కుతి = కోరిక, కర్తవ్యము = చేయ దగినది, మూలము = కారణము, సర్వధర్మ రక్షణ = అన్ని కర్తవ్యకర్మలను కాపాడుట, భువి = భూమి)

మైథునము అన్నది లేకపోతే ప్రాణు లనేవి ఉండవు (అంటే, వృక్ష, పశు, పక్ష్యాదులలో రతి లేకపోతే సంతానం ఉండదుగా మరి.), తినడానికి ఆహారము, నీళ్ళు కరవైపోతాయి, సంతోషము, కోరిక, చెయ్యాల్సిన పని అంటూ అసలే ఉండవు. లోకంలో అన్ని కర్తవ్యకర్మలను కాపాడుకోవడానికి రతియే కారణము.

352.   సమస్య: రతిని గొలిచి కావ్యములను వ్రాయగ నొప్పున్

352.485   కం. మితి లేనిది మతమౌఢ్యము,
జత దానికి రాజకీయ జాడ్యము, జనులా
హుతిఁ గాక మేలుకొన భా
రతినిఁ గొలిచి కావ్యములను వ్రాయగ నొప్పున్.

మతానికి సంబంధించిన మూర్ఖత్వము హద్దులేనిది. దానికి తోడు రాజకీయ రుగ్మత. ప్రజలు వీటికి బలి కాకుండా మేలు కోవడం కోసం, వాగ్దేవిని పూజించి కావ్యాలు వ్రాస్తే బాగుంటుంది.

353.   సమస్య: రమ్మని పిల్చినంత మరి రానను మాటయె రమ్యమౌ కదా

353.486   ఉ. ఇమ్ముగ నున్న యూరొదిలి యేగు సఖున్ గని యాపి గోపికల్
రమ్మని పిల్చినంత, మరి రానను మాటయె రమ్యమౌ కదా
నెమ్మికఁ జూపు కృష్ణునికి, నేర్పుగ వారిని యింటి కంపి, తా
గమ్మునఁ జేరగా మథుర కంసుని క్రౌర్యము రూపుమాపగన్.

(ఇమ్ముగ = సౌకర్యంగా, సఖుడు = స్నేహితుడు, కను చూచు, ఆపు = ఆగునట్లు చేయు, రమ్యము = ఒప్పిదమైనది, నెమ్మిక = ప్రేమ, అంపు = పంపు, గమ్మున = పట్టించుకోకుండా, క్రౌర్యము = క్రూరత్వము, రూపుమాపు = శాశ్వతంగా తొలగించు)

సౌకర్యంగా ఉన్న ఊరు వదిలి వెళ్ళిపోయే స్నేహితుని చూచి ఆపి గోపికలు రమ్మని పిలవగానే, నేర్పుగా వాళ్ళని ఇంటికి పంపివేసి కంసుని క్రూరత్వము రూపుమాపడం కోసం తాను ఏమీ పట్టనట్లుగా మధుర చేరడానికి, ప్రేమ చూపే కృష్ణునికి రానని చెప్పడం సరియైనదే కదా.

353.487 ఉ. గుమ్మ వరూధినిన్ కలియ గుట్టుగ తా ప్రవరాఖ్యు వోలె వే
షమ్ము ధరించు మ్రుచ్చునకు, సంగడికత్తెలు మేలమాడుచున్
రమ్మని పిల్చినంత మరి రానను మాటయె రమ్యమౌ కదా,
యమ్మదిరాక్షి యందు గల యాత్రము దాచుచు బెట్టు చేయగన్.

(గుమ్మ = స్త్రీ, కలియు = పొందు, గుట్టు = రహస్యం, వోలె = వలె, మ్రుచ్చు = మోసగాడు, సంగడికత్తె = చెలికత్తె, మేలమాడు = పరిహాసము చేయు, రమ్యము = ఒప్పిదమైనది, మదిరాక్షి = మదము కప్పిన కన్నులు గల స్త్రీ, ఆత్రము = ఆతురత, దాచు = దాచిపెట్టు, బెట్టు = బిగువు)

వరూధిని అనే వనితను రహస్యంగా పొందడానికి తాను ప్రవరాఖ్యుడి లాగా వేషము ధరించే మోసగాడికి చెలికత్తెలు ఆటపట్టిస్తూ రమ్మని పిలవగానే, ఆ స్త్రీ యందు తనకున్న ఆత్రము కప్పిపెట్టి పైకి బెట్టు చూపించడానికి, మరి రానని అనడమే సరియైనది కదా.

354. సమస్య: రమ్మే కాంతల కూతయౌ పతి మనోరాగమ్ము హెచ్చింపగన్

354.488 శా. నమ్మన్ కార్యము లందు చింతనయు, విన్నాణంబు, సౌందర్యమున్,
సమ్మోదమ్ముగ సౌఖ్య మిచ్చుట విలాసమ్మన్న యుత్సేకమున్,
యమ్మన్ మించిన యాదరమ్ము, మలయమ్మందున్న స్త్రీత్వంబు, గా
రమ్మే, కాంతల కూతయౌ పతి మనోరాగమ్ము హెచ్చింపగన్.

(నమ్ము = విశ్వసించు, కార్యము = వ్యాసంగము, చింతన = ఆలోచన, విన్నాణము = నేర్పు, సౌందర్యము = అందము, సమ్మోదము = సంతోషము, సౌఖ్యము = హాయి, విలాసము = శృంగారము, ఉత్సేకము =

అతిశయము, ఆదరము = ఆదరణ, మలయమ్మ = పార్వతి, స్త్రీత్వము = ఆడుతనము, గారము = ప్రేమ, కాంత = స్త్రీ, ఊత = ఆధారము, పతి = భర్త, మనోరాగము = మనస్సు నందు అనురాగము, హెచ్చించు = పెంచు)

కార్యాలలో విశ్వసించ తగ్గ ఆలోచన, నేర్పు, అందము, సంతోషంగా సుఖాన్నివ్వడం శృంగారమన్న అతిశయము, అమ్మని మించిన ఆదరణ, పార్వతీదేవిలో ఉన్న ఆడుతనము, ప్రేమ, భర్త మనస్సులో అనురాగం పెంచడానికి స్త్రీలకి ఆధారమవుతాయి.

355. సమస్య: రవి గాననిచోఁ గవి కాంచునే కదా

355.489 ఉ. చాలనిఁ జెప్పి వామనుడు సాతిగ మూడడుగుల్ గ్రహించి పా
తాళము దాకఁ ద్రొక్కి తన దాత బలిస్ సకలమ్ముఁ గ్రమ్మ యా
భీలత వ్యాస ప్రోక్తము, త్రివిక్రము, విస్తృతి యందు వానికిస్
కాలికి భూష యైన రవిఁ గాననిచోఁ గవి కాంచునే కదా.

(సాతి = దానము, సకలము = విశ్వము, క్రమ్ము = వ్యాపించు, ఆభీలత = భయమును గొలిపించునది, ప్రోక్తము = చెప్పబడినది, త్రివిక్రముడు = మూడులోకములను మూడడుగులుగా కొలచిన విష్ణువు, విస్తృతి = వ్యాప్తి, భూష = అలంకారము, రవి = సూర్యుడు, కాంచు = చూచు)

చాలు నాకు అని చెబుతూ వామనుడు దానంగా మూడు అడుగులు తీసుకొని, తన దాతయైన బలిచక్రవర్తిని పాతాళం దాకా త్రొక్కి, విశ్వమంతా వ్యాపించు భయము గొలిపించే దృశ్యము వ్యాసునిచే చెప్పబడినది. వ్యాప్తిలో వానికి కాలి అలంకారముగా ఉన్న సూర్యుడు త్రివిక్రముని చూడకపోతే మాత్రం కవి చూస్తాడు కదా.

356. సమస్య: రాణికి పారాణి పూసి రాణించి రహో

356.490 కం. కోణెను వీడిన మహిళలు,
ప్రాణంబులు పణము పెట్టి స్వాతంత్ర్యముకై,
శోణముతో భరతాం బను
రాణికి పారాణి పూసి, రాణించి రహో!

(కోణె = అంతఃపురము, వీడు = వదలు, పణము = పందెము, శోణము = రక్తము, అంబ = మాత, రాణించు = శోభించు)

అంతఃపురాన్ని వదిలిపెట్టిన స్త్రీలు ప్రాణాలు పణంగా పెట్టి స్వాతంత్ర్యము కోసం రక్తంతో భరతమాత అనే రాణికి పారాణి పూసి వర్ధిల్లారు.

356.491 కం. నానయె దాస్యమను కవులు,
వాణిని స్వాతంత్ర్య సమర పాథోజముగా,
ధ్వానము నిడు కవితల, నా
రాణికి పారాణి పూసి, రాణించి రహో!

(నాన = సిగ్గు, దాస్యము = బానిసత్వము, వాణి = వాక్కు, పాథోజము = శంఖము, ధ్వానము = ధ్వని, ఇడు = ఇచ్చు, రాణించు = శోభించు)

బానిసత్వము సిగ్గు పడాల్సిన విషయము అనే కవులు వాక్కును స్వాతంత్ర్య సమర శంఖంగా రవళించే కవితలతో ఆ (వాణి అంటే సరస్వతి అనే) రాణికి పారాణి పూసి వర్ధిల్లారు.

357. సమస్య: రాతిని గన నాతికి ననురాగము పుట్టెన్

357.492 కం. ప్రీతిగ రుక్మి ణిడిన సం
కేతము నార్తిన్ గ్రహించి కృష్ణుడు రాగా
నూతన వధువై కంసా
రాతినిఁ గన నాతికి ననురాగము పుట్టెన్.

(ఆర్తిన్ = బాధతో)

ప్రేమతో రుక్మిణి ఇచ్చిన సంకేతాన్ని బాధతో గ్రహించి కృష్ణుడు రాగా, కొత్త పెళ్ళికూతురై ఆ కంసమర్దనుణ్ణి చూడగానే ఆమెకు అనురాగం పుట్టింది.

358. సమస్య: రాతిరి వేళ భాస్కరుడు రమ్యముగా నుదయించెఁ దూర్పునన్

358.493 ఉ. శీతకరుండుఁ జల్లెను విశేషముగా భువి యందు జ్యోత్స్నలన్
రాతిరి వేళ, భాస్కరుడు రమ్యముగా నుదయించెఁ దూర్పునన్
జ్యోతిని పంచ, నీశ్వరు నియుక్తిని, ద్వంద్వము జీవ మందు యీ

రీతిగ భాగ మయ్యె వివరింప సమత్వము నన్ని వేళలస్.

(శీతకరుడు = చంద్రుడు, చల్లు = వెదజల్లు, విశేషముగా = ఎక్కువగా, భువి = భూమి, జ్యోత్స్న = వెన్నెల, భాస్కరుడు = సూర్యుడు, రమ్యము = మనోహరము, జ్యోతి = వెలుగు, నియుక్తి = ఆజ్ఞ, ద్వంద్వము = శీతోష్ణాదులు, జీవము = బ్రతుకు, రీతి = విధము)

ఈశ్వరాజ్ఞచే చంద్రుడు రాత్రి వేళ భూమి మీద ఎక్కువగా వెన్నెలలు వెదజల్లాడు, సూర్యుడు వెలుగును పంచడానికి తూర్పున మనోహరంగా ఉదయించాడు. అన్ని వేళలలోను సమభావాన్ని వివరించడానికి ఈ విధంగా శీతోష్ణాదులు జీవితంలో భాగ మయ్యాయి.

359. సమస్య: రాధను పెండ్లియాడె రఘురాముడు సర్వగుణాభిరాముడై

359.494 ఉ. మా ధవు డీత డంచు కృశమధ్యమ లెందరోఁ జూడ కృష్ణుడే
రాధను పెండ్లియాడె, రఘురాముడు సర్వగుణాభిరాముడై
గాధ రచింపఁ జేసె నొక గాదిలి తోడ సుఖించు టెట్టులో,
బోధన నిచ్చు యీ కథలు బొట్టెలకుస్ వెలిబుచ్చు ధర్మముస్.

(ధవుడు = భర్త, కృశమధ్యమ = స్త్రీ, అభిరాముడు = మనోహరమైన వాడు, గాదిలి = భార్య, బోధన = జ్ఞానము, బొట్టెలు = పిల్లలు, వెలిబుచ్చు = వ్యక్తపరచు)

మా భర్త ఇతడే అంటూ ఎందరో స్త్రీలు చూడగా, కృష్ణుడు రాధను పెండ్లి చేసుకున్నాడు. రఘువంశానికి చెందిన శ్రీరాముడు సకల గుణాలతో మనోహరమైన వాడై ఏకపత్నితో సుఖించడం ఎట్లాగో చరిత్ర లిఖింప జేశాడు. జ్ఞానాన్ని ఇచ్చే ఈ కథలు పిల్లలకి ధర్మము ఏమిటో వ్యక్తపరుస్తాయి.

360. సమస్య: రాధేయుడు గంగ దెచ్చి రావణు జంపెస్

360.495 కం. ఆధార మెవరు కురుపతి,
కే ధుని తేగా లభించె నిహ పరములు, సీ
తా ధవు డెవరి నడచె నన
రాధేయుడు, గంగ దెచ్చి, రావణు జంపెస్.

(ఆధారము = అండ, కురుపతి = కురు రాజైన దుర్యోధనుడు, ధుని = నది, ఇహపరములు = ఈ లోకము మఱియు పై లోకము, ధవుడు = భర్త, అడచు = చంపు, రాధేయుడు = కర్ణుడు)

కురు రాజైన దుర్యోధనునికి అండ ఎవరు, ఏ నది తీసుకొని రావడం వల్ల ఇహపరాలు దక్కాయి, సీత భర్తయైన శ్రీరామచంద్రుడు ఎవరిని చంపాడు, అంటే క్రమంగా, "కర్ణుడు", "గంగను తెచ్చి", మరియు "రావణుని చంపాడు".

361. సమస్య: రామాయణముస్ పఠియించి భారతార్థము చేసెస్

361.496 కం. గుణశాలి, నిర్వచన ధో
రణి వ్రాసెను, రావిపాటి లక్ష్మీ నారా
యణ కవి, ద్వ్యర్థిగ రామా
యణముస్, పఠియించి భారతార్థము చేసెస్.

(గుణశాలి = గుణవంతుడు, ధోరణి = పద్ధతి, ద్వ్యర్థి = రెండర్థములు కలది, పఠియించు = చదువు, అర్థము = శబ్దవివరణము)

ఈ పూరణ ఒక పుస్తక పరిచయం లాంటిది. నిర్వచన భారత గర్భ రామాయణము అనే కేవలం పద్యాలున్న ద్వ్యర్థి కావ్యాన్ని శ్రీ రావిపాటి లక్ష్మీ నారాయణ కవి 1954వ సంవత్సరంలో రచించారు. ఈ కావ్యం లోని ప్రతి పద్యంలో రామాయణ కథ, భారత కథ, రెండూ నడుస్తూ ఉంటాయి. ఆ విషయమే ఈ పద్యంలో చెప్పబడింది. గుణవంతుడైన శ్రీ రావిపాటి లక్ష్మీ నారాయణ కవి వచనం లేని పద్ధతిలో రెండర్థాలు ఉండే విధంగా రామాయణము వ్రాశాడు మరియు చదివి భారతం యొక్క అర్థము చేశాడు.

362. సమస్య: రాముడు కుంతి నందనుడు రాధ కుమారుడు భీష్ముడే కదా

362.497 ఉ. నీమముగా స్వధర్మమును నేర్పగ కృష్ణుడు యయ్యె నంతరా
రాముడు కుంతి నందనుడు, రాధ కుమారుడు భీష్ముడే కదా
స్వామి సుయోధనుండు తన సైన్యము నందున ముఖ్యు లంచు బ
ల్గోముగఁ జెప్పె, వారలనుఁ గూల్చెను కృష్ణసఖుండెఁ బోరునస్.

(నీమము = నియమము, స్వధర్మము = తన కర్తవ్యము, అంతరారాముడు = యోగియైనవాడు, కుంతి నందనుడు = కృష్ణసఖుడు = అర్జునుడు, రాధకుమారుడు = కర్ణుడు, స్వామి = రాజు, బల్గోముగ = చాల గర్వముతో, కూల్చు = చంపు, పోరు = యుద్ధము)

నియమం ప్రకారం స్వధర్మాన్ని కృష్ణుడు బోధించగా కుంతికుమారుడైన అర్జునుడు యోగి ఐనాడు. రాధేయుడైన కర్ణుడున్నూ, భీష్ముడే కదా రాజైన దుర్యోధనుడు తన సైన్యంలో ముఖ్యమైన వాళ్ళంటూ గర్వంగా చెప్పాడు. వాళ్ళను యుద్ధంలో అర్జునుడే పడగొట్టాడు.

363. సమస్య: రాముని రాక్షసాంతకుని దాశరథిన్ వినుతించు టొప్పునే

363.498 ఉ. రాముని రాజ్య మన్న మది రంజిలుఁ గాని, పరాయి యింటిలో
స్వామిని బంది యంచెరిగి స్వాగత మిచ్చెను, కాంతకై యథా
కామిగ నున్న రాజని వికారముగా ప్రజలే తలంప, త
ద్రాముని రాక్షసాంతకుని దాశరథిన్ వినుతించు టొప్పునే.

(స్వామిని = భార్య, యథాకామి = స్వేచ్ఛావిహారి, వికారము = అసహ్యము, తలంచు = యోచించు)

ఇచ్చిన సమస్యలో యతి తప్పింది. ఇక్కడ 10వ అక్షరం “దా”తో యతి కలిసేట్టు మొదటి అక్షరాన్ని “ద్రా” అని చెయ్యడం జరిగింది. రామరాజ్యం అంటే మనస్సుకి ఆనందమే గానీ, పరయివాడి ఇంట్లో భార్య బందీ అని తెలిసి కూడా స్వాగతించాడు. ఒక స్త్రీ కోసం ఇష్టము వచ్చినట్టుగా చేసిన రాజుని గురించి ప్రజలు అసహ్యంగా ఆలోచించారు. అలాంటి రాముణ్ణి, రాక్షస వినాశకుణ్ణి, దశరథ కుమారుణ్ణి పొగడడం సరియైన పనేనా?

364. సమస్య: రామునికి వనంబులుండ రాజ్యంబేలా

364.499 కం. ఏమా నిందను మోసెను,
రాముడు సతిని విడిపించి రావణుని చెరన్
కామించి తెచ్చె నిటకని,
రామునికి వనంబు లుండ రాజ్యం బేలా?

రాముడు, రావణుని చెరనుండి భార్యను విడిపించి, కామంతో ఇక్కడకు తీసుకుని వచ్చాడని, ఎందువల్ల నిందను మోశాడు. రాముడికి అడవులుండగా రాజ్యం ఎందుకు?

364.500   కం. ఈమా కోరిన వరములు,
రామునికి వనంబు లుండ రాజ్యం బేలా?
భూమీశుగఁ జేయ భరతు
నా మత మని రాణి కైక నాథునిఁ గోరెస్.

నేను కోరిన వరాలు ప్రసాదించుము. రామునికి అడవు లుండగా రాజ్యం ఎందుకు? భరతుణ్ణి రాజుగా చేయడం నా అభిప్రాయమని రాణియైన కైక భర్తయైన దశరథుడిని కోరింది.

364.501   కం. బాముల కోర్చుచు సత్యము
నీమముగ త్రిశంకుసుతుడు నిలువగ గని వి
శ్వామిత్రుని కేల కినుక
రా! మునికి వనంబు లుండ రాజ్యం బేలా?

కష్టాలని ఓర్చుకుంటూ, సత్యవ్రతంతో త్రిశంకు పుత్రుడైన హరిశ్చంద్రుడు ప్రవర్తిస్తూ ఉండడం చూసి, విశ్వామిత్రునికి కోపం ఎందుకురా! మునీశ్వరునికి అడవు లుండగా రాజ్యం ఎందుకు?

364.502   కం. కామింపడు భోగమ్ముల,
భూమీశుల పీచ మడచి పుడమిని దానం
బో ముని కిచ్చు ఘను, పరశు
రామునికి, వనంబు లుండ రాజ్యం బేలా?

సుఖాలను కోరుకోడు. రాజుల మదము నశింప జేసి, భూమిని ఓ మునికి దానం ఇచ్చే గొప్పవాడైన పరశురామునికి అడవులుండగా రాజ్యం ఎందుకు?

365.   సమస్య: రాయల వారికిస్ తెలుగు రాదు కదా రసముస్ గ్రహింపగస్

365.503   ఉ. వ్రాయగ లేను పద్యములు, వ్రాసిన వన్నియు బుట్టదాఖలై
పోయె నటన్న మాట వినఁ బోనిక, మారిన కాల మందు వా
లాయ మొనర్చ యాంగ్లమునె లక్ష్యముఁ జేయుచు నేర్చు కోడెకా
రా, యల వారికిస్ తెలుగు రాదు కదా రసముస్ గ్రహింపగస్.

(బుట్టదాఖలు = పనికిరానిదిగా భావించి పక్కన పడవేయు, వాలాయము = అవశ్యము, లక్ష్యము = గురి, కోడెకారు = యువకులు, అల = ఆ, రసము = శృంగారాది స్థాయీభావములు)

పద్యాలు వ్రాయలేను. వ్రాసిన వన్నీ బుట్టదాఖలై పోయాయి అన్న మాట ఇంక వినబోను. మారిన కాలంలో ఆంగ్లాన్ని అవశ్యం (compulsory) చేయగా అది గురి చేసుకుని నేర్చిన యువతంటారా, అవ్వారికి రసాస్వాదన చెయ్యడానికి తెలుగు రాదు కదా.

366. సమస్య: రారా తమ్ముడ రార యన్న యనియెస్ రాజాస్య ప్రాణేశ్వరుస్

366.504 శా. క్రూరుస్ సైంధవుఁ గాంచి ద్రౌపదియె యాక్రోశించి తబ్బిబ్బుగస్
రారా తమ్ముడ! రార యన్న! యనియెస్, రాజాస్య! ప్రాణేశ్వరుస్,
గారాబమ్ముగ నిన్ను కోరి యిట యీ కాంతార మందొంటిగస్
జేరస్ నన్ను నిరాకరింతువె యనెస్ చేడ్పాటు నన్నాతడే.

(క్రూరుడు = పరులను పీడించువాడు, కాంచు = చూచు, ఆక్రోశించు = మొఱపెట్టు, తబ్బిబ్బు = తడబాటు, రాజాస్య = చంద్రబింబము వంటి ముఖము కలదానా, ఈశ్వరుడు = మన్మథుడు, గారాబము = ప్రేమము, కాంతారము = అడవి, ఒంటిగ = ఒంటరిగా, చేరు = సమీపించు, నిరాకరించు = తిరస్కరించు, చేడ్పాటు = బాధ)

క్రూరుడైన సైంధవుణ్ణి చూసి ద్రౌపదియే మొఱపెట్టుకుంటూ తడబాటుతో రారా తమ్ముడా, రారా అన్నా అని అంది. చంద్రబింబము వంటి ముఖము కలదానా! నీకు మన్మథుణ్ణి, ప్రేమగా నిన్ను కోరి ఇక్కడ ఈ అడవిలో ఒంటరిగా సమీపించగా నన్ను తిరస్కరిస్తావా అని బాధతో అతడు అన్నాడు.

367. సమస్య: రావణుడా సీత మగడు రక్షించు మిమున్

367.505 కం. పావని సీతను ముచ్చిలు
బేవర మఘమని తెలిసి విభీషణు డనియెస్,
నీవు కుజను తిరిగిచ్చిన,
రావణుడా! సీత మగడు రక్షించు మిమున్.

(పావని = పవిత్రురాలు, ముచ్చిలు = దొంగిలించు, బేవరము = వ్యవహారము, అఘము = పాపము, కుజ = సీత)

పావనియైన సీతను దొంగిలించే వ్యవహారము పాపమని తెలిసిన విభీషణుడు ఏమన్నాడంటే, ఓ, రావణా! నువ్వు సీతను తిరిగి ఇచ్చేస్తే సీత భర్తయైన రాముడు మిమ్మల్ని రక్షిస్తాడు.

368. సమస్య: రావణునకు గుడిని కట్టె రాము డయోధ్యన్

368.506 కం. శైవాగ్రేసరుడని ప్రజ
రావణునకు గుడిని కట్టె, రాము డయోధ్యన్
యావిర్భవించెనని సం
భావించుచు కట్టిరి గుడి భక్త జను లటన్.

(శైవుడు = శివభక్తుడు, అగ్రేసరుడు = శ్రేష్ఠుడు, ప్రజ = ప్రజలు, ఆవిర్భవించు = పుట్టు, సంభావించు = స్తుతించు, అట = అచ్చట)

శివభక్తులలో శ్రేష్ఠుడని రావణాసురునికి ప్రజలు గుడి కట్టారు (రావణాసురుడు గొప్ప శివభక్తుడని, శివ తాండవ స్తోత్రాన్ని స్వయంగా రచించి పాడాడని, అలాంటి భక్తాగ్రేసరుడికి ఆలయం కట్టడం తప్పుకాదని ఉద్దేశించి, కొన్ని చోట్ల ఆయనకి ఆలయం కట్టారు. ఉదాహరణకి, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లోని బిస్రఖ్ అనే గ్రామం లోనూ, రాజస్థాన్ లోని జోధ్‌పూర్ లోనూ, మధ్యప్రదేశ్ లోని విదిశ అనే ప్రాంతం లోనూ రావణాసురుడి గుడి ఉందట.). శ్రీరాముడు అయోధ్యలో పుట్టాడని స్తుతిస్తూ భక్త జనులు అక్కడ గుడి కట్టారు.

369. సమస్య: రావణుని పెండ్లి కేగెను రాము డలరి

369.507 తే.గీ. గాధిసుతు యాగమున కడ్డు కర్మకరులె
రావణుని, పెండ్లి కేగెను రాము డలరి,
వారి యడ్డును తొలగించి స్వరువునకును,
జనకజ స్వయంవర మను వార్తను వినంగ.

(గాధిసుతుడు = విశ్వామిత్రుడు, అడ్డు = ప్రతిబంధకం, కర్మకరుడు = సేవకులు, అలరు = సంతోషించు, స్వరువు = యజ్ఞము, జనకజ = సీత)

విశ్వామిత్రుని యాగానికి రావణుని సేవకులే అడ్డు. యాగానికి వారి అడ్డును తొలగించి సీతాస్వయంవరమను వార్త వినగానే రాముడు సంతోషించి పెళ్ళికి వెళ్ళాడు.

370.   సమస్య: రెండవ భార్యనేలుకొనరే పతులందరు తల్లి మెచ్చగన్

370.508   ఉ. పాండవు లందరున్ తమకు పత్నిగ కృష్ణను స్వీకరించి, లే
కుండ విభేదముల్ తమకు నుంచిరి నీమము, వత్సరంబునన్
యుండును పత్నిగా యొకరి యోకము నందని, భోగ కాంక్షులై
రెండవ భార్య నేలు కొనరే పతు లందరు తల్లి మెచ్చగన్.

(నీమము = నియమము, వత్సరము = సంవత్సరము, ఓకము = ఇల్లు, కాంక్షుడు = కోరిక కలవాడు)

పాండవులు అందరూ ద్రౌపదిని తమకు భార్యగా స్వీకరించి, తమ మధ్య విభేదాలు లేకుండా ఉండడం కోసం సంవత్సరంలో ఆమె భార్యగా ఒకరి ఇంటిలోనే ఉండాలనే నియమము పెట్టుకున్నారు. ఆ భర్త లందరూ భోగాన్ని కోరి తమ తల్లియైన కుంతీదేవి మెచ్చుకోగా రెండవ భార్యను ఏలుకొనలేదా.

370.509   ఉ. అండగ నున్న స్వామినులు యందరి వీడి మృతిన్ లయింపగా,
మొండిగ జీవనమ్ము నెటు మోయుదు రంచని మాతఁ జెప్ప, కా
నిండని పెద్ద లందరును నిర్ణయ మివ్వగ, సంతు కోసమై
రెండవ భార్య నేలు కొనరే, పతు లందరు తల్లి మెచ్చగన్.

(అండ = ఆసరా, స్వామిని = భార్య, వీడు = వదలు, లయించు = తగులుకొను, మొండి = మూర్ఖుడు, మోయు = వహించు, కానిచ్చు = జరుగనిచ్చు, సంతు = సంతానము)

అండగా ఉన్న భార్యలు అందరినీ వదిలిపెట్టి మృత్యువు వాత పడగా, మొండిగా జీవితాన్ని ఎలా మోస్తారు అని తల్లి చెప్పగా, జరగనివ్వండని పెద్దలు నిర్ణయము ఇవ్వగా, సంతానం కోసం ఆ భర్త లందరూ తల్లి మెచ్చుకునే విధంగా రెండవ భార్యను ఏలుకోరా.

370.510   ఉ. కండలు జావఁగార తమ గ్రామము లందున పైరుపంటలన్
మెండుగఁ జేసి తా మొరపుమీరు పరంపర నిల్ప, నవ్వి, శ్రీ
మండితులైన కర్షకుల మానస మందున తొంటి భార్యలే,
రెండవ భార్య నేలుకొనరే పతు లందరు తల్లి మెచ్చగన్.

(జావగారు = కరుగు, మెండు = అధికము, ఒరపుమీరు = నాణ్యము పొందు, పరంపర = విడువక సాగునది, అవ్వి = అవి, శ్రీమండితుడు = సంపద చేత అలంకరింపబడిన వాడు, కర్షకుడు = రైతు, మానసము = మనస్సు, తొంటి = మొదటి)

కండలు కరిగించి తమ గ్రామాల్లో పైరు పంటలు అధికంగా చేసి తాము నాణ్యమైన పరంపర నిలుపగా, ఆ గ్రామాలు సంపదతో అలరారే రైతుల మనసుల్లో మొదటి భార్యలే. తల్లి మెచ్చుకునే విధంగా రెండవ భార్యని (అంటే, అసలు భార్యని) ఏలుకోరా.

371. సమస్య: రైలింజెను రోడ్డుమీద రయమున దిరిగెన్

371.511 కం. బాలికకు యాట బొమ్మలు
బోలెడు కొనె తండ్రి, యందు 'బుర్' యను ధ్వనితో,
కీలునుఁ దిప్పగ బొమ్మగు
రైలింజెను రోడ్డు మీద రయమునఁ దిరిగెన్.

బాలిక కోసం వాళ్ళ నాన్న బోళ్ళు ఆటబొమ్మలు కొన్నాడు. అందులో, కీలును తిప్పగానే "బుర్" అని చప్పుడు చేస్తూ బొమ్మ రైలింజెను రోడ్డు మీద వేగంగా తిరిగింది.

371.512 కం. పాలకు లాంగ్లేయు లపుడు
తోలించిరి ట్రాము (Tram) లెన్నొ తురగమ్ముల, బో
గీ (Bogie) లాగ నిపుడు దొరుకగ
రైలింజెను, రోడ్డు మీద రయమునఁ దిరిగెన్.

మన దేశానికి ఒకప్పుడు పాలకులైన ఆంగ్లేయులు ఆ రోజుల్లో గుర్రాలతో ట్రాములు తోలించారు. బోగీ లాగడానికి ఇప్పుడు రైలింజెను దొరకడం వల్ల రోడ్డు మీద వేగంగా తిరిగింది.

371.513 కం. కీలక పరిణామము, నలు
మూలల మెట్రోలు (Metro) తిరుగు ముచ్చట, యవి ప
ట్టాల పథమ్ముల లాగగ
రైలింజెను రోడ్డు మీద రయమునఁ దిరిగెన్.

నలు మూలల మెట్రోలు తిరిగుతున్నాయన్న వృత్తాంతము ఒక ప్రధానమైన మార్పు. అవి పట్టాల మార్గాలలో రైలింజెను లాగడం వల్ల రోడ్డు మీద వేగంగా తిరుగుతున్నాయి.

372. సమస్య: రోకలి తోడ మాధవుని రుక్మిణి మోదెను సత్య మెచ్చగన్

372.514 ఉ. పైకము దండిగా తమకు పమ్మగ నాటక మందు, యేకమై
పీకల దాక మద్యమునుఁ బీల్చి విగర్హణఁ జేయుచుండ, చీ
కాకు గరిష్ఠమై నట నికాయముఁ జేసెడి పిచ్చి చేష్టలన్,
రోకలి తోడ మాధవుని రుక్మిణి మోదెను సత్య మెచ్చగన్.

(పైకము = ధనము, దండి = సమృద్ధము, పమ్ము = దక్కు, ఏకమై = ఒక్కటగు, మద్యము = కల్లు, పీల్చు = త్రాగు, విగర్హణ = నింద, చీకాకు = గొడవ, గరిష్ఠము = అధికము, నికాయము = సమూహము, చేష్ట = పని, మోదు = కొట్టు)

నాటకంలో ధనం దండిగా తమకి ముట్టగా, ఒక్కటై నటవర్గము పీకల దాకా మద్యం త్రాగి తిట్లు తిట్టుతూ గొడవ ఎక్కువై చేసే పిచ్చి పనుల్లో రుక్మిణి సత్యభామ మెచ్చుకోగా రోకలితో మాధవుణ్ణి కొట్టింది.

373. సమస్య: రోమము సౌఖ్య మిచ్చుచునుఁ బ్రోవనిచో యశ మెల్లఁ బాడగున్

373.515 ఉ. కాముకుడైన వాలి బల గర్వితుడై సహజన్ము జోపి, భా
ర్యామణియౌ రుమన్, దశరథాత్మజ! బందినిఁ జేసె నంచు, శ్రీ
రాముని కాంజనేయు డిటు లజ్జితుడై మొర పెట్టె, స్నేహి కా
రో, మము సౌఖ్య మిచ్చుచునుఁ బ్రోవనిచో యశ మెల్లఁ బాడగున్.

(కాముకుడు = స్త్రీల వలచువాడు, సహజన్ముడు = సోదరుడు, జోపు = అవతలికి పాఱ ద్రోలు, దశరథాత్మజుడు = శ్రీరాముడు, బంది = చెఱ బడ్డది, ఇటు = ఈప్రకారము, లజ్జితుడు = సిగ్గుపడ్డవాడు, మొరపెట్టు = పడిన అన్యాయమునుగూర్చి చెప్పు, స్నేహి = స్నేహితుడు, ప్రోచు = రక్షించు, యశము = కీర్తి, పాడగు = నాశనమగు)

ఓ, దాశరథీ! కాముకుడైన వాలి బలగర్వంతో సోదరుడైన సుగ్రీవుని ఆవలకు పాఱ ద్రోలి అతని భార్యారత్నమైన రుమను చెఱపట్టాడని చెబుతూ, శ్రీరామునికి ఆంజనేయుడు ఈ విధంగా విన్నవించుకున్నాడు: మీరు స్నేహితుడు కారా. మమ్మల్ని సుఖమిచ్చి కాపాడకుంటే కీర్తి నాశన మవుతుంది.

374. సమస్య: లంగా లోపల దాచుకొందు వది యేలా బేల నీ ఫాలమున్

374.516 శా. సింగారించిన పెండ్లి మంటపమునన్ చిత్తేశుతో నాడగన్
యంగీకారము పెళ్ళికూతు రిడగన్, యాహూతులా భామఁ గాం
చంగాఁ బల్కిరి నాథు హస్తముల పుంజంబై తలంబ్రాలు రా
లంగా, లోపల దాచుకొందు వది యేలా బేల నీ ఫాలమున్.

(సింగారించు = అలంకరించు, చిత్తేశుడు = వరుడు, ఇడు = ఇచ్చు, ఆహూతుడు = ఆహ్వానింపబడిన వాడు, భామ = స్త్రీ, కాంచు = చూచు, నాథుడు = వరుడు, హస్తము = చెయ్యి, పుంజము = రాశి, తలంబ్రాలు = పెండ్లిలో వధూవరుల తలలపై వోయు అక్షతలు, రాలు = పడు, బేల = అమాయకురాలు, ఫాలము = నెత్తి)

అలంకరించిన పెళ్ళి మండపంలో పెళ్ళికూతురు వరునితో ఆడటానికి అంగీకారము ఇవ్వగా, ఆహూతులు ఆ అమ్మాయి చూస్తూ ఉండగా, "ఓ, అమాయకురాలా! వరుని చేతుల నుండి రాశిగా తలంబ్రాలు పడుతుండగా తల లోపల దాచుకుంటా వెందుకు?" అని అన్నారు.

374.517 శా. శృంగారమ్మును వీరమున్ సమధికోత్సేకంబుతో నిల్పి స
ప్తాంగంబుల్ గల మాడె మంతయును సంబాళించి స్త్రీజాతి కు
త్తుంగస్థానము నిచ్చి, రుద్రమ మహిన్ దోర్గీల రాజ్యంబు నే
లంగా, లోపల దాచుకొందు వది యేలా బేల! నీ ఫాలమున్.

(సమధిక = చాలా ఎక్కువ, ఉత్సేకము = అతిశయము, సప్తాంగములు = స్వామి, అమాత్యుడు, జనపదము, దుర్గము, కోశము, దండము, మిత్రులు (రాజ్యాంగములు), మాడెము = మండలాధిపతుల భూమండలము, సంబాళించు = నిర్వహించు, ఉత్తుంగ = ఉన్నతమైన, దోర్గీల = భుజశక్తితో, ఏలు = పాలించు, బేల = అమాయకురాలు, ఫాలము = నెత్తి)

ఓ అమాయకురాలా! శృంగారాన్ని వీరత్వాన్ని అధికమైన అతిశయముతో నిలిపి, తన క్రింద ఉండే భూమండలములో ఉండే ఏడు అంగాలను నిర్వహించి స్త్రీ జాతికి ఉన్నతమైన స్థానమును ఇచ్చి రాణీ రుద్రమ దేవి ఈ భూమి మీద భుజశక్తితో రాజ్యాన్ని పాలించగా, తల లోపల దాచుకుంటా వెందుకు?

375. సమస్య: లక్ష్మీవారమ్ము సోమవారమ్ము వచ్చె

375.518 లక్ష్మీవా! రమ్ము! సోమవారమ్ము వచ్చె,
నీ యనుజుడు చంద్రుని కది నెయ్యముఁ గద,
నీదు యన్న శివుడు నాడె చేదు మ్రింగె,
మాకు సంపద నిడ నదే నీకు తగును.

(అనుజుడు = తమ్ముడు, నెయ్యము = ఇష్టము, నీదు = నీ, నాడు = ఆ దినము, చేదు = విషము, మ్రింగు = త్రాగు, సంపద = ఐశ్వర్యము, ఇడు = ఇచ్చు, తగు = యుక్తమగు)

చంద్రుడికి సోమవారం అంటే ఇష్టం, శివుడు విషం త్రాగింది కూడా ఆ వారమే అని ఎక్కడో చదివాను. ఆ వివరాల ఆధారంగా ఈ సమస్య పూరించడం జరిగింది. లక్ష్మీ దేవివా! రా తల్లీ! సోమవారం వచ్చింది. నీ తమ్ముడు చంద్రుడికి అది ఇష్టమైంది కదా. నీ అన్నయైన శివుడు ఆ రోజే కదా విషం మ్రింగాడు. మాకు ఐశ్వర్యం ఇవ్వడానికి ఆ రోజే నీకు యుక్తమైనది.

376. సమస్య: లక్ష్మీ వల్లభుడయ్యె భర్త యుమకున్ లక్షింపుడీ పండితుల్

376.519 శా. లక్ష్మీగౌరి యటన్న పేరు నిడి సల్లాపంబులన్ బంధువుల్
లక్ష్మీ! యంచని గౌరి! యంచనుచుఁ బిల్వన్, వాడుకే వేడుకై,
లక్ష్మీ వల్లభు డయ్యె భర్త యుమకున్ లక్షింపుడీ పండితుల్
సూక్ష్మగ్రాహ్యతఁ దేలు నంచుఁ బలుకన్ చోద్యం బయెన్ పెండ్లిలో.

(గౌరి = పార్వతి, ఇడు = ఇచ్చు, సల్లాపము = పరస్పర సంభాషణము, బంధువు = చుట్టం, వాడుక = రివాజు, వేడుక = వినోదము, వల్లభుడు = భర్త, ఉమ = పార్వతి, లక్షించు = పరిగణించు, సూక్ష్మగ్రాహ్యత = ఎంత చిన్న విషయములనైన తెలిసికొనుట, తేలు = బయటపడు, చోద్యము = ఆశ్చర్యము)

'లక్ష్మీగౌరి' అన్న పేరు పెట్టి పరస్పర సంభాషణలలో బంధువులు, 'లక్ష్మీ' అని, 'గౌరీ అని అంటూ పిలవగా, ఆ వాడుకే వేడుకగా మారి లక్ష్మి భర్త ఉమకి భర్తయ్యాడు, పండితులు పరిగణించండి, సూక్ష్మగ్రాహ్యత ఏమిటో తెలిపోతుంది అని పలుకగా, పెళ్ళిలో ఆశ్చర్యమయ్యింది.

377.   సమస్య: లావును జూపుచుఁ లవుఁడు లంకిణిఁ గూల్చెను లక్కయింటిలో

377.520   ఉ. జీవుల నన్ని వస్తువుల చెంతనె బొమ్మల కొల్వు నందు సం
భావనఁ జేయగా నునుచ, బాలలు పోరుచు లక్క బొమ్మలఁ
నావివి నావివే యనుచు నాలుగు ప్రక్కల నేయ, దొర్లగా
లావునుఁ జూపుచుఁ లవుఁడు లంకిణిఁ గూల్చెను లక్క యింటిలో.

(సంభావన = ఊహించుట, ఉనుచు = ఉంచు, పోరు = కలహించు, ప్రక్క = వైపు, ఏయు = పడగొట్టు, దొర్లు = జారు, లావు = బలము, కూల్చు = పడవేయు)

జీవులను అన్ని వస్తువులను దగ్గరలో బొమ్మల కొలువులో ఊహించడం కోసము ఉంచగా, పిల్లలు పోట్లాడుకుంటూ, లక్క బొమ్మలని ఇవి నావి, నావే, యని అంటూ, నాలుగు పక్కలా పడగొట్టడం వలన జారగా, బలం ప్రదర్శిస్తూ లవుడి బొమ్మ లక్క ఇంటి బొమ్మలో లంకిణి బొమ్మని పడవేసింది.

378.   సమస్య: లింగని రంగరంగ యని లీన మయెఁ మకరాంక కేళిలో

378.521   ఉ. శృంగము లున్న యేకకుడు, శిష్ట ఋషీశ్వరు ఋష్యశృంగు, వా
రాంగన లాదరించి వలరాచపనిఁ గరపఁ, తదార్తిచే
యంగ నృపాలు పుత్రి కర మంది యతండు తలిర్చి, గేస్తురా
లిం గని రంగరంగ యని లీన మయెఁ, మకరాంక కేళిలో.

(శృంగము = కొమ్ము, ఏకకుడు = అసహాయుడు, శిష్ట = సదాచారసంపన్నుడు, వారాంగన = వేశ్య, ఆదరించు = చేరదీయు, వలరాచపని = రతిక్రీడ, కరపు = నేర్పు, తత్ = ఆ, ఆర్తి = తాపము, అంగనృపాలుడు = అంగదేశపు రాజైన రోమపాదుడు, పుత్రి = కుమార్తె, కరము = చెయ్యి, అందు = గ్రహించు, తలిర్చు = ముదమందు, గేస్తురాలు = ఇల్లాలు, కను = చూచు, రంగరంగ యని = హాయిగా, లీనము = కరగిపోవు, మకరాంక = మన్మథుడు, కేళి = క్రీడ)

భక్త తుకారాం అన్న చలనచిత్రంలో ముంభాజీ (నాగభాషణం) గారికి ఇచ్చిన సమస్య ఇది. ఆయన పూరించలేకపోతే తుకారాం గారు (నాగేశ్వరరావు) వచ్చి విప్రనారాయణ - దేవదేవి పరంగా ఈ సమస్యని పూరిస్తారు. ఇక్కడ ఋష్యశృంగుడి పరంగా పూరించడం జరిగింది. కొమ్ములున్న అసహాయుడు, సదాచారసంపన్నుడు, మునీశ్వరుడైన ఋష్యశృంగుని, వేశ్యలు చేరదీసి రతిక్రీడ నేర్పగా, ఆ తాపంతో అంగదేశపు

రాజైన రోమపాదుని కుమార్తెయైన శాంతను పాణిగ్రహణం చేసి అతడు ముదమంది ఇల్లాలిని చూసి హాయిగా మన్మథక్రీడలో మునిగిపోయాడు.

379. సమస్య: లేదనఁగఁ గల్గు భోగభాగ్యోదయమ్ము

379.522 తే.గీ. రాజసూయముఁ గాంచి రారాజు తలచె,
సొత్తు సడప పాండవులతో జూద మాడఁ
గోర నభ్యంతరము జనకుండు తనకు
లేదనఁగఁ గల్గు భోగభాగ్యోదయమ్ము.

(రాజసూయము = ఒకరాజు తక్కిన రాజులను జయించి చేసెడి యజ్ఞము, కాంచు = చూడు, రారాజు = దుర్యోధనుడు, తలచు = భావించు, సొత్తు = సంపద, సడపు = అపహరించు, జనకుడు = తండ్రి, కల్గు = కలుగును, భోగ = సుఖము, భాగ్య = సంపద, ఉదయము = ఉన్నతి)

రాజసూయ యాగము చూసి దుర్యోధనుడు, సొమ్ము దోచుకోవడానికి పాండవులతో జూదము ఆడాలనుకుంటే తండ్రియైన ధృతరాష్ట్రుడు తనకి అభ్యంతరము లేదని అంటే సుఖ సంపదలు కలుగుతాయని అనుకున్నాడు.

380. సమస్య: వందే మాతరమనుటయె పాపమ్మగునా

380.523 కం. వందేమాతర యుద్యమ
బందీలనుఁ జూచి జడిసి పాంధుం డనె, యీ
సందున ఫలములు కొన, నే
"వందే" మా తర మనుటయె పాపమ్మగునా.

(పాంధుడు = బాటసారి, తరము = శక్యము)

వందేమాతరం ఉద్యమంలో బందీలుగా పట్టుబడ్డ వారిని చూసి భయపడి, బాటసారి ఏమన్నాడంటే, ఈ సందులో పళ్ళు కొనడానికి నేను వందయే మా వల్ల అవుతుంది అనడం పాప మవుతుందా, అని.

381.   సమస్య: వక్త్రంబుల్ పది కన్నులైదు కరముల్ వర్ణింపగా వేయగున్

381.524   శా. వక్త్రంబందున జ్వాల యున్న శివు సంభావించు పౌలస్త్యుకున్,
వక్త్రం బందున జ్వాల యున్న శివునిన్ బర్హిధ్వజన్ జూడగన్,
యక్త్రంబై కృతవీర్య సూనునికి దత్తాత్రేయు దాక్షిణ్యమౌ,
వక్త్రంబుల్ పది, కన్ను లైదు, కరముల్ వర్ణింపగా వేయగున్.

(వక్త్రము = ముఖము, జ్వాల = మంట, సంభావించు = ఆరాధించు, పౌలస్త్యుడు = రావణుడు, బర్హిధ్వజ = పార్వతి, అక్త్రము = కవచము, కృతవీర్యసూనుడు = కృతవీర్యుని కుమారుడైన కార్తవీర్యార్జునుడు, దాక్షిణ్యము = దయ, కరము = చెయ్యి)

క్రమాలంకారంలో పూర్తి చేయబడిన సమస్య ఇది. ముఖంలో జ్వాల గల ముక్కంటియైన శివుని ఆరాధించే రావణునికి ముఖాలు పది. ఆ ముక్కంటినీ పార్వతినీ చూస్తే ఐదు కళ్ళు కనిపిస్తాయి. కార్తవీర్యార్జునునికి కవచంగా దత్తాత్రేయ స్వామి దయాలబ్ధమైన చేతులు లెక్కిస్తే వెయ్యి అవుతాయి.

382.   సమస్య: వడ దెబ్బకు పళ్ళు కదిలె వర్షోధృతిలో

382.525   కం. జడిపించె జూను నెలలో
వడ దెబ్బకు, పళ్ళు కదిలె వర్షోధృతిలో
యడలించ డిశంబరులో
గడగడ మనిపించు చలియె, కాలము సాగన్.

(జడిపించు = భయపెట్టు, వడ = వేడిమి, ఉధృతి = తీవ్రత, అడలించు = అదలించు, గడగడ = వడకుటయందగు అనుకరణము, సాగు = కొనసాగు)

కాలం సాగుతుండగా, జూను నెలలో ఎండదెబ్బకి భయపెట్టింది, వర్ష తీవ్రతలో డిశంబరులో గడగడ మనిపించే చలి అదలించగా పళ్ళు కదిలాయి.

383.   సమస్య: వడియము లెండెను విడువని వానల లోనన్

383.526   కం. వడగాలికి యొక పేటను

వడియము లెండెను, విడువని వానల లోనస్
దడిసె మరో పేట ప్రజలు,
గడియను పరివర్తనములుఁ గనుపడె పురిలో.

మామూలుగా పట్టణాలలో చూస్తూ ఉంటాము, ఒక చోట మండుటెండగా ఉంటే ఇంకో చోట దంచి వాన పడుతూ ఉంటుంది. ఒక పేటలో వడగాలి వీస్తుంటే, వడియాలు ఎండాయి. వాన విడవకుండా పడుతుంటే మరో పేట ప్రజలు తడిశారు. ఒక గంట వ్యవధిలోనే, పట్టణంలో ఈ మార్పులు కనబడ్డాయి.

383.527 కం. పుడమికి తొలకరి వానలు,
ముడు పిడ పరివార మంత మూగెను గుడిలో,
హడలుఁ గొలుపు హోమాగ్నికి
వడియము లెండెను, విడువని వానల లోనస్.

(పుడమి = నేల, తొలకరి వానలు = ఎండాకాలం తరవాత ఆరంభమయ్యే వానలు, ముడుపు = మొక్కుబడి, ఇడు = ఇచ్చు, మూగు = గుమిగూడు, హడలు = భయము)

వేసం కాలం తర్వాత నేల మీద మొదటి వానలు పడుతున్నాయి. కుటుంబమంతా మొక్కు చెల్లించుకోవడం కోసం గుడిలో చేరారు. వానలు విడవకుండా పడుతున్నా, భయము కలుగజేసే హోమాగ్నికి వడియాలు ఎండినాయి.

384. సమస్య: వద్దని యెంత వేడినను వచ్చెడి వాడె స్తుతింప నర్హుడౌ

384.528 ఉ. పొద్దున లేచు గోపికలు పూజలు కర్మలుఁ జేసి యుట్టిపై
ముద్దగ వెన్న దాచగనె, మ్రుచ్చిల వారి గృహాల వారు రా
వద్దని యెంత వేడినను వచ్చెడి వాడె స్తుతింప నర్హుడౌ,
ముద్దులు మూటఁ గట్టుచును మోమున నవ్వులు చిందు కృష్ణుడే.

(మ్రుచ్చిలు = దొంగిలించు, గృహము = ఇల్లు)

పొద్దున్నే నిద్ర లేచే గోపికలు, పూజలు పనులు చేసుకుని ముద్దగా వెన్నని ఉట్టి మీద దాచగానే ఎత్తుకుపోవడానికి వాళ్ళ ఇళ్ళకి వాళ్ళు రావద్దని ఎంత మొత్తుకున్నా వచ్చేవాడే స్తుతి చేయడానికి అర్హుడైన ముద్దులు మూటగట్టుకుని ముఖాన నవ్వులు చిందిస్తూ ఉన్న కృష్ణుడే.

384.529 ఉ. రద్దగు దాక శాసనము, రచ్చను వీడని రైతు కోర్కెకున్
మద్దతు నిచ్చి యుద్యమ సమాగమముల్ యెదిరింప, తానుగా,
హద్దులు మీరి వార లటు లల్లరి చేయుటఁ జూచి పాలకుల్
వద్దని యెంత వేడినను, వచ్చెడి వాడె స్తుతింప నర్హుడా.

(రద్దు = కొట్టివేత, శాసనము = చట్టము, రచ్చ = గొడవ, మద్దతు = సహాయము, ఉద్యమ = లక్ష్యసాధన కోసం సామూహికంగా చేసే ప్రయత్నం, సమాగమము = కలయిక)

చట్టము రద్దు చేసే దాకా గొడవ వదిలిపెట్టని రైతు కోరికకు మద్దతును ఇచ్చి ఉద్యమ కూటములు ఎదిరించగా, హద్దులు మీరి వాళ్ళలా అల్లరి చేయడం చూచి అధికారులు వద్దని ఎంత మొత్తుకున్నా, తనంత తానుగా వచ్చే వాడే స్తుతిపాత్రుడు.

385. సమస్య: వన రాజుకు మూషికమ్ము వాహనమయ్యెన్

385.530 కం. కనరే బొమ్మల కొలువుల,
వన మందలి జంతు తతిని వరుసగ నరలన్,
కనరాదు జాతి వైరము,
వనరాజుకు మూషికమ్ము వాహన మయ్యెన్.

బొమ్మల కొలువులలో అడవిలో ఉండే జంతువుల సమూహాన్ని అరల్లో వరసగా చూడమా? బొమ్మలు కదా, జాతివైరము కనపడదు. సింహానికి ఎలుక వాహన మయ్యింది.

385.531 కం. కన భారీ కాయము, వా
హనమా చిన్నది తిరుగుగ, యప్పల రాజున్
గనగాఁ గలిగెను మది భా
వన, రాజుకు మూషికమ్ము వాహన మయ్యెన్.

చూడబోతే భారీ శరీరము, తిరగడానికి వాహనమేమో చిన్నది. అప్పలరాజుని చూస్తే మనస్సులో ఏమనిపించిందంటే, రాజుగారికి ఎలిక వాహనమయ్యిందని.

385.532 కం. మన జ్ఞానము పెంపారగఁ

గన, యజ్ఞాన మను మూషికమ్ము నణచిఁ గా
చిన, విఘ్న రాజు సంభా
వన, రాజుకు మూషికమ్ము వాహన మయ్యెస్.

మన జ్ఞానము పెరుగగా చూడడం కోసం, అజ్ఞానమనే ఎలికని అణచి వేసి రక్షించిన వినాయకుని సంభావన (దక్షిణ) ఏమిటంటే, ఆ విఘ్న రాజుకి ఎలిక వాహన మవ్వడమే.

386. సమస్య: వనమున నున్న వాడె సుఖవంతుడు వాస్తవ మెంచి చూచినస్

386.533 చం. మనమున స్వార్థమన్న దణు మాత్రము నంటని చెట్లుచేమలుస్
జనులకు హానిఁ జేతు మను శారుక ముండని వన్యజీవులుస్
యనుగలమైన యున్కి మన కబ్బునె పట్టణ మందుఁ? గన్కనే
వనమున నున్న వాడె సుఖవంతుడు వాస్తవ మెంచి చూచినస్.

(మనము = మనసు, స్వార్థము = స్వప్రయోజనము, అణుమాత్రము = మిక్కిలి చిన్నది, అంటు = తగులుకొను, శారుకము = క్రూరత్వము, వన్య = అడవిలో ఉండేవి, అనుగలము = అనుకూలము, ఉన్కి = ఉనికి, అబ్బు = ప్రాప్తించు, కన్క = కనుక, వనము = అడవి, వాస్తవము = సత్యము, ఎంచు = గణించు)

మనస్సులో కొంచెం కూడా స్వార్థము నాటుకొనని చెట్లు, చేమలు, ప్రజలకు కీడు కలిగిద్దామనే క్రూరత్వము ఉండనటువంటి వన్య ప్రాణులు, అనుకూలమైన వాతావరణము మనకి పట్టణంలో దొరుకుతుందా? అందుకనే నిజంగా చూస్తే అడవిలో ఉన్నవాడే సుఖవంతుడు.

387. సమస్య: వరలక్ష్మీవ్రతము జేయవలె పురుషు లిలస్

387.534 కం. పరిశుద్ధాత్మస్ వనితలు
వరలక్ష్మీ వ్రతముఁ జేయవలె, పురుషు లిలస్
తరుణుల భక్తిని స్వేచ్ఛను
పరిరక్షింప వలయు ప్రతిభావంతులుగా.

(పరిశుద్ధాత్మ = స్వచ్ఛమైన మనస్సు, పరిరక్షించు = కాపాడు, ప్రతిభావంతుడు = బుద్ధిశాలి)

స్వచ్ఛమైన మనస్సుతో స్త్రీలు వరలక్ష్మీ వ్రతము చేయాలి. లోకంలో పురుషులు స్త్రీల భక్తినీ, స్వచ్ఛనీ బుద్ధిశాలులుగా కాపాడాలి.

388. సమస్య: వర్షాకాలము వచ్చె గ్రీష్మము వలెన్ వైశాఖ మాసంబునన్

388.535 శా. శీర్షణ్యమ్మును బోలు సూర్యుని ధరాక్షేత్రంబుఁ జుట్టన్ వడిన్,
వర్షంబో మరి గ్రీష్మమో భువికి సంప్రాప్తం బగున్, వాటి యా
కర్షం బందున మార్పు వచ్చి యెడవే కాస్తంత హెచ్చౌటచే
వర్షాకాలము వచ్చె గ్రీష్మము వలెన్ వైశాఖ మాసంబునన్.

(శీర్షణ్యము = శిరస్త్రాణము, పోలు = సరితూగు, ధరాక్షేత్రము = భూమి, చుట్టు = ప్రదక్షిణించు, వడి = వేగము, గ్రీష్మము = వేడిమి, భువి = భూమి, సంప్రాప్తము = లభ్యము, ఆకర్షము = ఆకర్షణము, ఎడవు = దూరము, కాస్త = కొంచెము, హెచ్చు = అధికము, వర్షాకాలము = జూన్ సెప్టెంబరు నెలల మధ్యలో వచ్చే వానలు కురిసే కాలం, వైశాఖము = మే నెల సగం నుండి జూన్ నెల సగం వరకు ఉన్న నెల రోజులు, మాసము = నెల)

వైశాఖ మాసంలో ఎండ ఉండడంలో ఆశ్చర్యము లేదు. వర్షం రావడం మాత్రం వాతావరణ మార్పు వల్లే జరుగుతుంది. ఒక్కొక్కసారి ఎండా వానా రెండూ ఉంటాయి. ఇది సూర్యుడికీ భూమికీ మధ్య దూరం పెరగడం వల్ల జరుగుతుంది అని ఎక్కడో చదివినట్లు గుర్తు. శిరస్త్రాణం లాగా ఉండే సూర్యుణ్ణి భూమి వేగంగా ప్రదక్షిణం చెయ్యడం వల్ల భూమికి వర్షమో ఎండో లభిస్తుంది. వాటి పరస్పర ఆకర్షణలో మార్పు వచ్చి దూరం కాస్తంత పెరగడం చేత వైశాఖ మాసంలో ఎండ లాగా వర్షాకాలం వచ్చింది.

389. సమస్య: వలపులు వలదను వనితకు వలువలు నచ్చెన్

389.536 కం. చెలువుడు చూపెడు పైపై
వలపులు వలదను వనితకు వలువలు నచ్చెన్,
కలతలు మాన్పెద నటులే
చెలి కవి యిచ్చి యనెడు ప్రియు చేష్టల కేతా?

(చెలువుడు = ప్రియుడు, వలపు = ప్రేమ, వలువ = వస్త్రము, కలత = మనస్సులో ఆందోళనము, చేష్ట = చేత, ఏతు = లోపము)

ప్రియుడు చూపించే పైపై ప్రేమలు వద్దనే స్త్రీకి వలువలు నచ్చాయి, ప్రియురాలి చీకాకులు ఆ విధంగా మానిపిస్తాను అనుకునే ప్రియుడి చేతలకు లోటా?

390. సమస్య: వలలుని కళ వలన లలన వలసిన దరిసెస్

390.537 కం. వలచితి నను సింహబలుని
వలకట్టుచు కృష్ణ యాటపాకకుఁ బిలువస్
వలలోన యతడుఁ జిక్కగ
వలలుని కళ వలన లలన వలసిన దరిసెస్.

(వలచు = కామించు, సింహబలుడు = కీచకుడు, వలకట్టు = అనుకూలపఱచు, కృష్ణ = ద్రౌపది, ఆటపాక = నర్తనశాల, వలలుడు = భీముడు, కళ = నైపుణ్యము, లలన = స్త్రీ, వలయు = కావలసిన, అరియు = నశించు)

కామించాను అనే కీచకుణ్ణి అనుకూలపరుస్తూ ద్రౌపది నర్తనశాలకు పిలువగా అతడు ఆ వలలో చిక్కగా భీముడి నేర్పు వల్ల ఆమెకు కావలసినది నశించడం జరిగింది, అంటే కీచకుడు నశించాడు.

390.538 కం. నలకవ నలవున నెనయగ
సులభమగు నలవిఁ దెలియక సొలయికఁ గలిగెస్
నలత కిడు యశనము నరయు
వలలుని కళ వలన లలన వలసిన దరిసెస్.

(నలకవ = రోగము, అలవు = సామర్థ్యం, ఎనయు = ఎదిరించు, సులభము = తేలిక, అలవి = విధము, సొలయిక = నిస్త్రాణ, నలత = రోగము, ఇడు = ఇచ్చు, అశనము = భోజనము, అరయు = ఎరుగు, వలలుడు = వంటవాడు, కళ = నైపుణ్యము, లలన = విలాసవతియగు స్త్రీ, వలయు = కావలసిన, అరియు = తుడిచిపెట్టు)

దీన్ని సర్వ లఘు కందము అంటారు. రోగాన్ని సామర్థ్యంతో ఎదిరించే సులభమైన పద్ధతి తెలియక నిస్త్రాణ వచ్చింది. రోగానికి ఇచ్చే ఆహారము గురించి తెలిసిన వంటవాడి నేర్పు వలన విలాసవతియైన స్త్రీకి కావలసినది తుడిచిపెట్టుకుపోయింది, అంటే రోగం తుడిచిపెట్టుకుపోయింది.

391. సమస్య: వాక్సీనులు వాడకున్న వైరస్ దొలగుస్

391.539 కం. దీక్షగ డెబ్బది శాతము
వాక్సిను వాడు జను లుండ వగవగ నేలా!
యాక్షేపణగా నితరులు
వాక్సీనులు వాడ కున్న వైరస్ దొలగుస్.

పట్టుదలగా 70% జనాలు వాక్సిను (vaccine) వాడే వాళ్ళుండగా అభ్యంతరాలున్న మిగిలిన వారు వాక్సీనులు వాడకపోతేనేం? విచారించడం ఎందుకు? వైరస్ (virus) తొలగిపోతుంది.

391.540 కం. తక్షణ రోగ నిరోధక
రక్షణ శక్తికి కరోన లక్ష్యముగ యెదో
వాక్సినుఁ గావలె, యెట్టులు
వాక్సీనులు వాడ కున్న వైరస్ దొలగుస్?

కరోనాని లక్ష్యము చేసుకుని వెంటనే రోగ నిరోధక రక్షణ శక్తి కోసం ఏదో ఒక వాక్సిను కావాలి. వాక్సీనులు వాడకపోతే వైరసు ఎట్లా పోతుంది?

391.541 కం. వాక్సిను కోసముఁ జూడరు
రక్షణకై, ప్రజలు స్వాస్థ్య లక్ష్యము లందుస్
శిక్షితులు, యేమగు నిపుడు
వాక్సీనులు వాడ కున్న? వైరస్ దొలగుస్.

ప్రజలు ఆరోగ్యానికి సంబంధించిన లక్ష్యాలలో సుశిక్షితులు కావున రక్షణకై వాక్సిను కోసం ఎదురు చూడరు. వాక్సీనులు వాడకపోతే మాత్రం ఏమవుతుంది ఇప్పుడు? వైరస్ తొలగిపోతుందిలే.

391.542 కం. ఏ క్షణ మెటులుండు నొకో,
వాక్సీనులు వాడ కున్న? వైరస్ దొలగుస్
లక్షణముగ సూచించిన
వాక్సీనులు వాడి జనులు స్వస్థతఁ బొందస్.

వాక్సీనులు వాడకపోతే ఏ క్షణం ఎలా ఉంటుందో? లక్షణంగా చెప్పిన వాక్సీనులు వాడి ప్రజలు ఆరోగ్యవంతులయితే వైరస్ తొలగిపోతుంది.

392. సమస్య: వాగ్దేవిని గొల్చువాడు పండితుడగునా

392.543 కం. వాగ్ధాటి పదును పెట్టు వి
దగ్ధత కొరకై గురుకృపఁ దప్పదు, కాగా
వాగ్దుష్టయె తా నంబర
వాగ్దేవినిఁ గొల్చువాడు పండితు డగునా?

(వాగ్ధాటి = వాక్చాతుర్యము, పదును పెట్టు = చురుకుదనం పెంచు, విదగ్ధత = నేర్పు, వాగ్దుష్ట = చెడు మాట్లాడువాడు, అంబర వాగ్దేవి = ఆకాశవాణి)

వాక్చాతుర్యము పదును పెట్టే నేర్పు కోసం గురువు గారి దయ ఉండి తీరాలి. అది అలా ఉండగా, చెడు మాట్లాడువాడు, ఆకాశవాణిని సేవిస్తే, అంటే అనుసరిస్తే, పండితుడవుతాడా?

393. సమస్య: వాణీపుత్రుడు మాధవాత్మజుడనన్ ద్వైమాతురుండే కదా

393.544 శా. ధ్యానింపన్ యరుదెంచి వ్యాసునికి నీ దంతమ్ముతో భారతా
ఖ్యానమ్మున్ లిఖియించి తీవె సురగంగా వాహినీ జెచ్చెరన్,
మైనాకస్వస కాపలాకు శివునే మార్కొన్న, విఘ్నేశ! శ
ర్వాణీపుత్రు డుమాధవాత్మజుడనన్ ద్వైమాతురుండే కదా.

(ధ్యానించు = తలచుకొను, ఆఖ్యానము = పురాణ గ్రంథము, లిఖియించు = రాతకాడుగా ఉండుట, ఈవు = నీవు, సురగంగా = ఆకాశగంగ, వాహిని = నది, జెచ్చెర = వేగము, మైనాకస్వస = పార్వతి, కాపలా = కావలి, మార్కొను = ఎదిరించు, విఘ్నేశ = వినాయకుడా, శర్వాణి = పార్వతి, ఉమ = పార్వతి, ధవుడు = భర్త, ఆత్మజుడు = పుత్రుడు, ద్వైమాతురుడు = వినాయకుడు)

ఇద్దరు తల్లులకి, అంటే, పార్వతికి గంగకి ముద్దు బిడ్డడైన వినాయకుణ్ణి ద్వైమాతురుడు అంటారు. అందుకని, ఇద్దరు తల్లుల లక్షణాలు ఉన్నట్లుగా వినాయకుణ్ణి ఉద్దేశించి ఈ పద్యం వ్రాయడం జరిగింది. తలచినదే తడవుగా వచ్చి, వ్యాసుని కోసం నీ దంతంతో భారత పురాణాన్ని రాతకాడుగా ఆకాశగంగా నదీ వేగంతో నీవే రచించావు

(అందు కోసం ఒక దంతాన్ని పీకేశాడు కాబట్టి, వినాయకుణ్ణి ఏకదంతుడంటారు). పార్వతీదేవి కాపలా కాస్తూ, శివుణ్ణే ఎదిరించిన వినాయకా! పార్వతీ పుత్రుడన్నా, ఉమాదేవి భర్తయైన శివుని పుత్రుడన్నా ఇద్దరు తల్లుల బిడ్డే కదా.

394. సమస్య: వారెవ శబ్బాసు భేషు వహ్వాల్ చెలగెస్

394.545 కం. ఒరిమితో పణము గెలిచి
హేరంబుడు విఘ్నపతిగ హితవరి కాగా
జోరుగ కైలాసంబున
'వారెవ, శబ్బాసు, భేషు, వహ్వాల్' చెలగెస్.

(ఒరిమి = ఓర్పు, పణము = పందెము, హేరంబుడు = వినాయకుడు, హితవరి = ఇష్టుడు, జోరు = ఉత్సాహము, చెలగు = శబ్దించు)

ఓర్పుతో పందెం (కుమారస్వామితో ముల్లోకాలు ఎవరు ముందు చుట్టి వస్తారు అన్న విషయంలో పందెం) గెలిచి వినాయకుడు విఘ్నాలకి రాజై ఇష్టుడు కాగా, ఉత్సాహంతో కైలాసంలో 'వారెవ, శబ్బాసు, భేషు, వహ్వా లన్నవి శబ్దించెను.

394.546 కం. భారత దేశము స్వేచ్ఛా
మారుతమునుఁ బీల్చు వేళ, మాతర గీతం
బారభటముగ జనాళిని
'వారెవ, శబ్బాసు, భేషు, వహ్వాల్' చెలగెస్.

(మారుతము = వాయువు, మాతర గీతము = వందేమాతరమనే పాట, ఆరభటము = ఆటోపము, ఆళి = సమూహము, చెలగు = శబ్దించు)

వందేమాతర గీతం ఆటోపంగా భారత దేశం స్వతంత్ర పవనాలు పీల్చే వేళ జనసమూహంలో 'వారెవ, శబ్బాసు, భేషు, వహ్వా లన్నవి శబ్దించెను.

395. సమస్య: వాల మొకటె తక్కువ గద వసుధాత్మజకున్

395.547 కం. ఈలువున రావణుని క
శ్వాలముఁ జూపు న దశోక వాటిని సీతా?
శూలధర యుమా? మోసెడి
వాల మొకటె తక్కువఁ గద వసుధాత్మజకున్.

(ఈలువు = ధైర్యము, అశ్వాలము = తెల్లుగడ్డి, వాటి = ఉద్యానవనము, శూలధర = శూలమును ధరించినది, ఉమ = పార్వతి, వాలము = బెబ్బులి, వసుధాత్మజ = భూసుతయైన సీత)

ధైర్యంగా అశోకవనంలో రావణాసురుడికి తెల్లుగడ్డి చూపించింది సీతేనా? శూలమును ధరించిన పార్వతీదేవియా? వాహనమైన బెబ్బులి ఒక్కటే తక్కువ కదా, పుడమి పుత్రికయైన సీతకి.

396. సమస్య: వాల్మీకికి రాజమండ్రి వాసము గాదా

396.548 కం. ఆల్మగలు పిల్ల లందర
కల్మష బుద్ధులుగఁ జేయు కథ తెనిగించెన్,
తాల్మిని నన్న యను తెలుగు
వాల్మీకికి రాజమండ్రి వాసముఁ గాదా.

భార్యాభర్తలు పిల్లలందరినీ పాపాత్ములుగా చేయు కథను సహనంతో తెనిగించిన నన్నయ అనే తెలుగు వాల్మీకికి (సంస్కృతంలో వాల్మీకి ఆదికవియైతే తెలుగున నన్నయే ఆదికవి) నివాస స్థలం రాజమండ్రే కదా.

397. సమస్య: వాసముల గణించు వాడు హితుడు

397.549 ఆ.వె. అహితుడన యొకని గృహమునఁ గుడిచి యింటి
వాసముల గణించు వాడు, హితుడు
పొందిన యుపకృతి నెపుడు మరువక కృత
జ్ఞుడుగ మేలు సేయు బిడువు వెతుకు.

(అహితుడు = విరోధి, కుడుచు = తిను, హితుడు = ఆప్తుడు, ఉపకృతి = ఉపకారము, కృతజ్ఞుడు = చేసిన మేలు తలచువాడు, బిడువు = అవకాశము)

తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టే వాడు విరోధి. ఆప్తుడైన వాడు పొందిన ఉపకారాన్ని మర్చిపోక కృతజ్ఞుడుగా ఉంటూ మేలు చేసే అవకాశం వెతుకుతాడు.

398. సమస్య: విఘ్నంబగునని గణపతి భీతిం జెందెన్

398.550 కం. మగ్నుడయి కావలిని, మే
ఘాఘ్నిన్ జలకమ్ములాడు గౌరీ సతికిన్,
జఘ్నితొ శతఘ్ను రాకయె,
విఘ్నంబగునని గణపతి భీతిం జెందెన్.

(మగ్నుడు = మునిగినవాడు, కావలి = కాపలా, మేఘాఘ్ని = పసుపు, జఘ్ని = ఆయుధము లేక శూలము, శతఘ్నుడు = శివుడు, విఘ్నము = అంతరాయము)

పసుపుతో స్నానం చేసే గౌరీమాతకు కాపలాలో నిమగ్నుడైన వినాయకుడు శూలంతో శివుని రాక అంతరాయమని భయపడ్డాడు.

399. సమస్య: విధవా రమ్మనుచు భార్య విభునిం బిలిచెన్

399.551 కం. ఉదధి జిలికి వ్యథఁ గొనె ను
ర్వి, ధవా! రమ్మనుచు భార్య విభునిం బిలిచెన్
విధిగా గరళము మ్రింగగ,
మది నీశుని నమ్మి సర్వమంగళ యదియే.

(ఉదధి = సముద్రము, చిలుకు = మథించు, వ్యథ = బాధ, ఉర్వి = భూమి, ధవ = భర్త, విభుడు = మగడు, విధి = చేయవలసిన పని, గరళము = విషము, ఈశుడు = శివుడు, సర్వమంగళ = పార్వతి)

సముద్రాన్ని మథించి పుడమి బాధను కొనితెచ్చుకుంది, నీ ధర్మము అనుకొని విషము మ్రింగమని భార్య భర్తని రా రమ్మని పిలిచింది. మనస్సులో శివుని నమ్మిన పార్వతి ఆమెయే.

400. సమస్య: విపరీతప్రతిభాష లాడినపుడే విద్వాంసు డంచందురే

400.552 మ. అపరాధమ్ము నిరూపితం బవగ న్యాయస్థానముల్ సాక్షులన్
యపరాధిన్ బలు ప్రశ్నలేసి నిజమున్ యత్నించి చెప్పింతురే
శపథమ్మున్ గొని, న్యాయవాది నెపుడున్, సత్యంబుఁ జెప్పింపగన్
విపరీతప్రతిభాష లాడినపుడే విద్వాంసు డంచందురే.

(అపరాధము = నేరము, నిరూపితము = నిరూపింప బడినది, అపరాధి = నేరము చేసినవాడు, పలు = అనేక, విపరీత = విరుద్ధము, ప్రతిభాష = మాఱుమాట, విద్వాంసుడు = చదువుకొన్నవాడు)

నేరము నిరూపింపబడడానికి, న్యాయస్థానాలు సాక్షుల వద్ద, నేరం చేసిన వాడి వద్ద శపథము తీసుకొని అనేకమైన ప్రశ్నలేసి నిజాన్ని ప్రయత్నించి చెప్పిస్తారే. అలా నిజం చెప్పించడానికి విరుద్ధమైన మాఱుమాటలు మాట్లాడినపుడే వకీలుని ఎప్పుడూ చదువుకొన్నవాడు అని అంటారు.

401. సమస్య: విపరీతార్థము జెప్పి దెప్పిరి గదా వేంచేయు మన్నన్ బుధుల్

401.553 మ. శపథమ్ముల్ సభ లోనఁ జేసితిమి యీ సంవాస మిక్కానలో
జప మేలా యని భీముడున్ సతియు దోషం బెంచి ధర్మంబుకున్
విపరీతార్థముఁ జెప్పి దెప్పిరిఁ గదా, వేంచేయు మన్నన్ బుధుల్,
నృప! నిన్ వీడ మటంచుఁ జెప్పిరిఁ గదా నిశ్చేష్టు ధర్మేంద్రుకున్.

(శపథము = ప్రతిజ్ఞ, వనము = అడవి, సంవాసము = నివాసము, ఇక్కాన = ఈ అడవి, జపము = మంత్రావృత్తి, సతి = భార్య, దోషము = తప్పు, ఎంచు = గణించు, ధర్మము = న్యాయము, విపరీత = విరుద్ధము, దెప్పు = ఎత్తిపొడుచు, వేంచేయు = పోవు, బుధుడు = మేధావి, నృప = రాజు, వీడు = వదలిపెట్టు, నిశ్చేష్టుడు = చేష్టలు ఉడిగిన వాడు, ధర్మేంద్రుడు = ధర్మరాజు)

పాండవుల వనవాసానికి సంబంధించిన ఘట్టం ఇది. సభలో (కౌరవ) ప్రతిజ్ఞలు చేసి ఈ అడవిలో నివాసము జపము ఎందుకు అంటూ భీముడూ భార్యయైన ద్రౌపదియునూ ధర్మానికి విరుద్ధమైన అర్థము చెప్పి ఎత్తిపొడిచారు కదా, పొమ్మని అంటే పండితులు రాజా! నిన్ను వదలము అని చెప్పారు కదా, చేష్ట లుడిగిన ధర్మరాజుకు.

402. సమస్య: వీరు డెవడన్న నుత్తరు పేరుఁ దలతు

402.554 తే.గీ. విజయు డోటమి నెరుగడు, వీరుడ నని
కదనము నడుమఁ బారెను కర్ణుడు, యిక
మొన కడలి యని సలుపక మునుపెఁ బారు
వీరు డెవ డన్న నుత్తరు పేరుఁ దలతు.

(విజయుడు = అర్జునుడు, కదనము = యుద్ధము, నడుమ = మధ్య, పారు = పరుగెత్తు, మొన = సేన, అడలు = భయపడు, అని = యుద్ధము, సలుపు = చేయు, మునుపు = ముందు, తలచు = భావించు)

అర్జునుడు ఓటమిని ఎరుగడు. వీరుణ్ణని యుద్ధము మధ్యలో పారిపోయాడు కర్ణుడు. ఇంక, సైన్యాన్ని చూసి భయపడి యుద్ధం చేయక ముందే పరిగెత్తిన వీరుడు ఎవడు అంటే ఉత్తరుడి పేరు తలుచుకుంటాను.

403. సమస్య: వృశ్చిక పుచ్ఛంబు మీద వృషభము నుంచెన్

403.555 కం. నిశ్చల యను బాల పరిచె
నిశ్చితముగ ప్రతిమ లన్ని నేర్పుగ దసరా
కాశ్చర్య పరుప, నందున
వృశ్చిక పుచ్ఛంబు మీద వృషభము నుంచెన్.

(నిశ్చితముగ = నిశ్చయింపబడినట్లుగా, ప్రతిమ = బొమ్మ లేక విగ్రహము, వృశ్చిక = తేలు, పుచ్ఛము = తోక, వృషభము = ఎద్దు)

దసరాలకి బొమ్మల కొలువు పెట్టుకోవడం మన ఆచారం. నిశ్చల అనే పిల్ల అనుకున్నట్లుగా దసరాకి అందరినీ ఆశ్చర్య పరచడానికి బొమ్మలన్నీ నేర్పుగా పరిచింది. ఆ చేయడంలో, తేలు బొమ్మ తోక మీద ఎద్దు బొమ్మ నుంచింది.

404. సమస్య: వేపాకున్ గొని చేయు పచ్చడి నహో వేడ్కన్ భుజింపన్ తగున్

404.556 శా. వాపోయెన్ తన పేడిమూతి తననే పల్మారు క్రేణింప, సం
ప్రాపించెన్ కరి వేప పత్రముల గ్రావం బందు భీముండు యా

లోపంబుస్ సరిఁ జేయఁ, గోరెను పృథస్ రోకండ్లలో నూరి క
ర్వేపాకుస్ గొని చేయు పచ్చడి నహో వేడ్కస్ భుజింపస్ తగుస్.

(వాపోవు = ఆవేదనల్ని వ్యక్తంచేయు, పేడిమూతి = మీసాల్లేని ముఖం, పల్మారు = మాటిమాటికి, క్రేణించు = పరిహసించు, సంప్రాపించు = సంగ్రహించు, గ్రావము = కొండ, పృథ = కుంతీదేవి, రోకండ్లు = రోకలులు, నూరు = నలగఁగొట్టు)

భీముడికి మీసాలు మొలవ లేదని భారతంలో ఉంది. తన పేడిమూతి తననే వెక్కిరించగా వాపోయిన భీముడు, కొండ మీద కరివేపాకులను సంగ్రహించి, ఆ లోపాన్ని సరి చేయడానికి రోకళ్లలో కరివేపాకు తీసుకుని నూరి చేసే పచ్చడి ఇష్టంగా తినడం మంచిది కదా అని తల్లియైన కుంతీదేవిని కోరాడు.

405. సమస్య: వేపాకుల పచ్చడి తిన వేడ్క జనించెస్

405.557 కం. తాపమ్ము నడచి రుధిర
వ్యాపనము నదుపునఁ బెట్టి వాజినమున కు
ద్దీపన మగు నట్టిది, కరి
వేపాకుల పచ్చడి తిన వేడ్క జనించెస్.

(తాపము = వేడిమి, అడచు = పోగొట్టు, రుధిరవ్యాపనము = రక్త ప్రసరణము, అదుపు = నియంత్రణ, వాజినము = బలము, ఉద్దీపనము = పురికొల్పుట, వేడ్క = కుతూహలము)

వేడిని పోగొట్టి రక్త ప్రసరణము నియంత్రించి బలాన్ని పురిగొల్పేటటువంటి కరివేపాకుల పచ్చడి తినాలని కుతూహలము కలిగింది.

406. సమస్య: వేసమ్మె ప్రధానమగును వేదాంతులకుస్

406.558 కం. కాసులు నింపెడిది కపట
వేసమ్మె, ప్రధాన మగును వేదాంతులకుస్
యాశల వీడుచు సత్యా
న్వేషణపై శ్రద్ధ యుంచి వేడుట ప్రభునిస్.

కపట వేషము ధనం నింపుతుంది. ఆశలను వదిలిపెట్టి సత్యాన్వేషణ మీద శ్రద్ధ ఉంచి భగవంతుని ప్రార్థించడమే జ్ఞానులకు ముఖ్య మవుతుంది.

407. సమస్య: వ్యాసుడు తెలుగునను వ్రాసె భాగవతమ్ముస్

409.559 కం. భాసురముగ నొక యభినవ
వ్యాసుడు తెలుగునను వ్రాసె భాగవతమ్ముస్,
యా సహజ కవియె పోతన,
కాసుల కమ్మక కవితకు గౌరవ మిచ్చెస్.

(భాసురము = ప్రకాశించునది, అభినవ = నవీన, కాసు = ధనము)

వెలిగిపోయే విధంగా ఒక క్రొత్త వ్యాసుడు తెలుగులో భాగవతం వ్రాశాడు. ఆ సహజ కవియే పోతన. ధనం కోసం అమ్మకుండా, కవిత్వానికి గౌరవ మిచ్చాడు.

408. సమస్య: శంకరు డెత్తె వెండిమల శైలతనూభవ సంభ్రమింపగస్

408.560 ఉ. చంకురమైన పుష్పకము శంకరవాసము పైని యాగగా,
శంకితు డౌచు నంది తగు సాకునుఁ జెప్పగ క్రుద్ధమూర్తియై,
లంక నృపాలమౌళి యగు రావణు డుగ్ర విరోధి గర్వ నా
శంకరు డెత్తె వెండిమల శైలతనూభవ సంభ్రమింపగస్.

(చంకురము = విమానము, శంకరవాసము = కైలాసగిరి, ఆగు = నిలిచిపోవు, శంకితుడు = సందేహము గలవాడు, తగు = యుక్తమగు, సాకు = కారణము, క్రుద్ధమూర్తి = కోపానికి ప్రతిరూపమై, లంకనృపాలమౌళి = లంక రాజులలో శ్రేష్ఠుడు, ఉగ్ర = భయంకరమైన, విరోధి = శత్రువు, గర్వము = అహంకారము, నాశంకరుడు = నాశనము చేయువాడు, వెండిమల = వెండికొండ, శైలతనూభవ = పార్వతి, సంభ్రమించు = తత్తరపడు)

పుష్పక విమానము కైలాసగిరి పైన నిలిచిపోగా, సందేహము గలవాడవ్వగా నంది సరియైన కారణము చెప్పగా, కోపంతో లంక రాజులలో శ్రేష్ఠుడైన రావణుడు, భయంకరులైన శత్రువుల గర్వమును నాశనం చేసే వాడు కైలాస శిఖరాన్ని పార్వతి తత్తరపడగా ఎత్తాడు.

409.   సమస్య: శంకరుఁ డుద్ధతిం బఱపె సాయకకోటిని రామచంద్రుపై

409.561   ఉ. జంకునుఁ గొల్వుఁ బోరున వెసన్ దశకంఠుడు శత్రు ధైర్య నా
శంకరుఁ డుద్ధతిం బఱపె సాయకకోటిని రామచంద్రుపై
లంక నృపాలు శౌర్యమును రాము డెదుర్కొని యస్త్ర వృష్టితో
బింకము రూపు మాపి యటు పిమ్మట సీతనుఁ గాచె గ్రక్కునన్.

(జంకు = భయము, కొల్వు = పురికొలుపు, పోరు = యుద్ధము, వెస = వేగము, దశకంఠుడు = రావణుడు, ధీరుడు = ధైర్యము గలవాడు, నాశంకరుడు = నాశనము చేయువాడు, ఉద్ధతి = గర్వము, పరపు = ప్రయోగించు, సాయక = బాణము, కోటి = సమూహము, నృపాలుడు = రాజు, శౌర్యము = పరాక్రమము, ఎదుర్కొను = ఎదిరించు, అస్త్రము = మంత్ర ప్రయోగాదులవలన శక్తినొంది శత్రు సంహారము చేయు బ్రహ్మాస్త్రాదికము, వృష్టి = వర్షము, బింకము = గర్వము, రూపుమాపు = నాశముచేయు, అటు పిమ్మట = ఆ తరువాత, కాచు = రక్షించు, గ్రక్కున = శీఘ్రముగా)

భయము కలిగించడానికి యుద్ధంలో వేగంగా శత్రువుల ధైర్యాన్ని నాశనము చేసేవాడైన రావణుడు దర్పంతో రామచంద్రుడి మీద బాణసమూహము ప్రయోగించాడు. లంకాధిపతి పరాక్రమాన్ని రాముడు ఎదిరించి అస్త్రవర్షంతో గర్వాన్ని నాశనం చేసి, ఆ తర్వాత వెంటనే సీతను రక్షించాడు.

410.   సమస్య: శంకరునకు తోక కలదు చర్చింపంగన్

410.562   కం. లంకిణి నడచిన భక్తవ
శంకరునకు తోక కలదు, చర్చింపంగన్
శంకయె, హనుమ యతండే,
శంకరు యవతార మతడు, సామీరి కనన్.

(అడచు = అణచు, భక్తవశంకరుడు = భక్తులకు వశమయ్యేవాడు, సామీరి = వాయుపుత్రుడు)

లంకిణిని అణచిన భక్తవశంకరునకు తోక ఉంది. విచారణ చేయడానికి ఏమన్నా సందేహమా? అతడు హనుమంతుడే. శంకరుని అవతారమైన వాయుపుత్రుడు.

411. సమస్య: శనికిన్ భయ మంద నట్టి చతురుం డితడే

411.563 కం. సనతు సుతుడనె కపి వరూ
ధిని తోడ హనుమనుఁ జూపి, ధీమంతుడు, యం
బునిధిని దాట ప్రవరుడు, య
శనికిన్ భయ మంద నట్టి చతురుం డితడే.

(సనతు సుతుడు = బ్రహ్మ కుమారుడైన జాంబవంతుడు, కపి వరూధిని = వానర సైన్యము, ధీమంతుడు = విద్వాంసుడు, అంబునిధి = సముద్రము, ప్రవరుడు = మేటి, అశని = వజ్రాయుధము, చతురుడు = సమర్థుడు)

బ్రహ్మ కుమారుడైన జాంబవంతుడు హనుమను జూపించి వానర సైన్యంతో అన్నాడు. విద్వాంసుడు, సముద్రాన్ని దాటగల మేటి, వజ్రాయుధానికి భయపడని సమర్థుడు ఇతడే.

411.564 కం. తన పని తా నొనరించుట
కనేకలోచనుఁ గొలుతురె? యద్రిని కొలువం
డనె శ్రీకృష్ణుడు, ప్రేనా
శనికిన్ భయ మంద నట్టి చతురుం డితడే.

(ఒనరించు = చేయు, అనేకలోచనుడు = ఇంద్రుడు, అద్రి = కొండ (గోవర్ధన గిరి), ప్రేనాశని = ఇంద్రుడు, వజ్రాయుధము, చతురుడు = సమర్థుడు)

తన పని తాను చేయడానికి ఇంద్రుని పూజిస్తారా? కొండని (గోవర్ధన గిరిని) పూజించండని శ్రీకృష్ణు డన్నాడు. ఇంద్రుడికి భయపడని సమర్థు డితడే.

411.565 కం. శనిపూజను నా పేరిట
నొనరింపగ ధనము లేదు, యుండిన శని యుం
డునె, యను పేదనుఁ గనమే,
శనికిన్ భయ మందనట్టి చతురుం డితడే.

నా పేరు మీద శనిపూజ చేయించడానికి ధనం లేదు, ఉంటే శని ఉంటుందా అనే పేదవాణ్ణి చూడమా. శనికి భయపడని నేర్పరి అతడే.

412. సమస్య: శరతల్పమ్ము్మన పవ్వళించుము సఖీ చల్లార్చెదన్ దాపమున్

412.566 మ. భరియింపన్ దలమే యచేతనునిగా భాస్వంతు రామున్ గనన్
శరతల్పమ్మున, పవ్వళించుము సఖీ చల్లార్చెదన్ దాపమున్,
మరణించెన్ యని నమ్మ వద్దు, వదనం బందున్ ప్రభల్ గాంచుమా,
మఱపే యంచు మహీసుతన్ త్రిజట సంభాళించె వాక్రుచ్చుచున్.

(భరియించు = భరించు, తలము = శక్యము, అచేతనుడు = చైతన్యం లేని వాడు, భాస్వంతుడు = శూరుడు, కను = చూచు, శరతల్పము = అమ్ముల శయ్య, పవ్వళించు = శయనించు, సఖి = స్నేహితురాలు, తాపము = బాధ, వదనము = ముఖము, ప్రభ = వెలుగు, కాంచు = చూచు, మఱపు = మూర్ఛ, మహీసుత = సీత, త్రిజట = లంకలో సీతకు కాపలాగా ఉన్న విభీషణుని కూతురు, సంభాళించు = ఓదార్చు, వాక్రుచ్చు = చెప్పు)

శూరుడైన శ్రీరాముణ్ణి అచేతనుడిగా అంపశయ్య మీద చూచి భరించడం శక్యమా! సఖీ! శయనించుము, నీ బాధ చల్లారుస్తాను, మరణించాడని నమ్మవలదు, ముఖంలో వెలుగు చూడుము, మూర్ఛ యని చెబుతూ సీతను త్రిజట ఓదార్చింది.

413. సమస్య: శవ పూజ సలుప శుభమని శాస్త్రము తెలుపున్

413.567 కం. భువనంబుల నియమంబులు
నవనముఁ జేయగ, యిరువది నాలుగు నామా
లవిరతముగఁ దలచుచు, కే
శవ పూజ సలుప శుభమని శాస్త్రము తెలుపున్.

(భువనము = జగము, నియమము = ఏర్పాటు, నవనము = స్తోత్రము, అవిరతము = విరామము లేకుండా)

కేశవ నామాలు 24 ఉన్నాయి. భువనాల నియమాలను స్తోత్రము చేయడానికి 24 నామాలు తలుచుకుంటూ విరామము లేకుండా కేశవ పూజ చెయ్యడం మంచిదని శాస్త్రం చెబుతోంది.

414. సమస్య: శవ విభవము గాంచి వణకె శక్రుడు భీతిన్

414.568 కం. ఇవకయు జడివానఁ గురియ,

యవలీలగ గిరిని యుంచి యంబరమున, యా
దవులనుఁ గాచిన, యా శై
శవ విభవముఁ గాంచి వణకె శక్రుడు భీతిన్.

(ఇవక = చలి లేక శైత్యం, జడివాన = నానుడువాన, అవలీలగ = సులభముగా, అంబరము = ఆకాశము, శైశవ = బాల్యము, విభవము = ఉన్నతి, శక్రుడు = ఇంద్రుడు, భీతిన్ = భయముతో)

చలితో పాటు జడివాన కురియగా, సులభంగా పర్వతాన్ని (గోవర్ధన గిరిని) ఆకాశానికి ఎత్తి యాదవులను రక్షించిన, ఆ బాలుని (కృష్ణుని) ఉన్నతి చూసి భయంతో ఇంద్రుడు వణికాడు.

415. సమస్య: శవము దటాలునను లేచె సంతస మెసఁగన్

415.569 కం. శివశంకరి పామరునకు
రవళింపగ బీజమంత్ర రావము నాల్కన్
కవియైన కాళి, శ్లోకా
శవముఁ దటాలునను లేచె సంతస మెసఁగన్.

(శివశంకరి = పార్వతి, పామరుడు = అజ్ఞుడు, రవళించు = మ్రోగించు, బీజమంత్రము = మంత్రముగా ఏర్పడు వర్ణము లేక వర్ణసముదాయము, రావము = ధ్వని, ఆశవము = ఆశుత్వము, తటాలున = అకస్మాత్తుగా, సంతసము = సంతోషము, ఎసగు = ఉప్పొంగు)

పార్వతీదేవి పామరుడికి నాలుక మీద బీజ మంత్రాల ధ్వని మ్రోగింపజేయగా, కవిగా మారిన కాళిదాసు శ్లోకాల వేగము, సంతోషం ఉప్పొంగించడానికి, అకస్మాత్తుగా పెరిగింది.

416. సమస్య: శాంతి సతతమ్ము దుర్జన సౌఖ్యదమ్ము

416.570 తే. గీ. ఇరుగు పొరుగు దేశములతో యీప్సితమ్ము
శాంతి సతతమ్ము, దుర్జన సౌఖ్యదమ్ము
యట్టి శాంతికి యాటంక మనిశ ముండ,
పూర్వ తప్పిదములఁ బోచిఁ బోరుచుండ.

(ఈప్సితము = వాంఛితము, సతతము = అనిశము = ఎల్లప్పుడు, వోచు = పరిగణించు)

ఇరుగు పొరుగు దేశాలతో ఎప్పుడూ శాంతి వాంఛించదగినది. దుష్టులకు సుఖాన్ని ఇచ్చేది ఏమిటంటే, అటువంటి శాంతికి ఎప్పుడూ భంగము ఉండి, వెనక చేసిన తప్పులని తలుచుకుని కలహిస్తూ ఉండడం.

417. సమస్య: శిల్పము శూన్యమైన యెడ చెన్నుగ సాహితి ద్యుమ్న మొందదే

417.571 ఉ. జల్ప సమానమైన వినఁజాలని కైతలె పుట్టు సంస్కృతిన్
శిల్పము శూన్యమైన యెడ, చెన్నుగ సాహితి ద్యుమ్న మొందదే
కల్పిత గాథ లన్నిటిని క్రన్ననఁ గూర్చి ప్రబంధరాజ మా
కల్పముఁ జేయు పండితుల కావ్య పిపాసను ప్రోత్సహించినన్.

(జల్పము = ఉపయుక్తముకాని మాట, కైత = కవిత్వము, సంస్కృతి = నాగరికత, శిల్పము = స్వరూపము, చెన్ను = అందము, ద్యుమ్నము = బలము, కల్పితము = ఊహింపబడినది, గాథ = చరిత్రము, క్రన్నన = శీఘ్రముగా, కూర్చు = జతపఱచు, ప్రబంధము = కావ్యము, రాజము = శ్రేష్ఠార్థవాచకము, ఆకల్పము = కల్పనము, పిపాస = దప్పిక, ప్రోత్సహించు = ప్రేరేపించు)

నాగరికతలో స్వరూపము అనేది లేక పోతే పనికిరాని మాట వంటి వినలేని కవిత్వాలే పుడతాయి. ఊహాత్మకమైన చరిత్రము లన్నిటినీ శీఘ్రముగా జతపరచి కావ్యరాజమును సృష్టించే పండితుల కావ్యదాహాన్ని ప్రేరేపిస్తే సుందరంగా సాహిత్యము బలాన్ని పుంజుకోదా.

418. సమస్య: శిల్పి వశీకృతార్థ కళ శీఘ్ర ఫలార్థము నీయ దెన్నడున్

418.572 ఉ. శిల్ప కళన్న శాస్త్రము, విశిష్ట విదగ్ధత కోరు నెప్పుడున్,
వేల్పులు, భిన్న సంస్కృతులు, ప్రేరణ నిచ్చు చరిత్ర ఘట్టముల్
కల్పన చేయుటన్న బహు కాలము పట్టును, కష్టసాధ్యమౌ,
శిల్పి వశీకృతార్థ కళ శీఘ్ర ఫలార్థము నీయ దెన్నడున్.

(శాస్త్రము = గమనించిన విషయములను క్రోడీకరించి విషయతత్వ నిర్ణయముచేసి సూత్రముల నిర్మించి ధర్మముల నుగ్గడించినది, విశిష్ట = మిక్కిలి ప్రధానమైనది, విదగ్ధత = నేర్పు, వేల్పు = దేవత, భిన్న = వేరైన, సంస్కృతి = నాగరికత, ప్రేరణ = ఉత్తేజ పరచుట, ఘట్టము = సందర్భము, కల్పన = ఊహించి రచించు,

వశీకృతము = అధీనము గావింపబడినది, అర్థము = నిమిత్తము లేక వివరణము, శీఘ్ర = త్వరితముగ, ఫలము = ఫలితము)

శిల్ప కళంటే శాస్త్రం. ప్రత్యేకమైన నేర్పును ఎప్పుడూ కోరుతుంది. దేవతలు, వేర్వేరు నాగరికతలు, ఉత్తేజపరిచే చరిత్రాంశాలు కల్పించడం అంటే చాలా కాలం పడుతుంది. కష్టంతో మాత్రమే సాధ్యమవుతుంది. శిల్పి అధీనం నిమిత్తము ఉన్న కళ, ఫలితము యొక్క అర్థాన్ని ఎప్పుడూ త్వరగా ఇవ్వదు.

419. సమస్య: శివ ఫాలాక్షంబు గురిసె శీతల వృష్టిన్

419.573 కం. నివుఱున లింగముఁ గన్నడ,
తివురుచు పుకిలించి కడుగ తిన్నడు భక్తిన్,
ప్రవిభాసిలుచున్ గరుణన్
శివ ఫాలాక్షంబుఁ గురిసె, శీతల వృష్టిన్.

(నివుఱు = బూడిద, లింగము = పానవట్టముమీది శివమూర్తి, కన్నడు = కనిపించు, తివురు = త్వరపడు, పుకిలించు = పుక్కిలించు, కడుగు = ప్రక్షాళించు, ప్రవిభాసిలు = ప్రకాశించు, కరుణ = దయ, ఫాలము = నుదురు, అక్షము = కన్ను, శీతల = చల్లని, వృష్టి = వాన)

బూడిదలో శివలింగము కనిపించగా, త్వరపడి పుక్కిలించి దాన్ని తిన్నడు భక్తితో ప్రక్షాళన చేయగా, ప్రకాశిస్తూ దయతో శివుని నుదుటి మీద ఉన్న మూడవ కన్ను చల్లని వాన కురిపించింది.

419.574 కం. కువలయ శరుపై యగ్నిని
శివ ఫాలాక్షంబుఁ గురిసె, శీతల వృష్టిన్
భవు జట గంగా నదిగా
భువిపై కొదిలె, కసి కృపల పొందటు లుండున్.

(కువలయశరుడు = ఉత్పలము బాణముగా కలవాడైన మన్మథుడు, ఫాలము = నుదురు, అక్షము = కన్ను, శీతల = చల్లని, వృష్టి = వాన, భవుడు = శివుడు, జట = అల్లుకొనినజుట్టు, భువి = భూమి, కసి = కోపము, కృప = దయ, పొందు = అభేదము)

శివుని నుదుటిపైని కన్ను మన్మథునిపై నిప్పును కురిపించింది. శివుని జటాజూటము చల్లని వర్షాన్ని గంగా నదిగా భూమిపైకి వదిలింది. కోపము దయల అభేదము అలాగే ఉంటుంది.

420. సమస్య: శివుని తోడ్కొని చనె చంద్రశేఖరుండు

420.575 తే.గీ. పాల సంద్రముఁ జిలుకగ వచ్చె విషము,
వేగ జగతిని కాపాడ, విష్ణుమూర్తి
శివుని తోడ్కొని చనె, చంద్రశేఖరుండు
విషము తన కంఠమున నుంచి వెతలుఁ దీర్చె.

(సంద్రము = సముద్రము, వేగ = త్వరగా, తోడ్కొని = వెంటబెట్టుకొని, వెత = దుఃఖము)

పాల సముద్రము చిలుకినపుడు విషము పుట్టగా, త్వరితగతిని జగత్తును కాపాడడానికి విష్ణుమూర్తి శివుణ్ణి వెంటబెట్టుకుని వెళ్ళాడు. శివుడు విషాన్ని తన కంఠములో ఉంచుకుని బాధలు తీర్చాడు.

421. సమస్య: శిశువులె తలిదండ్రులైన సిరి సంపదలే

421.576 కం. పసితన మాదిగ శిక్షణ
విశదముగాఁ బొందుచు, గురు విన్నాణము స్వా
తిశయము విచక్షణముఁ గల
శిశువులె, తలిదండ్రులైన సిరి సంపదలే.

(శిక్షణ = అభ్యాసం, విశదము = స్పష్టమయినది, గురు = గొప్పది, విన్నాణము = నేర్పు, స్వాతిశయము = స్వాభిమానము, విచక్షణము గల = దూరదృష్టి గల)

పసితనం నుండి బాగా శిక్షణ పొందుతూ, గొప్ప నేర్పు, స్వాభిమానము, దూరదృష్టి గల పిల్లలే తల్లిదండ్రులైతే సిరిసంపదలు వెల్లివిరుస్తాయి.

422. సమస్య: శిష్టుల వేధించె ధర్మశీలుండకటా

422.577 కం. దుష్టుడు నరకుడు జగతిని

శిష్టుల వేధించె, ధర్మశీలుం డకటా
ద్రష్టయగు కృష్ణు డట్టి ని
కృష్టసుతునిఁ బట్టి దునిమె, కృపఁ జూపకయే.

(దుష్టుడు = దుర్మార్గుడు, శిష్టుడు = సదాచార సంపన్నుడు, ధర్మశీలుడు = ధర్మమే శీలముగా కలవాడు, ద్రష్ట = చూచే సాక్షి, నికృష్ట = నీచుడైన, తునుము = చంపు)

దుర్మార్గుడైన నరకాసురుడు లోకంలో సదాచార సంపన్నులను బాధిస్తున్నాడని, ధర్మశీలుడూ జగత్సాక్షియైన కృష్ణుడు అటువంటి నీచుడైన పుత్రుని, దయ చూపకయే, అయ్యో, సంహరించాడు.

423. సమస్య: శునకమ్మయ్యెను విష్ణుదేవుడు సురస్తోమమ్ము కీర్తింపగన్

423.578 మ. తన మాహాత్మ్యముఁ గన్గొనన్ గదియ నుత్కంఠన్ త్రిమూర్తుల్, సతీ
యనసూయే బదిలించె బాలలుగ తా నాహారమున్ బెట్టగా,
తన కోర్కెన్ గమనించి వారిడగ, దత్తాత్రేయుడౌ విష్ణు యం
శున కమ్మయ్యెను, విష్ణుదేవుడు సురస్తోమమ్ము కీర్తింపగన్.

(మాహాత్మ్యము = మహిమ, కన్గొను = చూచు, కదియు = దగ్గరకు వచ్చు, ఉత్కంఠ = ఇష్టవస్తు ప్రాప్తికై పడు వేగిరపాటు, త్రిమూర్తులు = బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, సతి = పతివ్రత, బదిలించు = మార్చు, ఇడు = ఇచ్చు, విష్ణు యంశుడు = విష్ణువు అంశతో పుట్టిన వాడు, స్తోమము = సమూహము, కీర్తించు = స్తుతించు)

తన మహిమను చూడడానికి ఉత్కంఠతో త్రిమూర్తులు సమీపించగా, సతీ అనసూయ వాళ్ళని బాలలుగా మార్చి ఆహారం పెట్టగా, తన కోరికను తెలుసుకొని వాళ్ళు ఇవ్వగా, విష్ణువు మరియు దేవతల సమూహము తన్ను కీర్తించగా, విష్ణువు అంశ ఉన్నటువంటి దత్తాత్రేయునికి అమ్మ అయ్యింది.

424. సమస్య: శూద్రులు లేకున్న మీకు శుభములు యేవీ

424.579 కం. భద్రతకై ప్రభవించె ధ
రిత్రిని నాల్గు తరగతుల వృత్తులు మున్నే,
క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్యులు,
శూద్రులు లేకున్న, మీకు శుభములు యేవీ?

(భద్రత = నిర్భయముగా నుండుట, ప్రభవించు = పుట్టు, మున్ను = పూర్వము)

పూర్వమే, భద్రత కోసం భూమిపై నాలుగు తరగతుల వృత్తులు పుట్టాయి. క్షత్రియ, బ్రాహ్మణ, వైశ్య, శూద్రులు లేకుండా ఉంటే మీకు మంచి యోగాలు ఎక్కడుంటాయి?

425. సమస్య: శృంగారము శ్రుతిని మించ సిగ్గిలె సతియుస్

425.580 కం. శృంగార కీర్తనల క్షణ
భంగురమగు లోకవిదిత బంధము లుండస్,
రంగముపై పాడుమనగ,
శృంగారము శ్రుతిని మించ, సిగ్గిలె సతియుస్.

(క్షణభంగురము = అశాశ్వతము, లోకవిదిత = లోకానికి తెలిసిన, రంగము = రంగస్థలము, శ్రుతిమించు = మితిమీఱు, సిగ్గిలు = సిగ్గు పడు, సతి = స్త్రీ)

శృంగార కీర్తనలలో అశాశ్వతమైన లోకానికి తెలిసిన సంబంధాలు ఉండడం వల్ల రంగస్థలము మీద పాడమంటే, శృంగారము మితిమీఱడం చేత, అమ్మాయి కూడా సిగ్గు పడింది.

426. సమస్య: శ్రీమతి కుందగ నిరతము శ్రేయం బమరుస్

426.581 కం. హైము డనె, సుతుని చావుకు
శ్రీమతి కుందగ, నిరతము శ్రేయం బమరు
న్నీ మర్త్యమునకు, యేనుగు
మోమున మని విఘ్నపతిగ ముదమిడ నితడే.

(హైముడు = శివుడు, శ్రీమతి = భార్య, కుందు = దుఃఖించు, నిరతము = ఎల్లప్పుడు, శ్రేయము = శుభము, అమరు = సిద్ధించు, మర్త్యము = ప్రపంచము, మోము = ముఖము, మను = జీవించు, విఘ్నపతి = అంతరాయములను నియంత్రించువాడు, ముదము = సంతోషము, ఇడు = ఇచ్చు)

కుమారుడి మరణానికి భార్య దుఃఖించగా, ఇతడే ఏనుగు ముఖంతో జీవించి విఘ్నపతిగా అనందం ఇస్తే, ఎల్లప్పుడు ప్రపంచానికి శుభము కలుగుతుంది అని శివుడు అన్నాడు.

427. సమస్య: శ్రీరాముని పెద్దభార్య సీతకు మ్రొక్కెన్

427.582 కం. 'వేరేమి? రాజధర్మమె
శ్రీరాముని పెద్దభార్య', సీతకు మ్రొక్కెన్
ఘోరాటవి నామె విడచి,
యూరటకై యిటులఁ జెప్పి యూర్మిళ ధవుడే.

(రాజధర్మము = విధివత్తుగా రాజు చేయవలసిన పని, ఘోర = భయంకరమైన, అటవి = అడవి, ఊరట = నిరుత్సాహ సమయంలో కలిగే ఉపశమనం, ధవుడు = భర్త)

వేరేమున్నది? రాజధర్మమే శ్రీరాముని పెద్ద భార్య. భయంకరమైన అడవిలో సీతను వదిలిపెట్టి, ఆమెకు ఊరట కోసం ఈ విధంగా చెప్పి ఊర్మిళ భర్తయైన లక్ష్మణుడు సీతకు నమస్కారము చేశాడు.

428. సమస్య: శ్రీశ్రీకిన్ విశ్వనాథ శిష్యుండయ్యెన్

428.583 కం. అశ్రువు కారును శ్రమఁ గన
శ్రీశ్రీకిన్, విశ్వనాథ శిష్యుం డయ్యెన్
యశ్రమముగ కవి యగుటకు,
యాశ్రయుడగు చెళ్ళపిళ్ళ యభిమత ముండన్.

(అశ్రువు = కన్నీరు, కారు = స్రవించు, శ్రమ = కష్టము, కను = చూచు, అశ్రమము = శ్రమలేకుండా సులభముగా, ఆశ్రయుడు = పోషకుడు, అభిమతము = సమ్మతి)

శ్రమని చూస్తే శ్రీశ్రీ మహాకవికి కన్నీరు కారుతుంది. శ్రమ లేకుండా కవి అవడానికి పోషకుడైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి సమ్మతి ఉండటం వల్ల విశ్వనాథ సత్యనారాయణ గారు శిష్యుడయ్యాడు.

429. సమస్య: శ్వశురుని గోరె సాధ్వి స్తన వస్త్రము తానె త్యజించి అద్దిరా

429.584 చం. అశనముఁ బెట్టు బిత్తలిగ యంచనసూయ ననన్, త్రిమూర్తులన్
వశమున నుంచె తాను చనుఁబాలనుఁ బట్టగ, భేలుడై యయు
గ్మశరుడుఁ జూడ, పాపలుగ మారు డటంచు శివున్, శలున్, రతీ

శ్వశురునిఁ గోరె, సాధ్వి స్తన వస్త్రము తానె త్యజించి, అద్దిరా!

(అశనము = భోజనము, బిత్తలి = దిసమొలది, అనసూయ = అత్రి మహాముని భార్యయైన అనసూయ, అను = అని యడుగు, త్రిమూర్తులు = బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, వశము = స్వాధీనము, భేలుడు = అవివేకి, అయుగ్మశరుడు = మన్మథుడు, పాప = శిశువు, మారు = వేఱురూపమగు, శలుడు = బ్రహ్మ, రతీశ్వశురుడు = రతీదేవి మామగారైన విష్ణుమూర్తి, కోరు = కాంక్షించు, సాధ్వి = పతివ్రత, స్తనవస్త్రము = రవిక, త్యజించు = విడుచు, అద్దిరా = భళిరా)

దిసమొలగా భోజనం పెట్టమని అత్రి మహాముని భార్యయైన అనసూయను అడుగగా, తాను చనుబాలను పట్టడానికి త్రిమూర్తులను వశంలో ఉంచుకుంది. భళిరా! అవివేకియై మన్మథుడు చూడగా, ఆ పతివ్రత తనకు తానుగా రవిక విప్పి శివుణ్ణి, బ్రహ్మని, మన్మథుని భార్యయైన రతీదేవి మామగారైన విష్ణువును శిశువులుగా మారమని కోరింది.

430. సమస్య: షట్పద శింజినీ జనిత సాయక పంక్తికి నింతు లోర్తురే

430.585 ఉ. రాట్పడు నంచు సత్య సమరమ్మున రాదగ దంచు కృష్ణునిన్
రాట్పడఁ జేసి భూసుతుని రాణనుఁ జూపుచు దారుకుం డనెన్
త్విట్పతి తేజ! కంబుధర! ప్రేతల చిత్తము వంటి తమ్మికిన్
షట్పద! శింజినీ జనిత సాయక పంక్తికి నింతు లోర్తురే.

(రాట్పడు = ఇబ్బందిపడు, సమరము = యుద్ధము, భూసుతుడు = నరకాసురుడు, రాణ = విజృంభణము, దారుకుడు = కృష్ణుని సారథి, త్విట్పతి = సూర్యుడు, కంబుధర = శంఖమును ధరించిన శ్రీకృష్ణా, ప్రేత = గోపిక, చిత్తము = మనస్సు, తమ్మి = పద్మము, షట్పదము = తుమ్మెద, శింజినీ = వింటినారి, జనిత = పుట్టింప బడినది, సాయక = బాణము, పంక్తి = సమూహము, ఇంతి = వనిత, ఓర్చు = సహించు)

ఇబ్బంది పడుతుంది, సత్యభామ యుద్ధానికి రాదగినది కాదు అని కృష్ణుణ్ణి ఇబ్బంది పెట్టి, నరకాసురుడి విజృంభణము చూపిస్తూ కృష్ణుని సారథియైన దారుకుడు ఇలా అన్నాడు: "ఓ, సూర్యతేజా! శంఖధరుడవైన శ్రీకృష్ణా, గోపికల మానసము వంటి పద్మానికి తుమ్మెదయైన వాడా! వింటినారి నుండి విడువబడిన బాణసమూహాన్ని స్త్రీలు ఓర్చుకోగలరా?"

431. సమస్య: సంక్రాంతిని భోగి కనుమ సంభ్రమ మొందన్

431.586 కం. సంక్రమిత వ్యథను వేడగ
సంక్రాంతిని భోగి, కనుమ! సంభ్రమ మొందన్
చంక్రమణఁ జేయు గంగ క
లంక్రియ భాగీరథి యను లక్ష్మణమె సుమా!

(సంక్రమిత = లభించిన, వ్యథ = బాధ, వేడు = ప్రార్థించు, భోగి = రాజు, కను = చూడు, సంభ్రమము = తొట్రుపాటు, ఒందు = పొందు, చంక్రమణ = పరుగిడుట, అలంక్రియ = అలంకారము, లక్ష్మణము = నామధేయము)

చూడుమా! లభించిన బాధతో సంక్రాంతి రోజు రాజు (భగీరథుడు) ప్రార్థించగా, తొట్రుపాటు కలిగేటట్లుగా పరుగెత్తే గంగానదికి అలంకారము భాగీరథి అనే నామధేయమే సుమా!

431.587 కం. సంక్రీడన యన మించును
సంక్రాంతిని భోగి, కనుమ, సంభ్రమ మొందన్,
సంక్రీడన లేకుండ, య
లంక్రియల పశువుల సంబరము జరిపించున్.

(సంక్రీడన = కలిసి ఆడుట, మించు = దాటు, సంభ్రమము = ఉత్సాహము, ఒందు = పొందు, అలంక్రియ = అలంకారము, సంబరము = ఉత్సవము)

కలిసి ఆడుకోవడం అంటే భోగి పండుగ సంక్రాంతి పండుగని మించి ఉంటుంది. కనుమ పండుగ, ఉత్సాహము కలిగేటట్లుగా ఆటలు లేకుండా అలంకారాలతో పశువుల ఉత్సవము జరిపిస్తుంది.

432. సమస్య: సంధ్యా వందన మాచరింపవలదా చౌశీతి బంధమ్ములన్

432.588 శా. సంధ్యారాము సభన్ యహల్యఁ గనగన్ జంభారి యా రూప సౌ
గంధ్యమ్మంతయుఁ గ్రోలిఁ జెప్పె నిటు, ముగ్ధా! నీ వివాహమ్మునన్,
బంధ్యార్థుం డిట గౌతముండొ? మరి యీ పాకారియో? తేల్చుమా
సంధ్యా వందనమా? చరింప వలదా చౌశీతి బంధమ్ములన్?

(సంధ్యారాముడు = బ్రహ్మ, జంభారి = ఇంద్రుడు, సౌగంధ్యము = పరిమళము, క్రోలు = ఆస్వాదించు, ఇటు = ఈప్రకారము, ముగ్ధ = మోహింప చేయునది, బంధ్య = బంధించతగినవాడు, అర్హుడు = తగిన వాడు, పాకారి = ఇంద్రుడు, తేల్చు = నిర్ణయించు, సంధ్యావందనము = సంధ్యోపాసన, చరించు = తిరుగు, చౌశీతి బంధములు = సంభోగ సమయములో స్త్రీ పురుషుల కోసం చెప్పబడిన 84 స్థితి భేదములు)

బ్రహ్మసభలో అహల్యను చూడగానే, ఇంద్రుడు ఆమె సౌందర్య పరిమళాన్ని ఆస్వాదించి, ఈ విధంగా అన్నాడు: ఓ, ముగ్ధా! నీ వివాహ బంధంలో చిక్కుపడడానికి అర్హుడెవరు, గౌతముడా, ఈ ఇంద్రుడా? సంధ్యావందనం కావాలో, చౌశీతి బంధాలలో ఆనందం కావాలో, నిర్ణయించుకో.

433. సమస్య: సంయమివరుడౌటఁ గుదిరె సంసృతి సుఖముల్

433.589 కం. సంయతి వీడి నరుడు వా
చంయముగ సుభద్ర ప్రేమ చవిఁగొని, గెలిచెన్
సంయంతల, యామె కతడు
సంయమి వరుడౌటఁ, గుదిరె సంసృతి సుఖముల్.

(సంయతి = ఇంద్రియనిగ్రహము, వీడి = వదలి, నరుడు = అర్జునుడు, వాచంయముడు = మౌనవ్రతము కలవాడు, చవిగొను = రుచి చూచు, సంయంత = నిరోధకుడు, సంయమి = ముని, వరుడు = పెండ్లికొడుకు, కుదురు = అనుకూలమగు, సంసృతి = సంసారము)

అర్జునుడు ఇంద్రియనిగ్రహము వదలి పెట్టి మౌనవ్రతము కలవాడై సుభద్ర ప్రేమ రుచి చూచి నిరోధకులను గెలిచాడు. ఆమెకి అతడు మునిగా ఉన్న పెళ్ళికొడుకు అవడం వల్ల సంసార సుఖాలు అనుకూలించాయి.

434. సమస్య: సంసార సుఖంబులబ్బు సన్యాసికిలన్

434.590 కం. 'ఓం' సవ్వడి మన మందున
శంసించుచు సర్వ జనుల సౌఖ్యము కొరకై
హంస వగ, పార లౌకిక
సంసార సుఖంబు లబ్బు సన్యాసి కిలన్.

(సవ్వడి = నాదము, శంసించు = స్తుతించు, హంస = యోగి, పారలౌకిక = పరలోకసంబంధమైన, అబ్బు = ప్రాప్తించు, సన్యాసి = సన్యాసాశ్రమము కలవాఁడు, ఇల = భూలోకము)

మనస్సులో ఓంకార నాదాన్ని స్తుతిస్తూ, సకల ప్రజల సుఖం కోసం యోగి అవ్వగా, సన్యాసికి లోకంలో పరలోకసంబంధమైన సంసార సుఖాలు ప్రాప్తిస్తాయి.

434.591 కం. కంసారి యతి యగు నరో
త్తంసునిఁ గేరెను, సుభద్ర దరి ఖాండవ వి
ధ్వంసకు డగు నీ రాకను,
సంసార సుఖంబు లబ్బు సన్యాసి కిలస్.

(కంసారి = కృష్ణుడు, ఉత్తంసుడు = గొప్పవాడు, కేరు = పరిహసించు, దరి = సమీపము, విధ్వంసకుడు = నాశనము చేసినవాడు)

కృష్ణుడు యతి వేషంలో ఉన్న నరశ్రేష్ఠుడైన అర్జునిని ఏమని పరిహసించాడంటే సుభద్ర చెంతకు ఖాండవ వనము నాశనము చేసిన వాడవైన నీ రాకచే సన్యాసికి లోకంలో సంసార సుఖాలు దక్కుతాయి, అని.

434.592 కం. హంసగమన యనె, రంగ ని
నంసాగుణము విడి విప్ర నారాయణ నా
సంసేవఁ జేయ, తోడనె
సంసార సుఖంబు లబ్బు సన్యాసి కిలస్.

(హంసగమన = స్త్రీ, నినంస = నమస్కరింపనిచ్ఛ, విడి = వదలి, సంసేవ = తఱచుగా దర్శించుట, తోడను = వెంటడిని)

విప్రనారాయణ పాండురంగనికి నమస్కరించే కోరిక వదిలి నా సంసేవ చేస్తే వెంటనే ఆ సన్యాసికి సంసార సుఖాలు దక్కుతాయి అని హంసగమన (దేవదేవి) అన్నది.

435. సమస్య: సతి సతి గవయంగ పుత్రసంతతి కలిగెస్

435.593 కం. పితలాటమగు మను వవస్

యతివ శిఖండి మగవాడె యనుకొని, పుంస్త్వ
మ్మతనికి వర మవ మారిన
సతి సతిఁ గవయంగ పుత్ర సంతతి కలిగెన్.

(పితలాటము = మోసము, మనువు = వివాహము, అతివ = స్త్రీ, పుంస్త్వము = మగతనము, వరము = దేవతానుగ్రహము, కవయు = రమించు, పుత్ర = కొడుకు, సంతతి = సంతానము)

శిఖండి మొదట్లో స్త్రీయే. ఆమెను మగవాడని చెప్పి పెళ్ళి చేస్తారు. తరువాత, ఆ మోసం బయటపడుతుంది. అప్పుడు, బాధతో అడవికి వెళ్ళిన శిఖండికి ఒక గంధర్వుడు తన మగతనము వరంగా ఇచ్చి ఆమె ఆడతనం తను తీసుకుంటాడు. ఆ సందర్భం ఈ పద్యంలో చెప్పబడింది. స్త్రీయైన శిఖండి మగవాడనుకుని మోసపూరితమైన పెళ్ళి అవ్వగా, మగతనము వరంగా పొందగా మారిన ఆ స్త్రీతో ఒక స్త్రీ సంభోగించగా పుత్రసంతానం కలిగింది.

436. సమస్య: సతియే గద పూరుషునకు సద్గురు వకటా

436.594 కం. సతి సద్గుణములు పంచిన,
సతియేఁ గద పూరుషునకు సద్గురు, వకటా!
సతికిన్ దురాశ లున్నను,
పతి నుసిగొల్పును యనుచిత వర్తన మందున్.

(సతి = భార్య, పూరుషుడు = మనుషుడు, దురాశ = గొంతెమ్మకోరిక, పతి = భర్త, ఉసిగొల్పు = ప్రేరేపించు, వర్తనము = నడవడి)

భార్య మంచి గుణాలు పంచితే, ఆమే కదా మనుష్యునికి మంచి గురువు. అయ్యో! మరి భార్యకు దురాశ లుంటే భర్తను ఉచితంగాని ప్రవర్తనకు ప్రేరేపిస్తుంది.

437. సమస్య: సత్యమును బలుక నఘ మపజయమును గాదే

437.595 కం. ప్రాత్యైహిక విధు లందున
సత్యోద్యులు, ప్రాణ మాన సంకట మందున్,
ప్రత్యూహము లెన్నున్నను,

సత్యమునుఁ బలుక నఘ మపజయమునుఁ గాదే.

(ప్రాత్యైహిక = రోజు జరుగునది, సత్యోద్యుడు = సత్యవ్రతుడు, సంకటము = ఆపద, ప్రత్యూహము = విఘ్నము, అఘము = పాపము, అపజయము = ఓటమి)

నిత్య సత్యవ్రతులు ప్రాణానికి, మానానికి ఆపద వచ్చినప్పుడు, విఘ్నాలు ఎన్ని ఉన్నా, సత్యము చెప్పడం పాపము, పరాజయము కాదా.

438. సమస్య: సన్యాసికి వలయు జగతి సంపద లెల్లన్

438.596 కం. అన్యాయార్జనలన్ దౌ
ర్జన్యముఁ జేయుచును పగలు రాత్రియు యనకన్,
యన్యుల దోచెడి కుహనా
సన్యాసికి వలయు జగతి సంపద లెల్లన్.

అన్యాయమైన సంపాదనలతో, దౌర్జన్యము చేస్తూ, పగలనక రాత్రనక ఇతరులను దోచే బూటకపు సన్యాసికి లోకంలో ఉన్న సంపదలన్నీ కావాలి.

438.597 కం. విన్యాసంబుల భక్తి యు
పన్యాసంబులను, ముక్తిఁ బడయుదు రంచున్,
మాన్యుల దోచెడి కుహనా
సన్యాసికి వలయు జగతి సంపద లెల్లన్.

(విన్యాసము = చక్కని ప్రదర్శన, ఉపన్యాసము = ఏదేని యొక విషయము మీద విస్తరించి చెప్పుట, ముక్తి = మోక్షము, పడయు = పొందు, మాన్యుల = పెద్దమనుషులను, కుహనా = బూటకపు)

చక్కని ప్రదర్శనలలో, భక్తి ఉపన్యాసములలో, మోక్షము పొందుతారని అంటూ, పెద్దమనుషులను దోచే బూటకపు సన్యాసికి, లోకంలో ఉన్న సంపదలన్నీ కావాలి.

439. సమస్య: సరిగా గైకొనియెన్ వసంతము మహా సంపూర్ణ భావోన్నతిన్

439.598 మ. భరతుం డగ్రజు రాకఁ గాంచి మది సంభావించి హ్వానక్రియల్
సరిగాఁ గైకొనియెన్, వసంతము మహా సంపూర్ణ భావోన్నతిన్
పురమెల్లన్ జిలికించె కోసల జనుల్, భూపుత్రికై మానమం
దరు నిర్జించిన రాము శాంతిని సముత్థాపించ శ్లాఘించుచున్.

(అగ్రజుడు = అన్న, రాక = వచ్చుట, కాంచు = చూచు, మది = మనస్సు, సంభావించు = గౌరవించు, హ్వాన = పిలుపు, క్రియ = సమారంభము, కైకొను = గ్రహించు, వసంతము = పసుపును సున్నమును కలిపిన యెఱ్ఱనీళ్ళు, మహా సంపూర్ణ భావోన్నతిన్ = మహత్తరమైన సంపూర్ణ భావాతిశయము చేత, పురము = పట్టణము, ఎల్ల = సమస్తము, చిలికించు = చల్లు, భూపుత్రి = సీత, మానమందరుడు = రావణుడు, నిర్జించు = జయించు, సముత్థాపించు = నెలకొల్పు, శ్లాఘించు = మెచ్చు)

ఇది రామరాజభూషణుని "వసుచరిత్ర"లో వసంతకాల వర్ణన గురించిన "అరిగా పంచమ మేవగించి .." అన్న పద్యం లోని ఒక పాదం. భరతుడు అన్నయైన శ్రీరాముడు రావడం చూసి మనస్సులో గౌరవించి ఆయన్ని ఆహ్వానించడానికి తీసుకోవలసిన చర్యలన్నీ సరిగ్గా తీసుకున్నాడు. సీత కోసం రావణుణ్ణి జయించిన రాముడు శాంతిని నెలకొల్పాడని మెచ్చుకుంటూ, మహత్తరమైన సంపూర్ణ భావాతిశయముతో కోసల రాజ్యంలోని ప్రజలు పట్టణమంతా ఎఱ్ఱ నీళ్ళు చల్లారు.

439.599 మ. తరుశాఖల్ చిగురింప క్రొత్త దళముల్ దర్పంబుఁ జూపెట్టగా,
విరిఁదేనెల్ బహు పుష్పకీటములకున్ విందివ్వ, సర్వాంగ సుం
దరమై యొప్పు యుగాది పర్వదినమున్ తామ్రాక్ష గానమ్ముగా
సరిగా గైకొనియెన్ వసంతము మహా సంపూర్ణ భావోన్నతిన్.

(తరు = చెట్టు, శాఖ = కొమ్మ, చిగురించు = పల్లవించు, దళము = ఆకు, దర్పము = గర్వము, విరి = పుష్పము, బహు = అనేకమైన, పుష్పకీటము = తుమ్మెద, విందు = ఆరగింపు, అంగము = విధము, ఒప్పు = శోభిల్లు, పర్వదినము = పండుగ రోజు, తామ్రాక్షము = కోయిల, కైకొను = గ్రహించు, వసంతము = వసంత ఋతువు, మహా సంపూర్ణ భావోన్నతిన్ = మహత్తరమైన సంపూర్ణ భావాతిశయము చేత)

చెట్ల కొమ్మలు చిగురించి కొత్త ఆకులు దర్శాని ప్రదర్శించగా, పూదేనెలు తుమ్మెదలకి విందు భోజనం ఇవ్వగా, అన్ని విధాలుగా అందంగా శోభిల్లే ఉగాది పండగ రోజుని కోయిలల పాటగా మహత్తరమైన సంపూర్ణ భావాతిశయముతో సరిగ్గానే వసంత ఋతువు గ్రహించింది.

440. సమస్య: సానిం గొల్చిన వాని కబ్బును కదా సౌశీల్య సౌభాగ్యముల్

440.600 శా. పోనాడన్ మిగిలున్న దీ యహమె, సంపూర్ణంబుగా నంతటన్
యీ నా శీర్షమునన్ త్రిపాదముల నీవీ రీతి వ్యాపింపగా,
దానిన్ గూడ త్యజించె నీ బలి, నినున్ దర్శింపగా, శ్రీనివా
సా! నిం గొల్చిన వాని కబ్బును కదా, సౌశీల్య సౌభాగ్యముల్.

(పోనాడు = పోగొట్టుకొను, అహము = అహంకారము, శీర్షము = తల, త్యజించు = విడుచు, శ్రీనివాసా = లక్ష్మీదేవికి వాసస్థానమైన విష్ణుమూర్తి, కొల్చు = సంసేవించు, అబ్బు = ప్రాప్తించు, సౌశీల్యము = మంచిస్వభావము, సౌభాగ్యము = వైభవము)

పోగొట్టుకోవడానికి మిగిలి ఉన్నది ఈ అహంకార మొక్కటే. ఓ, శ్రీనివాసా! పూర్తిగా అంతటానూ, ఈ నా తల మీదనూ, మూడు పాదాలతో నీవు ఈ విధంగా వ్యాపించగా, నిన్ను చూడగానే ఆ అహంకారాన్ని కూడా ఈ బలి చక్రవర్తి వదిలేశాడు. నిన్ను సేవించిన వానికి మంచి స్వభావము, వైభవము ప్రాప్తిస్తాయి కదా.

441. సమస్య: సాయము చేయు వాడె కద శత్రువు తప్పదు కీడు నమ్మినన్

441.601 ఉ. పాయక వెంట నిల్తునని పౌరుల మద్దతు తెత్తు నంచు య
న్యాయ మెదుర్తు నంచు కుహనా గతి నెన్నియొ మిత్రవాక్యముల్
గూయుచు యెన్నికందున నిగూఢముగా ప్రతిపక్ష నేతకున్
సాయము చేయు వాడె కద శత్రువు తప్పదు కీడు నమ్మినన్.

(పాయు = విడుచు, మద్దతు = సహాయము, ఎదుర్చు = ఎదిరించు, కుహనా = అర్థాపేక్షచేతనగు కపటచర్య, గతి = ఉపాయము, కూయు = మొఱపెట్టు, ఎన్నిక = ప్రతినిధుల నెన్నుకొనుట, నిగూఢము = రహస్యము, ప్రతిపక్షము = ఎదురు పక్షము, నేత = నాయకుడు, కీడు = హాని)

విడువక వెంట ఉంటాననీ పౌరుల సాయము తీసుకొస్తాననీ అన్యాయాన్ని ఎదిరిస్తాననీ కపటోపాయంతో స్నేహితుడిలా మాటలు చెబుతూ ఎన్నికప్పుడు రహస్యంగా ప్రతిపక్ష నాయకుడికి సాయం చేసే వాడే కదా శత్రువు. అలాంటి వాడిని నమ్మితే హాని తప్పదు.

442. సమస్య: సాయుధ సంగ్రామ మార్గ సాధక గాంధీ

442.602 కం. సాయము నిరసించుచు యాం
గ్లేయుల పాలనను యడ్డగించుటయేగా
నీ యోజన, సత్యాహిం
సాయుధ సంగ్రామ మార్గ సాధక! గాంధీ!

(నిరసించు = నిరాకరించు, అడ్డగించు = ఆటంక పఱచు, యోజన = ఆలోచన, సాధక = అభీష్టమును సిద్ధింప చేయువాడు)

ఓ గాంధీ! సత్యము, అహింస ఆయుధాలుగా యుద్ధము చేసే మార్గాన్ని సాధించిన వాడా! సహాయము నిరాకరిస్తూ, ఆంగ్లేయుల పరిపాలనను ఆటంక పఱచడమేగా నీ ఆలోచన.

442.603 కం. ధ్యేయము స్వాతంత్ర్యమని, స
హాయ నిరాకరణమె వ్యవహారము మన కాం
గ్లేయులఁ దరుమ నను యహిం
సాయుధ సంగ్రామ మార్గ సాధక! గాంధీ!

(ధ్యేయము = లక్ష్యము, వ్యవహారము = కార్యాచరణము, తరుము = పారద్రోలు, అహింస = హింసచేయకుండుట, సాధక = అభీష్టమును సిద్ధింప చేయువాడు)

ఓ గాంధీ! స్వాతంత్ర్యమే లక్ష్యమనీ, సహాయ నిరాకరణమే మనకి ఆంగ్లేయులను పారద్రోలడానికి కార్యాచరణము అనీ అహింసని ఆయుధంగా యుద్ధం చేసే మార్గాన్ని సాధించిన వాడా!

443. సమస్య: సారా తెమ్మనె రాఘువుండు హనుమన్ సంరంభ మేపారగన్

443.604 శా. పారావారము దాట, నీదు ప్రతిభా పాండిత్యమే కన్పడెన్,

చేరన్, ముద్రిక సీత కిచ్చితివి, నీచే లంక కంపించెనే,
ఈ రామున్ కరుణించి, సీత మణి నా కీదెచ్చితే, శైల వా
సా! రా! తెమ్మనె రాఘవుండు, హనుమన్ సంరంభ మేపారగన్.

(పారావారము = సముద్రము, సంరంభము = వేగిరపాటు, ఏపారు = అధికమగు)

సముద్రము లంఘించడంలో నీ ప్రతిభాపాండిత్యాలు కనబడ్డాయి. చేరగానే ముద్రిక సీత కిచ్చావు. నీ వల్ల లంక వణికింది. ఈ రామునిపై దయతో, సీత మణిని నాకివ్వడానికి తెచ్చావా? వేగిరపాటు ఎక్కవవుతుంటే, వానరా! రా! తెమ్మని శ్రీరాముడు హనుమంతునితో అన్నాడు.

444. సమస్య: సారా తెమ్మనెను మౌని సారస ముఖులన్

444.605 కం. రారాజగు దుష్యంతుడుఁ
జేరెను కణ్వాశ్రమ మని, చెలికత్తె లనన్
యూరటకు మనకుఁ గలదు వ
సారా, తెమ్మనెను మౌని సారస ముఖులన్.

రాజగు దుష్యంతుడు కణ్వాశ్రమమును చేరుకున్నాడు అని చెలికత్తె లనగా, విశ్రాంతికి మనకున్నది వసారా, తీసుకుని రమ్మని మునీశ్వరుడు తామరపువ్వుల వంటి ముఖము గల స్త్రీలకు చెప్పాడు.

445. సమస్య: సారా! రమ్మనగ వచ్చు సాయుజ్య మిడన్

445.606 కం. సారగ్రీవా! హీరా!
సీరాయుధ! శూలపాణి! శితికంఠుడ! కే
దారా! శివా! యనుచు మన
సారా! రమ్మనగ వచ్చు సాయుజ్య మిడన్.

(సారగ్రీవుడు = హీరుడు = సీరాయుధుడు = శూలపాణి = శితికంఠుడు = కేదారుడు = శివుడు, సాయుజ్యము = మోక్షము, ఇడు = ఇచ్చు)

సారగ్రీవా, హీరా, సీరాయుధుడా, శూలపాణి, శితికంఠుడా, కేదారా, శివా అంటూ మనసారా రమ్మంటే మోక్షము ఇవ్వడానికి వస్తాడు.

446. సమస్య: సీతను గని శంకరుండు చిందులు వేసెన్

446.607 కం. తాతల కుత్తమ గతి నిడ,
క్ష్మాతలమున గంగఁ జేర్చ సగరు ప్రపౌత్రుం
డాతుర పడ, నియ్యకొనిన
సీతనుఁ గని, శంకరుండు చిందులు వేసెన్.

(క్ష్మాతలము = భూతలము, సగరు ప్రపౌత్రుడు = సగరుని మునిమనుమడైన భగీరథుడు, ఆతురపడు = తొందరపడు, ఇయ్యకొను = సమ్మతించు, సీత = గంగ)

తన తాతలకి ఉత్తమగతులు ఇవ్వడానికి భూమి మీదకి గంగానదిని జేర్చడానికి భగీరథుడు తొందరపడగా, ఒప్పుకున్న గంగని చూసి శివుడు చిందులు వేశాడు.

447. సమస్య: సీతాపతి యనగ చంద్రశేఖరుడు కదా

447.608 కం. భూతేశుని ప్రియ భక్తుడు
సీతాపతి యనగ, చంద్రశేఖరుడు కదా
సీతా నాథుని భక్తుడు,
యీా తీరుగ కేశవ శివు లేకముఁ గాదా.

(భూతేశుని = శివుని, సీతాపతి = శ్రీరామచంద్రుడు, చంద్రశేఖరుడు = శివుడు, సీతా నాథుని = శ్రీరాముని, ఏకము = సమానము)

శివుని ప్రియ భక్తుడు శ్రీరామచంద్రుడు అంటే, శ్రీరాముని భక్తుడు శివుడు కదా. ఈ విధంగా శివ కేశవు లిద్దరూ సమానమే కదా.

448. సమస్య: సుగ్రీవుని యెడమ కాలు శునకము కరిచెన్

448.609 కం. అగ్రజు వాలినిఁ గనగా
సుగ్రీవుని పాత్రధారి జడుగ, బెదరి యో
కుగ్రామపు రంగముపై
సుగ్రీవుని యెడమ కాలు శునకము కరిచెన్.

(అగ్రజుడు = అన్న, కను = చూచు, పాత్రధారి = నటుడు, జడుగు = భయాదులచే ఒదుగు, బెదరు = భయపడు, కుగ్రామము = చిన్నపల్లె, రంగము = నాట్యస్థానము, శునకము = కుక్క)

ఒక చిన్న పల్లెలో రంగస్థలం మీద, అన్నయైన వాలిని చూచి సుగ్రీవుని పాత్ర ధరించిన నటుడు భయంచేత ఒదిగి పోగా, బెదిరిన కుక్క సుగ్రీవుడి ఎడమ కాలు కరిచింది.

449. సమస్య: సెల్లు కంటె శత్రువు లేరి చెప్పుమయ్య

449.610 తే.గీ. లబ్ధి కన్నను కాలహరణమె మిన్న,
పెరుగ యేకాంత జీవన, మెరుగ రాని
మానసిక సమస్యలకు సమాశ్రయమగు
సెల్లు కంటె శత్రువు లేరి చెప్పుమయ్య.

(లబ్ధి = లాభము, కాలహరణము = సమయం వృథా అవడం, మిన్న = ఎక్కువ, ఎరుగు = తెలియు, సమాశ్రయము = నిలయము)

లాభం కన్నా కాలహరణమే ఎక్కువ. ఒంటరి జీవితం పెరగడం వల్ల తెలియని మానసిక సమస్యలకి నిలయమైన సెల్లు (Cell phone) కంటే శత్రువులు ఎక్కడున్నారు, చెప్పవయ్యా!

450. సమస్య: స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కెట్లు కల్గె నీ యతులిత మాధురీ మహిమ

శ్రీకృష్ణదేవరాయల వారిచ్చిన ఈ ఒకటిన్నర పాదాల ప్రసిద్ధమైన సమస్యని తెనాలి రామలింగ మహాకవి ఎలా పూరించాడంటే: స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కెట్లు కల్గె నీ, యతులిత మాధురీ మహిమ, హా!

తెలిసెస్; భువనైక మోహనో, ద్ధత సుకుమార వారవనితా జనతా ఘనతా పహారి సం, తత మధురాధ రోదిత సుధారస ధారలు గ్రోలుటం జుమీ. నా పూరణ క్రింద ఇవ్వబడింది.

450.611 చం. స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కెట్లు కల్గె నీ
యతులిత మాధురీ మహిమ? యంతయు భ్రాంతి యటం చెరింగి, కా
మిత ఫల సిద్ధికై తపన మిథ్య యటంచుఁ దలంచి, కష్టముల్
యితరుల వన్నిఁ జేకొనుటె యీశ్వర తత్త్వ మటంచనస్ జుమీ.

(స్తుతమతి = మెచ్చుకొనదగిన జ్ఞానము కలవాడు, అతులిత = అసమానమైన, మాధురీ = మాధుర్యము, మహిమ = గొప్పతనము, భ్రాంతి = ఉన్నది లేనట్టును లేనిది ఉన్నట్టును తలచుట, కామిత = కోరిన, ఫల = ప్రయోజనము, సిద్ధి = ఈడేఱుట, తపన = మిక్కుటమైన ఆసక్తి, మిథ్య = అసత్యము, చేకొను = గ్రహించు, తత్త్వము = స్వభావము)

మహాజ్ఞానవంతుడైన ఆంధ్రకవి ధూర్జటి మాటలకు ఈ అసమానమైన మాధుర్య మాహాత్మ్యము ఎలా కలిగింది? అంతా భ్రాంతి అని తెలిసి, కోరుకున్న ప్రయోజనం పొందడం కోసం తపించడం మిథ్య అని తలచి, ఇతరుల కష్టాలని గ్రహించడమే (గరళం మ్రింగి నట్లుగా) ఈశ్వర తత్త్వమని చెప్పడం వలననే సుమా.

451. సమస్య: స్వాతంత్ర్యము దొరకె విడువవా దాస్యంబుస్

451.612 కం. నేతల త్యాగ ఫలమ్ముగ,
స్వాతంత్ర్యము దొరకె, విడువవా దాస్యంబుస్?
చేతల దుస్తుల భాషను
ద్యోతక మగుచుండె యాంగ్ల ధోరణి సతముస్.

(ద్యోతకము = ప్రకాశింపఁజేయునది, ధోరణి = పద్ధతి, సతము = ఎల్లప్పుడు)

నేతల త్యాగఫలంగా స్వాతంత్ర్యము దక్కింది. చేతలలోను, దుస్తులలోను, భాషలోను ఎప్పుడూ ఆంగ్లేయుల పద్ధతే కనిపిస్తోంది. బానిసత్వము వదలిపెట్టవా?

452.   సమస్య: స్వార్థ విశృంఖలత్వ గుణ సాధనయే గద సత్యమార్గమౌ

452.613   ఉ. ప్రార్థకుడై యనీకమున బాధనుఁ జెప్పి పరిష్కరించగన్
పార్థుడుఁ గోర, వాని వ్యథఁ బాపగ కృష్ణుడుఁ జెప్పె నిట్లు, ప్ర
త్యర్థుల పాపకృత్యములు దండనయోగ్యము, చింత యేల, ని
స్స్వార్థ విశృంఖలత్వగుణ సాధనయేఁ గద సత్యమార్గమౌ.

(ప్రార్థకుడు = మనవి చేసికొనువాడు, అనీకము = యుద్ధము, పరిష్కరించు = చక్కబఱచు, పార్థుడు = అర్జునుడు, వ్యథ = దుఃఖము, పాపు = తొలగజేయు, ఇట్లు = ఈ ప్రకారము, ప్రత్యర్థి = శత్రువు, కృత్యము = పని, దండనయోగ్యము = శిక్షార్హము, చింత = దిగులు, నిస్స్వార్థ = స్వలాభము లేకుండుట, విశృంఖలత్వము = అడ్డులేనిది, గుణ = స్వభావము, సాధన = సాధించుట, సత్యమార్గము = మంచి త్రోవ)

వేడుకొనువాడై యుద్ధంలో బాధను చెప్పి చక్కబెట్టమని అర్జునుడు కోరగా, వాని దుఃఖము పోగొట్టడానికి కృష్ణుడు ఈ విధంగా చెప్పాడు: శత్రువుల పాపకార్యములు శిక్షార్హము, దిగు లెందుకు? అడ్డూ అదుపూ లేని నిస్స్వార్థ గుణ సాధనే కదా సత్య మార్గము.

453.   సమస్య: హనుమంతుని జప మిడుముల నందించు గదా

453.614   కం. మనమున రాముని దలచుచు,
వనమును నాశనముఁ జేసి, వైదేహికి రా
ము నగ నిడె, రావణు డలుగ
హనుమంతుని జప మిడుముల నందించుఁ గదా.

(ఇడుము = ఆపద, అలుగు = కోపించు)

మనస్సులో రాముణ్ణి తలుచుకుంటూ వనాన్ని నాశనం చేసి సీతకు రాముని నగను ఇచ్చాడు. రావణుడు కోపించడానికి హనుమంతుని జపము ఆపదలని అందిస్తుంది కదా.

454.   సమస్య: హరి సేవారతులైన వారి కిలలో నానందముల్ దక్కునే

454.615   మ. కరముల్ సాపి యొకింత సాయమును యే కంఠేరు డర్థించినన్

దరి రానీయక నట్టి వారలను, స్వార్థమ్మే స్వభావమ్ముగా
పరహింసే తమ వృత్తిగా గడుపు నప్రాచ్యుల్, ప్రజాకర్షణస్
హరి సేవారతులైన వారి కిలలో నానందముల్ దక్కునే?

(కరము = చేయి, ఒకింత = స్వల్పము, కంతేరుడు = దరిద్రుడు, అర్థించు = యాచించు, దరి = సమీపము, అప్రాచ్యుడు = తిట్టుగా వాడు పదము)

చేయి జాపి కొంచెం సాయాన్ని ఏ దరిద్రుడు యాచించినా, అట్లాంటి వాళ్ళని దగ్గరికి రానీయకుండా, స్వార్థమే తమ స్వభావముగా, ఇతరులను హింసించడమే తమ వృత్తిగా గడిపే అప్రాచ్యులు, ప్రజలను ఆకర్షించడంలో హరిభక్తులైతే మాత్రం వాళ్ళకి లోకంలో సంతోషాలు దక్కుతాయా?

455. సమస్య: హర్మ్యంబున నీదులాడె నదె మత్స్యంబుల్

455.616 కం. ధర్మ్యమగు రాజసూయపు
హర్మ్య మనె సుయోధనుడు, మయ సభనుఁ గని, సా
ధర్మ్యము లేనిది, వింతగ
హర్మ్యంబున నీదు లాడె నదె మత్స్యంబుల్.

(ధర్మ్యము = ధర్మమునుండి తొలగనిది, సాధర్మ్యము = పోలిక, హర్మ్యము = రాజగృహము)

మయసభను చూచి, సుయోధనుడు, ధర్మమునుండి తొలగని దైన రాజసూయ యాగము జరుపఁబడిన రాజగృహము, పోలిక లేనిది, వింతగా ఆ గృహమున చేపలు ఈదులాడుతున్నాయి అని అన్నాడు.

456. సమస్య: హింసాధర్మమె ముక్తినిచ్చు జగతిన్ హేరాళమై ఒప్పగన్

456.617 శా. సంసేవించెను ద్వారపాలకునిగా, శాపంబు బాధింపగన్
శంసల్ జేసెను వైరిజన్మ కోరకై చక్రిన్, దశాస్యుండుగా
హింసల్ జేయగ జన్మమెత్తి జయుడే యెంచెన్ మహాస్ఫూర్తితో,
హింసాధర్మమె ముక్తి నిచ్చు, జగతిన్ హేరాళమై యొప్పగన్.

(సంసేవించు = పనిగొను, ద్వారపాలకుడు = వాకిటి కావలివాడు, శంస = స్తోత్రము, వైరి = శత్రువు, చక్రి = విష్ణుమూర్తి, దశాస్యుడు = పదిముఖములు గల రావణుడు, హింస = బాధించుట, ఎంచు = తలచు, స్ఫూర్తి = స్ఫురణము, హేరాళము = అధికము)

ద్వారపాలకునిగా సేవ చేశాడు. శాపం (సనక సనందనాదుల) బాధింపగా, వైరి జన్మ కావాలని విష్ణుమూర్తిని ప్రార్థించాడు. రావణుడుగా హింసలు చేయడానికి జన్మ ఎత్తిన, జయుడే గొప్ప స్ఫురణతో (అదివరకు జరిగిన దాని గురించి) హింసని ధర్మంగా చేస్తేనే ముక్తి వస్తుంది, లోకంలో అది గొప్పగా చెప్పుకోబడుతుంది అని అనుకున్నాడు.

456.618 శా. ధ్వంసంబవ్వగ జాతి హక్కులు బ్రిటీష్దాస్యంబు వల్లన్, నరో
త్తంసుండైన సుభాషు చంద్రు డనె, స్వాతంత్ర్యంబెలే శక్తి, వి
ధ్వంసంబుల్ మన సైనికుల్ సలుపుచున్ వారింప వారిన్, యటుల్
హింసాధర్మమె ముక్తి నిచ్చు జగతిన్ హేరాళమై యొప్పగన్.

(ధ్వంసము = నాశము, హక్కులు = అధికారాలు, దాస్యము = చాకిరి, నరోత్తంసుడు = మనుషుల్లో గొప్పవాడు, స్వాతంత్ర్యము = స్వతంత్రభావము, విధ్వంసము = చాల ధ్వంసము, వారించు = ఆటంకపరచు, ముక్తి = విడుపు)

బ్రిటీషువారికి దాస్యం చేయడం వల్ల జాతి హక్కులు నాశనం అవగా, స్వతంత్రమే బలము, విధ్వంసము చేస్తూ మన సైనికులు వారిని ఆటంకపరిస్తే, ఆ విధంగా హింసని ధర్మంగా చేస్తేనే, మనకి విడుపు, లోకంలో అది గొప్పగా చెప్పుకోబడుతుంది, అని నరోత్తముడైన సుభాష్ చంద్రబోస్ అన్నాడు.

456.619 శా. సంశోధించెను పెక్కు మార్గములు తా శాంతిన్ ప్రతిష్ఠింపగన్
కంసారాతి, యవన్ని వ్యర్థ మవగా గాండీవితో నిట్లనెన్,
సంసిద్ధుండవుఁ గమ్ము కౌరవుల నాశంబున్ యొనర్పన్, యనిన్
హింసాధర్మమె ముక్తి నిచ్చు జగతిన్ హేరాళమై యొప్పగన్.

(సంశోధించు = పరిశీలించు, ప్రతిష్ఠించు = శాశ్వతముగా నిలుపు, కంసారాతి = కృష్ణుడు, వ్యర్థము = నిష్ప్రయోజనము)

తాను శాంతిని నెలకొల్పడానికి చాలా మార్గాలు పరిశీలించాడు. అవన్నీ వమ్ము కాగా, కృష్ణుడు అర్జునిడితో ఈ విధంగా అన్నాడు: కౌరవులను నాశనం చేయడానికి సిద్ధం అవ్వు. యుద్ధంలో హింసని ధర్మంగా చేస్తేనే, మనకి విడుపు. లోకంలో అది గొప్పగా చెప్పుకోబడుతుంది.

456.620 శా. మాంసాహార మటుంచి శాకములలో మన్కిన్ గనన్ వచ్చునే,
సంసారంబున హింసలేక మనుటల్ సాధ్యంబె జీవాళికిన్,
హింసల్ జేయక తప్పకున్న నపుడే హింసన్ యొనర్చంగ, యా
హింసాధర్మమె ముక్తి నిచ్చు జగతిన్ హేరాళమై యొప్పగన్.

(అటుంచు = ప్రక్కన పెట్టు, శాకము = ఆకుకూర, మన్కి = ప్రాణము, కను = చూచు, మనుట = జీవించుట, జీవాళి = జీవుల సమూహము, ఒనర్చు = చేయు)

మాంసాహారము పక్కన పెట్టి, అసలు, శాకాలలో ప్రాణం చూడొచ్చుగా. ప్రపంచంలో హింస లేకుండా బ్రతకడం జీవులకి సాధ్యమా? హింసలు చేయడం తప్పనిసరి ఐనపుడే హింసను చేస్తే, ఆ హింసాధర్మమే పాపవిముక్తి నిస్తుంది. అదే లోకంలో గొప్పగా చెప్పుకోబడుతుంది. ధర్మవ్యాధుడు భారతంలో చెప్పిందిదే.

పేరు	:	మద్దాలి వేంకట సత్య రంగనాధం
పుట్టిన తేదీ	:	25-09-1958
జన్మస్థలం	:	చిరువోలు గ్రామం, మోపిదేవి మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
విద్యార్హతలు	:	M.Sc; BL
విద్య నభ్యసించిన విద్యా సంస్థలు	:	జిల్లా పరిషత్ హైస్కూలు, మోపిదేవి; శాతవాహన కళాశాల, విజయవాడ; ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ; ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ
వృత్తి / అనుభవం వివరాలు	:	భారతీయ సాంఖ్యక సేవ (Indian Statistical Service) సభ్యునిగా కేంద్ర ప్రభుత్వంలో 36 సంవత్సరాలకు పైగా అనుభవం; సెప్టెంబరు 2018లో డైరెక్టర్ జనరల్ గా సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీసులో (ఢిల్లీ) పదవీ విరమణ
ప్రస్తుత వ్యాసంగం	:	తెలుగు సాహిత్యం చదవడం, వ్రాయడం; సమకాలీన సమస్యలు విశ్లేషించి ప్రభుత్వాలకు, అధికారులకు తగిన సూచనలు ఇవ్వడం
కుటుంబ వివరాలు	:	భార్య: కామేశ్వరి; కుమారుడు: భారత్; కుమార్తె: స్వాతి; కోడలు: కోమల్; మనుమరాలు: ఈరా
గత ప్రచురణలు	:	శ్రీరాముని అంతరంగము (Paperback & E-book) in July 2025 దత్తపదుల సమాహారం (E-book) on 12th August 2025
బ్లాగు వివరాలు	:	https://mvsranganadham.in/

ISBN 978-93-343-8295-2